

సత్యమేవ జయతే

సాక్షి

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 183

మంగళవారం 23-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సమఉజ్జీల సమరం' ఏమాత్రం కాదు!

భారత్, పాక్ మ్యాచ్ అంటే ఇప్పుడు పూర్తిగా ఏకపక్షమని టీమిండియా టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అభిప్రాయపడ్డాడు. అసలు ఇరు జట్ల మధ్య ఆటను 'వైరం'తో పోల్చాల్సిన అవసరమే లేదని సూర్య స్పష్టం చేశాడు. -IIలో

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
23-9-2025



భారత్‌కు రానున్న అథ్లెటిక్స్ దిగ్గజం ఉసేన్ బోల్ట్

అథ్లెటిక్స్ దిగ్గజం ఉసేన్ బోల్ట్ రెండోసారి భారత్‌కు రానున్నాడు. బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ), ముంబై సిటీ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్ల మధ్య అక్టోబర్ 1న ముంబైలో జరిగే ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో బోల్ట్ బరిలోకి దిగుతాడు. తొలి అర్ధభాగం బెంగళూరు జట్టుకు, రెండో అర్ధభాగంలో ముంబై జట్టుకు బోల్ట్ ప్రాతినిధ్యం వహిస్తాడు. భారత ఫుట్‌బాలర్లతోపాటు, బాలీవుడ్, ఇతర రంగాల ప్రముఖులు ఈ మ్యాచ్‌లో బోల్ట్‌తో కలిసి సరదాగా ఆడతారు. ప్రముఖ స్పోర్ట్స్ మా తయారీ సంస్థ ప్యూమా ఈ మ్యాచ్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ మ్యాచ్‌కంటే ముందు బోల్ట్ సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు ఢిల్లీ, ముంబైలలో పలు ప్రైవేట్ ఈవెంట్లలో పాల్గొంటాడు. 'భారత్‌కు మరోసారి రావడానికి ఉత్సాహంతో ఉన్నాను. క్రీడల పట్ల ఇక్కడి ప్రజలకు ఎంతో మక్కువ ఉంది. భారీ సంఖ్యలో నన్ను అభిమానించే వాళ్లు కూడా ఉన్నారు' అని 2014లో తొలిసారి భారత్‌కు వచ్చిన 39 ఏళ్ల బోల్ట్ వ్యాఖ్యానించాడు. 2017లో అథ్లెటిక్స్‌కు గుడ్‌బై చెప్పిన బోల్ట్ ఒలింపిక్స్‌లో 8 స్వర్ణాలు, ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 11 స్వర్ణాలు, 2 రజతాలు, ఒక కాంస్యం సాధించాడు. పురుషుల 100 మీటర్లు, 200 మీటర్ల విభాగాల్లో ఇప్పటికీ బోల్ట్ పేరిటే ప్రపంచ రికార్డులు ఉన్నాయి.

దివ్య దేశ్‌ముఖ్‌కు వైల్డ్ కార్డు

పురుషుల ప్రపంచకప్ టోర్నీ బరిలో భారత మహిళా గ్రాండ్‌మాస్టర్



న్యూఢిల్లీ: భారత మహిళా గ్రాండ్‌మాస్టర్, మహిళల చెస్ ప్రపంచకప్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ ఈ ఏడాది మరోసారి పురుషుల ఈవెంట్‌లో పాల్గొనేందుకు సిద్ధమైంది. ఇటీవలే గ్రాండ్ స్విస్ టోర్నీలో పురుష గ్రాండ్‌మాస్టర్లతో పోటీపడ్డ దివ్య... అక్టోబర్ 31 నుంచి నవంబర్ 27 వరకు భారత్‌లోని గోవా వేదికగా జరిగే పురుషుల ప్రపంచకప్ టోర్నీలో బరిలోకి దిగనుంది. వాస్తవానికి దివ్యకు ఈ టోర్నీలో పాల్గొనే అవకాశం లేకపోయినా... చివరి నిమిషంలో ఒక ప్లేయర్ వైదొలగడంతో ఆ స్థానాన్ని దివ్య దేశ్‌ముఖ్‌తో భర్తీ చేశారు. ఈ టోర్నీలో ఆడాలని మహిళల ప్రపంచ నంబర్‌వన్ హు ఇఫాన్ (చైనా), ప్రస్తుత ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)లకు నిర్వాహకులు ఆహ్వానించారు. అయితే ఈ ఇద్దరు చైనా గ్రాండ్‌మాస్టర్లు ప్రపంచకప్‌లో ఆడేందుకు రాలేమని తెలిపారు. నాకౌట్ ఫార్మాట్‌లో జరిగే ప్రపంచకప్‌లో మొత్తం 206 మంది ప్లేయర్లు పోటీపడతారు. టాప్-3లో నిలిచిన వారు వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధిస్తారు. భారత్ నుంచి ఈ టోర్నీలో 20 మంది ప్లేయర్లు ఆడనున్నారు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్, ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానంద, విదిత్, అరవింద్ చిదంబరం, పెంటేల హరికృష్ణ, నిహాల్ సరీన్, మురళీ కార్తికేయన్, ప్రాణేశ్, ఇనియన్, ఎస్ఎల్ నారాయణన్, దీప్తాయన్ ఘోష్, సూర్యశేఖర గంగూలీ, కార్తీక్ వెంకటరామన్, రాజా రిత్విక్, ఆరోన్యక్ ఘోష్, లలిత్ బాబు, హిమల్ గుసెయిన్, హర్షవర్ధన్, నీలాశ్ సాహా పోటీపడనున్నారు.

'సమఉజ్జీల సమరం' ఏమాత్రం కాదు!

- పాక్‌తో 'వైరం' అనడంలో అర్థం లేదు
- సూర్యకుమార్ యాదవ్ వ్యాఖ్య



దుబాయ్: 'ఇద్దరు కొట్టుకుంటే యుద్ధం...అదే ఒకడు మీద పడిపోతే దండయాత్ర'... తెలుగు సినిమాలో ఒక డైలాగ్ ఇది. భారత టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సరిగ్గా ఇదే అర్థం వచ్చేలా పాకిస్తాన్ గురించి చెప్పాడు. భారత్, పాక్ మధ్య మ్యాచ్ అంటే ఇప్పుడు పూర్తిగా ఏకపక్షమని అతను గుర్తు చేశాడు. అసలు ఇరు జట్ల మధ్య ఆటను 'వైరం'తో పోల్చాల్సిన అవసరమే లేదని అతను స్పష్టం చేశాడు. భారత్, పాక్ మధ్య 2018 నుంచి జరిగిన గత 7 వన్డేల్లో భారత్ 6 గెలవగా, 1 మ్యాచ్ వర్షంతో రద్దయింది. ఇరు జట్ల మధ్య మొత్తం 15 టి20 మ్యాచ్‌లు జరగ్గా... భారత్ 11 గెలిచి, 3 మాత్రమే ఓడింది. వరుసగా గత 4 మ్యాచ్‌లలో మనదే పైచేయి. 2022లో ఓటమి తర్వాత రెండు ఫార్మాట్‌లు కలిపి మన జట్టు వరుసగా 7 మ్యాచ్‌లలో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో టీమిండియా ఆధిపత్యంపై సూర్య తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. 'భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్‌లకు 'వైరం' అనే మాటను ఇకపై వాడవద్దని విజ్ఞప్తి చేస్తున్నా. అసలు ఇరు జట్ల మధ్య వైరం అనాల్సినంతగా పోటీ ఎక్కడ ఉంది. నా అభిప్రాయం ప్రకారం రెండు జట్ల మధ్య 15–20 మ్యాచ్‌లు జరిగి ఇద్దరూ 7–7తో సమంగా ఉండి లేదా 8–7తో కాస్త ఆధిక్యంలో ఉంటే సమ ఉజ్జీల సమరం అని చెప్పవచ్చు. కానీ సరిగ్గా అంకెలు గుర్తు లేవు కానీ ప్రస్తుతం ఇది 13–0 లేదా 10–1గా ఉంది. కాబట్టి ఇకపై ఇది అసలు పోటీనే కాదు' అని సూర్య ఘాటుగా వ్యాఖ్యానించాడు.

దూబే స్పెల్ కీలక మలుపు...

పాక్ ఇన్నింగ్స్ డ్రింక్స్ విరామ సమయంలో ఆట మలుపు తిరిగిందని సూర్యకుమార్ అన్నాడు. సాధారణంగా పవర్‌ప్లే తర్వాత ఆట మారుతుందని, కానీ 10–17 ఓవర్ల మధ్య తాము పాక్‌ను కట్టడి చేయడంలో సఫలమయ్యామని కెప్టెన్ చెప్పాడు. ఈ 8 ఓవర్లలో పాక్ 38 పరుగులు మాత్రమే చేయగలిగింది. 'స్పిన్నర్లు బాగానే బౌలింగ్ చేసినా నా దృష్టిలో శివమ్ దూబే స్పెల్ ఆటను మలుపు తిప్పింది. ఈసారి అతను తనకు లభించిన అవకాశాన్ని సమర్థంగా వాడుకుంటూ పూర్తి కోటా ఓవర్లు బౌలింగ్ చేశాడు. ప్రాక్టీస్ సెషన్లలో దూబే బౌలింగ్‌లో బాగా శ్రమించాడు. కొత్త బంతితో కూడా సాధన చేశాడు. ఈ మ్యాచ్‌లో పక్కా ప్రణాళికతో అతను వచ్చాడు' అని సూర్య చెప్పాడు. మరోవైపు నీరు-నిప్పులాంటి గిల్, అభిషేక్ భాగస్వామ్యంపై కూడా సారథి ప్రశంసలు కురిపించాడు. 'అభిషేక్ బ్యాటింగ్ శైలి అలాగే ఉంటుంది. పవర్‌ప్లే తర్వాత కూడా అతను తగ్గడు. గిల్ ఎలా ఆడతాడో కూడా అందరికీ తెలుసు. ఏ రకంగానైనా అతను పరుగులు రాబట్టగలడు. మైదానం బయట కూడా మంచి స్నేహం ఉంటే ఫలితం ఎలా ఉంటుందో వీరిద్దరు చూపించారు. నీరు-నిప్పులాంటి వీరిద్దరు కలిసి ఆడుతుంటే సమన్వయానికి ఒక కనుసైగ చాలు' అని కెప్టెన్ వ్యాఖ్యానించాడు.

'వాళ్లు అలా చేయడం నచ్చలేదు'



భారత్, పాక్ మ్యాచ్‌లలో సహజంగా కనిపించే కవ్వింపులు, మాటల యుద్ధం ఆదివారం మ్యాచ్‌లో కూడా కనిపించింది. వేర్వేరు సందర్భాల్లో అభిషేక్ శర్మ, శుబ్‌మన్ గిల్‌లకు హారిస్ రవూఫ్, షాహీన్ అఫ్రిదిలతో వివాదం రేగింది. దీనిపై మ్యాచ్ తర్వాత అభిషేక్ స్పష్టతనిచ్చాడు. పాక్ ఆటగాళ్ల ప్రవర్తన వల్లే తాను స్పందించాల్సి వచ్చిందని అతను చెప్పాడు. 'ఎలాంటి కారణం లేకుండా వారు మాపైకి దూసుకొచ్చి కవ్వించే ప్రయత్నం చేశారు. అది నాకు అస్సలు నచ్చలేదు. నేను దూకుడుగా ఆడి చెలరేగడమే దానికి సరైన మందు అని భావించాను' అని అభిషేక్ వెల్లడించాడు. తన బాల్య మిత్రుడు గిల్‌తో కలిసి భారీ భాగస్వామ్యం నెలకొల్పడం, అది జట్టు విజయానికి కారణం కావడం పట్ల అభిషేక్ సంతోషం వ్యక్తం చేశాడు. మరోవైపు హాఫ్ సెంచరీ చేశాక తాను గన్ షూటింగ్ తరహాలో చేసిన సంబరంలో ఎలాంటి తప్పూ లేదని పాక్ బ్యాటర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ అన్నాడు. 'ఆ క్షణంలో వచ్చిన ఆలోచనతోనే నేను గన్ తరహాలో బ్యాట్‌తో అలా చేశాను. నేను సాధారణంగా 50 దాటినప్పుడు ఎలాంటి సంబరాలు చేసుకోను. అప్పటికప్పుడు నాకు అలా చేయాలనిపించింది. జనం దాని గురించి ఎలా ఆలోచిస్తారనేది నాకు అనవసరం. దానిని నేను పట్టించుకోను' అని ఫర్హాన్ స్పష్టం చేశాడు.



చావో రేవో మ్యాచ్

- నేడు పాకిస్తాన్‌తో శ్రీలంక ఢీ
- ఆసియా కప్ టి20 టోర్నీ

అబుదాబి: ఆసియా కప్ సూపర్-4 దశలో తమ తొలి మ్యాచ్‌ల్లో ఓడిన రెండు జట్లు కీలక సమరానికి సన్నద్ధమయ్యాయి. నేడు జరిగే పోరులో పాకిస్తాన్‌తో శ్రీలంక తలపడుతుంది. లీగ్ దశలో అజేయంగా నిలిచిన శ్రీలంక గత పోరులో అనూహ్యంగా బంగ్లాదేశ్ చేతిలో ఓడగా... భారత్ చేతిలో పాకిస్తాన్ చిత్తయింది. ఫైనల్ చేరే అవకాశాలు సజీవంగా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో గెలవడం తప్పనిసరి. సూపర్-4లో రెండో పరాజయం ఎదురైతే ముందంజ వేసే అవకాశాలు దాదాపుగా ముగిసిపోతాయి. ఈ నేపథ్యంలో ఎవరు పైచేయి సాధిస్తారనేది ఆసక్తికరం. భారత్ చేతిలో ఓడిన మ్యాచ్‌లో ఆరంభంలో పాక్ బ్యాటింగ్ మెరుగ్గానే కనిపించింది. టాప్-3 బ్యాటర్లు ఫఖర్, ఫర్హాన్, అయూబ్ రాణించారు. అయితే జట్టు మిడిలార్డర్ మరీ పేలవంగా కనిపిస్తోంది. తలత్, నవాజ్, కెప్టెన్ సల్మాన్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోతున్నారు. పాక్ బౌలింగ్ కూడా గొప్పగా లేదు. మరోవైపు శ్రీలంక కూడా బ్యాటింగ్ వైఫల్యం వల్లే బంగ్లా చేతిలో ఓటమిపాలైంది. అయితే లీగ్‌లో ఆటగాళ్ల ప్రదర్శనను బట్టి చూస్తే ఆ జట్టు కోలుకునే అవకాశం ఉంది. ప్రధాన బ్యాటర్లు కుశాల్ మెండిస్, కుశాల్ పెరీరా, నిసాంకపై అంచనాలు ఉండగా... బౌలింగ్‌లో చమీరా, హసరంగ రాణిస్తున్నారు. ఆల్‌రౌండర్‌గా షనక ప్రభావం చూపించాడు. ఇప్పటి వరకు ఆకట్టుకోని కెప్టెన్ అసలంక ఒక మంచి ఇన్నింగ్స్ ఆడాలని టీమ్ కోరుకుంటోంది.

మళ్లీ 'క్యాబ్' అధ్యక్షుడిగా గంగూలీ | విండీస్‌తో సిరీస్‌కు పంత్ దూరం
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఫుట్‌బాల్‌లోనూ పాక్‌పై భారత్‌దే పైచేయి



కొలంబో: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో పాకిస్తాన్ జట్టును భారత జట్టు చితక్కొట్టగా... మరోవైపు ఫుట్‌బాల్‌లోనూ పాకిస్తాన్ జట్టుపై భారత్ తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-17 టోర్నమెంట్‌లో భాగంగా పాకిస్తాన్‌తో సోమవార జరిగిన గ్రూప్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 3-2 గోల్స్ తేడాతో గెలిచింది. భారత తరఫున దలాల్‌మువాన్ గాంగ్టే (31వ నిమిషంలో), గున్లేబా వాంగ్‌ఖెరాక్‌పమ్ (64వ నిమిషంలో), రహాన్ అహ్మద్ (74వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. పాకిస్తాన్ జట్టుకు హంజా యాసిర్ (71వ నిమిషంలో), మొహమ్మద్ అబ్దుల్లా (43వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. ఈ విజయంతో భారత్ గ్రూప్ 'బి'లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి తొమ్మిది పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. ఆరు పాయింట్లతో పాకిస్తాన్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. గ్రూప్ 'బి' నుంచి భారత్, పాకిస్తాన్ జట్లు సెమీఫైనల్ చేరుకున్నాయి. గ్రూప్ 'ఎ' నుంచి బంగ్లాదేశ్, నేపాల్ జట్లు సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. ఈనెల 25న జరిగే సెమీఫైనల్స్‌లో బంగ్లాదేశ్‌తో పాకిస్తాన్; నేపాల్‌తో భారత్ తలపడతాయి.

జార్జ్ కుట్టి ప్రపంచంలోకి...


● మోహన్‌లాల్

ప్రేక్షకులను మరోసారి జార్జ్ కుట్టి ప్రపంచంలోకి తీసుకెళ్లేందుకు మోహన్‌లాల్ సిద్ధమయ్యారు. దర్శకుడు జీతూ జోసెఫ్, హీరో మోహన్‌లాల్ కాంబినేషన్‌లోని 'దృశ్యం' ఫ్రాంచైజీకి ఆడియన్స్‌లో మంచి క్రేజ్ ఉంది. ఈ ఫ్రాంచైజీ నుంచి ఇప్పటికే వచ్చిన 'దృశ్యం 1, దృశ్యం 2' చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించింది. తాజాగా మోహన్‌లాల్, జీతూ జోసెఫ్ కాంబినేషన్‌లోనే 'దృశ్యం 3' రానుంది. ఆంటోని పెరుంబవూర్ నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం కేరళలో పూజా కార్యక్రమాలతో మొదలైంది. 'దృశ్యం, దృశ్యం 2' చిత్రాల్లో నటించిన మీనా 'దృశ్యం 3'లోనూ నటిస్తున్నారు. జార్జ్ కుట్టి పాత్రలో మోహన్‌లాల్ నటిస్తున్నారు. ''జార్జ్ కుట్టి ప్రపంచం మళ్లీ జీవం పోసుకుంది. 'దృశ్యం 3' పూజా కార్యక్రమాలతో మొదలైంది'' అంటూ 'ఎక్స్' వేదికగా మోహన్‌లాల్ పోస్ట్ చేశారు. ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవిలో విడుదలయ్యే అవకాశాలున్నాయి. ఇక మోహన్‌లాల్ నటించిన పీరియాడికల్ వార్ డ్రామా 'వృషభ' చిత్రం ఈ దీపావళికి రిలీజ్ కానుంది.

ఈశ్వర దేవుడు ఇక్కడికి వచ్చారా!


● రిషబ్ శెట్టి

'నాన్న ఇక్కడే ఎందుకు మాయం అయ్యాడు' అనే డైలాగ్‌తో మొదలవుతుంది 'కాంతార: చాప్టర్ 1' తెలుగు ట్రైలర్. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన కన్నడ సినిమా 'కాంతార: చాప్టర్ 1'. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించగా, గుల్షన్ దేవయ్య, జయరాం ఇతర పాత్రల్లో నటించారు. హోంబలే ఫిలింస్ నిర్మించిన ఈ సినిమా అక్టోబరు 2న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్స్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. తెలుగు ట్రైలర్‌ను ప్రభాస్, తమిళంలో శివ కార్తికేయన్, మలయాళంలో పృథ్వీరాజ్ సుకుమారన్, హిందీ ట్రైలర్‌ను హృతిక్ రోషన్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. 'ఎప్పుడు మనిషి అధర్మం వైపు వెళ్తాడో.. ధర్మాన్ని కాపాడటానికి ఈశ్వరుడు తన గణాలను పంపుతూనే ఉంటాడు', 'కాంతార లోపలికి అస్సలు వెళ్లకూడదు పిల్లలు..', 'అక్కడ బ్రహ్మరాక్షసుడు ఉన్నాడు', 'మమ్మల్ని చూడ్డానికి మీరొచ్చారు.. మిమ్మల్ని చూడటానికి మేం రాకూడదా..!', 'ఈశ్వర దేవుడు ఇక్కడికి వచ్చారా..', 'ఈడికి రావడమే కాదు.. ఆయన వెలిసింది ఈడ్నే', 'ఇప్పుడు కూడా ఉన్నారా..' వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ సినిమాకు అజనీష్ లోకనాథ్ సంగీతం అందించారు.

ప్రేక్షకులకు కృతజ్ఞుడనై ఉంటాను

\- చిరంజీవి



చిరంజీవి హీరోగా కె.వాసు దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రాణం ఖరీదు'. జయసుధ, చంద్రమోహన్, కైకాల సత్యనారాయణ ఇతర పాత్రలు పోషించారు. క్రాంతి కుమార్ నిర్మించిన ఈ చిత్రం 1978 సెప్టెంబరు 22న విడుదలైంది. ఈ మూవీ రిలీజై 47 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేశారు. ''కొణిదెల శివ శంకర వరప్రసాద్ అనబడే నేను 'ప్రాణం ఖరీదు' ద్వారా చిరంజీవిగా మీకు పరిచయం అయ్యి నేటితో 47 ఏళ్లు దిగ్విజయంగా పూర్తయ్యాయి. ఈ చిత్రం ద్వారా నాకు నటుడిగా ప్రాణం పోసి.. మీ అన్నయ్యగా, కొడుకుగా, మీ కుటుంబ సభ్యుడిగా, మెగాస్టార్‌గా అనుక్షణం నన్ను ఆదరించి, అభిమానించిన తెలుగు సినిమా ప్రేక్షకులకు నేను ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటాను. నేటికి 155 సినిమాలను నేను పూర్తి చేసుకున్నాను అంటే అందుకు కారణం నిస్వార్థమైన మీ ప్రేమ. ఈ 47 ఏళ్లలో నేను పొందిన ఎన్నో అవార్డులు, గౌరవ మర్యాదలు నావి కావు. మీ అందరివీ, మీరందించినవి. మనందరి మధ్య ఈ ప్రేమానుబంధం ఎల్లప్పటికీ ఇలాగే కొనసాగాలి అని కోరుకుంటున్నాను'' అంటూ పోస్ట్‌లో రాసుకొచ్చారు చిరంజీవి. ఇదిలా ఉంటే.. చిరంజీవి నటించిన తొలి చిత్రం 'పునాది రాళ్లు' అయినప్పటికీ 'ప్రాణం ఖరీదు' ముందుగా విడుదలైంది. కాగా చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర', 'మన శంకర వరప్రసాద్‌గారు' వంటి చిత్రాల్లో నటిస్తున్నారు.

వినోదాన్ని బతికించండి

\- బ్రహ్మానందం


● బన్నీ వాసు, బ్రహ్మానందం, ప్రియదర్శి

''తమ జీవితం ఎలా ఉన్నా అందర్నీ నవ్వించాలనే సిద్ధాంతంతో బతుకుతున్నారు హాస్యనటులు. అందుకే కమెడియన్స్‌ని ఆశీర్వదించండి.. వినోదాన్ని బతికించండి. కామెడీ బతికితే అందరూ ఆనందంగా ఉంటారు'' అని హాస్యనటుడు బ్రహ్మానందం తెలిపారు. ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం జోడీగా విజయేందర్ ఎస్ దర్శకత్వం వహించిన చిత్రం 'మిత్ర మండలి'. బీవీ వర్క్స్ సమర్పణలో కల్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ సినిమా అక్టోబరు 16న విడుదల కానుంది. ఆర్ఆర్ ధృవన్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'జంబర్ గింబర్ లాలా..' అంటూ సాగే మూడో పాటని బ్రహ్మానందం చేతుల మీదుగా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ–''నేను ఈ సినిమాలో ఎలాగైనా ఉండాలని నన్ను తీసుకొచ్చాడు బన్నీ వాసు. కడుపుబ్బా నవ్వించే హాస్య చిత్రం 'మిత్ర మండలి'' అని చెప్పారు. ''మా సినిమా చూసి బాగా నవ్వుతారని హామీ ఇస్తున్నాను'' అన్నారు ప్రియదర్శి. ''బ్రహ్మానందంగారితో మొదటిసారి వేదికని పంచుకోవడం జీవితంలో మర్చిపోలేని క్షణం'' అన్నారు చిత్ర సమర్పకులు బన్నీ వాసు. ''నా మొదటి సినిమాలో బ్రహ్మానందంగారు ఉండటం గౌరవంగా భావిస్తున్నాను'' అని విజయేందర్ ఎస్ తెలిపారు. విజయేందర్ రెడ్డి తీగల, నిహారిక ఎన్.ఎం, సంగీత దర్శకుడు ఆర్ఆర్ ధృవన్, నటులు రాగ్ మయూర్, విష్ణు, ప్రసాద్ బెహ్రా మాట్లాడారు.

సీట్ ఎడ్జ్ థ్రిల్లర్


● రాణీ ముఖర్జీ

రాణి ముఖర్జీ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మర్దానీ 3'. అభిరాజ్ మినావాలా దర్శకత్వంలో యష్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్నారు. దసరా నవరాత్రులు శుభారంభం సందర్భంగా 'మర్దానీ 3' పోస్టర్‌ను ఆవిష్కరించారు మేకర్స్. ''మర్దానీ (2014), మర్దానీ 2 (2019)' వంటి విజయాల తర్వాత ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌ను ఇచ్చేలా 'మర్దానీ 3' తెరకెక్కుతోంది. మంచికి, చెడుకి మధ్య జరిగే పోరాటాల్ని ఈ సినిమాలో చూపించబోతున్నాం. తనకు ఎంతో ఇష్టమైన, ప్రేమించిన డేర్ డెవిల్ పోలీస్ శివానీ శివాజీ రాయ్ పాత్రలో రాణి ముఖర్జీ మరోసారి కనిపించబోతున్నారు. ఓ కేసుని పరిష్కరించడానికి, దాని కోసం తన ప్రాణాలను పణంగా పెట్టే శివానీ సంకల్పం ఎలాంటిదో సినిమాలో చూడాలి'' అని యూనిట్ తెలిపింది. ఈ చిత్రం 2026 ఫిబ్రవరి 27న రిలీజ్ కానుంది.

ప్రేమలో రెండోసారి


● రమణ, తేజ, వనిత

రమణ సాకే, వనిత గౌడ జంటగా నటించిన చిత్రం 'ప్రేమలో రెండోసారి'. సత్య మార్క దర్శకత్వంలో సాకే రామయ్య సమర్పణలో సిద్ధ క్రియేషన్స్‌లో సాకే నీరజ లక్ష్మి నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని డైరెక్టర్ తేజ విడుదల చేసి, మాట్లాడుతూ– ''ప్రేమలో రెండోసారి' టీజర్ బాగుంది. ప్రేమ నేపథ్యంలో తీసిన సినిమాలు ఆదరణ పొందుతాయి. 'ప్రేమలో రెండోసారి' కూడా విజయం సాధించాలి'' అని తెలిపారు. ''ఈ సినిమాలో ప్రేమతో పాటు భావోద్వేగాలు, సెంటిమెంట్ వంటి అంశాలుంటాయి'' అన్నారు రమణ సాకే. సత్య మార్క మాట్లాడుతూ–''మా చిత్రం లేటెస్ట్ ట్రెండ్ తగ్గట్టుగా నేటి యువతీ యువకులకు బాగా కనెక్ట్ అవుతుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. అక్టోబరులో సినిమా విడుదల చేయనున్నాం'' అని తెలిపారు. ''ఈ సినిమాలోని సంగీతం, నేపథ్య సంగీతం మనసును హత్తుకునేలా ఉంటుంది'' అని వనిత గౌడ పేర్కొన్నారు.

తల్లి సంకల్పం గొప్పది


● ఉన్ని ముకుందన్

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బయోపిక్‌గా రూపొందుతోన్న చిత్రం 'మా వందే'. సీహెచ్. క్రాంతికుమార్ దర్శకత్వంలో వీర్ రెడ్డి. ఎం నిర్మిస్తున్నారు. ఇందులో నరేంద్ర మోదీగా ఉన్ని ముకుందన్ నటిస్తున్నారు. సోమవారం (సెప్టెంబరు 22) ఉన్ని ముకుందన్ పుట్టినరోజు. ఈ సందర్భంగా 'మా వందే' నుంచి ఆయన పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''మోదీ వ్యక్తిగత, రాజకీయ జీవితంలోని విశేషాలను సహజంగా మా సినిమాలో చూపించబోతున్నాం. మోదీ పాత్రను సమర్థవంతంగా పోషిస్తున్నారు ఉన్ని ముకుందన్. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశంతో 'మా వందే' ఆకట్టుకోనుంది. అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యున్నత సాంకేతిక విలువలు, వీఎఫ్ఎక్స్‌లతో రూపొందే ఈ చిత్రం పాన్ ఇండియా భాషలతో పాటుగా, ఇంగ్లిష్‌లోనూ నిర్మాణమవుతోంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ధర్మాన్ని రక్షించే సూపర్ హీరో


● ఎస్‌జే సూర్య, కల్యాణ్ దాసరి

ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా రూపొందుతున్న తాజా చిత్రం 'అధీర'. కల్యాణ్ దాసరి హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. దర్శకుడు ప్రశాంత్ వర్మ పర్యవేక్షణలో శరణ్ కొప్పిశెట్టి ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్కే దుగ్గల్ సమర్పణలో ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సూపర్ హీరో పాత్రలో నటిస్తున్నారు కల్యాణ్. ఈ సినిమా నుంచి ఎస్‌జే సూర్య ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. ''ఆశ, అంధకారం మధ్య జరిగే యుద్ధమే ఈ చిత్రం. ధర్మాన్ని రక్షించడానికి సూపర్ హీరోగా దాసరి కల్యాణ్ తన పవర్స్‌ని ఉపయోగిస్తారు. ఈ సినిమా థియేటర్స్‌లో ఆడియన్స్‌కు గొప్ప అనుభూతిని అందించబోతోంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: శివేంద్ర.


'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 183

మంగళవారం 23-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మెరుగైన ఇంటి వైపు..

భారత్ నుంచి ఆస్కార్ బరిలో నిలిచిన 'హోమ్‌బౌండ్' వివరాలు..

-ఫ్యామిలీలో



స్టాక్ మార్కెట్లే ఇప్పుడు దిక్కు

ఎడిల్‌వీజ్ ఎండీ –సీఈవో రాధికా గుప్తాతో 'సాక్షి' ఇంటర్వ్యూ

-17లో



పొదుపు ఉత్సవం షురూ

తగ్గిన జీఎస్టీ పన్నులతో మార్కెట్లు మొదలు ఇళ్ల దాకా ప్రజలకు ఖర్చు తగ్గి పొదుపు ఉత్సవం మొదలైందని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



...బాధ్యతారాహిత్యం!

ఎయిరిండియా విమాన ప్రమాద నివేదికలోని అంశాలు లీకవడం 'దురదృష్టకరం, బాధ్యతారాహిత్యం' అని సుప్రీం పేర్కొంది.

వివరాలు 6లో ▸

నేడు స్థానిక ఎన్నికల రిజర్వేషన్ల ఖరారు

- వివరాలు 16లో ▶

వసతుల్లేని బడులన్నీ ఒకే చోట..



ఒకే సముదాయంలోకి నాలుగైదు చొప్పన ప్రభుత్వ పాఠశాలలు

టీచర్ల కొరత సమస్య తీరడంతో పాటు సత్ఫలితాలొస్తాయి

ప్రభుత్వం తరఫున విద్యార్థులకు రవాణా సదుపాయం

- అల్పాహారం, మధ్యాహ్న భోజనం, స్నాక్స్ సైతం అందించాలి
- వెంటనే ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలి
- తెలంగాణ రైజింగ్–2047 ప్రణాళికలో కోర్ అర్బన్ ఏరియాపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- విద్య, వైద్యం, రోడ్డు రవాణా, పారిశుధ్య రంగాలకు ప్రాధాన్యమివ్వాలని దిశానిర్దేశం.. రోడ్లపై వర్షపునీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ నిర్మించాలని సూచన
- డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్ క్లీనింగ్‌కు రోబోలను వాడాలని స్పష్టీకరణ

'తెలంగాణ రైజింగ్' ప్రణాళికపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్

అరకొర వసతులతో ఉన్న నాలుగైదు ప్రభుత్వ పాఠశాలలను ఒకే సముదాయంలోకి తీసుకొస్తే సత్ఫలితాలుంటాయని.. దీనివల్ల టీచర్ల కొరత కూడా తీరిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం తరఫున రవాణా సదుపాయంతోపాటు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, స్నాక్స్ సైతం పాఠశాలల్లో అందించాలని విద్యాశాఖను ఆదేశించారు. వెంటనే ఈ ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేయాలన్నారు. తెలంగాణ రైజింగ్–2047 ప్రణాళికలో భాగమైన కోర్ అర్బన్ ఏరియా సమగ్రాభివృద్ధి, ప్రజారోగ్యం, విద్యా ప్రమాణాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సచివాలయంలో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక విద్యను అందరికీ అందించే సంస్కరణలను ముందుగా అమలు చేయాలన్నారు. జీహెచ్‌ఎంసీ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, కాలేజీలన్నింటినీ గుర్తించాలని చెప్పారు. నర్సరీ నుంచి 4వ తరగతి, 5వ తరగతి నుంచి 8వ తరగతి , 9వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు మూడు విభాగాలుగా నాణ్యమైన విద్యను అందరికీ అందించాలన్నారు. నర్సరీ నుంచి 4వ తరగతి స్కూళ్లపై ముందుగా దృష్టిపెట్టాలని.. ప్రభుత్వ స్థలాలు, ఇటీవల కబ్జాలు, ఆక్రమణల నుంచి

మిగతా 2వ పేజీలో ▶

హైవే పనుల్లో అలసత్వం వద్దు

- భూసేకరణ, పరిహారం పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదు
- కలెక్టర్లు, ఆర్డీవోలకు సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరిక
- అక్టోబర్ కల్లా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం
- ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర, దక్షిణ భాగాల పనులు ఒకేసారి ప్రారంభించాలని ఎన్‌హెచ్‌ఏఐకి విజ్ఞప్తి
- పలు ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష

2లో

'సమ్మక్క'కు ఛత్తీస్‌గఢ్ ఓకే

- ప్రాజెక్టుకు ఎన్‌ఓసీ జారీకి ఆ రాష్ట్ర సీఎం సూత్రప్రాయ అంగీకారం..రాయ్‌పూర్‌లో ఆయనతో మంత్రి ఉత్తమ్ భేటీ

-7లో

అడ్డగోలు మార్పుతో తీవ్ర నష్టం

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్లు మార్చి ప్రభుత్వం ఆగం చేస్తోంది

- రీజినల్ రింగ్ రోడ్డు బాధితుల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం
- రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించింది
- నల్లగొండ, సూర్యాపేట, సంగారెడ్డి, గజ్వేల్ బాధితులతో భేటీలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

-2లో





● ఆస్కార్ ఎంట్రీ



‘జిన్ షిన్ జ్యుషు’ అనేది జపనీస్ ఎనర్జీ హీలింగ్ టెక్నిక్. ఒత్తిడి, ఆందోళన తగ్గించడానికి, సుఖ నిద్రకు ఇది సహాయపడుతుందని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ హీలింగ్ అండ్ కేరింగ్ అధ్యయనం తెలియజేసింది. పడుకోవడానికి కొద్దిసేపు ముందు చేతి బొటనవేలు, కాలి బొటనవేలును కొద్ది నిమిషాల పాటు నొక్కాలని ఇది శరీరాన్ని నిద్రకు సిద్ధం చేయడానికి సహాయపడుతుందని చెబుతోంది జిన్ షిన్.

మెరుగైన ఇంటి వైపు

ఈ దేశవాసులకు ఈ దేశమే ఇల్లు. ఇక్కడే ఉండాలి. జీవించాలి. కాని ఈ నేల ప్రతి ఒక్కరికీ నివాసయోగ్యంగా ఉందా? ప్రతి ఒక్కరినీ సమానంగా, గౌరవంగా చూస్తోందా? ఏ మహమ్మారో వస్తే వలస కూలీలను ‘మీ ఊరికి పోండి’ అని సాటి మనుషులే తరిమికొడితే ‘ఇంటి వైపు’ నడక సాగుతుందా? మన హైదరాబాదీ దర్శకుడు నీరజ్ ఘేవాన్ తీసిన ‘హోమ్‌బౌండ్’ ఎన్నో సామాజిక ప్రశ్నలు లేవనెత్తుతోంది. వివక్షలను ప్రశ్నిస్తోంది. భారత దేశం నుంచి ఆస్కార్‌కు ఆఫీషియల్ ఎంట్రీగా ఎంపికైన ఈ సినిమా వివరాలు.

హోమ్‌బౌండ్

మే 21, 2025.

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కనీవినీ ఎరగనట్టుగా స్టాండింగ్ ఒవేషన్ ఇస్తున్నారు ప్రేక్షకులు.

సినిమా అయ్యాక లేచి నిలబడి చప్పట్లు కొడుతున్నారు.

ఒక నిమిషం... రెండు నిమిషాలు... చప్పట్లు ఆగడం లేదు... 9 నిమిషాల పాటు చప్పట్లు మోగుతూనే ఉన్నాయి.

ఆ సినిమాలో నటించిన నటీనటులు, నిర్మాత, దర్శకుడు ఉద్వేగంతో కన్నీరు కారుస్తూ ఒకరిని ఒకరు హత్తుకున్నారు.

బహుశా ఆ చప్పట్ల మోత ‘ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా’ను తాకినట్టున్నాయి. 2026లో జరగనున్న 98వ ఆస్కార్ అవార్డ్స్ పోటీకి ‘బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్’ కేటగిరి కోసం ఇండియా నుంచి అఫీషియల్ ఎంట్రీగా ఆ సినిమాను ఎంపిక చేశారు.

పేరు: హోమ్‌బౌండ్.

నిజ సంఘటన ఆధారంగా...



ఈ సినిమాను నిజ జీవిత సంఘటన ఆధారంగా దర్శకుడు నీరజ్ ఘేవాన్ తీశాడు. 2020లో న్యూయార్క్ టైమ్స్‌లో కశ్మీర్ జర్నలిస్ట్ బషారత్ పీర్ ఒక ఆర్టికల్ రాశాడు. ఒక మిత్రుడి సమాధి పక్కన కూచుని ఉన్న మరో మిత్రుడి ఫొటో వేసి. ‘టేకింగ్ అమృత్ హోమ్’ అనే ఆ ఆర్టికల్ కోవిడ్ కాలంలో సూరత్ ఫ్యాక్టరీల్లో పని చేస్తున్న ఇద్దరు మిత్రులు ఉత్తర్ ప్రదేశ్‌లోని తమ సొంత ఊరుకు బయలుదేరి ఎలా సర్వం కోల్పోయారో, వారిలో ఒక మిత్రుడు చనిపోతే మరో మిత్రుడు కోవిడ్‌కు భయపడకుండా ఆ శవాన్ని ఎలా ఇంటికి చేర్చాడో బషారత్ ఆ ఆర్టికల్‌లో రాశాడు. అది చదివిన నీరజ్ కోవిడ్ సమయాన్ని నేపథ్యంగా ఉంచుతూనే ఈ దేశంలో వ్యాపించిన సామాజిక దుర్నీతులను ముందు వరుసలో పెట్టి ‘హోమ్‌బౌండ్’ను తీశాడు.

అదే దర్శకుడికి అదే గుర్తింపు

‘హోమ్‌బౌండ్’ (ఇంటి వైపు) దర్శకుడు నీరజ్ ఘేవాన్. ఇంతకు ముందు ఇతను తీసిన ‘మసాన్’ సినిమా మన దేశంలోనే కాదు విదేశాల్లో కూడా విపరీతమైన ప్రశంసలు పొందింది. దానికి కారణం ఆ సినిమాలో ఎత్తి చూపించిన వివక్ష, తాత్త్వికత. ఇప్పుడు కూడా అలాంటి వివక్షను, ఆధిపత్యాన్ని దర్శకుడు గొప్ప కళాత్మకంగా, సెన్సిబుల్‌గా చూపించడం వల్లే ‘హోమ్‌బౌండ్’కు ఘన జేజేలు దక్కుతున్నాయి. హాలీవుడ్ దిగ్గజం మార్టిన్ స్కోర్‌సెసి ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉండటమే కాదు సినిమా విపరీతంగా నచ్చడంతో పొగడ్తలతో ప్రచారంలోకి తెచ్చాడు. ఆ తర్వాత ఫిల్మ్‌ఫెస్టివల్స్‌లో సినిమాకు ప్రశంసలు మొదలయ్యాయి. కాన్స్ తర్వాత టొరెంటో ఫిల్మ్ ఫెస్టివల్‌లో ‘హోమ్‌బౌండ్’ రెండవ స్థానంలో నిలిచింది. ‘మసాన్’ సినిమా సమయంలో కేన్స్‌లో పాల్గొన్న నీరజ్ తిరిగి ఈ సినిమాతో అదే కేన్స్‌లో సగర్వంగా నిలిచాడు.

ఇద్దరు స్నేహితుల కథ

‘హోమ్‌బౌండ్’ షోయెబ్, చందన్ కుమార్ అనే ఇద్దరు మిత్రుల కథ. వీరిద్దరూ అట్టడుగు ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న యువకులు. చిన్నప్పటి నుంచి వీరు పోలీస్ కానిస్టేబుళ్లు అవ్వాలనుకుంటారు. అందుకై ప్రయత్నిస్తూ నగరంలో అంత వరకూ చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ ఉంటారు. కాని ఒకసారి ఊరు విడిచి నగరానికి చేరుకున్నాక ప్రపంచపు పోకడ, మన దేశంలో వేళ్లూనుకుని ఉన్న వివక్ష వారికి అనుభవంలోకి వస్తుంది. చందన్ దళితుడైన కారణంగా అవమానాలు ఎదుర్కొంటుంటే, షోయెబ్ ముస్లిం కావడం వల్ల వివక్షను ఎదుర్కొంటూ ఉంటాడు. ఈ ‘దేశం’ అనే ‘ఇల్లు’ వీరికి ‘కొందరికి’ ఇస్తున్నట్టుగా మర్యాద, గౌరవం ఇవ్వడం లేదు. ‘కానిస్టేబుల్ ఉద్యోగం’ వస్తే అన్ని వివక్షలు పోతాయని వీరు అనుకుంటారుగాని అదంతా ఉత్త మాట... కొందరు ఎంత ఎదిగినా కిందకే చూస్తారని కూడా అర్థమవుతుంది. వీరికి పరిచయమైన అమ్మాయి సుధా భారతి అంబేద్కరైట్‌గా సమాజంలో రావలసిన చైతన్యం గురించి మాట్లాడుతుంటుంది. ఈలోపు పులి మీద పిడుగులా లాక్‌డౌన్ వస్తుంది. అక్కడి నుంచి ఆ స్నేహితులిద్దరూ సొంత ఊరికి బయలుదేరడంతో ఆ ప్రయాణం వారిని ఎక్కడికి చేర్చిందనేది కథ. ఇందులో ఇద్దరు స్నేహితులుగా విశాల్ జేత్వా, ఇషాన్ ఖట్టర్ నటించారు. సుధా భారతిగా జాన్వీ కపూర్ నటించింది. కరణ్ జోహర్, అదర్ పూనావాలా (కోవీషీల్డ్ తయారీదారు) నిర్మాతలు. సహజమైన పాత్రలు, గాఢమైన సన్నివేశాలు, దర్శకుడు సంధించే ప్రశ్నలు ఈ సినిమా చూశాక ప్రేక్షకులను వెంటాడుతాయని ఇప్పటి వరకూ వస్తున్న రివ్యూలు చెబుతున్నాయి.

ఆస్కార్ నామినేషన్స్‌ను జనవరి 22, 2026న ప్రకటిస్తారు. హోమ్‌బౌండ్ నామినేట్ అవుతుందని ఆశిద్దాం. మరో ఆస్కార్ ఈ సినిమా వల్ల వస్తే అదీ ఘనతే కదా.

నవశక్తి

‘ఆశలు ఉండగానే సరిపోదు ఆశయ సాధనకు కృషి చేయాల్సిందే! అప్పుడే సరైన ఫలితాన్ని సాధించగలం అంటోంది 19 ఏళ్ల కాట్రావత్ అంజలి. సెప్టెంబర్ 1 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో జరిగిన ప్రతిష్ఠాత్మకమైన ఆలిండియా తాల్ సైనిక్ క్యాంపులో ఉస్మానియా వర్సిటీ సైఫాబాద్ సైన్స్ కాలేజీ విద్యార్థిని, ఎన్‌సిసి క్యాడెట్ అంజలి ఫైరింగ్ విభాగంలో తన ప్రతిభను చూపింది. పతకాలూ సాధించింది. నవ శక్తికి ప్రతీకగా నిలుస్తున్న మహబూబ్‌నగర్ వాసి అంజలి చెబుతున్న విషయాలు ఆమె మాటల్లోనే..

ఫైర్ ముఖ్యం





“మా నాన్న నర్సింహ లారీ డ్రైవర్. అమ్మ దుర్గ గృహిణి. పుట్టిందీ, పెరిగిందీ మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి. ఓయూ సైఫాబాద్ కాలేజీలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. డిగ్రీతో పాటు ఆ కాలేజీలో ఎన్‌సిసిలో సి-సర్టిఫికెట్ చేస్తున్నాను. ఈ యేడాది ఢిల్లీలో జరిగిన టీఎస్సీ (తాల్ సైనిక్ క్యాంప్)లో పాల్గొనే అవకాశం లభించింది. ఇది జాతీయ స్థాయి ఈవెంట్. ఆర్మీ వింగ్‌కి మాత్రమే అవకాశం ఉండే ఈవెంట్ కూడా. ఐయుసి, ఐజిసి, టీ ఆర్జీ.. ఇలా లాంచింగ్ వరకు దశల వారీగా శిక్షణ తీసుకుంటూ, పోటీలో పాల్గొంటూ, సక్సెస్ సాధిస్తేనే టీఎస్సీకి ఎంపిక కాగలం.

ప్రత్యేక శిక్షణ

నేను పాల్గొన్నది ఫైరింగ్ అప్లికేషన్. దీనికి ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ప్రతిరోజూ చేయాల్సిన వ్యాయామాలు, మోటివేషన్ క్లాసులు, ఫైరింగ్‌లో ఏ మోడ్‌పాయింట్ ఎలా తీసుకోవాలనేది శిక్షణలో భాగం. ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఉండే ట్రెనింగ్‌తో పాటు రేంజ్ సెక్షన్ దగ్గర ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి. భుజ బలానికి ప్రత్యేక వ్యాయామాలు ఉంటాయి. స్పోర్ట్స్ సైకాలజిస్ట్‌ల క్లాసులు ఉంటాయి. మానసికంగా ఒకే విషయంపైన ఏకాగ్రత ఉండేలా శిక్షణ ఇస్తారు. పాయింట్ 22 బోర్ రైఫిల్ బరువు 3-4 కేజీలు ఉంటుంది. దీనిని మోయడమే కాదు, అదే సమయంలో ఫైర్ చేయడానికి చాలా శక్తి కావాలి. ఇందుకోసం బలం పెరిగేలా ఆహార నియమాలు, డిప్స్, పుషప్స్, కోర్‌మజిల్ స్ట్రెంథెనింగ్ .. వంటివి రోజూ సాధన చేస్తూ ఉండాలి.

స్ఫూర్తిని నింపే ఈవెంట్..

జాతీయ స్థాయిలో జరిగే టీఎస్సీలో పాల్గొనడానికి దేశవ్యాప్తంగా ఉన్న 17 డైరెక్టరేట్స్ నుంచి మంచి శిక్షణ తీసుకున్న విద్యార్థులు పాల్గొంటారు. ప్రతి డైరెక్టరేట్ నుంచి 40-50 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారు. ఇందులో మన ప్రాంతం నుంచి నేను పాల్గొనడం చాలా ఆనందాన్నిచ్చింది. జాతీయ స్థాయి శిక్షణ పొందిన విద్యార్థులను కలుసుకోవడం, వారి సంస్కృతి గురించి తెలుసుకోడం, పోటీలో పతకాలు సాధించడమూ చాలా సంతోషాన్నిచ్చింది.

ఆశ .. ఆశయం

చిన్నప్పటి నుంచి పోలీస్ అవ్వాలని, డిఫెన్స్‌లోకి వెళ్లాలనేది నా ఆలోచన. దానికి తగినట్టుగా నాకున్న ఆసక్తిని గమనించి, మా ఎన్సీసీ అసోసియేట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ పల్లటి నరేష్ ఆసక్తి ఉందా అని అడిగారు. నా ఆనందం మాటల్లో చెప్పలేను. నాకు ఇష్టమైన రైఫిల్ ట్రెనింగ్‌లో మిస్ కాకుండా పాల్గొనడం మొదలుపెట్టాను. ఈ ట్రెనింగ్ వల్ల కొన్ని నెలలుగా కాలేజీకి దూరంగా ఉండాల్సి వచ్చింది. క్లాసులు, ల్యాబ్స్ మిస్ అయ్యాను. మా లెక్చరర్స్ సపోర్ట్ ఉండటం మరింత బలాన్నిచ్చింది. ఇప్పుడు ఫైనలియర్ కాబట్టి ట్రెనింగ్ తీసుకుంటున్నాను. స్టేట్ పోలీస్ ట్రెనింగ్‌కి అప్లికేషన్ పెట్టుకున్నాను. సెంట్రల్ డిఫెన్స్‌లో పాల్గొనాలనేది నా ఆశ. అందుకు తగిన ట్రెనింగ్ తీసుకుంటున్నాను” అని ఆనందంగా వివరించింది అంజలి.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) సెప్టెంబర్ 22న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,16,410	బంగారం (24 క్యారెట్లు)	1,14,500	బంగారం (24 క్యారెట్లు)	1,13,070	బంగారం (24 క్యారెట్లు)	1,14,500	బంగారం (24 క్యారెట్లు)	1,15,200	బంగారం (24 క్యారెట్లు)	1,13,020
బంగారం (22 క్యారెట్లు)	1,08,250	బంగారం (22 క్యారెట్లు)	1,06,300	బంగారం (22 క్యారెట్లు)	1,03,650	బంగారం (22 క్యారెట్లు)	1,06,300	బంగారం (22 క్యారెట్లు)	1,05,980	బంగారం (22 క్యారెట్లు)	1,03,600
వెండి	1,39,000	వెండి	1,36,400	వెండి	1,48,000	వెండి	1,36,400	వెండి	1,37,000	వెండి	1,48,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి
ఉత్తర కార్తె: సెప్టెంబర్ 26 వరకు
హస్త కార్తె: 27 నుంచి

సేంద్రియ ఉత్పాదకాలపై ఎన్‌ఐపీహెచ్‌ఎంలో శిక్షణ

ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంలో ఉపయోగించే అనేక బయో ఉత్పాదకాల (బయో ఇన్‌పుట్స్)ను పొలాల్లోనే తయారు చేసుకొని, పంటలకు వినియోగించుకునే పద్ధతులపై హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని కేంద్ర వ్యవసాయ శాఖకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐపీహెచ్‌ఎం) 3 రోజుల శిక్షణ ఇవ్వనుంది. అక్టోబర్ 13 నుంచి 15 వరకు జరిగే ఈ శిక్షణను తెలుగు, ఇంగ్లిష్, హిందీలలో బోధిస్తారు. జీవన ఎరువులు, జీవన పురుగుమందులు, ఘన/ద్రవ జీవామృతం, కషాయాలు, ద్రావణాల తయారీతో పాటు మిత్రపురుగులను క్షేత్రస్థాయిలో పెంపొందించుకునే పద్ధతులు నేర్పిస్తారు. 30-40 మందికి అవకాశం. రైతులు, ఎఫ్‌పీవోల సభ్యులు, గ్రామీణ యువతీయువకులు ఈ శిక్షణకు అర్హులు. శిక్షణ రుసుము, వసతి, భోజన ఖర్చులన్నీ కలిపి ఒకరికి రూ. 4,185లు. ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై లోతైన అవగాహన పెంచుకోవాలనుకునే యువతకు ఈ శిక్షణ ఉపయోగకరం.

ఇతర వివరాలకు.. డా. బి. శైలజ - 96667 21672.
Email: dirphmniphm-ap@nic.in

26, 27 తేదీల్లో కిసాన్ మహోత్సవం

ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ ఆవరణలో కిసాన్ మహోత్సవం జరగనుంది. అధునాతన వ్యవసాయ పద్ధతులు, పోకడలపై ఎగ్జిబిషన్, సదస్సులు, చర్చా గోష్ఠులు నిర్వహిస్తారు. 2023, 2024 వార్షిక వ్యవసాయ పురస్కారాలు ప్రదానం చేస్తారు.

ప్రవేశం ఉచితం. ఇతర వివరాలకు.. 70757 51969

అధిక దిగుబడినిచ్చే మిల్కీ మష్రూమ్



భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలికి అనుబంధంగా ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ మష్రూమ్ రీసెర్చ్ అధిక దిగుబడినిచ్చే డీఎంఆర్ మిల్కీ-299 అనే కొత్త పుట్టగొడుగుల రకాన్ని అభివృద్ధి చేసింది. ఈ రకం పుట్టగొడుగులు గది ఉష్ణోగ్రతలో 7 రోజులు, ఫ్రిడ్జ్‌లో 15 రోజుల వరకు నిల్వ ఉంటాయని ఐసీఏఆర్ తెలిపింది. విస్తృతంగా సాగులో ఉన్న డీఎంఆర్‌సీ-985 రకంతో పోల్చితే ఇది 14.5% అధిక దిగుబడినిస్తుంది. దేశీ జన్యువనరులతో ఆధునిక బ్రీడింగ్ పద్ధతుల ద్వారా తయారైన ఈ రకం పుట్టగొడుగుల పెంపకం రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఐసీఏఆర్ తెలిపింది. బటన్ మష్రూమ్స్ పెంపకంలో మాదిరిగా నియంత్రిత వాతావరణం కోసం ఖరీదైన ప్రత్యేక మౌలిక సదుపాయాలు దీనికి అవసరం లేదు. స్వల్పఖర్చుతో కూడిన షెడ్లలోనూ 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వరకు పెంచవచ్చని చెబుతున్నారు.



సాంప్రదాయ పంటలు పండించే చాలా మంది రైతుల నికరాదాయం ఎకరానికి రూ.20 వేలకు మించటం లేదు. పత్తి, మొక్కజొన్నకు బదులుగా మునగ సాగు చేస్తే సన్న, చిన్నకారు రైతుల నికరాదాయం పెరుగుతుంది. 3 సంవత్సరాలలోపు ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కూడా మునగను సాగు చేసుకోవచ్చు. వాతావరణ ఒడిదుడుగులను తట్టుకోవటానికి మునగ దోహద పడుతుంది. నాటిన 7-8 నెలల్లో తొలి పంట కోతకు వస్తుంది. మూడేళ్లలో వరుసగా కనీసం 5 కార్శి పంటలు తీసుకోవచ్చు. మునగ ఆకుల పొడి, గింజల ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. టి. భరత్, ఉద్యాన శాస్త్రవేత్త బి. శివ, విస్తరణ శాస్త్రవేత్త డా. ఎన్. హేమ శరత్ చంద్ర మునగ సాగుపై అందించిన పూర్తి వివరాలు.

మునగ మేలు!







మునగ ఒక్కసారి నాటితే మూడేళ్ల పాటు మునగ కాయల దిగుబడి
ఎకరానికి వెయ్యి మొక్కలు.. మొక్కకు 150 కాయలు..
మునగాకు, గింజల ద్వారా అదనపు ఆదాయం
ఏడాదికి ఎకరానికి రూ.75 వేల ఆదాయం వస్తుందంటున్న శాస్త్రవేత్తలు

ఎకరానికి ఉత్పాదకాల ఖర్చెంత?

కావలసినవి	ఖర్చు (రూ.)
1 కేజీ విత్తనం	2,000
1,000 పాలిథీన్ సంచులు	1,294
సగం ట్రాక్టర్ ట్రక్కు మట్టి, ఇసుక	600
ఒక ట్రాక్టర్ ట్రక్కు పశువుల ఎరువు	2,500
100 కేజీల వేప పిండి	1,500
6 కేజీల ట్రైకోడెర్మా జీవన ఎరువు	600
4 లీటర్ల వేప నూనె	2,400
40 కేజీల జిప్సం	400
4 బస్తాల యూరియా	1,070
2 బస్తాల పొటాష్	3,000
5 బస్తాల సూపర్ ఫాస్ఫేట్	1,810
అర లీటరు రీజెంట్	400
దీపపు ఎరలు	300
సాగు ఖర్చు (కౌలు/దుక్కి/కూలి మినహా)	17,874

పోషకాల గనిగా పేరు తెచ్చుకున్న మునగ రైతుల పాలిట కల్పవృక్షంగా విరాజిల్లుతున్నది. తినే వారికి ఆరోగ్యం, పండించే వారికి లాభాలు అందిస్తోంది. తక్కువ పెట్టుబడితోనే అధిక దిగుబడులందిస్తూ.. అన్నదాతల ఇంట సిరులు కురిపిస్తున్నది. మునగ చెట్టులో ప్రతీ భాగం ఉపయోగకరమైనదే. ఆకులు, కాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటి విత్తనాలను ఔషధ పరిశ్రమలలో వాడతారు. అందుకే, వీటికి మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉంటుంది. ఆరోగ్యపరంగానే కాకుండా, వ్యాపారపరంగానూ మునగను సాగు చేసేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.



ఏ నేలలైనా ఓకే

అన్ని రకాల నేలల్లో మునగను సాగు చేసుకోవచ్చు. ఉదజని సూచిక 6.5-8 శాతం ఉండే ఇసుక రేగడి నేలలు ఎక్కువ అనుకూలంగా ఉంటాయి. నీరు నిలవని ఎర్ర, ఇసుక, ఒండ్రు నేలలు అనుకూలమైనవి. నీటి వసతి గల సారవంతమైన భూముల్లో అధిక దిగుబడి సాధించవచ్చు. ఆరు నెలల్లోనే కాతకు వచ్చే ఏకవార్షిక రకాలు అందుబాటులోకి వచ్చాయి.

అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు

మునగ విత్తనంతో మొక్కలు పెంచి, నాటుకోవాలి. జూలై నుంచి అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు. ఏ సమయంలో విత్తినా వేసవిలోనే (జనవరి-ఏప్రిల్ మధ్యలో) పూతకు వస్తుంది. ఫిబ్రవరిలో ఎక్కువ పూత, కాత ఉంటుంది. ఒక ఎకరానికి వెయ్యి మొక్కలు నాటాలి. మొక్కలను ముందుగా నర్సరీల్లో పెంచాలి. పీకేఎం-1 మునగ రకం విత్తుకోవటం మేలు. పాలిథిన్ సంచుల్లో విత్తిన 15 రోజుల్లో మొలక వస్తుంది. మొక్కల మధ్య 1 మీ., వరుసల మధ్య 1.5 మీ. దూరంలో గుంతలు తీసుకోవాలి. అర ట్రక్కు పశువుల ఎరువుకు రెండు బస్తాల వేపపిండి, 10 కేజీల ట్రైకోడెర్మా కలపాలి. దీన్ని ప్రతి గుంతకు రెండు దోసెళ్ళు (ఒక కిలో), గుప్పెడు సూపర్ ఫాస్పేట్ వేయాలి. ప్రతి మొక్కకూ డ్రిప్ ద్వారా 135: 23: 45 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను అందిస్తే దిగుబడులు పెరుగుతాయి. నత్రజని, పొటాష్ ఎరువులను యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో డ్రిప్ ద్వారా అందించాలి. డ్రిప్ ద్వారా 10-15 లీ. నీరివ్వాలి. నాటిన తర్వాత 3, 6 నెలలకు నత్రజని ఎరువు వేయాలి. వాస్తవానికి మునగ మొక్కలకు ఎక్కువ ఎరువులు అవసరం ఉండదు. జీవన ఎరువులు కూడా వాడితే నేల సారం, నేల ఆరోగ్యం పెరిగి తెగుళ్ళు రాకుండా ఉంటాయి.

బొంత పురుగులతో జాగ్రత్త

మునగ కాండంపై బొంత పురుగులు గుంపులుగా చేరి, బెరడును తొలిచి తింటాయి. ఆకులను తొలిచేస్తాయి. దీంతో ఆకు విపరీతంగా రాలిపోతుంది. ఈ సమయంలో పురుగు గుడ్లను, లార్వాలను ఏరివేయాలి. వర్షాల తర్వాత పెద్ద పురుగులను నివారించడానికి హెక్టారుకు ఒక దీపపు ఎరను ఉంచాలి. వేపనూనె మందు ద్రావణం పిచికారీ చేస్తే మొక్కలపై పురుగులకు వికర్షకాలుగా పనిచేస్తాయి.

ఈ పంటలతో మునగను కలపొద్దు

ఆయిల్ పామ్, పత్తి, కూరగాయ పంటల్లో అంతర పంటగా వేస్తే మునగ మొక్కలు ఎరువులు, నీరు ఎక్కువగా అంది చాలా ఏపుగా పెరుగుతాయి. కానీ, పూలు, కాయలు ఆలస్యంగా రావడం స్పష్టంగా గుర్తించాం. కాబట్టి, అంతర పంటగా వేసినప్పుడు మునగ మొక్కలకు ఎక్కువ నీరు, ఎరువులు అందకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ చీడపీడలు ఆశించే టమాటా, వంగ, మిర్చి పంటలను మునగలో అంతర పంటలుగా వేసుకోకూడదు. ఎరువులు, సస్యరక్షణ చర్యలు తక్కువ అవసరమయ్యే కూరగాయ పంటలను మాత్రమే వేసుకోవాలి. లేకపోతే మునగ దిగుబడి తగ్గిపోతుంది. పొలంలో మురుగు నీరు చేరకుండా చూసుకోవాలి.

కత్తిరించిన 4-5 నెలల్లో మళ్లీ కాపు

మునగ నాటిన మొదట్లో ప్రతి 2 నెలలకోసారి (6 నెలల్లో 3 సార్లు) విధిగా కొమ్మలు కత్తిరిస్తే.. కొమ్మలు గుబురుగా వచ్చి పూత, కాయల దిగుబడి ఎక్కువగా వస్తుంది. పక్క కొమ్మలు రాకుండా ఏపుగా బాగా ఎత్తు పెరిగితే పూత సరిగ్గా రాదు. భారీ వర్షాలు, ఈదురు గాలులకు మొక్కలు పక్కకు పడిపోయి విరిగిపోతాయి. మొదటి కాయ కోత తర్వాత భూమట్టం నుంచి 90 సెం.మీ. ఎత్తులో మొక్క కాండం, కొమ్మలను కత్తిరించాలి. దీంతో 4-5 నెలల్లో చెట్టు మళ్లీ కాపు కొస్తుంది. మూడు సంవత్సరాల వరకు ఇలా 4-5 నెలలకొకసారి కార్శి పంటలను తీసుకోవచ్చు. కత్తిరించిన వెంటనే మొక్కకు 45, 15,30గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. 30 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. ఏటా 25 కిలోల చొప్పున బాగా చివికిన పశువుల ఎరువు వేయాలి.

మొక్కకు 150 కాయలు

ఒక ఎకరానికి 1,000 మొక్కలు నాటితే ప్రతి మొక్కకు కనీసం 150 కాయల చొప్పున 1,50,000 కాయలు కాస్తాయి. రూపాయికి 2 కాయల చొప్పున (ఒక కేజీకి రూ.5) స్థానికంగా అమ్మితే.. ఎకరానికి ఏడాదికి రూ.75,000 ఆదాయం వస్తుంది. మునగ ఆకులను కోసి ఎండ బెట్టి పొడి చేసి అమ్ముచ్చు. మునగ గింజలు/నూనె ద్వారా అదనపు ఆదాయం వస్తుంది.

మునగ ప్రకృతి సేద్యం ఇలా..

మునగ పంటను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే ఖర్చులు తగ్గి, నేల ఆరోగ్యం మెరుగుపడి, మంచి దిగుబడులు వస్తాయి. ప్రకృతి వ్యవసాయ పద్ధతి మునగ సాగుకు బాగా అనుకూలం. భూమిని లోతుగా దున్ని సూర్య కాంతికి ఎండబెట్టాలి. గోతులు తవ్వి, ఎండిన ఆకుల చెత్త, పశువుల ఎరువు, ఘనజీవామృతం లేదా వర్మీ కంపోస్ట్ కలిపి గోతులను నింపాలి. సేంద్రియంగా సాగు చేసిన విత్తనాలను మాత్రమే వాడాలి. విత్తనాలను బీజామృతంలో శుద్ధి చేసిన 24 గంటల తర్వాత విత్తాలి. మొక్కలకు జీవామృతం లేదా గోమూత్ర ద్రావణం వాడాలి. ద్రవ జీవామృతాన్ని 15 రోజులకు ఒకసారి ఇస్తూ ఉండాలి. డ్రిప్ ద్వారా నీరివ్వాలి. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వేపనూనె, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి కషాయాలను తయారు చేసి పిచికారీ చేయాలి. పచ్చి రొట్ట పంటలను పెంచి, కత్తిరించి, మొక్కల మొదళ్ల చుట్టూ మల్చింగ్‌గా వెయ్యాలి. కలుపు సమస్య తగ్గుతుంది. ఉత్పత్తి ఖర్చు 30-40% తగ్గుతుంది. ప్రకృతి వ్యవసాయంలో పండించిన మునగ కాయలు రుచిగా, పోషకాలు అధికంగా ఉండి, ఎగుమతులకు అనుకూలంగా ఉంటాయి.

ఇతర వివరాలకు.. డా. టి. భరత్ - 97005 49754

మంగళవారం 23-9-2025



'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 183

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పండుగ ముందు పరుగు..

ఒకే రోజు రూ.2,200 పెరిగిన పసిడి ఢిల్లీలో కొత్త గరిష్టం 1,16,200 -17లో



వనితలది ఇంకా వెనుకబాటే!

స్త్రీల దుస్థితిని కళ్లకు కట్టిన ఐక్యరాజ్యసమితి నివేదిక -2లో



కష్టమైనవి గాలికొదిలేసింది

'ఈశాన్య భారతంలో కష్టమనిపించిన ఏ అభివృద్ధి ప్రాజెక్టు, పనినీ కాంగ్రెస్ భుజాలకు ఎత్తుకోలేదు' అని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు.

వివరాలు 6లో ▸



చైనా బాటలో బ్రిటన్

ప్రతిభావంతులను ఒడిసిపట్టేందుకు చైనా మాదిరిగా వీసా ఫీజు మాఫీ, మినహాయింపుల దిశగా యూకే అడుగులు వేస్తోంది.

వివరాలు 6లో ▸



కొందరు సరిగా పనిచేయట్లేదు

కొందరు హైకోర్టు జడ్జీలు వేగంగా కేసులను పరిష్కరించే నైపుణ్యమున్నా ఆ స్థాయిలో పని చేయట్లేదని సుప్రీం ఆవేదన వ్యక్తం చేసింది.

వివరాలు 6లో ▸



దృష్టిపెట్టాల్సింది నా రీల్స్‌పై కాదు

కేజ్రీవాల్ తన ప్రసంగాలపై కాకుండా వరద బాధితులకు సాయం చేయడంపై దృష్టి పెట్టాలని ఢిల్లీ సీఎం రేఖాగుప్తా అన్నారు.

వివరాలు 6లో ▸

వెబ్ ఆప్షన్లకు నోటిఫికేషన్



ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం మొదటి దశ వెబ్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. నీట్ యూజీలో అర్హులైన అభ్యర్థులే ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది.

- వివరాలు 3లో

ఇదంజగత్



ఈవీఎంలను గత 20 ఏళ్లుగానే వినియోగిస్తున్నారు మేడమ్!

కల్చరల్ సెంటర్‌లో కిట్టీ దందా!

ఎంఎంసీసీసీలో నిబంధనలకు విరుద్ధంగా పేకాట

- స్టేక్ రూ. 20 వేలకు మించరాదని చెబుతున్న నిబంధనలు
- కానీ లక్షల్లో స్టేక్‌లు.. కిట్టీ పేరిట కమీషన్ వసూలు చేస్తున్న ముఠా!
- కాయిన్స్ మాటున పెద్దమొత్తంలో చేతులు మారుతున్న డబ్బు
- కమిటీ కళ్లు గప్పి నెలకు దాదాపు కోటిన్నర వరకు అక్రమార్జన!
- కొత్తగా చేరిన సభ్యులదే ఈ నిర్వాకం అంటున్న పాత సభ్యులు
- ముగ్గురి ముఠాకు టీడీపీ మాజీ ఎమ్మెల్సీ అండ ఉందనే ఆరోపణలు



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఎక్కువగా ధనికులు, ప్రముఖులు నివసించే ప్రాంతం. ఇప్పుడది పేకాటరాయుళ్లకు అడ్డాగా మారిందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. పొరుగు రాష్ట్రం నుంచి వస్తున్న వారు నిబంధనలకు విరుద్ధంగా లక్షలు కుమ్మరించి జూదం ఆడుతున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి అది ఎమ్మెల్యేలు, ఎంపీల కాలనీ కల్చరల్ సెంటర్ (ఎంఎంసీసీసీ). అందులో 350 మంది వరకు సభ్యులుంటే.. ఈ మధ్య కాలంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు కాని 150 మందికి కొత్తగా సభ్యత్వాలు ఇచ్చారు. ఇలా కొత్తగా సభ్యత్వం తీసుకున్న వారితో సాంస్కృతిక కేంద్రం కాస్తా జూదశాల అనే అపకీర్తి మూట కట్టుకుంటోందని, 'కిట్టీ'దందా యథేచ్ఛగా సాగుతోందని అసలైన పాత సభ్యులు వాపోతున్నారు.

కమిటీకి తెలియకుండానే.. : కాలనీలో నివసించే వారు వారాంతంలో కుటుంబంతో సేద తీరడానికి, చిన్న చిన్న ఆటలు ఆడుకోవడానికి, వేడుకలు నిర్వహించుకోవడానికి అనువుగా ఈ కేంద్రం ఉండేది. దీనిని అభివృద్ధి పరిచే ఉద్దేశంతో బయటి వారికి సభ్యత్వం ఇచ్చారు. ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షలు సభ్యత్వ రుసుము కింద సేకరించారు. అలా వచ్చిన నిధులతో పాటు కాలనీలో స్థలాలు పొంది ఇళ్లు నిర్మించుకున్న వారు కూడా కొంత మొత్తం వేసుకుని సెంటర్‌ను అభివృద్ధి చేశారు. కానీ ఇప్పుడది దుర్వినియోగం అవుతోందని, బడా బాబులంతా కల్చరల్ సెంటర్ వేదికగా పేకాట ఆడుతున్నారని, దీంతో కేంద్రం అభివృద్ధి లక్ష్యం దెబ్బతిని, పక్కా జూదశాలగా మారిపోయిందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. చూడ్డానికి అంతా నిబంధనలు పాటిస్తున్నట్లుగానే ఉంటుందని, కానీ కొందరు నిబంధనలకు విరుద్ధంగా, కల్చరల్ సెంటర్ కార్యనిర్వాహక వర్గాన్ని ఏమార్చి

మిగతా 2వ పేజీలో ▶

మావోయిస్టులకు ఎదురుదెబ్బ

ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్ అడవుల్లో ఎన్‌కౌంటర్

- ఒకేరోజు ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యుల మృతి
- మృతుల్లో కదారి సత్యనారాయణ రెడ్డి, కట్టా రామచంద్రారెడ్డి
- ఈ ఏడాది ఇప్పటి వరకు కేంద్ర కమిటీ సభ్యులు తొమ్మిది మంది హతం



సత్యనారాయణరెడ్డి



రామచంద్రారెడ్డి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/సాక్షి, సిద్దిపేట/సిరిసిల్ల: ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులోని అబూజ్‌మడ్ అడవుల్లో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కదారి సత్యనారాయణరెడ్డి (67) అలియాస్ కోసా, కట్టా రామచంద్రారెడ్డి (63) అలియాస్ వికల్ప్ మృతి చెందారు. ఈ ఘటనపై నారాయణపూర్ ఎస్పీ రాబిన్‌సన్ గుడియా మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో మహారాష్ట్రకు సమీప సరిహద్దులో ముస్ఫర్షి దగ్గరున్న దట్టమైన అడవుల్లో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నారనే సమాచారం శుక్రవారమే పోలీసులకు అందిందని, దీంతో భద్రతాదళాలు మావోలు తలదాచుకున్న ప్రదేశాన్ని రెండు వైపుల నుంచి చుట్టుముడుతూ ముందుకు వెళ్లాయన్నారు. సోమవారం ఉదయం ఇరువర్గాల మధ్య

మిగతా 14వ పేజీలో ▶

జల దిగ్బంధం... ట్రాఫిక్ చక్రబంధం

- హైదరాబాద్‌పై వరుణ ప్రతాపం.. సాయంత్రం నుంచి రాత్రి వరకు జడివాన
- కి.మీ. మేర స్తంభించిన ట్రాఫిక్.. సీఎం కాన్వాయ్‌కూ తప్పని ట్రా'ఫికర్'
- బంజారాహిల్స్‌లో అత్యధికంగా 10.5 సెం.మీ. వర్షపాతం



14 లో



ప్రపంచవ్యాప్తంగా 37.6 కోట్లకుపైగా మహిళలు తీవ్ర దారిద్ర్యంలో మగ్గుతున్నారని, ఇది పురుషుల సంఖ్య కంటే ఎక్కువని ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అమలులో పురోగతిపై విడుదల చేసిన 'ద జెండర్ స్నాప్‌షాట్ 2025'లో వెల్లడించింది. ప్రతి ముగ్గురిలో ఒక మహిళ తమ జీవితకాలంలో శారీరక లేదా లైంగిక హింసకు గురవుతున్నారు. జెనరేటివ్ ఏఐ వల్ల పురుషులతో పోలిస్తే మహిళల ఉద్యోగ, ఉపాధి అవకాశాలే ఎక్కువగా దెబ్బతింటాయి. 2024లో ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ వాడుతున్న పురుషులు 70 శాతం కాగా, మహిళల్లో ఇది 65 శాతమే. ఈ నివేదిక ఇంకా ఏమేం చెప్పిందంటే..

- సాక్షి, స్పెషల్ డెస్క్

వనితలది.. ఇంకా వెనుకబాటే!

ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన 'ద జెండర్ స్నాప్‌షాట్ 2025'.. ప్రపంచవ్యాప్తంగా మహిళల స్థితిగతులపై కీలక అంశాలను వెల్లడించింది. మహిళల్లో పేదరికం అనారోగ్యం, వారిపై వివక్ష ఇవన్నీ తగ్గాలంటే.. ప్రభుత్వాలు విద్య, వైద్యం వంటి రంగాల్లో పెట్టుబడులు పెంచాలని, మహిళలకు ఆర్థిక సాధికారత కల్పించాలని ఈ నివేదిక పేర్కొంది. ఇలా పెట్టే పెట్టుబడులు వృథా కావని, వీటివల్ల దేశాల ఆర్థిక వ్యవస్థలు మెరుగుపడతాయని తెలిపింది.

తీవ్ర దారిద్ర్యంలో 37.6 కోట్ల మహిళలు | 89.6 కోట్ల మందికి స్వచ్ఛ ఇంధనం లేదు | ఇంటర్నెట్ వినియోగిస్తున్నది 65 శాతమే | స్త్రీల దుస్థితిని కళ్లకు కట్టిన ఐరాస నివేదిక

పేదరికం

మహిళా పేదరికం 2020 నుంచి భారీగా పెరుగుతోంది. ఇది ఇలాగే కొనసాగితే 2030 నాటికి 35 కోట్లకుపైగా బాలికలు, స్త్రీలు పేదరికంలో మగ్గుతూనే ఉంటారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీలు) అమలును ఇప్పటినుంచి వేగవంతం చేస్తే 2025లో 9.2 శాతంగా ఉన్న ఈ పేదరికాన్ని 2050 నాటికి 2.7 శాతానికి పరిమితం చేయొచ్చు.

ఆరోగ్య భద్రత

పురుషులతో పోలిస్తే దాదాపు 6.4 కోట్ల మంది మహిళలకు ఆరోగ్య భద్రత లేదు. పోషకాహార లోపాల వల్ల బాలికలు, స్త్రీల ఆరోగ్యం దారుణంగా తయారవుతోంది. 15–49 ఏళ్ల మధ్య ఉండే యువతులూ, స్త్రీలలో రక్తహీనత 2025లో 31.1 శాతంగా ఉంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే 2030 నాటికి ఇది 33 శాతానికి పెరుగుతుంది

2000–2023 మధ్య మహిళల ప్రసూతి మరణాల రేటు 39.3 శాతం తగ్గింది. మగవాళ్లు తమ జీవితంలో అనేక రకాల తీవ్రమైన వ్యాధులూ, అనారోగ్య పరిస్థితులతో గడిపే మొత్తం సమయం.. 2021లో 8 ఏళ్లు కాగా, మహిళల్లో ఇది 10.9 సంవత్సరాలు.

విద్య

పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో చేరికలు, చదువు పూర్తి విషయంలో అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలే ముందున్నారు. కానీ, సబ్ సహారన్ ఆఫ్రికా, మధ్య, దక్షిణాసియాల్లో మాత్రం సెకండరీ విద్య పూర్తి చేయడంలో మాత్రం వెనకబడ్డారు.

లింగ సమానత్వం

గత 5 ఏళ్లలో ప్రపంచ వ్యాప్తంగా.. మహిళల పట్ల వివక్ష చూపే అనేక చట్టాలను తొలగించారు. లింగ సమానత్వాన్ని ప్రోత్సహించే చట్టాలు వచ్చాయి. మానభంగానికి (రేప్) సంబంధించి 63 దేశాలు చట్టాలు చేశాయి. కానీ ఇప్పటికీ కేవలం 38 దేశాల్లోనే అమ్మాయిలకు వివాహానికి కనీస వయసు 18 ఏళ్లుగా ఉంది.

- 15–49 ఏళ్ల మహిళల్లో.. గత ఏడాది కాలంలో.. ప్రతి 8 మందిలో ఒకరు (12.5 శాతం) తమ ప్రస్తుత లేదా మాజీ భాగస్వామి వల్ల శారీరక లేదా లైంగిక హింసకు గురయ్యారు.
- 2025 జనవరి 1 నాటికి జాతీయ పార్లమెంటుల్లో మహిళా సభ్యుల శాతం 27.2 శాతం. 102 దేశాల్లో దేశాధిపతి లేదా ప్రభుత్వాధిపతిగా ఇప్పటివరకూ మహిళలు ఎంపిక/ఎన్నిక కాలేదు.
- 2025 ఆగస్టు 1 నాటికి కేవలం 29 దేశాల్లోనే.. దేశాధిపతి లేదా ప్రభుత్వాధిపతిగా మహిళ ఉన్నారు. 5 ఏళ్ల కిందట ఇలాంటి దేశాల సంఖ్య 22.
- ప్రపంచ వ్యాప్తంగా మొత్తం మేనేజర్ స్థాయిలో మహిళలు 30 శాతం ఉన్నారు.

స్వచ్ఛ ఇంధనం

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 89.6 కోట్ల మంది మహిళలకు స్వచ్ఛ ఇంధనం లేదా ఆ సాంకేతికత అందుబాటులో లేదు. 2030 నాటికి ఇది సాధించాలంటే ఇప్పటి నుంచి ఏటా 8 బిలియన్ డాలర్లు ఖర్చు చేయాలి. ఈ పెట్టుబడికి 24 రెట్ల ఆదాయం తిరిగి వస్తుంది.

ఏఐ

జెనరేటివ్ ఏఐ మహిళల ఉద్యోగ, ఉపాధి అవకాశాలనూ దెబ్బతీయనుంది. 21.1 శాతం పురుష ఉద్యోగాలపై ఈ ప్రభావం ఉంటే.. మహిళలపై ఇది 27.6 శాతం.

ఇంటర్‌నెట్

2024లో ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ వాడుతున్న పురుషులు 70 శాతం కాగా, మహిళల్లో ఇది 65 శాతమే. అధిక ఆదాయ దేశాల్లో 93 శాతం మహిళలు, 94 శాతం పురుషులు 'ఆన్‌లైన్'లో ఉంటున్నారు.

దివ్యాంగులు

మామూలు మహిళలతో పోలిస్తే దివ్యాంగులు చాలా చోట్ల వివక్షను ఎదుర్కొంటున్నారు. మామూలు మహిళల్లో 65 శాతం ఇంటర్నెట్ వాడుతుంటే దివ్యాంగుల్లో 26 శాతమే వినియోగిస్తున్నారు.

శాంతి

2024లో తీవ్రమైన అశాంతి, ఘర్షణ వాతావరణం ఉన్న ప్రాంతానికి కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉంటున్న బాలికలు, స్త్రీలు 67.6 కోట్లు. 1990ల తరువాత ఇదే అత్యధిక. అశాంతి, ఘర్షణలు, యుద్ధ వాతావరణం ఉన్న దేశాల్లోని పార్లమెంటుల్లో మహిళల ప్రాతినిధ్యం కేవలం 20 శాతమే.



క్లుప్తంగా...

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

ఎన్‌ఆర్‌ఐలకు మంత్రి పొన్నం విజ్ఞప్తి



హుస్నాబాద్: ప్రవాస భారతీయులు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనుల పర్యవేక్షణ సందర్భంగా సోమవారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. అమెరికా, ఇతర దేశాల్లోని మన మేధావులు, విద్యార్థులు మన దేశానికి చెందిన 100 మందికి పైగా సీఈవోలు ఇతర దేశాల్లో ఉన్నారన్నారు. వారి తెలివితేటలను రాష్ట్రానికి వినియోగిస్తే.. ప్రభుత్వాలు రెడ్‌కార్పెట్ వేసి స్వాగతం పలుకుతాయని పేర్కొన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెడితే ప్రభుత్వాలు ఎన్‌ఆర్‌ఐల కోసం అనుకూల విధానాలు తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు.

తొలగింపులెన్ని?.. నియామకాలెన్ని..

ఏపీపీలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఎంతమంది అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను తొలగించారు?.. వారి పదవీ కాలం ఎంత?.. కొత్తగా ఎందరిని నియమించారు?.. తదితర వివరాలను తమ ముందు ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ మంగళవారానికి వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా ఎల్‌బీ నగర్ కోర్టులో పనిచేస్తున్న తనకు.. ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా ప్రభుత్వం తొలగించిందంటూ న్యాయవాది టి.వెంకటేశ్వర ప్రసాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే అంశంపై మరో 12 మంది వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఏపీపీలుగా పనిచేస్తున్న పిటిషనర్లకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగిస్తూ ఈ నెల 10న జీవో జారీ చేశారన్నారు. ఎందుకు తొలగిస్తున్నారో చెప్పలేదని, వాదన వినిపించే అవకాశం కూడా ఇవ్వకుండా హోంశాఖ జారీ చేసిన జీవో చట్టవిరుద్ధమన్నారు. పిటిషనర్లను తిరిగి నియమించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పదవీ కాలం (శాశ్వత ఏపీపీలు కాకుండా)తో నియమితులైన ఏపీపీలను ఎప్పుడైనా తొలగించే అధికారం సర్కార్‌కు ఉంటుందని స్పష్టం చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఏపీపీలకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేశారు.

హైవే పనుల్లో అలసత్వం వద్దు

- భూసేకరణ, పరిహారం పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదు
- కలెక్టర్లు, ఆర్డీవోలకు సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరిక... అక్టోబర్ కల్లా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం
- ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర, దక్షిణ భాగాల పనులు ఒకేసారి ప్రారంభించాలని ఎన్‌హెచ్‌ఏఐకి విజ్ఞప్తి
- పలు ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రామకృష్ణారావు, వేం నరేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: జాతీయ రహదారులకు సంబంధించిన భూ సేకరణ, పరిహారం ఖరారు, పంపిణీ విషయంలో అలసత్వం చూపే కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లపై వేటు వేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. చిన్న చిన్న కారణాలతో పలు రహదారుల పనుల్లో జాప్యం జరగడం సరికాదని అన్నారు. వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. భూసేకరణ, పరిహారం పంపిణీని అక్టోబర్ నెలాఖరుకల్లా కచ్చితంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భూ సేకరణ విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాలని, అదే సమయంలో రోడ్ల నిర్మాణంతో కలిగే లాభాలను రైతులకు వివరించడం ద్వారా ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సోమవారం సచివాలయంలో.. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, అనుమతుల జారీ, నూతన ప్రతిపాదనలకు ఆమోదం తదితర అంశాలపై జాతీయ రహదారులు, రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్)తో పాటు ఇతర శాఖలు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రహదారులకు భూ సేకరణ, పరిహారం పంపిణీలో జాప్యంపై జిల్లాల కలెక్టర్లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రశ్నించారు. 'కాలా'(కాంపిటెంట్ అథారిటీ ఫర్ ల్యాండ్ అక్విజిషన్) నుంచి నిధుల విడుదలలో జాప్యం జరుగుతోందని వారు చెప్పారు. అయితే ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు నిధులు వెంటనే విడుదల చేస్తున్నామని, కలెక్టర్లు పనులు త్వరగా చేయాలని అన్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం.. కలెక్టర్లు, సంబంధిత ఇతర అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పలుచోట్ల కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్లు చెప్పగా, వారంలోపు అడ్వకేట్ జనరల్‌తో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎస్ రామకృష్ణారావును ఆదేశించారు.

ఎప్పటికప్పుడు కొత్త కొర్రీలెందుకు?

ట్రిపుల్ ఆర్ ఉత్తరభాగంపై కేంద్రం లేవనెత్తిన ప్రతి సందేహాన్ని నివృత్తి చేస్తున్నా ఎప్పటికప్పుడు కొత్త సమస్యలను ఎందుకు లేవనెత్తుతున్నారని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను సీఎం ప్రశ్నించారు. సందేహాలన్నింటినీ ఒకేసారి పంపాలని సూచించారు. ట్రిపుల్ ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలను వేర్వేరు ప్రాజెక్టులుగా చూడొద్దని, రెండింటికీ ఒకే జాతీయ రహదారి నంబరు కేటాయించాలని, వెంటనే అనుమతులు మంజూరు చేసి ఏకకాలంలో పనులు ప్రారంభించాలని కోరారు.

వెంటనే అనుమతులివ్వండి

భారత్ ఫ్యూచర్ సిటీ–అమరావతి–మచిలీపట్నం 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవేకు వెంటనే అనుమతులు ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను ముఖ్యమంత్రి కోరారు. ఈ రహదారికి సమాంతరంగా రైలు మార్గం కూడా నిర్మించాలని, బెంగళూరు–శంషాబాద్ ఎయిర్‌పోర్ట్–అమరావతి మధ్య రైలు మార్గం అవసరమని అన్నారు. హైదరాబాద్–శ్రీశైలం మార్గంలో రావిర్యాల–మన్ననూర్ ఎలివేటెడ్ కారిడార్‌కు వెంటనే అనుమతులు ఇవ్వాలని సీఎం కోరారు. హైదరాబాద్–మంచిర్యాల–నాగ్‌పూర్ నూతన రహదారికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమర్పించిన ప్రతిపాదనలనే అంగీకరించాలని విజ్ఞప్తి చేశారు. పలు జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి అటవీ, పర్యావరణ శాఖ అభ్యంతరాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు.

'వన్య ప్రాణులు లేనిచోట కూడా ఆ చట్టం అమలు'

2002 నుంచి 2022 వరకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అటవీ, పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించారని, దాంతో ప్రస్తుతం అనుమతులు ఇవ్వడం లేదని ఫారెస్ట్ సౌత్ రీజియన్ ఐజీ త్రినాథ్‌కుమార్ చెప్పగా సీఎం అసహనం వ్యక్తం చేశారు. అవసరమైనచోట అడవి పెంపకానికి ప్రత్యామ్నాయ భూమిని ఇస్తామని, దీనిపై కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, భూపేందర్ యాదవ్‌లతో భేటీ అవుతానని తెలిపారు. వన్యప్రాణులు లేని అటవీ ప్రాంతాల్లోనూ వన్య ప్రాణుల చట్టం అమలు చేస్తున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇలావుండగా..తమ కార్యాలయ నిర్మాణానికి హైదరాబాద్‌లో రెండు ఎకరాల భూమి కేటాయించాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ముఖ్యమంత్రిని కోరగా, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్ర అధికారులకు సూచించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శులు శేషాద్రి, శ్రీనివాసరాజు, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అలైన్‌మెంట్ అడ్డగోలు మార్పుతో తీవ్ర నష్టం

- రీజినల్ రింగు రోడ్డు బాధితుల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం: కేటీఆర్
- నల్లగొండ, సూర్యాపేట, సంగారెడ్డి, గజ్వేల్ బాధితులతో భేటీ



మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: రీజినల్ రింగు రోడ్డు(ట్రిపుల్ ఆర్) అలైన్‌మెంట్ మార్పుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రీజినల్ రింగు రోడ్డు మూలంగా ఎవరికీ నష్టం జరగకుండా కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక గాంధీతో ఎన్నికల ముందు హామీలు ఇప్పించారన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీని పూర్తిగా మరిచిపోయిందని మండిపడ్డారు. రీజినల్ రింగు రోడ్డు అలైన్‌మెంట్ మార్పుతో నష్టపోతున్న నల్లగొండ, సూర్యాపేట జిల్లాలతోపాటు సంగారెడ్డి, గజ్వేల్ నియోజకవర్గాలకు చెందిన బాధితులు సోమవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్‌తో భేటీ అయ్యారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు నేతలు, ప్రజా ప్రతినిధులు ఈ భేటీలో పాల్గొన్నారు. 'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అలైన్‌మెంట్ మార్పుతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది. బీఆర్‌ఎస్ పాలనలో ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి వ్యవసాయరంగాన్ని సుభిక్షం చేశాం. గతంలో భూసేకరణ సమస్యలు ఎదురైనప్పుడు మా ప్రభుత్వం నేరుగా రైతులతో చర్చలు జరిపి పునరావాసం కల్పించడంతోపాటు శాశ్వత పరిష్కారాలు చూపించింది. కానీ కాంగ్రెస్ మాత్రం ఔటర్ రింగ్ రోడ్డు విషయంలోనూ, ఇప్పుడు ఆర్‌ఆర్‌ఆర్ విషయంలోనూ అలైన్‌మెంట్లు మార్చి పేదల, రైతుల జీవితాలను ఆగం చేస్తోంది'అని కేటీఆర్ ఆరోపించారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పుతో నష్టపోతున్న వారికి బీఆర్‌ఎస్ అండగా నిలవడంతోపాటు అసెంబ్లీ, పార్లమెంట్‌లో ఈ అంశాన్ని లేవనెత్తుతాం. అలైన్‌మెంట్ శాశ్వతంగా జరిగేంత వరకు బీఆర్‌ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుంది. రీజినల్ రింగ్ రోడ్డు బాధితులు తమ డిమాండ్లను సాధించుకోవడానికి ఐకమత్యం ప్రదర్శించాలి. గ్రామ గ్రామాన తీర్మానాలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పక దిగి వస్తాయి'అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్ అనేది 'జనతా గ్యారేజ్'.. అని రైతులు ఎప్పుడైనా తెలంగాణ భవన్‌కు వచ్చి న్యాయ నిపుణులను సంప్రదించవచ్చన్నారు.

వసతుల్లేని బడులన్నీ ఒకేచోట..

▶ మొదటి పేజీ తరువాయి

విముక్తి పొందిన ప్రభుత్వ భూముల్లో స్కూళ్లకు అధునాతన భవనాలు నిర్మించాలని సూచించారు.

5 అంశాలు.. 111 ప్రతిపాదనలతో ప్రణాళిక..

ప్రజల మౌలిక వసతులకు అద్దంపట్టే గ్లోబల్ సిటీకి చిరునామాగా కోర్ అర్బన్ సిటీని అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మానవ జీవన ప్రమాణాలకు కొలమానమైన విద్య, వైద్యం, రోడ్డు రవాణా, పారిశుద్ధ్య రంగాలకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని దిశానిర్దేశం చేశారు. పెరుగుతున్న నగర విస్తృతి, జనాభాకు అవసరమైన అధునాతన మౌలిక సదుపాయాలను ప్రపంచస్థాయి ప్రమాణాలతో అందించే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించాలన్నారు. పేదలందరికీ తక్షణ వైద్య సాయం అందుబాటులో ఉండేలా ప్రత్యేక క్లినిక్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఐదు ప్రధాన అంశాలుగా విభజించిన కోర్ అర్బన్ సిటీ అభివృద్ధి ప్రణాళిక అందులోని మొత్తం 111 ప్రతిపాదనలపై సమీక్షలో సీఎంఓ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దే ప్రతిపాదనలను మరింత లోతుగా పరిశీలించాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. పైపైన మెరుగులు కాకుండా పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కోర్ అర్బన్ సిటీని అభివృద్ధి చేయాలని చెప్పారు.

క్లీన్ సిటీ కోసం ప్రణాళిక..

ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని సీఎం స్పష్టం చేశారు. ప్రపంచంలో హైదరాబాద్‌కు క్లీన్ సిటీ ఇమేజ్ తెచ్చేందుకు నిరంతరం శ్రమించాలన్నారు. క్లీన్ సిటీ ప్రణాళికలను అమలు చేసే అధికారులకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. కోర్ అర్బన్ సిటీలోని ప్రభుత్వ కార్యాలయాలన్నీ సొంత భవనాల్లో ఉండేలా స్థలాలు కేటాయించి భవన నిర్మాణాల ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. సచివాలయంతోపాటు సిటీలోని ప్రభుత్వ ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీలపై సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసి పునరుత్పాదక విద్యుత్‌ను వినియోగించాలన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల పరిరక్షణకు డిజిటల్ ల్యాండ్ డేటాబేస్ విధానం అమలు చేయాలన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు డ్రోన్ పోలీసింగ్..

నగరంలో గంటల కొద్దీ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ స్టడీ జరగాలని, అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. అన్ని జంక్షన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని, గూగుల్ సహకారంతో ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించే ప్రణాళిక వెంటనే అమలు చేయాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు డ్రోన్ పోలీసింగ్ అమలు చేయాలని, వెంటనే డ్రోన్లను కొనుగోలు చేయాలన్నారు. వర్షం పడితే జంక్షన్లలో నీళ్లు నిల్వకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ నిర్మించాలని చెప్పారు. డ్రైనేజీ, మ్యాన్ హోల్స్ క్లీనింగ్‌కు రోబోలను వాడాలని.. యంత్ర పరికరాలతోనే క్లీనింగ్ జరగాలన్నారు. జూబ్లీహిల్స్ మహాప్రస్థానం తరహాలో మూసీ పరీవాహకంలో ఉన్న అంబర్‌పేట శ్మశానవాటికను ఆధునీకరించాలని ఆదేశించారు.

అన్ని హంగులతో హుస్సేన్‌సాగర్ 2.0

హుస్సేన్‌సాగర్ చుట్టూ నెక్లెస్ రోడ్, ఇందిరా పార్కు, సంజీవయ్య పార్కు ప్రాంతాలను అద్భుతంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ చెప్పారు. ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా హుస్సేన్‌సాగర్ 2.0ను అన్ని హంగులతో అభివృద్ధి చేయాలన్నారు. స్కై వాక్, సైకిల్ ట్రాక్‌తోపాటు మల్టీలెవల్ పార్కింగ్ తదితర నిర్మాణాలు చేపట్టాలన్నారు. అన్ని పార్కుల్లో పిల్లల ఆటపాటలకు వీలుగా ప్లే జోన్లను అభివృద్ధి చేయాలన్నారు. వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక వెండింగ్ జోన్స్‌ను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. మల్టీ స్టోరేజ్ బిల్డింగ్స్, ఫైర్ సేఫ్టీ అంశాలపై అత్యంత పకడ్బందీ వ్యవస్థ ఉండాలని సూచించారు. వీధి దీపాలకు సోలార్ విద్యుత్ వినియోగం, కొత్తగా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద పైలట్ ప్రాజెక్టుగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటును పరిశీలించాలన్నారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. నగరంలోని విద్యుత్ సబ్ స్టేషన్ల అప్‌గ్రెడేషన్‌తో పాటు, ఎక్కడపడితే అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను స్ట్రీమ్ లైన్ చేసి రీ–లొకేట్ చేయాలని సూచించారు.

సర్కారీ శాఖలకు ఇక ఒకే పరిధి..

కోర్ అర్బన్ సిటీలో మున్సిపల్, పోలీస్, విద్యుత్, జలమండలి విభాగాల యూనిట్లు, వాటిని పర్యవేక్షించే అధికారుల పరిధి ఒకేతీరుగా ఉండేలా పునర్వ్యవస్థీకరించాలని సీఎం ఆదేశించారు. ఉదాహరణకు మున్సిపల్ జోన్ ఏరియా, అక్కడి పోలీస్ స్టేషన్ ఏరియా, జలమండలి, విద్యుత్తు సర్కిల్ పరిధికి ఒకే హద్దులుంటే అక్కడుండే అధికారుల పర్యవేక్షణ, సమన్వయం సమర్థంగా ఉంటుందన్నారు. మంచినీటి, మురుగునీటి వ్యవస్థపై నిర్వహణ వేర్వేరుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతుల విషయంలో విభాగాల మధ్య సమన్వయం ఉండేలా చూసుకోవాలన్నారు.

చర్లపల్లి జైలులో డ్రగ్స్ రిహాబ్ సెంటర్..

నగరాన్ని డ్రగ్స్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు కఠినచర్యలు అమలు చేయాలని సీఎం ఆదేశించారు. డ్రగ్స్, గంజాయి సేవించి పట్టుబడితే బాధితులుగా చూడొద్దని.. కనీసం 10 రోజులపాటు రిహాబిలిటేషన్ సెంటర్లో ఉంచాలన్నారు. చర్లపల్లి జైలు ప్రాంగణంలోనే రిహాబిలిటేషన్ సెంటర్ నిర్మించి నిర్వహణ, పర్యవేక్షణకు మాజీ సైనిక అధికారుల సేవలను వినియోగించుకోవాలన్నారు.

నాగారం భూములపై నివేదిక ఇవ్వండి

- ధిక్కరణ కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం
- మరో ధిక్కరణ కేసులో ఐఏఎస్, ఐపీఎస్‌లకు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని గైరాన్ సర్కారీ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశించినా.. ఉత్తర్వులను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై సమగ్ర నివేదిక అందజేయాలని జూన్‌లో తాము ఆదేశించినా.. ఇప్పటివరకు ఎందుకు సమర్పించలేదని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ప్రశ్నించింది. తదుపరి విచారణను అక్టోబర్ 10వ తేదీకి వాయిదా వేస్తూ.. ఆలోగా నివేదిక అందజేయాలని తేల్చిచెప్పింది. నిర్మాణాలు కొనసాగించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన మరో ధిక్కరణ పిటిషన్‌లో ప్రతివాదులైన ఐఏఎస్, ఐపీఎస్‌లు, ఇతరులకు నోటీసులు జారీ చేసింది. నాగారం గ్రామంలోని సర్వే నంబర్ 181, 182, 194, 195లోని గైరాన్ భూములను కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌లు, వారి బంధువులు అక్రమంగా కొనుగోలు చేశారని గతంలో బిర్లా మల్లేశ్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఆ భూములను విక్రయించడం, బదిలీ చేయడం, నిర్మాణాలు చేపట్టడం సహా ఎలాంటి మార్పులు చేయవద్దని ప్రతివాదులకు తేల్చిచెప్పడం తెలిసిందే. న్యాయస్థానం ఉత్తర్వులున్నా వివాదాస్పద భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని మల్లేశ్ హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. జూన్‌లో ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు.. రెండు వారాల్లో పిటిషనర్ లేవనెత్తిన అంశాలకు సమాధానమిస్తూ నివేదిక అందజేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. అయినా ఇప్పటివరకు కలెక్టర్ నివేదిక దాఖలు చేయలేదంటూ మహేశ్ మరో ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కోర్టు రెండు వారాలు గడువు ఇచ్చి దాదాపు మూడు నెలలు కావస్తున్నా కలెక్టర్ ఇప్పటి వరకు నివేదిక అందజేయలేదన్నారు. ఇది న్యాయస్థానం ఉత్తర్వుల ధిక్కరణే అవుతుందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. అక్టోబర్ 10లోగా నివేదిక దాఖలు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. తొలి ధిక్కరణ పిటిషన్‌లో ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ.. విచారణ వాయిదా వేశారు.

కల్చరల్ సెంటర్‌లో 'కిట్టీ' దందా!

▶ మొదటి పేజీ తరువాయి

లక్షల రూపాయలతో పేకాట ఆడుతున్నారని నిజమైన సభ్యులు కొందరు వాపోతున్నారు. కొత్తగా చేరిన సభ్యులతో పాటు, వారి గెస్టులు కూడా యథేచ్ఛగా పేకాట ఆడడానికి వస్తున్నారని చెబుతున్నారు. డబ్బులు కన్పించకుండా కాయిన్స్ రూపంలో ఈ జూదం ఆడుతున్నారని తెలుస్తోంది. పేకాట ఆడడానికి వెళ్లేవారు.. నిర్వాహకులుగా వ్యవహరిస్తున్న వారికి ఫీజు చెల్లించి కాయిన్స్ తీసుకుని వాటి ద్వారా పేకాట ఆడుతున్నట్లు సమాచారం. కడప జిల్లాకు చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్సీ అండ చూసుకుని అతని సోదరుడు భరత్‌తో పాటు సునీల్‌రెడ్డి, జగదీశ్ అనేవారు దీనిని నిర్వహిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ కార్యకలాపాలన్నీ సెంటర్ కమిటీ దృష్టికి రాకుండా జాగ్రత్తగా కొనసాగిస్తున్నట్లు తెలిసింది. పేకాట ఆడనిచ్చినందుకు కిట్టీ (కమీషన్) తీసుకుంటూ అక్రమార్జనకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అడ్డగోలుగా అక్రమార్జన

ఒక్కొక్కరు లక్ష, రెండు లక్షల రూపాయల స్టేక్‌తో ఆటలు ఆడుతున్నట్లు సమాచారం. ఇది నిబంధనలకు విరుద్ధమని, ఎట్టి పరిస్థితుల్లోనూ స్టేక్ రూ.20 వేలకు మించరాదని నిబంధనలు చెబుతున్నట్లు సమాచారం. ఒక్కొక్కరు లక్ష రూపాయల స్టేక్ చొప్పున 10 ఆటలు ఆడితే.. ఒక ఆటకు ఏడు పాయింట్లు లెక్కిస్తారు. ఒక్కో పాయింట్‌కు రూ.400 కిట్ చొప్పున 70 పాయింట్లకు రూ.28 వేల కిట్ తీస్తున్నారు. ఇలా ఐదు టేబుల్స్ ఉంటాయనుకుంటే.. 28,000 x 5 లెక్కన రూ.1.40 లక్షలు కమీషన్ కింద వసూలు చేస్తున్నారన్నమాట. ఇక రూ.2 లక్షల స్టేక్‌తో ఆడేవారు కూడా ఉన్నారు. రూ.2 లక్షల స్టేక్‌తో ఆడే ఆటలు కూడా లెక్కగట్టి పాయింట్లు తీస్తారు. ఈ క్రమంలో ఒక టేబుల్‌పై ఆరు ఆటలు పూర్తయితే ఏకంగా రూ.1.92 లక్షలు వసూలు అవుతుందని, అలాంటివి మూడు టేబుల్స్ ఆడితే ఒక రోజుకు రూ.5.75 లక్షలు కిట్టీ కింద వసూలు చేస్తున్నారని సమాచారం. ఇలా నెలకు దాదాపు కోటిన్నర వరకు వసూలు చేస్తున్నారని, ఇ దంతా మేనేజింగ్ కమిటీకి తెలియకుండానే జరుగుతోందని అంటున్నారు. టేబుల్ దగ్గర డబ్బు పెట్టకపోయినా..అక్కడ ఉండే రెండు గదుల్లో డబ్బు దాస్తున్నట్లు అనుమానాలు వ్య క్తం అవుతున్నాయి. ఈ అంశంపై ఇటీవలే పోలీసులకు కూ డా ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం కాగా.. వారు తూతూ మంత్రంగా విచారణకు వచ్చి వెళ్లినట్లు చెబుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా జరగడానికి వీల్లేదు

ఈ మధ్యనే ఎంఎంసీసీ బాగా పాపులర్ అవుతోంది. చాలామంది కల్చరల్ సెంటర్‌కు వస్తున్నారు. మేము కేవలం కాయిన్స్ మాత్రమే ఇస్తాం. అక్కడ ఎలాంటి డబ్బు చేతులు మారడం ఉండదు. అయితే ఆ కాయిన్స్‌కు ఎంత మొత్తం పెట్టి ఆడుతున్నారన్నది కనుక్కోవడం కష్టసాధ్యం. గతంలో ఈ విధంగా జరిగినట్లు ఆరోపణలు రావడంతో అన్నిచోట్లా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఇప్పుడు కూడా నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి కార్యక్రమాలు జరగడానికి వీల్లేదు.

– రాగిడి లక్ష్మారెడ్డి, ఎంఎంసీసీ ప్రధాన కార్యదర్శి

వెబ్ ఆప్షన్లకు నోటిఫికేషన్

- ఎంబీబీఎస్, బీడీఎస్ మేనేజ్‌మెంట్, ఎన్ఆర్ఐ కోటా విడుదల
- బుధవారం మధ్యాహ్నం వరకు అవకాశం
- 6,406 మంది అర్హులైన అభ్యర్థులతో కాళోజీ వర్సిటీ ఫైనల్ లిస్ట్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేట్ మెడికల్, డెంటల్ కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి మేనేజ్‌మెంట్ కోటా (బీ, సీ/ఎన్ఆర్ఐ కేటగిరీ) కింద ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాల కోసం మొదటి దశ వెబ్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (కేఎన్ఆర్‌యూహెచ్ఎస్) విడుదల చేసింది. బీ,సీ కేటగిరీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన 6,406 మందితో ఫైనల్ జాబితాను వెల్లడించారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి బుధవారం 24 మధ్యాహ్నం 2 గంటల వరకు అర్హులైన అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ కోరారు. ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు https://tspvtmedadm. tsche. in వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

6,406 మంది అర్హులతో ఫైనల్ జాబితా

ఈనెల 20న యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో విడుదల చేసిన మేనేజ్‌మెంట్ కోటా ఫైనల్ మెరిట్ లిస్ట్‌లో పేరు ఉన్న నీట్ యూజీ అర్హులైన అభ్యర్థులే ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని 26 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 2,120 సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కింద కేటాయించారు. ఇందులో బీ కేటగిరీ కింద 1,480 సీట్లు ఉండగా, ఎన్ఆర్ఐ కోటా కింద 640 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే బీడీఎస్ కింద రాష్ట్రంలోని ఆర్మీ డెంటల్ కాలేజీతో పాటు 10 ప్రైవేటు డెంటల్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా కింద 543 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆర్మీ డెంటల్ కాలేజీలోని 43 సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కింద ఆర్మీ సిబ్బంది వారసులకే కేటాయించనున్నారు. మిగతా 10 ప్రైవేటు కాలేజీల్లో ఒక్కో కాలేజీలో 50 సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కింద కేటాయించారు. వీటిలో 30 సీట్లు లోకల్ కేటగిరీలో, 5 సీట్లు అన్ రిజర్వ్‌డ్ కింద, మరో 15 సీట్లు ఎన్ఆర్ఐ కోటా కింద కేటాయించనున్నారు. కాగా మెరిట్ అభ్యర్థులు కోర్సు, కళాశాల, కేటగిరీ (బీ, సీ/ఎన్ఆర్ఐ) వారీగా ప్రాధాన్యత క్రమంలో ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. కాగా, కరీంనగర్‌కు చెందిన చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీలో ప్రవేశాలు తెలంగాణ హైకోర్టు తుది తీర్పు ఆధారంగా ఉంటాయని యూనివర్సిటీ స్పష్టం చేసింది. మైనారిటీ మెడికల్ కాలేజీల్లోని మేనేజ్‌మెంట్ కోటా సీట్లు ముస్లిం మైనారిటీ విద్యార్థులకే కేటాయిస్తారు. అర్హులైన మైనారిటీ విద్యార్థులు అందుబాటులో లేకపోతే, చివరి దశలో గరిష్టంగా 30 శాతం వరకు నాన్–మైనారిటీ అభ్యర్థులతో భర్తీ చేస్తారు.

అక్రమ మద్యంపై ఎక్సైజ్‌శాఖ కొరడా

వారం రోజుల్లో 1704 మద్యం బాటిళ్లు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న ముఠాలపై ఎక్సైజ్ శాఖ దాడులు ముమ్మరం చేసింది. దసరా పండుగ సందర్భంగా కొందరు.. ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి విమానాలు, రైళ్లు, బస్సులు, ఇతరవాహనాల్లో తెలంగాణకు రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నట్టు అందిన సమాచారం మేరకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఈ నెల 15 నుంచి 30 వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్టు ఎక్సైజ్‌శాఖ కమిషనర్ కార్యాలయం తెలిపింది. ఎన్‌డీపీఎల్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఎస్టీఎఫ్ (స్టేట్ టాస్క్‌ఫోర్స్), డీటీఎఫ్ (డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్), ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు, ఎక్సైజ్ టీమ్‌లు వారం రోజులుగా నిర్వహించిన దాడుల్లో 1704 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.68.16 లక్షలని అధికారులు తెలిపారు. కాగా, అక్రమ మద్యం రవాణా, సారా నియంత్రణపై సిబ్బంది మరింత దృష్టి పెట్టాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఆదేశించారు.

నళినికి వెంటనే ఉద్యోగ బెనిఫిట్స్ ఇవ్వాలి

రాష్ట్ర ప్రభుత్వానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్

- మాజీ డీఎస్పీకి పరామర్శ.. ఆమెను ప్రధాని వద్దకు తీసుకెళ్తామని వెల్లడి
- రామ్‌దేవ్ బాబాతో వైద్యం అందిస్తామని హామీ



భువనగిరిలో నళినిని పరామర్శిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, చిత్రంలో ఆమె కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు

సాక్షి, యాదాద్రి: తీవ్ర అనారోగ్యానికి గురైన తెలంగాణ ఉద్యమకారిణి, మాజీ డీఎస్పీ నళినికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఉద్యోగ బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ప్రతినిధులతో కలిసి భువనగిరిలోని నళిని ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా నళిని తన అనారోగ్య సమస్యను బీజేపీ నేతలకు తెలియజేశారు. అనంతరం రాంచందర్‌రావు మాట్లాడుతూ సీఎం రేవంత్ గతంలో ఆర్థిక ప్రయోజనాలను ఇప్పిస్తానని హామీ ఇచ్చినా అమలు చేయలేదని నళిని చెప్పారన్నారు. దీంతో ఆమె మానసికంగా కుంగిపోయి ఆరోగ్యం క్షీణించిందన్నారు. ప్రధాని మోదీని కలవాలని ఉందని నళిని చెప్పారని.. ఇందుకోసం పార్టీ తరఫున ప్రధాని అపాయింట్‌మెంట్ తీసుకుంటానన్నారు. ఆమెకు యోగా గురువు రామ్‌దేవ్ బాబాతో వైద్యం చేయిస్తామని పేర్కొన్నారు. 'నా ఆరోగ్యం బాగా దెబ్బతింది. నా జీవితాశయం యోగశాల నిర్మాణం పూర్తి చేయాలి. ప్రభుత్వం నుంచి నాకు రావాల్సిన డబ్బు వస్తే యోగశాల నిర్మాణానికి ఖర్చుచేస్తా. నాకు ఏ ఇతర ఆర్థిక సాయం అవసరం లేదు'అని ఆమె రాంచందర్‌రావుకు వివరించారు. రాంచందర్‌రావు వెంట బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, ఉపాధ్యక్షుడు డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, కాసం వెంకటేశ్వర్లు, నాయకులు ఊట్కూరి అశోక్‌గౌడ్, గూడూరు నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఉన్నారు.

నళినికి భువనగిరి కలెక్టర్ పరామర్శ

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశంతో భువనగిరి కలెక్టర్ హనుమంతరావు సోమవారం భువనగిరిలో నళినిని నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. సర్వీస్ సమస్యలు ఏమైనా ఉంటే నిబంధనల మేరకు త్వరలోనే పరిష్కరిస్తామని సీఎం చెప్పినట్లు కలెక్టర్ ఆమెకు వివరించారు. ప్రభుత్వం సహాయం చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. కాగా, నళిని అభ్యర్థన మేరకు తప్పకుండా తాను ప్రధానికి లేఖ రాసి వైద్య సాయం అందేలా చూస్తానని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



“స్వార్థం అన్ని రకాల భాషలూ మాట్లాడుతుంది. అన్ని రకాల పాత్రలూ పోషిస్తుంది. అలాగని నిస్వార్థం భాషను మాట్లాడకుండా ఏమీ ఉండదు.
– రామ్‌ధారీ సింగ్ దినకర్, రచయిత

సాక్షి
మంగళవారం, 23 సెప్టెంబర్ 2025

ట్రంప్ తెచ్చిన తంటా!

ఎవరి అంచనాలకూ అందకుండా ప్రవర్తిస్తూ అయోమయానికి గురిచేయటంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సిద్ధహస్తుడు. ఆర్నెల్లక్రితం రెండోసారి అధికారంలోకొచ్చింది మొదలు తీసుకుంటున్న విపరీత నిర్ణయాల మాదిరే హెచ్1బీ వీసా ఫీజు దాదాపు లక్ష డాలర్లు చేసి ఐటీ, ఫార్మా, సాంకేతిక రంగాల నిపుణుల ఆశలను భగ్నం చేశారు. ఈ వీసా లబ్ధిదారుల్లో అత్యధికులు భారతీయులని తెలిసే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని వేరే చెప్పనవసరం లేదు. ప్రస్తుతం హెచ్1బీ వీసాదారులు 7,30,000 మందిలో దాదాపు 71 శాతం మంది భారతీయులు. ఇప్పటికే మన సరుకులపై సుంకాల మోత మోగించి భిన్నరంగాల కార్మికుల పొట్టగొట్టిన ట్రంప్, ఇప్పుడు ఐటీ, ఫార్మా, సాంకేతిక రంగ పరిశ్రమల్లో పనిచేస్తున్న అత్యంత నైపుణ్యంగల ఇంజనీర్ల ఆశలు అడియాసలు చేశారు. మొదట ఫీజు పెంపుపై చేసిన అస్పష్ట ప్రకటన అమెరికాలోని భారతీయుల్లో తీవ్ర ప్రకంపనలు రేపింది. పండగ కోసం స్వస్థలాలకు చేరుకుంటున్న వేలాదిమంది మార్గమధ్యంలో మెనుదిరిగే ప్రయత్నం చేయగా, అలాంటివారిని మరింత ఇబ్బంది పెట్టాలన్న ఏకైక లక్ష్యంతో ట్రంప్ కనుసన్నల్లో పనిచేసే ‘మాగా’ ఉద్యమకారులు విమానాల్లో భారీయెత్తున సీట్లు బ్లాక్ చేసి టిక్కెట్ల ధరలు ఆకాశాన్నంటేలా చేశారు. అసలు జరుగుతున్నదేమిటో అర్థంకాక అమెజాన్, మైక్రోసాఫ్ట్ తదితర సంస్థలన్నీ ఆదివారం మధ్యాహ్నం గడువు ముగిసే వేళకు వచ్చితీరాలని సందేశాలు పంపటంతో స్వస్థలాలకొచ్చినవారంతా ఉన్నపాటున బయల్దేరారు. అంతా అయిన తర్వాత ఈ పెంపు కొత్త దరఖాస్తులకు మాత్రమే వర్తిస్తుందంటూ, అది కూడా వార్షిక ఫీజు కాదు... ఒక్కసారి కట్టాల్సిన రుసుమేనంటూ వైట్‌హౌస్ అధికార ప్రతినిధి తీరిగ్గా ప్రకటించారు. పైగా రెండు మూడేళ్లలో వీసాను నవీకరించుకోవాల్సినవారికి కూడా ఇది వర్తించబోదని చెప్పారు. కానీ యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఛాంబర్ ఆఫ్ ప్రోగ్రెస్ సంస్థల ప్రతినిధుల ప్రకటనలు గమనిస్తే ఇప్పటికీ దిగ్గజ సంస్థల్లో ఏర్పడిన అయోమయం పోలేదని అర్థమవుతుంది. అసలు ఇప్పుడు చెప్పిన మాటకు ట్రంప్ కట్టుబడి ఉంటారన్న గ్యారెంటీ కూడా లేదు.

తీరికూర్చుని నిందలేయటానికి తప్ప వలసదారుల వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ కొచ్చిన నష్టం లేశమాత్రమైనా లేదు. అర్హులైన అమెరికన్ల ఉద్యోగాలు కొల్లగొట్టిందీ లేదు. ఒక అబద్ధాన్ని పదే పదే చెబితే నిజమవుతుందన్న ఉద్దేశంతోనే ఆ కట్టుకథను మాగా ప్రచారంలో పెట్టింది. ప్రారంభంలో వలసదారులు తక్కువ వేతనానికి చేరినా త్వరలోనే తమ నైపుణ్యంతో, చురుకుదనంతో అక్కడివారితో సమానంగా వేతనం అందుకుంటున్నారు. నిజానికి ఐటీ, ఫార్మా, సాంకేతిక రంగాల మాట అటుంచి చిప్ డిజైన్, క్లౌడ్ కంప్యూటింగ్, పెనువేగంతో విస్తరిస్తున్న కృత్రిమ మేధ (ఏఐ) తదితర ప్రాజెక్టుల్లో సమర్థంగా పనిచేసే చాలినంతమంది స్థానిక నిపుణులు దొరకటం అక్కడి సంస్థలకు అసాధ్యం. ఏఐలో అమెరికాను చైనా దాటిపోతోందన్న వార్త ఇప్పటికే అక్కడి పరిశ్రమల్ని కలవరపెడుతోంది. దాన్ని మరింత పెంచటం, చివరకు అమెరికా వెనకబాటుకు కారకుడు కావటం మినహా ట్రంప్ సాధించేదేమీవుండదు.

వలసదారుల వల్ల అమెరికా పొందిన లబ్ధి అంతా ఇంతా కాదు. ప్రపంచంలో ఎక్కడా లేనంత సంపద పోగు పడటానికి వలసదారులే కారణం. 1990–2000 మధ్య నోబెల్ సాధించిన శాస్త్రవేత్తల్లో 26 శాతంమంది వలసదారులు. ఇప్పుడు ప్రముఖ కంపెనీలుగా ఉన్న సంస్థల వృద్ధి వెనక 25 శాతం వలసదారులే ఉన్నారు. తన విపరీత నిర్ణయాలు అనుద్దేశిత పర్యవసానాలకు దారి తీస్తాయన్న ఎరుక ట్రంప్‌కు లేకుండా పోయింది. తాజా పెంపు నిర్ణయాన్ని న్యాయస్థానాలు తప్పుబట్టి తాత్కాలికంగా నిలిపేయవచ్చంటున్నారు. ఆ సంగతెలావున్నా ట్రంప్ సృష్టించిన అనిశ్చితి పర్యవసానంగా స్థానిక కంపెనీలు తమ కార్యక్షేత్రాలను వేరే దేశాలకు తరలిస్తాయి. దాంతోపాటు వృత్తిరంగ నిపుణులు, విద్యార్థులు ఇతర దేశాల వైపు దృష్టి సారిస్తారు. ఇదంతా అమెరికాకే నష్టం. మన ప్రభుత్వం మెరుగైన విధానాలతో ముందుకొస్తే, ఆ ప్రతిభా సామర్థ్యాలకు ఆసరాగా నిలిస్తే ఆ చర్య దేశాభివృద్ధికి దోహదపడుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.విదియ రా.2.27 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** హస్త ప.1.00 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** రా.9.44 నుండి 11.29 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.07 వరకు, తదుపరి రా.10.46 నుండి 11.33 వరకు, **అమృత ఘడియలు:** ఉ.6.33 నుండి 8.16 వరకు

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.55
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

అక్కడ ఉండొద్దు!



ఒక చోట సక్సెస్ అయ్యాక మనం ఇక అక్కడ ఉండకూడదు. అంతకు మించినదానిని కనిపెట్టాలి. ఫుడ్ డెలివరీకి మరో ప్రత్యామ్నాయ మార్గం ఉందా అని నేనిప్పుడు ఆలోచిస్తున్నాను. అభివృద్ధి చెందటం అనేది ఎప్పటికీ ఆగిపోయేది కాదు.

– శ్రీహర్ష మెజెటి, ‘స్విగ్గీ’ సీఈవో

చిరునవ్వు వాదనలు



వాదనలలో హాస్య ధోరణిని కలిగి ఉండండి. మీరు వాదనలోకి దిగవలసి వచ్చినప్పుడు, దానిని పెంచకుండా నివారించటానికి ఉన్న ఒక ఉత్తమ మార్గం ఫన్నీగా ఉండటం. ఇంకో మార్గం, అవతలి వారి వాదనను మీరు చిరునవ్వుతో ఆలకించటం.

– ఎడ్ షీరాన్, గేయ రచయిత

ఏదో ఒకటి..!



అంత బాగా లేని సినిమాల నుండి కూడా నేను ప్రేరణ పొందుతాను. ఎందుకంటే, అందరూ విఫలం అయిందని భావించే సినిమాల్లో కూడా ఏదో ఒక మంచి ఉంటుంది. ఎంత బాగుండకపోయినా బాగుండేది ఒకటి ఉంటుందని నేను నమ్ముతాను.

– స్టీవెన్ స్పీల్‌బర్గ్, హాలీవుడ్ దర్శకుడు

ఏసీల గ్రహం!



ఈ శతాబ్దం మధ్య నాటికి, భారతదేశ పట్టణ జనాభా 60–70 కోట్లకు చేరుకుంటుంది. వీరిలో ఎక్కువమంది ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండే నగరాల్లో ఉంటారు. పూర్తిగా ఏసీలపై ఆధారపడే భవిష్యత్తు నుంచి మనం మన భూగోళాన్ని కాపాడుకోవాలి.

– చంద్ర భూషణ్, ‘ఐఫారెస్ట్’ సీఈవో

అదృశ్యం



టీనేజర్లు ట్రోలింగ్ అనే శూన్యంలోకి అదృశ్యమవుతున్నారు. వాస్తవ ప్రపంచం నుండి వారు ఏ విధమైన ప్రేరణా పొందటం లేదు. జీవితంలో తాము ఏమి చేయాలనుకుంటున్నారో ఆలోచించటానికి వారికి వారే సమయం ఇచ్చుకోవడం లేదు.

– జెన్నిఫర్ అనిస్టన్, అమెరికన్ నటి

మెరుగవండి!



ఈ కొత్త ప్రపంచంలో, మనం పనిచేసే విధానం గతంలో కంటే ఎక్కువ వేగంగా మారుతోంది. ప్రతి ఉద్యోగీ బాస్‌లా మారుతారు. ప్రతి వర్క్ ఫ్లో స్మార్ట్ అవుతోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి మన నైపుణ్యాలు మెరుగుపడాలి.

– పునీత్ చందోక్, ‘మైక్రోసాఫ్ట్’ ఇండియా ప్రెసిడెంట్

ఐరాస అవసరం తీరిపోలేదు!

విశ్లేషణ



డేనియల్ వార్నర్

అమెరికాలో చార్లీ కిర్క్ హత్యోదంతంపై రేగుతున్న ప్రజాగ్రహం, పోలెండ్‌ను బెదిరిస్తున్న రష్యన్ డ్రోన్‌లు, ఇజ్రాయెల్ ఇపుడు బాహాటంగానే చెబుతున్న గాజాలోని జాతి నిర్మూలన, గాజా పొరుగు దేశాలపై ఇజ్రాయెల్ దాడులు... వీటన్నిటి నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి (ఐరాస) 80వ వార్షికోత్సవం జరుపుకోవాల్సిన అవసరం ఉందా? కానీ, సహజ జ్ఞానానికి విరుద్ధంగా, ఇటువంటి సందర్భానికి ఇదే సరైన సమయమేమో అని కూడా అనిపిస్తోంది. సమస్యలను విడివిడిగా చూడాలని, చర్చలు జరపాలని అమెరికా విజ్ఞప్తి చేస్తోంది. కాల్పుల విరమణ పాటించాలనటం, శాంతియుతంగా చర్చలు జరపాలని పిలుపు నివ్వడంలో ఆ విజ్ఞప్తులు ప్రతిధ్వనిస్తున్నాయి.

ఎనభై అన్నది కీలక ఘట్టం

అంతర్జాతీయ శాంతి, భద్రతలను సాధించడంలో – ఐరాస వైఫల్యాలు; నాగరికంగా చర్చలు జరుపుకొనే పద్ధతిని పెంపొందించడంలో, అందరికీ పూర్తి మానవ హక్కులను కాపాడడంలో – అమెరికా అంతర్గత బలహీనతలు స్పష్టంగా కనిపిస్తున్న దశ ఇది. మహా అయితే, ఐరాస 80వ వార్షికోత్సవం... గతి తప్పిన జాతీయతావాదం, మిగిలిన వర్గాలను పట్టించుకోకుండా స్వీయ వర్గానికే వీర విధేయత చూపడం, విశృంఖల హింస వంటి వాటికి అతీతంగా కొన్ని విలువలున్నాయని గుర్తు చేసేందుకు ఉపయోగపడుతుంది. నానాజాతి సమితి 26 ఏళ్ళే మనగలిగింది. దానిని మించి మనుగడ సాగిస్తున్నందుకు ఐరాస గర్వపడవచ్చు. ఒక వ్యక్తి జీవితంలో 80వ పడిలో పడడం కీలక ఘట్టం. ఆయుర్దాయాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాల్సి ఉంటుంది. అలాగే, ఐరాస తన ప్రాధాన్యాన్ని కొనసాగించుకునేందుకు ఈ వార్షికోత్సవం కూడా ముఖ్యమైంది.

ఏడేళ్లుగా నిధుల సంక్షోభం!

ఐరాసలో తిరిగి జవజీవాలు నింపేందుకు ‘యూఎన్ 80 ఇనీషియేటివ్’ పేరుతో 2025 మొదట్లో ఒక కార్యక్రమం ప్రారంభమైంది. కానీ, ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్నట్లుగా కనిపిస్తున్న సంస్థను ప్రక్షాళన చేసే బదులుగా అది... వెలాతెలా బోతున్న సంస్థ వేడుకగా మారినట్లు కనిపిస్తోంది. ఐరాస ఆర్థిక సంక్షోభం నానాటికీ పెరుగుతోంది. ‘‘సభ్య దేశాలన్నీ తమ చందా మొత్తాలను పూర్తిగా చెల్లించకపోవడం, చాలా దేశాలు సకాలంలో చెల్లించకపోవడం వల్ల కనీసం గత ఏడేళ్లుగా ఐరాస ద్రవ్యత సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది’’ అని ఐరాస ఉన్నత కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వెల్లడించారు. ఈ ఏడాది మార్చి 11 నాటికి ‘‘మొత్తం 193 దేశాలలో 75 దేశాలే వాటి వంతు మొత్తాలను పూర్తిగా చెల్లించాయి. సంస్థ 2025 సంవత్సరపు బడ్జెట్ 3.72 బిలియన్ డాలర్లుగా ఉంది’’ అని ఆ ప్రకటనలో తెలిపారు. నిధుల లోటును; మధ్య ప్రాచ్యంలోను, ఉక్రెయిన్‌లోను శాంతిని నెలకొల్పడమనే ప్రాథమిక విధి లోని వైఫల్యాలను చూస్తుంటే ఐరాస కూడా నానాజాతి సమితి బాట పడుతుందా? అనే ప్రశ్న రావటం సహజమే.



నేటి నుంచి ఐరాస సర్వప్రతినిధిసభ 80వ సమావేశం

‘శాంతి కోసం సమైక్యత’

అయితే, సమితి గురించి ప్రముఖ న్యాయ కోవిదుడు, మాజీ ప్రొఫెసర్, జడ్జి, గుటెరస్‌కు సన్నిహితుడు అయిన జార్జ్ అబీ సాబ్ ఒక ఇంటర్వ్యూలో మూడు ఆశావహమైన సంగతులను చెప్పారు. మొదటిది: అంతర్జాతీయ సమాజం తన సమష్టి అభిమతాన్ని వ్యక్తీకరించేందుకు, ఆ సమాజాన్ని న్యాయబద్ధం చేసేందుకు ఉన్న ఒకే ఒక అంతర్జాతీయ వేదిక ఇప్పుడు ఐరాస మాత్రమే. ఖతార్ రాజధాని దోహాపై ఇటీవలి దాడిని (ఇజ్రాయెల్ పేరును నేరుగా ప్రస్తావించకపోయినప్పటికీ) భద్రతా మండలి ఖండించింది. ‘శాంతి కోసం సమైక్యత’ పేరుతో ఐరాస సర్వ ప్రతినిధి సభ చేసిన తీర్మానం ప్రకారం, ఆక్రమిత పాలస్తీనా భూభాగం నుంచి ఇజ్రాయెల్ తన సేనలను ఇప్పటికే సెప్టెంబర్ 18 నాటికి ఉపసంహరించుకుని ఉండాలి. ఇది అంతర్జాతీయ న్యాయస్థానం సలహా పూర్వకంగా వెలిబుచ్చిన అభిప్రాయం. దాన్ని పాటించని ఇజ్రాయెల్‌పై సర్వ ప్రతినిధి సభ కొన్ని చర్యలు తీసుకోవచ్చు. ఉదాహరణకు, ఐరాస శాంతి పరిరక్షక దళాన్ని నియోగించవచ్చు.

చెప్పుకోదగిన విజయాలు

రెండు: శాంతి, భద్రతలను పక్కనపెడితే ఐరాస చెప్పుకోతగిన విజయాలు కొన్ని ఉన్నాయి. వివిధ ఐరాస సంస్థలు పర్యావరణం వంటి రంగాల్లో ప్రత్యేక సేవలందిస్తున్నాయి. పర్యావరణానికి హానికరమైన చేపల వేటకు పాల్పడేవారికి సబ్సిడీలను నిరాకరించే వాణిజ్య ఒప్పందానికి ప్రపంచ వాణిజ్య సంస్థ ఇటీవల కట్టుబడవలసి వచ్చింది. మూడు: బహుళ పక్షానికి (మల్టీలేటరలిజం) వ్యతిరేకంగా చేస్తున్న ప్రయత్నాలను ప్రతిఘటించడం. ఏవో ఒకటి రెండు దేశాలు పెత్తనం చలాయించకుండా, ప్రపంచ వ్యవస్థను తీర్చిదిద్దటంలో వివిధ దేశాలకు భాగస్వామ్యం కల్పించడానికి ఐరాస ప్రయత్నాలు ఎంతో కొంత ముందుకు సాగుతున్నాయి. షాంఘై సహకార సంస్థ ఐరాసకు ప్రత్యామ్నాయం వంటి బహుళ పక్ష వ్యవస్థ కాకపోవచ్చు. కానీ, డొనాల్డ్ ట్రంప్ సుంకాల బెదిరింపులను ప్రతిఘటించే విధంగా వివిధ దేశాల్లో కొన్ని సంకేతాలు కనిపిస్తున్నాయి.

◆ పరస్పర వైషమ్యాలతో సతమతమవుతున్న ప్రపంచంలో, తన ప్రాధాన్యాన్ని నిలుపుకొనేందుకు, 80వ పడిలో పడిన ఐరాస తిప్పలు పడుతోంది. ఈ ప్రయత్నంలో ఐరాస వార్షికోత్సవ చర్చా కార్యక్రమం (సెప్టెంబర్ 23–27) ముఖ్యమైనది కాబోతోంది.

◆ అమెరికాను ఆ దేశ సంస్థాపక పితామహులు ముందుకు తెచ్చిన సుమారు 80 ఏళ్ల తర్వాత, లింకన్ ‘స్వాతంత్ర్య పునరుజ్జీవనం’ గురించి మాట్లాడారు. ఇప్పుడు ‘యూఎన్ 80 ఇనీషియేటివ్’ అదే రకమైన నూతన ఆవిర్భావం గురించి ప్రస్తావించింది.

అమెరికా–ఐరాస పోలికలు

అంతర్జాతీయ సహకారానికి అడ్డుపడుతున్న అంశాలకూ, అమెరికాలో రాజకీయ పోలరైజేషన్‌కూ మధ్యనున్న సారూప్యాలను గమనించకుండా ఉండడం కష్టం. భీకర అమెరికన్ అంతర్యుద్ధాలలో ఒకదాన్ని చవి చూసిన తర్వాత పెన్సిల్వేనియాలోని గెట్టీస్ బర్గ్‌లో 1863లో చేసిన ప్రసంగంలో అమెరికా పురుద్ధరణను అధ్యక్షుడు అబ్రహాం లింకన్ దర్శింపజేశారు. అమెరికా ఏర్పడిన 87 ఏళ్ల తర్వాత లింకన్ ‘‘ప్రజల కోసం, ప్రజలతో ఎన్నుకోబడిన, ప్రజా ప్రభుత్వం’ అన్న భావనను పునశ్చరణ చేశారు. ఐరాస ప్రణాళిక ఉపోద్ఘాతం కూడా ‘‘ఐక్యరాజ్య సమితి ప్రజలమైన మేము’’ అనే మొదలవుతుంది. అమెరికాను ఆ దేశ సంస్థాపక పితామహులు ముందుకు తెచ్చిన సుమారు 80 ఏళ్ల తర్వాత, లింకన్ ‘స్వాతంత్ర్య నూతన జననం’ గురించి మాట్లాడారు. ఇప్పుడు ‘యూఎన్ 80 ఇనీషియేటివ్’ అదే రకమైన నూతన ఆవిర్భావం గురించి ప్రస్తావించింది. అంతర్జాతీయంగా ప్రభుత్వాల మధ్య వారధిగా పని చేస్తున్న సంస్థ ఐరాస ఒక్కటే! కనుక సమితి తన జీవిత కాలాన్ని, ప్రాధాన్యాన్ని, 80 ఏళ్లకు మించి పొడిగించుకోగలుగుతుందా అన్న సందేహం అక్కర్లేదు.

వ్యాసకర్త అంతర్జాతీయ వ్యవహారాల నిపుణుడు – రచయిత

ప్రజలు అమాయకులు అనుకుంటున్నారా?

‘నువ్వు చెప్పే దానితో నేను ఏకీభవించకపోవచ్చు కానీ చెప్పడానికి నీకున్న ఆ హక్కును నా ప్రాణమిచ్చి అయినా కాపాడుతాను’ అన్న ప్రముఖ ఫ్రెంచ్ రచయిత వోల్టేర్ మాటలు గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థ అనుకుంటున్న మన దేశంలో నీటి మూటలే! దేశంలో పాత్రికేయులకు రచయితలకు గడ్డుకాలం దాపురించింది. అకారణమైన అరెస్టులు, అక్రమ కేసులు వారి చుట్టూ బిగించుకుంటున్న పరిస్థితి చూస్తున్నాం. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇంతకు భిన్నమైన పరిస్థితి ఏమీ లేదు.

పత్రికా సంపాదకుల మీద, పాత్రికేయుల మీద నిర్బంధకాండ యథేచ్ఛగా కొనసాగుతున్నది. ప్రభుత్వాలు తమకు వ్యతిరేకంగా రాసే పత్రికా సంపాదకులనూ, పాత్రికేయులనూ, సోషల్ మీడియా జర్నలిస్టులనూ, యూ ట్యూబర్లనూ ఒక్కరనేమిటి... ఎవరినీ వదలడం లేదు. కేసులతో వారిని వేధిస్తున్నారు. ఇళ్లపై అర్ధరాత్రి దాడులు నిర్వహించి అరెస్టుల పర్వం కొనసాగిస్తున్నారు. తప్పును తప్పుగా చెప్పడం తప్పుగా భావిస్తున్నాయి ప్రభుత్వాలు. మార్గదర్శకాలను ఉల్లంఘించినా, నియంత్రణ రేఖలను అధిగమించినా ప్రభుత్వాలు వారిపై చర్య తీసుకోవడం సబబు, సమర్థనీయం. కానీ తమ పని విధానాన్ని, విధి విధానాలను వ్యతిరేకించినా లేక సమర్థించకపోయినా; ప్రభుత్వ పాలసీలను, పథకాలలో ఉన్న లొసుగులను ఎత్తిచూపినా ప్రభుత్వాలు అది చాలా క్షమించరాని నేరంగా భావిస్తున్నాయి. పత్రికలు ఏదైనా రాసినంత మాత్రాన ప్రజలు గుడ్డిగా నమ్ముతారా? అందులో నిజానిజాలు బేరీజు వేసుకోరనుకోవడం తప్పు. ప్రజలకు ఉన్న వివేచనను, విచక్షణను ప్రభుత్వాలు తక్కువగా అంచనా వేయకూడదు.

పత్రికలు ఈ పోటీ ప్రపంచంలో పాత్రికేయ విలువలూ, సామాజిక బాధ్యతలూ రెండింటినీ రెండు భుజాలపై మోస్తూ ఈ వృత్తికి న్యాయం చేయాలి. ఒక రాజకీయ పార్టీవారు తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన పనిని... వారు అధికారంలోనికి రాగానే ప్రతిపక్షాలు అదే పని చేస్తే సహించే పరిస్థితి నేడు లేదు. అంటే అధికారంతో, హోదాతో విలువలు మారుతాయన్న మాట! రాజ్యాంగం ఎన్నో విలువలతో పకడ్బందీ చట్టాలతో ప్రజల హక్కులను కాపాడుతూ తయారైన ఒక పవిత్ర, ప్రామాణిక గ్రంథం. దేశానికి దిశా నిర్దేశం చేసే గ్రంథం అది. రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడిచే ఏ రకమైన చర్యలైనా ప్రజలు సహించరు. ప్రజల సహనాన్ని పరీక్షిస్తే తగిన సమయంలో తగు తీర్పునిస్తారు. పత్రికా సంపాదకులను, పాత్రికేయులను వేధించిన ప్రభుత్వాలకు ప్రజాస్వామ్యంలో ప్రజామోదం ఉండదు. విమర్శను ఆహ్వానించాలి. విచక్షణతో అందులోని సహేతుకతను అర్థం చేసుకొని ఆలోచించాలి. అంతేకానీ విమర్శలోని విషయాలను విషంగా పరిగణిస్తే పరిణామాలు విషమంగానే ఉంటాయి. విధాన నిర్ణయాలపై విమర్శలు వస్తే విశ్లేషించుకుని సవరించుకోవాలి. అందుకు విరుద్ధంగా విమర్శకులపై విచ్చలవిడిగా కేసులు బనాయించి విశృంఖలంగా అరెస్టు చేస్తూ వారికున్న హక్కులను కాలరాయాలని ప్రయత్నిస్తే న్యాయస్థానాలు మౌనంగా ఉండవు.

◆ ప్రభుత్వాలు, పాలకులు విమర్శను ఆహ్వానించాలి. విచక్షణతో అందులోని సహేతుకతను అర్థం చేసుకొని ఆలోచించాలి. అంతేకానీ విమర్శలోని విషయాలను విషంగా పరిగణిస్తే పరిణా మాలు విషమంగానే ఉంటాయి.



మీడియా స్వేచ్ఛ విషయంలో ప్రపంచంలోని 180 దేశాల్లో భారత్ 151 స్థానాన్ని పొందింది. ఇక్కడే భావ ప్రకటన స్వేచ్ఛ దేశంలో ఏ మేరకు ఉందో స్పష్టమవుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మీడియాపై ఎక్కుపెట్టిన ఆంక్షలను, కేసులను ఇండియన్ న్యూస్ పేపర్స్ సొసైటీ, ఎడిటర్స్ గిల్డ్ లాంటి సంస్థలు ఖండించాయి. పత్రికా రంగాన్ని ఫోర్త్ ఎస్టేట్ అని ఘనంగా చెప్పుకుంటున్నాం. దాని విలువను, గౌరవాన్ని కాపాడవలసిన బాధ్యత పాలకులదే!

– శ్రీశ్రీ కుమార్ । కవి–రచయిత

కార్మికుల హక్కులకు భంగం!

ఇన్‌బాక్స్

ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసన పరిషత్‌లు రెండూ నాలుగు కార్మిక వ్యతిరేక బిల్లులను ఆమోదించడంతో కార్మిక హక్కులు బుగ్గిపాలయ్యాయి. ఫ్యాక్టరీల చట్టం 1948కి తెచ్చిన సవరణ ప్రకారం సెక్షన్ 54లో కార్మికుడు పది గంటలకు మించి పనిచేయరాదు. ఆ సంగతి పేర్కొంటూనే ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ అనుమతితో 13 గంటల వరకూ పని చేయించుకోవడానికి కొత్తగా అనుమతించారు. మధ్యలో ఆరు గంటలకు ఒకసారి అరగంట విశ్రాంతి ఇస్తే చాలని పేర్కొన్నారు. ఇలా పరిశ్రమల్లో, కార్యాలయాల్లో 13 గంటల పని విధానాన్ని ఏపీ ప్రభుత్వం చట్టబద్ధం చేసింది. రాత్రిపూట కూడా మహిళలు పని చేయటానికి అనుకూలంగా చట్టాలను సవరించింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం... కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్లను బలపరచడమే కాకుండా, దానికి అనుకూలంగా రాష్ట్రంలో చట్ట సవరణలకు పూనుకున్నది. శ్రామికవర్గానికి వ్యతిరేకంగా, పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరించే కూటమి ప్రభుత్వం, తన అసలు రూపాన్ని మరోసారి బయటపెట్టింది.



శతాబ్దానికి పైగా ప్రపంచవ్యాప్తంగా కార్మికులు ‘పనికి ఎనిమిది గంటలు, విశ్రాంతికి ఎనిమిది గంటలు, వినోదానికి ఎనిమిది గంటలు’ అనే నినాదంతో పోరాడారు. గౌరవం, ఆరోగ్యం, బానిసలుగా కాకుండా మనుషులుగా జీవించే హక్కు కోసం శ్రామిక వర్గం చేసిన పోరాటం అది. ఎక్కువ పని గంటలు ‘ఉత్పాదకతను పెంచుతాయి’, ‘అవకాశాలను సృష్టిస్తాయి’ అని ప్రభుత్వం చేసే ప్రచారం పచ్చి మోసం. వాస్తవానికి, ఈ విధానం పెట్టుబడిదారులకు భారీ లాభాలను తెచ్చిపెడుతుంది. అదే సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగాలను దూరం చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులకు వ్యతిరేకమైన నాలుగు కార్మిక కోడ్‌లను ప్రవేశపెట్టింది. కార్మిక సంఘాల హక్కులను అడ్డుకుంది, కాంట్రాక్ట్ కార్మికులను ప్రోత్సహించింది.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విధించిన 13 గంటల పనిదినాలు కార్మికుల ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయి. పని చేసే చోట ప్రమాదాలు పెరుగుతాయి. మహిళలు, యువత భరించలేని నిస్సహాయ స్థితిలోకి వెళ్లిపోతారు. నిజమైన అభివృద్ధి అంటే తక్కువ పని గంటలు, ఎక్కువ వేతనాలు, సార్వత్రిక సామాజిక భద్రత, కార్మికులకు ఉత్పత్తిపై ప్రజాస్వామిక నియంత్రణ ఉండటం! తాజా శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, విద్యార్థులు, అన్ని ప్రజాస్వామిక శక్తులూ పోరాడాలి.

– కొల్లిపర వెంకటేశ్వరరావు
కార్యదర్శి, సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్, ఆంధ్రప్రదేశ్ కమిటీ


డేటా పాయింట్

అతివలు ‘ప్రశ్నిస్తున్నారు’!

18వ లోక్‌సభలో... యువ మహిళా ఎంపీలు పురుషులతో పోలిస్తే సగటున ఎక్కువ ప్రశ్నలు అడిగారు. మొత్తంగా కూడా మహిళలు సగటున వేసిన ప్రశ్నల సంఖ్య పురుష ఎంపీలు అడిగిన వాటితో దాదాపు సమానంగా ఉండటం విశేషం.



ఆధారం: పాలిటిక్స్ ఫర్ ఇంప్యాక్ట్ రూపొందించిన ‘లోక్‌సభ వార్షిక నివేదిక 2024-25’



మనలోనే...



జీవితమనే బండి సజావుగా నడుస్తున్నంత కాలం నేనే జ్ఞానిని, నేనే దేవుడినని చెప్పుకుంటాం. అయితే జీవిత ప్రయాణంలో ఎక్కడో అక్కడ ఒక గుంతలో చిక్కుకున్నప్పుడు, అడ్డంకులు ఎదురైనప్పుడు, మనం దేవాలయానికి వెళ్తాం, ప్రార్థిస్తాం. లేదా ఓ ఆధ్యాత్మిక గురువునో, ఓ సాధువునో సందర్శిస్తాం. ఒక సాధారణ వ్యక్తి జీవిత ప్రయాణంలో ఒక జెన్ సాధువు గురించి విన్నాడు. ఆయన అసామాన్యుడు అనీ, ఎవరి దుఃఖాన్నయినా మటుమాయం చేసే శక్తి ఆయనకు ఉందనీ విన్నాడు. ఆయనను చూడటానికి చాలా దూరం ప్రయాణించాడు. ఒక కొండపైన గుడిసెలో నివసిస్తున్న ఆ సాధువు వద్దకు వెళ్ళాడు. ఊహాతీత నిరాడంబరత కనిపించింది. సాధువు కోసం వెళ్ళిన వ్యక్తి ఆయనను సేవకుడనుకున్నాడు. మీ గురువుగారిని చూడటానికి వచ్చానన్నారు. అయితే ఆయన, ప్రశాంతంగా ఇలా చెప్పారు...

‘ప్రతి నిరాడంబరమైన, అతి సరళమైన వ్యక్తిలో ఒక సాధువు కనిపిస్తాడు. ప్రతి ఒక్కరి మనస్సులో, మంచి, చెడు, దురాశ, జ్ఞానం వంటి అనేక రకాల లక్షణాలు ఉంటాయి. ఎటువంటి భ్రమలూ లేని వారై ఉంటారు. అంతెందుకు, నీలోనూ ఒక సాధువు దాగి ఉన్నాడు. ఆ సాధువు కోసం అన్వేషించు. నిన్ను ఇక్కడికి ఏ కారణం తీసుకు వచ్చిందో అది దానంతటదే అదృశ్యమవుతుంది.’ ఈ మాటలతో ఆ వ్యక్తి ఆయన సామాన్యుడు కాదనీ, తాను చూడాలనుకుంటున్న సాధువు ఆయనే అని గ్రహించాడు. నిజమైన సాధువులను, బోధకులను ఎలా గుర్తించాలి? అది చాలా సులభం. తప్పుడు మార్గంలో నడవాలనే కోరికను ప్రజలకు చూపించరు. డబ్బుల కోసం ఎగబడరు. కానీ నకిలీ బోధకులు ప్రజల దురాశను బలహీనతలను సొమ్ము చేసుకుంటారు. నిజమైన సాధువులు అందరి ప్రయోజనం కోసం సరైన మార్గంలో నడిపిస్తారు. ప్రకృతి సంపదను మానవులతో మాత్రమే కాకుండా ఇతర జీవులతో కూడా పంచుకుంటూ, సంతోషకరమైన జీవితానికి మార్గం సుగమం చేసే మంచి వ్యక్తులవుతారు. సన్మార్గం, దుర్మార్గం మధ్య ఉన్న తేడాను చెబుతారు. కళ్ళు తెరిపిస్తారు.

– యామిజాల జగదీశ్

జీఎస్‌టీ పొదుపు ఉత్సవం మొదలైంది

- ఇది మార్కెట్ల నుంచి ముంగిళ్లదాకా పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చింది
- తగ్గిన జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన సందర్భంగా ప్రధాని వ్యాఖ్య
- దేశ ప్రజలకు మోదీ బహిరంగ లేఖ

న్యూఢిల్లీ: తగ్గిన జీఎస్‌టీ పన్నుల కారణంగా దేశ వ్యాప్తంగా మార్కెట్లు మొదలు ఇంటి ముంగిళ్ల దాకా ప్రజలకు ఖర్చులు తగ్గి పొదుపు ఉత్సవం మొదలైందని ప్రధాని మోదీ ఆనందం వ్యక్తంచేశారు. నగదు ఆదా ఉత్సవం ప్రతి ఒక్కరి ఇంట్లో పండుగ శోభను మోసుకొచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు. శరన్నవరాత్రి ఉత్సవాల తొలి రోజునే జీఎస్‌టీ తగ్గుముఖం పట్టిందని, ఇది శుభ సూచకమంటూ దేశ ప్రజలకు మోదీ సోమవారం బహిరంగ లేఖ రాశారు. ''షాపింగ్ చేసే వాళ్లకు ఇది నిజంగా పండుగే. అన్ని మార్కెట్లలో, అందరి ఇళ్లలో నగదు ఆదా ఉత్సవం ఆరంభమైంది. నవ శకం జీఎస్‌టీ సంస్కరణలు దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. సెప్టెంబర్ 22 నుంచి జీఎస్‌టీ సంస్కరణలు పొదుపు పెంచడంతోపాటు రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్య తరగతి, వ్యాపారులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల దాకా సమాజంలోని ప్రతి ఒక్క వర్గానికి ప్రయోజనం చేకూరుస్తున్నాయి. ఈ శుభతరుణంలో అందరం ఆత్మ నిర్భరత పథంలో కలిసి నడుద్దాం. 2047 ఏడాదికల్లా వికసిత్ భారత్ ఉమ్మడి లక్ష్యాన్ని సాధిద్దాం. ఈ సంవత్సరం పండుగల సీజన్ కొత్త సంతోషాలను మోసుకొచ్చింది. తగ్గిన జీఎస్‌టీతో ప్రజలు డబుల్ బొనాంజాను ఒడిసి పట్టారు. జీఎస్‌టీ సంస్కరణలు అద్భుతమైన ప్రగతికి, పెట్టుబడులకు బాటలు వేయనున్నాయి. దీంతో దేశంలోని ప్రతి రాష్ట్రం, ప్రాంతం అభివృద్ధిలో దూసుకుపోనుంది'' అని మోదీ ఆ లేఖలో అభిలషించారు.

పన్ను రహితం లేదా 5 శాతం

''ఆహారం, ఔషధాలు, సబ్బులు, టూత్‌పేస్ట్, బీమా ఇలా మరెన్నో వస్తూత్పత్తులు ఇప్పుడు పన్నురహితంగా లేదా కేవలం 5 శాతం జీఎస్‌టీ శ్లాబులో అందుబాటులోకి వచ్చాయి. గతంలో 12 శాతం శ్లాబులో ఉన్న ఎన్నో ఉత్పత్తులు ఇప్పుడు 5 శాతం శ్లాబులోకి దిగొచ్చాయి. ఇవి 'శ్లాబులు మారడానికి ముందు, ఆ తర్వాత రేట్లు' అంటూ వ్యాపారులు తమ దుకాణాల ముందు బోర్డ్‌లు తగిలించడం చూస్తుంటే మనసుకు ఎంతో సంతోషంగా ఉంది. రూ.12 లక్షల వార్షికాదాయంపై సున్నా పన్నును అమలుచేసి మధ్యతరగతి ప్రజల చేతుల్లో నగదు నిలిచేలా చేశాం. ఇప్పుడు తగ్గిన జీఎస్‌టీ రేట్లు, అమలవుతున్న జీరో ఐటీ ట్యాక్స్‌తో ప్రజలకు రూ.2.5 లక్షల కోట్ల సొమ్ము ఆదా అయింది. దీంతో చిన్న ఇల్లు కట్టుకోవడం, కొత్త వాహనం కొనుక్కోవడం, గృహోపకరణాలు కొనుగోలుచేయడం, కుటుంబంతో కలిసి సరదాగా బయట భోజనం చేయడం వంటి ఆనందాలెన్నో సాకారమవుతున్నాయి'' అని మోదీ ఆనందం వ్యక్తంచేశారు.

'చిరు'వ్యాపారుల పెద్ద పండుగ

''సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు జీఎస్‌టీ తగ్గింపుతో పండుగ కాంతుల్లో వెలిగిపోతున్నాయి. సులభతర వ్యాపారానికి అనువైన వాతావరణం నెలకొంది. తక్కువ ట్యాక్స్‌లు, తక్కువ ధరలు, అనువైన నిబంధనల కారణంగా వ్యాపారం ఊపందుకోనుంది. వ్యాపారాభివృద్ధి అవకాశాలు మెరుగయ్యాయి. స్థానిక ఉత్పత్తుల విస్తృతి పెరగనుంది. ఇది ఆత్మనిర్భర్ భారత్ దిశగా పెద్ద అడుగు'' అని అన్నారు.

కవరేజీ కమాల్

తగ్గిన జీఎస్‌టీతో ప్రజల కొనుగోళ్లు పెరగనున్నాయని, పౌరుల్లో హర్షాతిరేకాలు మిన్నంటాయంటూ సోమవారం పలు ప్రధాన హిందీ, ఇంగ్లిష్ దినపత్రికల్లో వచ్చిన కథనాలు, ప్రధాన వార్తలను ప్రధాని ప్రస్తావించారు. 'తక్కువ ధరలు, ఎక్కువ ఆనందాలు' అనే క్యాప్షన్ పెట్టి మోదీ పలు న్యూస్‌పేపర్ల ఫ్రంట్ పేజీలను తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. తగ్గిన జీఎస్‌టీతో వినియోగదారులకు భారీ ప్రయోజనం చేకూరనుందంటూ దైనిక్ భాస్కర్, దైనిక్ జాగరణ్, ఎన్‌బీటీ, హిందుస్తాన్, హరిభూమి, రాష్ట్రీయ సహారా సహా పలు ప్రధాన ఆంగ్ల పత్రికల తొలి పేజీ క్లిప్పింగ్‌లను మోదీ షేర్ చేశారు.

కష్టమైన పనులను గాలికొదిలేసింది

అది ఆ పార్టీకి వారసత్వంగా వచ్చిన అలవాటు

- అందుకే ఈశాన్యభారతం ఎంతో కోల్పోయింది
- కాంగ్రెస్‌పై ప్రధాని ధ్వజం
- త్రిపుర, అరుణాచల్‌లో అభివృద్ధి ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన

ఈటానగర్/అగర్తలా: ఈశాన్య భారతంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా గత కాంగ్రెస్ ప్రభుత్వాలపై ప్రధాని మోదీ విమర్శల వర్షం కురిపించారు. ఈశాన్యభారతంలో పర్యటనలో భాగంగా సోమవారం ప్రధాని త్రిపుర, అరుణాచల్‌ప్రదేశ్‌లలో రూ.5,100 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఈటానగర్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ''అరుణాచల్‌ప్రదేశ్‌లో కేవలం రెండు లోక్‌సభ స్థానాలే ఉన్నాయి. రాజకీయంగా ఈ రెండు సీట్లతో తమకు ఎలాంటి ప్రయోజనంలేదని కాంగ్రెస్ ఎప్పుడో భావించింది. ఈశాన్యభారతంలో కష్టమనిపించిన ఏ అభివృద్ధి ప్రాజెక్టు, పనినీ కాంగ్రెస్ భుజాలకెత్తుకోలేదు. కొండలు, అటవీప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టడం సవాళ్లతో కూడిన పని. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈశాన్య రాష్ట్రాలను వెనుకబడిన ప్రాంతాలుగా ప్రకటించి చేతులు దులుపుకున్నాయి. అభివృద్ధి పనులను వదిలేసే కాంగ్రెస్ నిష్క్రియాపర్వం కారణంగా ఈశాన్యభారతం అభివృద్ధికి అస్సలు నోచుకోలేదు.

ఇలా పనులను గాలికొదిలేయడం కాంగ్రెస్‌కు వారసత్వంగా వచ్చిన దురలవాటు. కాంగ్రెస్ కారణంగా నిర్లక్ష్యానికి గురైన అరుణాచల్‌ప్రదేశ్‌ను ఢిల్లీలో కూర్చుని పరిపాలిస్తే సరిపోదని నాకు అర్థమైంది. అందుకే రాష్ట్రానికి తరచూ కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులను పంపించా. నేను కూడా ఈశాన్య భారతంలో ఇప్పటిదాకా 70 సార్లకుపైగా పర్యటించా. దశాబ్దకాలంలో చూస్తే మంత్రులు, అధికారులు 800 సార్లు పర్యటించారు. రహదారులు నిర్మించడం అసాధ్యమని కాంగ్రెస్ భావించిన అదే చోట్ల ఇప్పుడు ఆధునిక రహదారులను నిర్మించాం. సేతు టన్నెల్‌నే తీసుకోండి. ఒకప్పుడు అది సాధ్యమని ఎవ్వరూ ఊహించలేదు. ఇప్పుడు ఇది అరుణాచల్‌ప్రదేశ్ గౌరవ గుర్తింపుగా నిలిచింది. హోలోంగి ఎయిర్‌పోర్ట్ సైతం కొత్త టర్మినల్‌తో అందుబాటులోకి వచ్చింది. ఇక్కడి నుంచి నేరుగా ఢిల్లీకి విమానసర్వీసులు ఉన్నాయి. ఈ అనుసంధాన ప్రాజెక్టులు ప్రయాణాలను సులభతరం చేశాయి. రైతులు తమ ఉత్పత్తులను పెద్ద మార్కెట్లకు తరలించగల్గుతున్నారు'' అని మోదీ అన్నారు.

ఆ ఆలోచనను మార్చాలనుకున్నా

''2014లో తొలిసారిగా ప్రధానిగా దేశ సేవచేసే అవకాశం వచ్చినప్పుడు ఒక్కటే అనుకున్నా. కాంగ్రెస్ భావజాల సుడిగుండం నుంచి దేశాన్ని కాపాడాలని కంకణం కట్టుకున్నా. ఏ రాష్ట్రంలోనైనా మా మార్గదర్శకం ఓట్లు, సీట్లు కావు. దేశమే ముఖ్యం అనే నినాదంతో ముందుకెళ్తున్నాం. ఎవరి గురించి అయితే ఎవరూ పట్టించుకోలేదో వాళ్లనే మోదీ పట్టించుకుంటాడు. అదే అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రం. అందుకే 2014 నుంచి అభివృద్ధికి కొత్త కేంద్రంగా అరుణాచల్‌ప్రదేశ్‌ను మలిచా. రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలున్నాయి. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలుంటే కలిగే డబుల్ ప్రయోజనాలకు అరుణాచల్ ఒక మచ్చుతునక. ఈరోజు ప్రకటించిన పలు విద్యుత్ ప్రాజెక్టులు పూర్తయ్యాక రాష్ట్రం ప్రధాన విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా భాసిల్లుతుంది. రూ.1,750 కోట్ల వ్యయంతో 80.2 కోట్ల యూనిట్ల వార్షిక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో చేపట్టిన టాటో–1 ప్రాజెక్ట్ పూర్తయితే వేలాది మందికి ఉపాధితోపాటు సరసమైన ధరలో విద్యుత్ అందుబాటులో ఉంటుంది''అని మోదీ అన్నారు. షియోమీ జిల్లాలో యార్జెప్ నదిపై రెండు భారీ జలవిద్యుత్ ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేశారు.

అలిగిన కూటమి పార్టీ

త్రిపురలో మోదీ పాల్గొన్న కార్యక్రమాల్లో కనీసం తమకు ఆహ్వానం అందలేదని త్రిపుర రాష్ట్రంలో కూటమి సర్కార్‌లో భాగస్వామి అయిన 'ది తిప్రా మోథా' పార్టీ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ మేరకు పార్టీ టీఎంపీ సీనియర్ ఎమ్మెల్యే రంజిత్ దేవ్‌వర్మ ఒక ప్రకటన విడుదలచేశారు. '' త్రిపురేశ్వరీ ఆలయం ప్రాంగణంలో మోదీ చేపట్టిన పునరుద్ధరణ భవనాల ప్రారంభోత్సవాలు, పూజా కార్యక్రమాల్లో మా టీఎంపీ పార్టీ చీఫ్, రాజవంశీకుడు ప్రద్యోత్ కిశోర్ మాణిక్య దేవ్‌వర్మను ఆహ్వానించలేదు. కూటమి సర్కార్‌లో సభ్యులై ఉండికూడా పార్టీ ఎమ్మెల్యేలను పిలవలేదు. ఆలయాన్ని కట్టించిన మహారాజ ధన్య మాణిక్య రాజవంశానికే చెందిన రాజమాత విభూ కుమారి దేవికి సైతం ఆహ్వానం అందలేదు'' అని దేవ్‌వర్మ అసహనం వ్యక్తంచేశారు. 1949 సెప్టెంబర్‌లో నాటి భారత సర్కార్, రాణి కంచన్ ప్రవదేవీల మధ్య ఒడంబడిక కుదిరేనాటికి ఈ ఆలయం ఈ వంశస్తుల అధీనంలోనే ఉందని దేవ్‌వర్మ గుర్తుచేశారు. మాకూ ఆహ్వానం అందలేదని మరో కూటమి పార్టీ ఇండీజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఇటానగర్‌లో ఏర్పాటైన ఎగ్జిబిషన్‌లో మహిళతో మాట్లాడుతున్న ప్రధాని



స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో మాటామంతీ

అరుణాచల్ రాజధాని ఇటానగర్‌లో ఇందిరాగాంధీ పార్క్‌లో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌నూ మోదీ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి స్వయంసహాయక సంఘాల ప్రతినిధులు, స్థానిక వ్యాపారులతో మోదీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తగ్గిన జీఎస్‌టీతో మీకు ఎలాంటి ప్రయోజనాలు దక్కనున్నాయో వాళ్లను మోదీ స్వయంగా అడిగి తెల్సుకున్నారు. '' స్థానిక వ్యాపార వర్గాలతో నేరుగా సంభాషించడం ద్వారా వాళ్లలో ఉత్సాహాన్ని పెంచడంతోపాటు వ్యాపారాన్ని మరింత అభివృద్ధిచేయాలని వాళ్లను ప్రోత్సహించా. ఇలాంటి చర్యలు క్షేత్రస్థాయి నుంచి వ్యాపారమూలాలను మరింత బలోపేతం చేస్తాయి''అని మోదీ ఆ తర్వాత అన్నారు. జీఎస్‌టీ ద్వారా ఒకే దేశం, ఒకే పన్ను భావనను తీసుకొచ్చి పాత పలురకాల పన్నులకు ప్రధాని మోదీ చరమగీతం పాడారని అక్కడి స్థానిక వ్యాపారులు గుర్తుచేసుకున్నారు. జీఎస్‌టీ తగ్గడంతో నిర్మాణ వ్యయం భారీగా తగ్గనుందని, దీంతో గృహనిర్మాణ ఖర్చులు కలిసొస్తాయని స్థానిక వ్యాపారులు మోదీతో చెప్పారు. ముడిసరుకులు తక్కువ ధరకు లభిస్తాయని, దీంతో స్థానిక ఉత్పత్తుల తయారీ వ్యయం తగ్గనుందని ఆదాయం పెరిగే అవకాశముందని వాళ్లు మోదీతో అన్నారు. వికసిత్ భారత్ సుసాధ్యం కావాలంటే మీరంతా స్వదేశీ వస్తువులనే వినియోగించాలని, స్వదేశీ వస్తువులనే అమ్మాలని వాళ్లకు మోదీ సూచించారు.

త్రిపురేశ్వరీ ఆలయంలో పూజలు

త్రిపురలో పర్యటించిన సందర్భంగా ప్రధాని మోదీ గోమతీ జిల్లాలోని ప్రఖ్యాత త్రిపురేశ్వరీ ఆలయాన్ని సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ తీర్థయాత్ర కాయకల్ప, అభివృద్ధి(ప్రసాద్) పథకంలో భాగంగా రూ.52 కోట్లతో చేపట్టిన త్రిపురేశ్వరీ ఆలయ మరమ్మతు పనులు పూర్తయిన సందర్భంగా మోదీ గర్భగుడిలో అమ్మవారిని దర్శించుకున్నారు. 'మహారాజా' ధన్య మాణిక్య 1501 సంవత్సరంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. 500 సంవత్సరాల ఘన చరిత గల ఈ ఆలయం 51 శక్తిపీఠాల్లో ఒకటిగా భక్తులు కొలుస్తారు. సోమవారం ఆలయంలో మోదీ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లో కొద్దిసేపు కలియతిరిగారు. త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి, ముఖ్యమంత్రి మాణిక్‌సాహా, సీనియర్ ఉన్నతాధికారులు మోదీకి ఆలయ విశిష్టతను వివరించారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఆలయ ప్రత్యేకతను చాటే ఎగ్జిబిషన్‌నూ మోదీ సందర్శించారు. మండే ఎండలోనూ మోదీని చూసేందుకు జనం ఎగబడ్డారు. గత 11 సంవత్సరాల్లో త్రిపురకు మోదీ రావడం ఇది 11వ సారి కావడం విశేషం. '11 ఏళ్లలో మోదీ 11 సార్లు త్రిపురకు వచ్చారు. నవరాత్రి తొలిరోజున భక్తిశ్రద్ధలతో మోదీ సంప్రదాయ ధోతీలో మాతా త్రిపురసుందరిని దర్శించుకున్నారు' అని ఎంపీ బిప్లవ్ కుమార్ వెల్లడించారు. ప్రసాద్ పథకంలో భాగంగా ఆలయ కాంప్లెక్స్‌లో భక్తులు సేదతీరేందుకు పెద్ద హాల్, వేచి ఉండే గది, ధ్యానం హాల్, పూజారి గది, మ్యూజియంలను నిర్మించారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక గది ఏర్పాటుచేశారు. ఒకేసారి రెండు లక్షల మంది భక్తులు సందర్శించినా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా 30,000 చదరపు అడుగుల్లో ఏర్పాట్లు చేశారు. దీపావళి రోజున ఈ ఆలయానికి భక్తుల తాకిడి మరీ విపరీతంగా ఉంటుంది.

దురదృష్టకరం.. బాధ్యతారాహిత్యం!

ఎయిరిండియా విమాన ప్రమాద నివేదిక లీకేజీపై సుప్రీం వ్యాఖ్య



న్యూఢిల్లీ: అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాద నివేదికలోని కొన్ని అంశాలు ముందుగానే లీకవడం 'దురదృష్టకరం, బాధ్యతారాహిత్యం'అంటూ సుప్రీంకోర్టు ఘాటైన వ్యాఖ్యలు చేసింది. ఫలితంగా ఘోర ప్రమాదానికి పైలట్ల తప్పిదాలే కారణమంటూ జూన్ 12వ తేదీన మీడియా చిలువలుపలువలుగా కథనాలు వచ్చాయని తెలిపింది. ప్రమాదంపై స్వతంత్ర, నిష్పాక్షిక సత్వర విచారణ చేపట్టాలని, బాధితుల వ్యక్తిగత గోప్యత, మర్యాదలకు భంగం కల్గించరాదని పేర్కొంటూ సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం కేంద్ర ప్రభుత్వంతోపాటు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ)కు నోటీసులు జారీ చేసింది. జూలై 12వ తేదీన ఎయిర్‌క్రాఫ్ట్ యాసిడెంట్ ఇన్వెసి ్టగేషన్ బ్యూరో(ఏఏఐబీ) ప్రాథమిక నివేదికలోని కొన్ని ఎంపిక చేసిన అంశాలను బహిర్గతం చేయడం దురదృష్టకరం, బాధ్యతారాహిత్యంగా అభివర్ణించింది. దీనిని ప్రత్యర్థి వైమానిక సంస్థలు స్వార్థానికి వాడుకునే ప్రమాదముందని తెలిపింది. సేఫ్టీ మ్యాటర్స్ ఫౌండేషన్ అనే సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలను వినిపించారు. ప్రాథమిక నివేదికలోని పైలట్ల తప్పిదముందని ఆరోపించే కేవలం ఒకే ఒక వాక్యం వల్లనే ప్రపంచవ్యాప్తంగా మీడియాలో కథనాలు వచ్చాయన్నారు. మిగతా అంశాలన్నీ మరుగున పడిపోయాయన్నారు. విషాదం చోటుచేసుకుని 100 రోజులు దాటినా ఇప్పటికీ అసలు కారణాలు వెల్లడి కాలేదని చెప్పారు. పైపెచ్చు, విచారణ కమిటీలోని ఐదుగురిలో ముగ్గురు డీజీసీఏకు చెందిన వారే ఉండటంతో నివేదికపై అనుమానాలకు తావిచ్చే అవకాశముందని తెలిపారు. విమానం ఫ్లైట్ డేటా రికార్డర్‌ను వెల్లడిస్తే ఘటనకు దారితీసిన కారణాలపై స్పష్టత వస్తుందని ఆయన తెలిపారు. స్పందించిన ధర్మాసనం... స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తునకు డిమాండ్ చేయడం సబబుగానే ఉన్నా, ఫ్లైట్ డేటా రికార్డర్ సమాచారాన్ని డిమాండ్ చేయడం మాత్రం ప్రశ్నార్థకమని వ్యాఖ్యానించింది. ఫ్లైట్ డేటా రికార్డర్ వెల్లడైతే పరస్పర విరుద్ధ కథనాలు వచ్చే ప్రమాదముందని పేర్కొంది. 'ఇటువంటి సందర్భాల్లో దర్యాప్తు పూర్తి అయ్యే వరకు నివేదికలోని అన్ని అంశాలను పూర్తి స్థాయిలో గోప్యంగా ఉంచాల్సిన అవసరముంది. అప్పటి వరకు మేం ఎదురుచూస్తాం'అని ధర్మాసనం తెలిపింది. ప్రమాదంపై కేంద్రం ఏర్పాటు చేసిన దర్యాప్తు కమిటీ నివేదికలోని కొన్ని అంశాలను లీకవడంతో పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగిందంటూ వైమానిక రంగ నిపుణుడు కెప్టెన్ అమిత్ సింగ్ సారథ్యంలోని సేఫ్టీ మ్యాటర్స్ ఫౌండేషన్ సంస్థ ఈ పిటిషన్ వేసింది. ఫ్యూయల్ కటాఫ్ స్విచ్‌లను 'రన్'నుంచి 'కటాఫ్'కు మార్చడం వల్లే ప్రమాదం జరిగిందని, ఇది పైలట్ తప్పిదమేనంటూ ఏఏఐబీ ప్రాథమిక నివేదికలోని కొన్ని అంశాలు జూలై 12వ తేదీన బయటకు రావడం తెల్సిందే.

కొందరు సరిగా పనిచేయట్లేదు!

- హైకోర్టు జడ్జీలపై సుప్రీం అసహనం
- వాళ్లకు మేం స్కూల్ ప్రిన్సిపాల్‌గా బోధించాలనుకోవట్లేదని వ్యాఖ్య

న్యూఢిల్లీ: కొందరు హైకోర్టు న్యాయమూర్తులు వేగంగా కేసులను పరిష్కరించే వృత్తినైపుణ్యం ఉన్నా కూడా ఆ స్థాయిలో పనిచేయట్లేరని సర్వోన్నత న్యాయస్థానం ఆవేదన వ్యక్తంచేసింది. అలాంటి జడ్జీలపాలిట స్కూల్ ప్రిన్సిపాల్ మాదిరి హితబోధ చెప్పే ఉద్దేశం తమకు లేదని, స్వీయసమీక్ష ద్వారా ఆ జడ్జీల తమ వైఖరిని మార్చుకోవాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం హితవు పలికింది. ''హైకోర్టుల్లో రెండు రకాల జడ్జీలున్నారు. కొందరు జడ్జీలు పగలూరాత్రీ పనిచేస్తూ వేగంగా ఎక్కువ కేసులను పరిష్కరిస్తున్నారు. కొందరు జడ్జీలు మాత్రం దురదృష్టవశాత్తు సవ్యంగా సేవలు అందించట్లేదరు. కారణాలు మంచివైనా చెడ్డవైనా సరే పని మాత్రం సరిగా సాగట్లేదు. పరిస్థితులు ఎలాంటివనేది ఇక్కడ అప్రస్తుతం. ఒక జడ్జీ ఒక క్రిమినల్ కేసును ఆలకిస్తున్నారనుకుందాం. ఆయన రోజుకు 50 కేసులను పరిష్కరించాలని మేం అత్యాశపడట్లేదు. అలాగని ఆయన ఒక్క కేసు విచారించి గొప్ప పని చేశాననుకుంటే పద్ధతి కాదు. బెయిల్ కేసులో రోజుకు ఒకే ఒక్క కేసును విచారిస్తూ కూర్చుంటా అంటే అది ఆయన ఆత్మపరిశీలనకే వదిలేయాలి. తమ వద్ద కేసుల పెండింగ్‌ల కొండ పేరుకుపోకుండా జడ్జీలు చూసుకోవాలి. ఆ మేరకు స్వీయ నియంత్రణ ఉండాలి. వృత్తిపరంగా నాణ్యమైన కార్యశీలత అనేది తప్పనిసరి. రోజుకు పరిష్కరించే ఎక్కువ కేసుల సంఖ్య పెంచుకుంటూ పోవాలి. దాంతో పాటే కేసుల పరిష్కార విధానంలో అత్యున్నత న్యాయప్రమాణాలు, నియమనిబంధనలను పాటించాల్సిందే. ఈ విషయంలో హైకోర్టు జడ్జీలకు స్కూల్ ప్రిన్సిపాల్ మాదిరి పాఠాలు చెప్పే యోచన మాకు లేదు. మన ముందు ఎంతటి పెండింగ్ కేసుల భారం ఉంది, ఎంత త్వరగా ఆ భారాన్ని తగ్గించుకోవాలని అనే స్పృహ జడ్జీలకు ఉండాలి'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమపై నమోదైన క్రిమినల్ కేసుల్లో వాదోపవాదనలు ముగిసి తీర్పులు జార్ఖండ్ హైకోర్టులో ఏళ్ల తరబడి రిజర్వ్‌లోనే ఉండిపోవడంతో విసిగిపోయిన ఆ నిందితులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఉదంతంలో ధర్మాసనం పై విధంగా స్పందించింది.

పరువు నష్టం నేరం కాదు

సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: పరువు నష్టం కేసులను నేరరహితంగా చూడాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు పేర్కొంది. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు 'ది వైర్'అనే ఆన్‌లైన్ పబ్లికేషన్ సంస్థపై పరువు నష్టం కేసు వేశారు. ఈ మేరకు మేజిస్ట్రేట్ కోర్టు ది వైర్‌కు సమన్లు జారీ చేయగా, ఢిల్లీ హైకోర్టు దానిని సమర్థించింది. హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ 'ది వైర్'వేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా జస్టిస్ ఎంఎం సుందరేశ్.. 'ఇటువంటి ఆరోపణలు ఎదుర్కోవడం నేరం కాదని నిర్ధారించాల్సిన సమయం వచ్చింది' అంటూ వ్యాఖ్యానించారు. ది వైర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ దీనిని సమర్థిస్తూ సంబంధిత చట్టంలో సంస్కరణలను చేపట్టాల్సిన అవసర ముందన్నారు. భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ)లోని సెక్షన్ 499 ప్రకారం పరువునష్టం కలిగించడం నేరం కాగా, దీనినే భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) కూడా సెక్షన్ 356గా కొనసాగించింది. అయితే, న్యాయమూర్తి సుందరేశ్ వ్యాఖ్యలు 2016లో సుబ్రమణ్య స్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు. పరువు నష్టం చట్టంలోని నిబంధనలకు రాజ్యాంగబద్ధత ఉందని అప్పటి తీర్పులో సుప్రీంకోర్టు సమర్థించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే, గౌరవం పొందే ప్రాథమిక హక్కు కిందకు ఇది వస్తుందని తెలిపింది.

దృష్టిపెట్టాల్సింది నా రీల్స్‌పై కాదు

కేజ్రీవాల్‌కు ఢిల్లీ సీఎం రేఖా గుప్తా చురక

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమ వేదికల్లో వచ్చే తన ప్రసంగాలను కనిపెట్టడానికి బదులుగా పంజాబ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు సాయం అందించడంపై దృష్టిపెట్టాలని ఢిల్లీ సీఎం రేఖా గుప్తా సోమవారం ఆప్ చీఫ్ కేజ్రీవాల్‌కు చురకలు అంటించారు. ఈవీఎంలపై రేఖా గుప్తా మాట్లాడుతున్న వీడియోను ఆదివారం కేజ్రీవాల్ షేర్ చేశారు. అందులో ఆమె..'గత 70 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ ఈవీఎంలతో హ్యాకింగ్ కొనసాగిస్తోంది. అయినా ఏమీ జరగలేదు. అదే బీజేపీ చేస్తే మాత్రం అకస్మాత్తుగా అదో పెద్ద టాపిక్ అవుతోంది'అంటూ వ్యాఖ్యానించారు. దీనిపై ఢిల్లీలోని రాజకీయ పార్టీలు మండిపడ్డాయి. ఓటు చోరీతోనే ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వచ్చిందంటూ ఆరోపణలకు దిగాయి. అయితే, కేజ్రీవాల్ ఆ వీడియోను ఎడిట్ చేసి పెట్టారని, సీఎం గుప్తా ఇంటర్వ్యూలోని ఎడిట్ చేసిన భాగమంటూ బీజేపీ ఎదురుదాడికి దిగింది. ఈ నేపథ్యంలో సీఎం రేఖా గుప్తా సోమవారం కేజ్రీవాల్ లక్ష్యంగా తీవ్ర విమర్శలు చేశారు. 'కేజ్రీవాల్ గారూ, సోషల్ మీడియాలో నా వీడియోలు, రీల్స్, ఇంటర్వ్యూలను చూసి, నన్ను లక్ష్యంగా చేసుకోవడం మానేయండి. మీ తీరుపై ఆగ్రహంతో ఉన్న ఢిల్లీ వాసులపై దృష్టిపెట్టండి. సీఎం వ్యాఖ్యలను వక్రీకరించడానికి మీకు సిగ్గేయడం లేదా? మీకింకో పనిలేదా? నా రీల్స్ చూడటానికి బదులుగా పంజాబ్‌లో ప్రజల కష్టాలను తీర్చండి'అని సలహా ఇచ్చారు.

అమెరికాలో టిక్‌టాక్ బాధ్యత ఒరాకిల్‌కు

వాషింగ్టన్: అమెరికాలో సామాజిక మాధ్యమం టిక్‌టాక్ బాధ్యతలను ప్రముఖ టెక్ సంస్థ ఒరాకిల్ చేపట్టనుంది. అమెరికా వినియోగదారుల కోసం అవసరమైన అల్గారిథమ్‌ను త్వరలో టిక్‌టాక్ అందజేయనుంది. ఈ మేరకు అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ఫోన్ సంభాషణ సందర్భంగా ఒప్పందం కుదిరినట్లు ఓ అధికారి వెల్లడించారు. చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్ కంపెనీ యాజమాన్యంలో టిక్‌టాక్ పనిచేస్తోంది. తాజా ఒప్పందంతో అమెరికాలోని టిక్‌టాక్ వినియోగదారులకు సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని చైనా కంపెనీ తారుమారు చేసేందుకు అవకాశం ఉందనే ఆందోళనలకు చెక్ పడుతుందని భావిస్తున్నారు. ఈ ఒప్పందంలో సిల్వర్ లేక్ అనే ప్రైవేట్ ఈక్విటీ సంస్థ కూడా భాగస్వామిగా ఉంటుంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. టిక్‌టాక్‌ను అమెరికా కంపెనీకి అమ్మేయాలని లేదా నిషేధం ఎదుర్కోవాల్సి ఉంటుందని బైట్‌డ్యాన్స్‌ను హెచ్చరిస్తూ డెమోక్రాటిక్ పార్టీకి చెందిన గత అధ్యక్షుడు బైడెన్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన ట్రంప్..బైడెన్ విధించిన నిషేధం గడువును పలుమార్లు పొడిగించారు. టిక్‌టాక్‌తో చర్చలను సైతం కొనసాగించారు. తాజాగా, జిన్‌పింగ్‌తో ఫోన్ కాల్ సందర్భంగా దీనిపై ట్రంప్ ఒక అంగీకారానికి వచ్చారు.

చైనా బాటలో బ్రిటన్

శాస్త్ర, సాంకేతిక నిపుణులకు వీసా ఫీజు మినహాయింపు!

లండన్: అత్యంత ప్రతిభావంతులను ఒడిసిపట్టేందుకు చైనా మాదిరిగా బ్రిటన్ సైతం వడివడిగా పావులు కదుపుతోంది. హెచ్–1బీ వీసా వార్షిక రుసుమును అమెరికా ప్రభుత్వం ఏకంగా లక్ష డాలర్లకు పెంచడంతో సైన్స్, టెక్నాలజీ నిపుణుల చూపు ఇతర దేశాలపై పడనుంది. ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్రిటన్ ఆరాటపడుతోంది. ఈ దిశగా ఇప్పటికే వ్యూహరచన చేసినట్లు లండన్‌లోని ప్రధానమంత్రి కార్యాలయంలోని విశ్వసనీయ వర్గాలువెల్లడించాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సృజనాత్మకత, నవ్యావిష్కరణలు చూపే ప్రతిభావంతులను తమ దేశంలోకి ఆకర్షించేందుకు వీలుగా వాళ్ల వీసా ఫీజును పూర్తిగా మాఫీ చేయాలని ప్రధాని కీర్ స్టార్మర్ సారథ్యంలోని యూకే సర్కార్ భావిస్తోంది. ఇప్పటికే స్టార్మర్ ఈ ఏడాది తొలినాళ్లలో 5.4 కోట్ల బ్రిటిష్ పౌండ్ల మూలనిధితో 'ది గ్లోబల్ టాలెంట్ టాస్క్‌ఫోర్స్' విభాగాన్ని ఏర్పాటుచేశారు. బ్రిటన్ ఆర్థికాభివృద్ధిని ఉరకలెత్తించేలా నవ్యావిష్కరణలు చేసే యువ ప్రతిభావంతులకు దేశంలోకి సాదర స్వాగతం పలకాలని ప్రభుత్వం యోచిస్తోంది. ట్రంప్ జాత్యహంకారంతో రంకెలేస్తూ హెచ్–1బీ వీసా ఫీజుల మాటున విదేశీ ప్రతిభావంతులను తరిమికొడుతున్న నేపథ్యంలో వాళ్లకు ఆశ్రయమిచ్చి దేశ పురోభివృద్ధికి అక్కరకొచ్చేలా ఉపయోగించుకోవాలని స్టార్మర్ ప్రభుత్వం ఆశిస్తోంది. ఇందులోభాగంగానే వీసా ప్రక్రియను వేగవంతంచేసి అడ్మినిస్ట్రేషన్ చార్జీలను రద్దుచేయాలని భావిస్తున్నారు. ప్రస్తుత బ్రిటన్‌లో వీసా ఫీజు 1,000 పౌండ్లుగా ఉంది. మరోవైపు 2020లో బ్రిటన్ గ్లోబల్ టాలెంట్ వీసాను తీసుకొచ్చింది. దీని కోసం 766 పౌండ్ల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. వార్షిక ఆరోగ్యసేవలు కావాలంటే ఆమేరకు సర్‌చార్జ్‌లు కలుపుకుంటే ఒక్కో వీసాదారుడు 1,035 పౌండ్లు చెల్లించాల్సి ఉంటుంది. జీవిత భాగస్వామి, సంతానానికి సైతం ఇవే చార్జీలు వర్తిస్తాయి. అయితే ప్రపంచంలోనే సైన్స్, టెక్నాలజీ రంగాలకు సంబంధించి టాప్–5 విశ్వవిద్యాలయాల్లో అభ్యసించిన, ప్రతిష్టాత్మక విద్య, ఉపాధిరంగ అవార్డ్‌లను గెల్చుకున్న వ్యక్తులకు ఎలాంటి వీసా ఫీజులను వసూలుచేయకూడదని బ్రిటన్ ప్రభుత్వం యోచిస్తోంది. ఆర్థికాభివృద్ధి పెంపే లక్ష్యంగా అత్యంత ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, టీచర్లు, డిజిటల్ రంగ నిపుణుల వీసా ఫీజును మాఫీ చేయాలని భావిస్తున్నారు.

భారత్, అమెరికా విదేశాంగ మంత్రుల భేటీ

న్యూయార్క్: భారత్‌పై అమెరికా సర్కార్ 50 శాతం టారిఫ్ భారం మోపడంతో ఇరుదేశాల నడుమ వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరగనున్న నేపథ్యంలో ఈ రెండు దేశాల విదేశాంగ మంత్రులు న్యూయార్క్‌లో భేటీ అయ్యారు. లొట్టె న్యూయార్క్ ప్యాలెస్‌లో సోమవారం ఉదయం భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోలు సమావేశమయ్యారు. భారత్‌పై అమెరికా 50శాతం టారిఫ్ విధించాక ఇరునేతలు కలవడం ఇదే తొలిసారి. ''ద్వైపాక్షిక అంశాలుసహా మారుతున్న అంతర్జాతీయ పరిణా మాలపై విస్తృతస్థాయిలో చర్చించుకున్నాం. కీలక అంశాల్లో పురోగతి కోసం నిరంతరం సంప్రతింపులు ముఖ్యమని ఇద్దరం భావించాం''అని భేటీ తర్వాత జైశంకర్ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌పెట్టారు. ఇదే నగరంలో అమెరికా వాణిజ్యమంత్రితో భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూశ్ గోయెల్ బృందం భేటీకానుంది. పరస్పర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందం ఖరారు కోసం ఈ సమావేశం జరగనుంది. అమెరికా పత్తి, డెయిరీ, తదితర వ్యవసాయ ఉత్పత్తులను భారతీయ మార్కెట్లోకి తేవాలని ట్రంప్ యత్నిస్తుండగా అవి వస్తే భారతీయ రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయని భారత్ వాదిస్తోంది. దీంతో ఏకాభిప్రాయం కుదరక ఇంకా ఈ ఒప్పందం ఖరారుకాలేదు.

టీటీపీ స్థావరంపై పాక్ వైమానిక దాడి

మహిళలు, చిన్నారులు సహా 30 మంది మృతి

పెషావర్: అఫ్గానిస్తాన్ సరిహద్దు ప్రాంతంలోని ఉగ్రవాదుల స్థావరాలపై పాక్ వైమానిక దళం భారీ దాడులు చేపట్టింది. ఖైబర్ ఫంఖున్వా ప్రావిన్స్‌లోని పష్తూన్ వర్గం ఆధిపత్యం ఉన్న ఖైబర్ జిల్లా మాత్రెదారా గ్రామంపై సోమవారం వేకువ జామున 2 గంటల సమయంలో దాడి జరిగింది. తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ) స్థావరాలే లక్ష్యంగా జేఎఫ్–17 ఫైటర్ జెట్లు 8 శక్తివంతమైన ఎల్ఎస్–6 బాంబులను వేసినట్లు సమాచారం. ఈ దాడులతో భారీ పేలుళ్లు సంభవించాయి. గ్రామంలోని చాలా భాగం ధ్వంసమైంది. కనీసం 30 మంది చనిపోయినట్లు తెలుస్తోంది. మృతుల్లో మహిళలు, చిన్నారులు సైతం ఉన్నారు. పదుల సంఖ్యలో జనం గాయపడ్డారు. ప్రమాద తీవ్రతపై అధికారికంగా ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇలా ఉండగా, పాక్ జెట్ విమానాల దాడుల్లో తిరా లోయలోని ఐదు నివాసాలు నేలమట్టమ య్యాయని, శిథిలాల నుంచి 20 మృతదేహాలను వెలికి తీశామని తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ పార్టీ తెలిపింది. అయితే, ఫైటర్ జెట్లు దాడి చేయలేదని, మిలిటెంట్లు బాంబులు తయారు చేస్తుండగా పేలుళ్లు జరిగినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.


ఇంద్రకీలాద్రిపై శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో కనకదుర్గమ్మ అమ్మవారు. -విజయవాడ


శ్రీశైల మహాక్షేత్రంలో బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమిచ్చిన భ్రమరాంబదేవి - శ్రీశైలం టెంపుల్


బాసరలో శైలపుత్రి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు. - బాసర


శైలపుత్రి అలంకారంలో అలంపూర్ శ్రీ జోగుళాంబ అమ్మవారు. - అలంపూర్


వరంగల్ శ్రీ భద్రకాళి దేవాలయంలో సోమవారం బాలా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు. - హనుమకొండ కల్చరల్

‘సమ్మక్క’కు ఛత్తీస్‌గఢ్ ఓకే

- ప్రాజెక్టుకు ఎన్‌ఓసీ జారీకి ఆ రాష్ట్ర సీఎం విష్ణుదేవ్ సాయి సూత్రప్రాయ అంగీకారం
- రాయ్‌పూర్‌లో ఆయనతో మంత్రి ఉత్తమ్ భేటీ.. ప్రాజెక్టు ఆవశ్యకత గురించి ప్రజెంటేషన్
- ముంపునకు బాధ్యత తీసుకుంటామని భరోసా.. ముందే గంపగుత్తగా పరిహారం చెల్లిస్తామని హామీ
- సానుకూలంగా స్పందించిన ఛత్తీస్‌గఢ్ సీఎం.. 25న సీడబ్ల్యూసీ భేటీకి ముందే ముందడుగు


ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయితో కరచాలనం చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సమ్మక్క సాగర్ బరాజ్‌కు అనుమతుల విషయంలో ముందడుగు పడింది. బరాజ్ నిర్మాణం కోసం రాష్ట్రానికి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) జారీ చేసేందుకు ఛత్తీస్‌గఢ్ సూత్రప్రాయ అంగీకారం తెలిపింది. సోమవారం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు వెళ్లిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని అధికారు ల బృందం.. ఆ రాష్ట్ర సీఎం విష్ణుదేవ్ సాయితో సమావేశమైంది. ములుగు జిల్లాలోని తుపాకులగూడెం వద్ద గోదావరిపై 6.7 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 83 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్న సమ్మక్క సాగర్ బరాజ్ ఆవశ్యకత గురించి మంత్రి ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విష్ణుదేవ్ సాయికి వివరించారు. తమ రాష్ట్ర ప్రాజెక్టుకు ఎన్‌ఓసీ జారీ చేయాలని కోరారు. అందుకు ఛత్తీస్‌గఢ్ సీఎం సానుకూలంగా స్పందించా రు. అనంతరం మంత్రి ఉత్తమ్ అక్కడ మీడియాతో మాట్లాడుతూ విష్ణుదేవ్ సాయికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజె క్టును సాకారం చేసే ఈ నిర్ణయం కోసం చిరకాలం నిరీక్షించామన్నారు. సమ్మక్క బరాజ్‌తో ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గుర య్యే భూములను సేకరించి నిర్వాసితులకు పరిహారం చెల్లించడంతోపాటు పునరావాసం కల్పించే విషయంలో తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ బాధ్యత తీసుకుంటుందని హామీ ఇచ్చా రు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతుల సాధన కోసం ఛత్తీస్‌గఢ్ ఇచ్చే ఎన్‌ఓసీ తుది అంతర్రాష్ట్ర ఒప్పందం వంటిదని.. అది లేకుంటే ప్రాజెక్టు నిర్మాణం ముందుకు సాగదన్నారు. సత్వర ఎన్‌ఓసీ జారీకి ఆ రాష్ట్ర సీఎం అంగీకారం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు 47 టీఎంసీల కేటాయింపుపై ఈ నెల 25న కేంద్ర సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించనుండగా ఎన్‌ఓసీ జారీపై ఆలోపే ఛత్తీస్‌గఢ్ సీఎం సానుకూలంగా స్పందించడం కీలక పరిణామంగా చెప్పొచ్చు.

వెనకబడిన ప్రాంతాలకు జీవధార..

రాష్ట్రంలో ఫ్లోరైడ్ పీడిత నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో నీటి ఎద్దడి నివారణకు గోదావరిలో ఇంద్రావతి కలిసిన ప్రాంతానికి దిగువన సమ్మక్క బరాజ్‌ను ప్రభుత్వం నిర్మిస్తోంది. శ్రీరామ్‌సాగర్ రెండో దశ కింద ఉన్న 1.78 లక్షల హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణతోపాటు రామప్ప–పాకాల లింక్ కాల్వ కింద 12,146 హెక్టార్ల కొత్త ఆయకట్టుకు ఈ ప్రాజెక్టు సాగునీరు అందిస్తుందని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్, జనగామ, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో వ్యవసాయం దశ మారుతుందని, నమ్మకమైన సాగునీటి సరఫరాతో కరువు నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. ప్రాజెక్టులో భాగంగా బరాజ్‌తోపాటు అప్రోచ్ కాల్వలు, గ్రావిటీ కాల్వలు, 3 పంప్‌హౌస్‌లు, డెలివరీ సిస్టర్న్‌లు, 90 కి.మీ. మేర సొరంగాల నెట్‌వర్క్ నిర్మిస్తున్నట్లు చెప్పారు.

గంపగుత్తగా పరిహారం ఇస్తాం..

సమ్మక్క సాగర్ బ్యాక్‌వాటర్ వల్ల ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా భూపాలపట్నం తహసీల్ పరిధిలో 13.06 హెక్టార్ల భూమి, 53.03 హెక్టార్ల నది, 6.35 హెక్టార్ల నాలా భూమి ముంపునకు గురవుతుందని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ముంపు ప్రభావంపై ఐఐటీ ఖరగ్‌పూర్‌తో ఛత్తీస్‌గఢ్ జరిపించిన అధ్యయనంలో తేలిన అంశాలను స్వీకరించి సిఫారసులను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విషయంలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ సూచనలకు కట్టుబడి ఉండటంతోపాటు భూయజమానులకు పరిహారం చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి ఎన్‌ఓసీ జారీకి ముందే గంపగుత్తగా పరిహారమంతా చెల్లిస్తామని చెప్పామన్నారు.

క్లుప్తంగా...

నిలోఫర్‌లో అక్రమాలపై విచారణ ఏది?

- నామినేషన్ పద్ధతిలో మళ్లీ కొనుగోళ్లకు రంగం సిద్ధం

సాక్షి, హైదరాబాద్: నిలోఫర్ ఆసుపత్రిలో గతంలో జరిగిన కొనుగోళ్ల అక్రమాలపై విచారణ లేకుండానే మరోసారి దొడ్డిదారిన పరికరాల కొనుగోళ్లకు తెర తీశారు. మంగళవారం జరిగే హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీపీఎస్) సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. నిలోఫర్‌కు గత ఏడాది సీఎస్‌ఆర్ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వ సంస్థ హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) రూ.20 కోట్లు కేటాయించింది. అందులో రూ.10 కోట్లు ఆస్పత్రి ఎదురుగా కొత్త భవనం నిర్మాణానికి కేటాయించగా, మిగతా రూ.10 కోట్లు పరికరాల కొనుగోళ్లకు కేటాయించారు. గతంలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన అధికారి ఈ కొనుగోళ్లలో రూ. 5 కోట్ల వరకు కొల్లగొట్టినట్లు ఆరోపణలున్నాయి. ఉదాహరణకు 60 కిలోల వాషింగ్ మిషన్, హైడ్రో ఎక్స్ట్రాక్టర్, టంబుల్ డ్రైయర్‌లకు రూ.8.94 లక్షల మేర కంపెనీలు ధర నిర్ణయిస్తే, ఈ మూడింటిని ఏకంగా 16.87 లక్షలకు కొనుగోలు చేసినట్లు ఆధారాలతో సహా రుజువైంది. పాత మిషన్లను విక్రయించుకోవడం, ఇతర పరికరాలను సైతం తానే ఇష్టానుసారంగా కొనుగోలు చేయడం వంటి చర్యలతో అక్రమాలకు పాల్పడ్డట్లు ప్రభుత్వం గుర్తించింది. దానిపై విచారణకు కూడా ఆదేశించింది. అయితే ఏ చర్యలూ తీసుకోలేదు. మిగిలిన రూ.5 కోట్ల కొనుగోళ్లపై డీపీఎస్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. టెండర్ల ప్రక్రియలో కాకుండా నామినేషన్ విధానంలో ఇష్టమైన వారి నుంచి పరికరాలు కొనుగోలు చేసేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం.

బీఆర్‌ఎస్ బతుకమ్మ సంబరాలు 24న

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ పండుగను బీఆర్‌ఎస్ పార్టీ ఈ నెల 24న నిర్వహించనుంది. పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో వేడుకలు జరగనున్నాయి. ఈ కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుంది. బతుకమ్మ సంబరాల నిర్వహణపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన సోమవారం తెలంగాణ భవన్‌లో సన్నాహక సమావేశం జరిగింది. సమావేశానికి మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావు గౌడ్, నగర ఎమ్మెల్యేలు, పార్టీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు హాజరయ్యారు. కార్యక్రమానికి భారీగా మహిళలను తరలించేందుకు కృషి చేయాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కేటీఆర్ సూచించారు.

బతుకమ్మకు ఆంక్షలా?: బీజేపీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బతుకమ్మ ఉత్సవాల వేళ కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలు విధిస్తూ, పోలీస్ అనుమతి ఇవ్వడం లేదని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి విమర్శించారు. ఉత్సవాల నిర్వహణకు చివరికి కోర్టు ఉత్తర్వులతో అనుమతి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ఈ నెల 23న మహిళా మోర్చా ఆధ్వర్యంలో చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారి దేవాలయం వద్ద నిర్వహించనున్న బతుకమ్మ వేడుకల పోస్టర్‌ను.. సోమవారం బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిల్పారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. కోటిమంది మహిళలను కోటీశ్వరుల్ని చేస్తామంటున్న సీఎం రేవంత్‌రెడ్డి.. మహిళల హక్కులను కాపాడి స్వేచ్ఛగా పండుగలు జరుపుకొనే అవకాశం ఇవ్వాలన్నారు.

మహిళలకు రెండు చీరలేవీ?: కవిత

సాక్షి, హైదరాబాద్: ఆడబిడ్డలకు ఒకటి కాదు, రెండు చీరలిస్తామని గతంలో ప్రభుత్వం చెప్పి ఎగ్గొట్టిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం బతుకమ్మను పేర్చి, మహిళా నాయకులతో కవిత బతుకమ్మాడారు. అనంతరం విలేకరులతో కవిత మాట్లాడారు. ఆడబిడ్డలకు మాట ఇచ్చినట్లు నెలకు రూ.2500తో పాటు, 18 ఏళ్లు నిండిన ఆడబిడ్డలందరికీ స్కూటీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

స్నేహితుల వేధింపులు.. బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

- దావత్ ఇవ్వాలంటూ బెదిరించిన స్నేహితులు
- ఆత్మహత్యకు ముందు తండ్రికి వాట్సాప్ వీడియో పంపిన సాయితేజ్
- పోలీస్ స్టేషన్ వద్ద అతడి తల్లిదండ్రుల ధర్నా


సాయితేజ్ (ఫైల్)

బోడుప్పల్/ఉట్నూర్‌రూరల్: తోటి విద్యార్థి, వారి స్నేహితుల వేధింపులు తట్టుకోలేక ఓ బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. విద్యార్థి తల్లిదండ్రులు, మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి కథనం ప్రకారం వివరాలు.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం, లాక్కారం గ్రామానికి చెందిన జాదవ్ ప్రేమ్ సింగ్, శ్రీలత భార్యా భర్తలు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు జాదవ్ సాయితేజ్ (19) మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం నారాపల్లిలోని సిద్దార్థ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీ సమీపంలో ఓ హాస్టల్‌లో తోటి విద్యార్థి డేవిడ్, మురళీతో కలిసి ఓ రూమ్‌లో ఉంటున్నాడు. మురళీ వేరే రూమ్‌కు షిఫ్ట్ కాగా డేవిడ్, సాయితేజ్ కలిసి ఉంటున్నారు. ఈక్రమంలో ఈనెల 20న మురళీది బర్త్‌డే ఉండగా డేవిడ్, మురళీని రూమ్‌కు పిలిచాడు. రాత్రి 11 గంటల సమయంలో మురళీతోపాటు అతని స్నేహితులు మరో ముగ్గురు సాయితేజ్ రూమ్‌కు వచ్చారు. ఆ సమయంలో వారి మధ్య చిన్న గొడవ జరిగింది.

తప్పు చేశావు కాంప్రమైజ్ చేస్తాం

21వ తేదీన మురళీ వారి స్నేహితుడు చిన్నబాబుతోపాటు మరో ఏడుగురితో కలిసి వచ్చాడు. రాత్రి సాయితేజ్ మురళీని అనవసరంగా కొట్టాడని. తాము కాంప్రమైజ్ చేస్తాం రండి అంటూ హాస్టల్ పక్క గల్లీకి పిలిచారు. కాంప్రమైజ్ పార్టీ ఇవ్వాలంటూ బార్‌కు తీసుకెళ్లారు. అక్కడ మురళీ స్నేహితులు సాయితేజ్‌ని కొట్టి బెదిరించారు. అందరికీ దావత్ ఇవ్వాలంటూ తాగేసి బిల్లును డేవిడ్ చేత రూ.2,500, సాయితేజ్ చేత రూ.2,500 కట్టించారు. మరో ఐదు వేలు ఇవ్వాలంటూ బెదిరించారు. తీవ్ర మనస్తాపం చెందిన సాయితేజ్ బయటకు వెళ్లి తెస్తానంటూ రూమ్‌కు వచ్చాడు. తోటి విద్యార్థులు, వారి స్నేహితులు తనను తీవ్రంగా వేధిస్తూ కొడుతున్నారని, తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని తండ్రి ప్రేమ్‌సింగ్‌కు వాట్సాప్‌లో వీడియో పెట్టాడు. అనంతరం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయితేజ్ ఎంతకూ తిరిగి రాకపోవడంతో మురళీ, ఇతర స్నేహితులు అతడి గదికి వచ్చారు. లోపల గడియపెట్టి ఉండటంతో హాస్టల్ యజమాని సహాయంతో తలుపు పగలకొట్టి చూడగా సాయితేజ్ ఉరివేసుకుని ఉన్నాడు. మేడిపల్లి పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తమ కుమారుడి చావుకు కారణమైన మురళీ, అతడి స్నేహితులను కఠినంగా శిక్షించాలంటూ సాయితేజ్ తల్లిదండ్రులు, బంధువులు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ



తిరుమల: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం తిరుమలలో ప్రారంభం కానున్నాయి. వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారం మంగళవారం రాత్రి 7 నుంచి 8 గంటల మధ్యలో నిర్వహించే ‘అంకురార్పణ’ ఘట్టంతో ఈ బ్రహ్మోత్సవాలకు బీజం పడనుంది. ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఆగమశాస్త్రం ప్రకారం ప్రతి వైదిక ఉత్సవానికి ముందు అంకురార్పణ చేపడతారు. నవధాన్యాలను మొలకెత్తించి ఈ భూ మండలం అంతా పాడిపంటలతో, పశుపక్ష్యాదులతో సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తారు. శ్రీవారి సర్వసైన్యాధ్యక్షుడు శ్రీ విష్వక్సేనులవారిని మాడ వీధుల్లో ఊరేగిస్తారు. జగద్రక్షకుడైన శ్రీవారికి నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు శ్రీ విష్వక్సేనులవారు ఈ విధంగా మాడ వీధుల్లో ఊరేగుతారని ప్రాశస్త్యం.

మేడారానికి నేడు సీఎం రాక

- 2026లో జరిగే జాతర ఏర్పాట్లను పరిశీలించనున్న రేవంత్‌రెడ్డి
- సమ్మక్క–సారలమ్మ గద్దెల పునరుద్ధరణ... ఆధునీకరణ పనులకు శ్రీకారం
- అనంతరం అధికారులతో సీఎం సమీక్ష
- తెలంగాణ కుంభమేళాకు ఇక మహర్దశ.. మహాజాతరకు విస్తృతంగా ఏర్పాట్లు


సీఎం పర్యటన నేపథ్యంలో మేడారంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

సాక్షి ప్రతినిధి, వరంగల్: సీఎం రేవంత్‌రెడ్డి మేడారం పర్యటన ఖరారైంది. మంగళవారం మధ్యాహ్నం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారానికి ఆయన హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. దాదాపు 2.30 గంటలపాటు సీఎం మేడారంలో గడపనున్నారు. ఈ సందర్భంగా 2026 జనవరి 28 నుంచి 31 వరకు జరిగే సమ్మక్క–సారలమ్మ మహాజాతర నిర్వహణ కోసం చేపట్టిన పనులను పరిశీలిస్తారు. అనంతరం మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్, ఇతర అధికారులు, పూజారులతో మాట్లాడతారని అధికారులు తెలిపారు.

పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం

ఆదివాసీ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ సమ్మక్క–సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలున్న ప్రాంగణాన్ని లక్షలాది భక్తులు మంది దర్శించుకునేందుకు వీలుగా మేడారంలో భారీఎత్తున అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. కోట్లాది భక్తులు వచ్చే జాతర ప్రాశస్త్యానికి తగ్గట్టు భారీఎత్తున స్వాగత తోరణాల నిర్మాణంతోపాటు గద్దెల వద్దకు భక్తులు సులువుగా చేరుకోవడం, గద్దెల దర్శనం, బంగారం (బెల్లం) సమర్పణ, జంపన్న వాగులో స్నానాలాచరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయనున్నారు. మేడారం అభివృద్ధి పనుల్లో గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు ఎటువంటి భంగం కలగొద్దనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ప్రతి నిర్మాణం.. ప్రతి కట్టడాన్ని పూర్తిగా ఆదివాసీ సంప్రదాయాలకు అనుగుణంగా, మేడారం జాతర పూజారులు, ఆదివాసీ పెద్దల సూచనలతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్మాణాల్లో విలువైన గ్రానైట్, లైమ్‌స్టోన్‌ను వాడుతారు. ప్రముఖ స్థపతి, చరిత్రకారుడు ఈమని శివనాగిరెడ్డి సేవలను మేడారం అభివృద్ధి పనులకు ప్రభుత్వం వినియోగించుకుంటోంది.

ఏర్పాట్లను సీఎం పరిశీలించడం ఇదే తొలిసారి

ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మేడారం జాతరను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఇంతకాలం మేడారం జాతరకు ప్రభుత్వాలు తాత్కాలిక ఏర్పాట్లు చేసేవి. జాతర నిర్వహణపై సమీక్షకు సైతం గతంలో ముఖ్యమంత్రులు పెద్దగా శ్రద్ధ చూపిన సందర్భాలు లేవు. మేడారం జాతర ఏర్పాట్లపై తొలిసారిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తున్నారు. అందులో భాగంగానే ఇక్కడ పర్యటించనున్నారు. మేడారం పూజరులు, ఆదివాసీ పెద్దలు, మంత్రులు, గిరిజన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రముఖులతో జాతర నిర్వహణ, కొత్త నిర్మాణాలపై ముఖ్యమంత్రి మంగళవారం మేడారంలో సమీక్షిస్తారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో సమీక్ష జరిపిన సీఎం రేవంత్‌రెడ్డి.. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం మరోసారి రివ్యూ చేయనున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి.

సీఎం టూర్ షెడ్యూల్ ఇలా...

సీఎం రేవంత్‌రెడ్డి మేడారం పర్యటన షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు సోమవారం సాయంత్రం అధికారికంగా ప్రకటించాయి. ఉదయం 10.45 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరనున్న సీఎం.. మధ్యాహ్నం 12 గంటలకు మేడారం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 12.15 గంటల నుంచి 1.30 గంటల వరకు సమ్మక్క–సారలమ్మలను దర్శించుకొని పూజారులతో ఇంటరాక్ట్ అవుతారు. తర్వాత పబ్లిక్ మీటింగ్‌లో ఆలయ పునరుద్ధరణ పనుల ప్లాన్‌ను డిజిటల్ లాంచ్ చేస్తారు. 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు మేడారం పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికారులతో సమీక్ష జరిపిన అనంతరం తిరిగి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరుతారు. సీఎం పర్యటన సందర్భంగా మంత్రి సీతక్క, కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.



అసెంబ్లీ ఆవరణలో బతుకమ్మ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలో సోమవారం శాసనమండలి సచివాలయ ఉద్యోగులు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ సంబురాలను ప్రారంభించారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, శాసనపరిషత్ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు వేడుకల్లో పాల్గొన్నారు.

యాదగిరీశుడి సన్నిధిలో 25 దేశాల ప్రతినిధులు



యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామిని 25 దేశాలకు చెందిన 30 మంది ప్రతినిధులు సోమవారం దర్శించుకున్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ‘ట్రైనింగ్ ఆఫ్ మీడియా మేనేజ్‌మెంట్’ సదస్సులో పాల్గొనడానికి వచ్చిన శ్రీలంక, వియత్నాం, థాయ్‌లాండ్, ఈజిప్ట్, ఆర్మేనియా, కెన్యా, ఘనా, జాంబియా, నమీబియా, ఇరాక్, పాలస్తీనా, టాంజానియా, మారిషస్, క్యూబా తదితర దేశాలకు చెందిన ప్రతినిధులు సోమవారం యాదగిరిగుట్టకు వచ్చారు. ఆలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని పూజలు చేశారు. వీరందరికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. శ్రీస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ విశేషాలను వారికి ఆలయ అధికారులు, అర్చకులు వివరించారు.



దుర్గా పూజ, దివాళీ మరియు ఛట్ పూజ - 2025 సందర్భంగా భారతీయ రైల్వే కార్యాచరణ



ప్రత్యేక రైళ్ళు 21.09.2025 నుండి 30.11.2025 వరకు నడుపబడతాయి

రైలు నం.	స్టేషన్		తేదీలు		ఫ్రీక్వెన్సీ	నడుపబడే రోజులు
	నుండి	వరకు	నుండి	వరకు		
08439	పూరి	పాట్నా జం.	13.09.25	29.11.25	వీక్లీ	శనివారం
08440	పాట్నా జం.	పూరి	14.09.25	30.11.25	వీక్లీ	ఆదివారం
02811	భువనేశ్వర్	యశ్వంత్‌పూర్ జం.	13.09.25	29.11.25	వీక్లీ	శనివారం
02812	యశ్వంత్‌పూర్ జం.	భువనేశ్వర్	15.09.25	01.12.25	వీక్లీ	సోమవారం
08581	విశాఖపట్నం	Smvt. బెంగళూరు	14.09.25	30.11.25	వీక్లీ	ఆదివారం
08582	Smvt. బెంగళూరు	విశాఖపట్నం	15.09.25	01.12.25	వీక్లీ	సోమవారం
08547	విశాఖపట్నం	తిరుపతి	12.09.25	26.11.25	వీక్లీ	బుధవారం
08548	తిరుపతి	విశాఖపట్నం	13.09.25	27.11.25	వీక్లీ	గురువారం
08579	విశాఖపట్నం	చర్లపల్లి	12.09.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
08580	చర్లపల్లి	విశాఖపట్నం	13.09.25	29.11.25	వీక్లీ	శనివారం
03230	పాట్నా జం.	పూరి	25.09.25	27.11.25	వీక్లీ	గురువారం
03229	పూరి	పాట్నా జం.	26.09.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
03208	బక్సర్	కియుల్	21.09.25	30.11.25	రోజువారీ	రోజువారీ
03207	కియుల్	బక్సర్	21.09.25	30.11.25	రోజువారీ	రోజువారీ
03209	ఝఝూ	దానాపూర్	21.09.25	30.11.25	రోజువారీ	రోజువారీ
03210	దానాపూర్	ఝఝూ	21.09.25	30.11.25	రోజువారీ	రోజువారీ
05297	పాట్లీపుత్ర	బల్లియా	01.10.25	30.11.25	రోజువారీ	రోజువారీ
05298	బల్లియా	పాట్లీపుత్ర	01.10.25	30.11.25	రోజువారీ	రోజువారీ
03215	పాట్నా జం.	థావే జం.	01.10.25	30.11.25	రోజువారీ	రోజువారీ
03216	థావే జం.	పాట్నా జం.	01.10.25	30.11.25	రోజువారీ	రోజువారీ
03677	ధన్‌బాద్ జం.	గోరఖ్‌పూర్ జం.	21.09.25	30.11.25	వీక్లీ	ఆదివారం
03678	గోరఖ్‌పూర్ జం.	ధన్‌బాద్ జం.	22.09.25	01.12.25	వీక్లీ	సోమవారం
03043	హౌరా జం.	రక్సౌల్ జం.	27.09.25	15.11.25	వీక్లీ	శనివారం
03044	రక్సౌల్ జం.	హౌరా జం.	28.09.25	16.11.25	వీక్లీ	ఆదివారం
03511	అసన్సోల్ జం.	పాట్నా జం.	19.10.25	09.11.25	వీక్లీ	ఆదివారం
03512	పాట్నా జం.	అసన్సోల్ జం.	19.10.25	09.11.25	వీక్లీ	ఆదివారం
03131	సీల్దా	గోరఖ్‌పూర్ జం.	30.09.25	18.11.25	బై-వీక్లీ	మంగళవారం, గురు
03132	గోరఖ్‌పూర్ జం.	సీల్దా	01.10.25	19.11.25	బై-వీక్లీ	బుధ, శుక్ర
03527	అసన్సోల్ జం.	గోరఖ్‌పూర్ జం.	26.09.25	07.11.25	వీక్లీ	శుక్రవారం
03528	గోరఖ్‌పూర్ జం.	అసన్సోల్ జం.	27.09.25	08.11.25	వీక్లీ	శనివారం
03007	హౌరా జం.	ఖాతిపురా	28.09.25	02.11.25	వీక్లీ	ఆదివారం
03008	ఖాతిపురా	హౌరా జం.	30.09.25	04.11.25	వీక్లీ	మంగళవారం
03109	కోల్‌కత్తా టెర్మినల్	వడోదర జం.	30.09.25	25.11.25	వీక్లీ	మంగళవారం
03110	వడోదర జం.	కోల్‌కత్తా టెర్మినల్	02.10.25	27.11.25	వీక్లీ	గురువారం
03417	మాల్దా టౌన్	ఉధ్నా జం.	27.09.25	08.11.25	వీక్లీ	శనివారం
03418	ఉధ్నా జం.	మాల్దా టౌన్	29.09.25	10.11.25	వీక్లీ	సోమవారం
03187	కోల్‌కత్తా టెర్మినల్	మధుబని	30.09.25	25.11.25	వీక్లీ	మంగళవారం
03188	మధుబని	కోల్‌కత్తా టెర్మినల్	01.10.25	26.11.25	వీక్లీ	బుధవారం
03465	మాల్దా టౌన్	దిఘా	27.09.25	29.11.25	వీక్లీ	శనివారం
03466	దిఘా	మాల్దా టౌన్	27.09.25	29.11.25	వీక్లీ	శనివారం
03101	సీల్దా	మాలతిపత్‌పూర్	26.09.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
03102	మాలతిపత్‌పూర్	సీల్దా	27.09.25	29.11.25	వీక్లీ	శనివారం
03135	సీల్దా	పాట్నా జం.	05.10.25	16.11.25	వీక్లీ	ఆదివారం
03136	పాట్నా జం.	సీల్దా	05.10.25	16.11.25	వీక్లీ	ఆదివారం
03430	మాల్దా టౌన్	చర్లపల్లి	30.09.25	11.11.25	వీక్లీ	మంగళవారం
03429	చర్లపల్లి	మాల్దా టౌన్	02.10.25	13.11.25	వీక్లీ	గురువారం
04131	కాన్పూర్ సెంట్రల్	Smvt. బెంగళూరు	21.09.25	09.11.25	వీక్లీ	ఆదివారం
04132	Smvt. బెంగళూరు	కాన్పూర్ సెంట్రల్	24.09.25	12.11.25	వీక్లీ	బుధవారం
07019	జైపూర్ జం.	హైదరాబాద్	28.09.25	23.11.25	వీక్లీ	ఆదివారం
07020	హైదరాబాద్	జైపూర్ జం.	26.09.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
07029	అగర్తల	చర్లపల్లి	22.09.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
07030	చర్లపల్లి	అగర్తల	26.09.25	24.11.25	వీక్లీ	సోమవారం
07053	కాచిగూడ	బికనీర్ జం.	27.09.25	29.11.25	వీక్లీ	శనివారం
07054	బికనీర్ జం.	కాచిగూడ	23.09.25	25.11.25	వీక్లీ	మంగళవారం
07075	హైదరాబాద్	గోరఖ్‌పూర్ జం.	22.09.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
07076	గోరఖ్‌పూర్ జం.	హైదరాబాద్	28.09.25	23.11.25	వీక్లీ	ఆదివారం
07191	కాచిగూడ	మధురై జం.	22.09.25	20.10.25	వీక్లీ	సోమవారం
07192	మధురై జం.	కాచిగూడ	24.09.25	22.10.25	వీక్లీ	బుధవారం
07193	హైదరాబాద్	కొల్లం జం.	27.09.25	29.11.25	వీక్లీ	శనివారం
07194	కొల్లం జం.	హైదరాబాద్	22.09.25	01.12.25	వీక్లీ	సోమవారం
07230	హైదరాబాద్	కన్యాకుమారి	24.09.25	26.11.25	వీక్లీ	బుధవారం
07229	కన్యాకుమారి	హైదరాబాద్	26.09.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
07651	జల్నా	ఛప్రా	27.08.25	26.11.25	వీక్లీ	బుధవారం
07652	ఛప్రా	జల్నా	29.08.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
07153	నరసాపూర్	Smvt. బెంగళూరు	03.10.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
07154	Smvt. బెంగళూరు	నరసాపూర్	04.10.25	29.11.25	వీక్లీ	శనివారం
07005	చర్లపల్లి	రక్సౌల్ జం.	06.10.25	24.11.25	వీక్లీ	సోమవారం
07006	రక్సౌల్ జం.	చర్లపల్లి	09.10.25	27.11.25	వీక్లీ	గురువారం
07717	తిరుపతి	హిసార్	01.10.25	26.11.25	వీక్లీ	బుధవారం
07718	హిసార్	తిరుపతి	05.10.25	30.11.25	వీక్లీ	ఆదివారం
07017	చర్లపల్లి	తిరుపతి	28.09.25	30.11.25	వీక్లీ	ఆదివారం
07018	తిరుపతి	చర్లపల్లి	29.09.25	01.12.25	వీక్లీ	సోమవారం
07131	తిరుపతి	నరసాపూర్	28.09.25	30.11.25	వీక్లీ	ఆదివారం
07132	నరసాపూర్	తిరుపతి	29.09.25	01.12.25	వీక్లీ	సోమవారం
07233	చర్లపల్లి	నరసాపూర్	27.09.25	29.11.25	వీక్లీ	శనివారం
07234	నరసాపూర్	చర్లపల్లి	28.09.25	30.11.25	వీక్లీ	ఆదివారం

రైలు నం.	స్టేషన్		తేదీలు		ఫ్రీక్వెన్సీ	నడుపబడే రోజులు
	నుండి	వరకు	నుండి	వరకు		
07445	కాకినాడ టౌన్	లింగంపల్లి	22.09.25	24.11.25	ట్రై-వీక్లీ	సోమ, బుధ, శుక్ర
07446	లింగంపల్లి	కాకినాడ టౌన్	27.09.25	29.11.25	ట్రై-వీక్లీ	మంగళ, గురు, శని
07447	కాకినాడ టౌన్	చర్లపల్లి	27.09.25	29.11.25	వీక్లీ	శనివారం
07448	చర్లపల్లి	కాకినాడ టౌన్	28.09.25	30.11.25	వీక్లీ	ఆదివారం
07605	తిరుపతి	అకోలా జం.	26.09.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
07606	అకోలా జం.	తిరుపతి	28.09.25	23.11.25	వీక్లీ	ఆదివారం
07609	జల్నా	తిరుపతి	23.09.25	24.11.25	వీక్లీ	సోమవారం
07610	తిరుపతి	జల్నా	24.09.25	25.11.25	వీక్లీ	మంగళవారం
07521	కడప	గుంతకల్ జం.	22.09.25	30.11.25	రోజువారీ	రోజువారీ
07522	గుంతకల్ జం.	కడప	22.09.25	30.11.25	రోజువారీ	రోజువారీ
07057	పూర్ణ జం.	జల్నా	28.09.25	30.11.25	వీక్లీ	ఆదివారం
07058	జల్నా	పూర్ణ జం.	25.09.25	27.11.25	వీక్లీ	గురువారం
07281	పూర్ణ జం.	జల్నా	22.09.25	30.11.25	రోజువారీ	రోజువారీ
07282	జల్నా	నాందేడ్	22.09.25	30.11.25	రోజువారీ	రోజువారీ
07012	తిరుపతి	చర్లపల్లి		27.09.25	వీక్లీ	శుక్రవారం
07011	చర్లపల్లి	తిరుపతి		26.09.25	వీక్లీ	శనివారం
07055	కాచిగూడ	నాగర్‌సోల్		25.09.25	వన్ ట్రిప్	గురువారం
07056	నాగర్‌సోల్	కాచిగూడ		26.09.25	వన్ ట్రిప్	శుక్రవారం
07046	చర్లపల్లి	నహర్లగన్	27.09.25	29.11.25	వీక్లీ	శనివారం
07047	నహర్లగన్	చర్లపల్లి	23.09.25	02.12.25	వీక్లీ	మంగళవారం
08611	సంత్రాగచి జం.	అజ్మీర్ జం.	22.09.25	24.11.25	వీక్లీ	సోమవారం
08612	అజ్మీర్ జం.	సంత్రాగచి జం.	25.09.25	27.11.25	వీక్లీ	గురువారం
02863	సంత్రాగచి జం.	యశ్వంతపూర్ జం.	25.09.25	27.11.25	వీక్లీ	గురువారం
02864	యశ్వంతపూర్ జం.	సంత్రాగచి జం.	27.09.25	29.11.25	వీక్లీ	శనివారం
08845	సంత్రాగచి జం.	సికింద్రాబాద్ జం.	19.09.25	03.10.25	వీక్లీ	శుక్రవారం
08846	సికింద్రాబాద్ జం.	సంత్రాగచి జం.	20.09.25	04.10.25	వీక్లీ	శనివారం
08109	సంత్రాగచి జం.	పాట్నా జం.	18.10.25	01.11.25	వీక్లీ	శనివారం
08110	పాట్నా జం.	సంత్రాగచ్చి జం.	19.10.25	02.11.25	వీక్లీ	ఆదివారం
08629	రాంచీ	గోరఖ్‌పూర్ జం.	18.10.25	01.11.25	వీక్లీ	శనివారం
08630	గోరఖ్‌పూర్ జం.	రాంచీ	19.10.25	02.11.25	వీక్లీ	ఆదివారం
08865	నేతాజీ ఎస్.సి. బోస్ ఇట్వారీ జం.	షాలిమార్	27.09.25	01.10.25	రోజువారీ	శని, ఆది, సోమ, మంగళ, బుధ
08866	షాలిమార్	నేతాజీ ఎస్.సి. బోస్ ఇట్వారీ జం.	28.09.25	02.10.25	రోజువారీ	శని, ఆది, సోమ, మంగళ, బుధ
06085	ఎర్నాకులం జం.	పాట్నా జం.	26.09.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
06086	పాట్నా జం.	ఎర్నాకులం జం.	22.09.25	01.12.25	వీక్లీ	సోమవారం
06055	పోదనూరు జం.	బరౌని జం.	27.09.25	29.11.25	వీక్లీ	శనివారం
06056	బరౌని జం.	పోదనూరు జం.	09.09.25	02.12.25	వీక్లీ	మంగళవారం
06063	కోయంబత్తూరు జం.	ధన్‌బాద్ జం.	26.09.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
06064	ధన్‌బాద్ జం.	కోయంబత్తూర్ జం.	22.09.25	01.12.25	వీక్లీ	సోమవారం
01667	రాణి కమలాపతి	దానాపూర్	27.09.25	01.11.25	బై-వీక్లీ	శని, మంగళ
01668	దానాపూర్	రాణి కమలాపతి	28.09.25	02.11.25	బై-వీక్లీ	ఆది, బుధ
01701	జబల్‌పూర్	దానాపూర్	26.09.25	05.11.25	బై-వీక్లీ	బుధ, శుక్ర
01702	దానాపూర్	జబల్‌పూర్	27.09.25	06.11.25	బై-వీక్లీ	గురు, శని
09821	సొగరియా	దానాపూర్	27.09.25	01.11.25	వీక్లీ	శనివారం
09822	దానాపూర్	సొగరియా	29.09.25	03.11.25	వీక్లీ	ఆదివారం
02192	రేవా రాణి	కమలాపతి	27.09.25	01.11.25	వీక్లీ	శనివారం
02191	రాణి కమలాపతి	రేవా	27.09.25	01.11.25	వీక్లీ	శనివారం
01704	రేవా	డాక్టర్ అంబేద్కర్ నగర్	27.09.25	25.10.25	వీక్లీ	శనివారం
01703	డాక్టర్ అంబేద్కర్ నగర్	రేవా	28.09.25	26.10.25	వీక్లీ	ఆదివారం
09059	ఉధ్నా జం.	ఖుర్దా రోడ్ జం.	01.10.25	26.11.25	వీక్లీ	బుధవారం
09060	ఖుర్దా రోడ్ జం.	ఉధ్నా జం.	03.10.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
09025	వల్సాద్	దానాపూర్	06.10.25	24.11.25	వీక్లీ	సోమవారం
09026	దానాపూర్	వల్సాద్	07.10.25	25.11.25	వీక్లీ	మంగళవారం
09045	ఉధ్నా జం.	పాట్నా జం.	03.10.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
09046	పాట్నా జం.	ఉధ్నా జం.	04.10.25	29.11.25	వీక్లీ	శనివారం
09007	వల్సాద్	ఖాతిపురా	02.10.25	30.10.25	వీక్లీ	గురువారం
09008	ఖాతిపురా	వల్సాద్	03.10.25	31.10.25	వీక్లీ	శుక్రవారం
09031	ఉధ్నా జం.	జయనగర్	05.10.25	30.11.25	వీక్లీ	ఆదివారం
09032	జయనగర్	ఉధ్నా జం.	06.10.25	01.12.25	వీక్లీ	సోమవారం
09343	డాక్టర్ అంబేద్కర్ నగర్	పాట్నా జం.	02.10.25	27.11.25	వీక్లీ	గురువారం
09344	పాట్నా జం.	డాక్టర్ అంబేద్కర్ నగర్	03.10.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
09195	వడోదర జం.	మఊ	06.10.25	24.11.25	వీక్లీ	సోమవారం
09196	మఊ	వడోదర జం.	07.10.25	25.11.25	వీక్లీ	మంగళవారం
09043	బాంద్రా టెర్మినస్	బర్నీ	05.10.25	30.11.25	వీక్లీ	ఆదివారం
09044	బర్నీ	బాంద్రా టెర్మినస్	06.10.25	01.12.25	వీక్లీ	సోమవారం
09117	ఉధ్నా జం.	సుబేదర్‌గంజ్	03.10.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
09118	సుబేదర్‌గంజ్	ఉధ్నా జం.	04.10.25	29.11.25	వీక్లీ	శనివారం
09075	ముంబై సెంట్రల్	కత్గోడం	01.10.25	26.11.25	వీక్లీ	బుధవారం
09076	కత్గోడం	ముంబై సెంట్రల్	02.10.25	27.11.25	వీక్లీ	గురువారం
09185	ముంబై సెంట్రల్	కాన్పూర్ అన్వర్గంజ్	05.10.25	30.11.25	వీక్లీ	ఆదివారం
09186	కాన్పూర్ అన్వర్గంజ్	ముంబై సెంట్రల్	06.10.25	01.12.25	వీక్లీ	సోమవారం
09039	ఉధ్నా జం.	ధన్‌బాద్ జం.	03.10.25	28.11.25	వీక్లీ	శుక్రవారం
09040	ధన్‌బాద్ జం.	ఉధ్నా జం.	05.10.25	30.11.25	వీక్లీ	ఆదివారం

భారతీయ రైల్వే

www.indianrailways.gov.in

మమ్మల్ని అనుసరించండి /RailMinIndia

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025

రెరాలో కొత్త సాంకేతికత
తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ సాంకేతికతను మరింత బలోపేతం చేయనుంది. వేగవంతమైన సేవలను అందించేందుకు కియోస్క్‌లను ఏర్పాటు చేయనుంది. -10లో



జర్మన్ ఫెస్ట్.. జాయ్ మస్ట్..
జర్మనీ దేశం గురించి తెలియని సిటిజనులు ఉంటారేమో కానీ అక్టోబర్ ఫెస్ట్ గురించి తెలియని పార్టీ ప్రియులు ఉండరు. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.0/29.0
నగరంలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. భారీ వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 31, కనిష్టంగా 29 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

వర్షపాతం ఇలా (ప్రాంతం / సెంటీ మీటర్లు)
రాత్రి 10 గంటల వరకు నమోదైన వర్షపాతం ఇలా

ప్రాంతం	సెంటీ మీటర్లు
బంజారాహిల్స్	10.5
శ్రీనగర్‌కాలనీ	9.9
ఖైరతాబాద్	8.9
వెంకటేశ్వర కాలనీ	8.1
మైత్రివనం	6.8
యూసఫ్‌గూడ	6.7
ముషీరాబాద్	6.2
వనస్థలిపురం	6.1
రహమత్‌నగర్	5.0
ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ	5.0
విద్యానగర్	4.9


అమీర్‌పేట చర్మాస్ జంక్షన్‌లో..


మాసాబ్‌ట్యాంక్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

నగరం అతలాకుతలం

- గంటల తరబడి నిలిచిన ట్రాఫిక్
- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు
- అత్యధికంగా బంజారాహిల్స్‌లో 10 సెం.మీ వర్షపాతం నమోదు

ఏరులై పారిన రహదారులు | వరద నీటిలో కొట్టుకుపోయిన వాహనాలు

సాక్షి, సిటీబ్యూరో

కుండపోత వర్షానికి హైదరాబాద్ మహానగరం అతలాకుతలమైంది. సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించి పోయింది. తొలి అర్ధగంటలో ఆకాశానికి చిల్లుపడినట్లు వర్షం కురవడంతో ప్రధాన రహదారులపై వరద నీరు ఏరులై పారింది. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. రోడ్ల పక్కన నిలిపిన వాహనాలు కొట్టుకుపోయాయి. వరద ఉధృతికి ఓపెన్ నాలాలు, డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లాయి. నగరం నాలుగు దిక్కులా గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అయింది. వాహనాలు కిలో మీటర్ల పొడవునా బారులు తీరాయి. ఒకవైపు భారీ వర్షం మరోవైపు వాహనాలు ముందుకు కదలక పోవడం, ఆటోలు, జీపులు కాలుష్యం వదులుతుండటంతో ద్విచక్ర వాహనాదారులు నరక యాతనపడ్డారు. అత్యధికంగా బంజారాహిల్స్‌లో సుమారు 10 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. బంజారాహిల్స్ నాలా పొంగి వెంకటేశ్వర కాలనీ డివిజన్‌లోని దేవరకొండ బస్తీ నీట మునిగింది. ఇళ్లలోకి నీళ్లు చేరాయి.

ఉరుములు మెరుపులతో....

మధ్యాహ్నం వరకు భానుడు ప్రతాపం చూపగా..ఆ తర్వాత వరుణుడు విజృంభించాడు. సాయంత్రం నాలుగు గంటలకు ఉరుములు మెరుపులతో ప్రారంభమైన వర్షం రాత్రి వరకు కొనసాగింది. నిమిషాల వ్యవధిలోనే ప్రధాన రహదారులపై భారీగా వరద నీరు వచ్చి చేరడంతో చెరువుల తలపించాయి. గత వారం రోజుల నుంచి సాయంత్రం సమయం నగర వాసులను వణికిస్తోంది. సగటున ఐదు నుంచి పది నిమిషాలు తగ్గకుండా ఏకధాటి వర్షంతో జనజీవనంపై తీవ్రప్రభావం పడుతుంది. సోమవారం బంజారాహిల్స్, శ్రీనగర్‌కాలనీ, ఖైరతాబాద్, మైత్రివనం, యూసుఫ్‌గూడ, వనస్థలిపురం, హయత్‌నగర్, బహదూర్‌పురా ప్రాంతాల్లో భారీగా వర్షం కురిసింది.

అసెంబ్లీ నుంచి ఖైరతాబాద్‌కు రెండు గంటలు

భారీ వర్షానికి ట్రాఫిక్ చక్ర బంధనంగా తయారైంది. ఫలితంగా పలు ప్రధాన మార్గాల్లో వాహనాలు ముందుకు కదలలేదు. మెహిదీపట్నం–గచ్చిబౌలి మార్గంలో టోలిచౌకి–షేక్‌పేట వంతెనపై భారీగా వాహనాలు నిలిచి పోయాయి. వాహనదారులు అసెంబ్లీ నుంచి లక్డీకాపూల్ మీదుగా ఖైరతాబాద్ వరకు చేరేందుకు రెండు గంటలు, మెహిదీపట్నం నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు రెండున్నర గంటలు, ఎల్బీనగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ మీదుగా మలక్‌పేట చేరేందుకు మూడు గంటల సమయం పట్టింది. ప్రధానంగా హైదరాబాద్–విజయవాడ రహదారి, హైదరాబాద్–వరంగల్, హైదరాబాద్–ముంబై, హైదరాబాద్– బెంగళూర్, హైదరాబాద్– కరీంనగర్ మార్గాల్లో ట్రాఫిక్ కిలో మీటర్ల కొద్దీ నిలిచి పోవడంతో..నగరంలోని వాహనాలు సైతం ముందుకు కదలలేదు. ప్రధాన రహదారులపై ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాదారులు సర్వీస్ రహదారుల బాటపట్టారు. దీంతో సర్వీస్ రహదారులపై కూడా వాహనాలు ముందుకు కదలలేదు. మరోవైపు సర్వీస్ రోడ్లపై భారీగా వరద నీరు చేరడంతో స్థానికులు మ్యాన్‌హోళ్ల మూతలు తెరిచారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


బంజారాహిల్స్ జీవీకే మాల్ వద్ద..


వీఎస్టీ వద్ద..


చింతలకుంట వద్ద విజయవాడ రహదారిపై వర్షపు నీరు..


సికింద్రాబాద్‌లో..

హీట్ ఐలాండ్‌తోనే
క్లౌడ్ బరస్ట్

మరికొన్ని ఏళ్ల పాటు నగరాల్లో ఇవే పరిస్థితులు

- సాయంత్రం వేళల్లోనే ఒక్కసారిగా భారీ వర్షాలు
- ఫ్లడ్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కీలకం
- అందుకే చెరువులు, కుంటలు, నాలాలపై దృష్టి
- ఏ ప్రాంతంలోనూ నివాసాల జోలికి వెళ్లడం లేదు
- కబ్జా స్థలాల్లో కృత్రిమ నివాసాలు సృష్టిస్తున్నారు
- రూ.50 వేల కోట్ల విలువైన 923 ఎకరాలకు విముక్తి

వెల్లడించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

చెర వీడిన స్థలాలు ఇలా...

ఆక్రమణ రకం	ఎకరాల్లో
ప్రభుత్వ భూమి	424
ఫుట్‌పాత్స్	0.05
నాలాలు	15
రోడ్లు	218.3
చెరువులు	233
పార్కులు	25.65
అక్రమ కట్టడాలు	7.14
మొత్తం	923.14

సాక్షి, సిటీబ్యూరో: వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ కారణంగా నగరాల్లో ఏర్పడుతున్న 'హీట్ ఐలాండ్' కారణంగానే క్లౌడ్ బరస్ట్, మినీ క్లౌడ్ బరస్ట్ ఏర్పడుతున్నాయని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు.

దీనికి కండెక్టివ్ కరెంట్ తోడు కావడంతో సాయంత్రం వేళల్లో ఒక్కసారిగా భారీ వర్షం కురుస్తుందని వివరించారు. మరికొన్ని ఏళ్ల పాటు నగరాలకు ఈ ఇబ్బంది తప్పదని, ఫలితంగానే ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యం ఇస్తూ జలవనరులు, నాలాలు, పార్కుల్ని పునరుద్ధరిస్తున్నామని పేర్కొన్నారు. బుద్ధ భవన్‌లోని ప్రధాన కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

కోర్ ఏరియాలో అధిక ఉష్ణోగ్రత...

సబ్ అర్బన్ ప్రాంతాలతో పోలిస్తే కోర్ సిటీలో మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటోంది. హీట్ ఐలాండ్‌గా పిలిచే దీంతో లోకల్ మాయిశ్చరైజర్ పెరుగుతోంది. దీనికి కాలుష్యం తోడు కావడంతో నీటి బిందువులుగా మారి క్లౌడ్ బరస్ట్‌లు జరుగుతున్నాయి. కాలంతో సంబంధం లేకుండా క్లౌడ్ బరస్ట్‌లు గడిచిన 25 ఏళ్లల్లో మూడు రెట్లు పెరిగాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని అర్బన్ ఫ్లడ్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫ్రాస్టక్చర్ అభివృద్ధి చేస్తున్నాం. రాజధానిలో 70 శాతం చెరువులు మాయమయ్యాయి. చాలా వరకు నాలాలు కనెక్టివిటీ కోల్పోయాయి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకునే జెన్–జెడ్ కోసం జలవనరులు పరిరక్షిస్తున్నాం. పార్కుల పరిరక్షణతో వాతావరణంలో వేడిని తగ్గించే అవకాశం ఉంది.


బంజారాహిల్స్ రోడ్ నెం 3లో..

పక్కా పథకం ప్రకారం కబ్జా పర్వం...

హైడ్రా ఏ ఒక్క నివాసం జోలికీ వెళ్లట్లేదు. ప్రజలు సోషల్‌మీడియా చూసి ఓ అభిప్రాయానికి రావద్దు. గాజుల రామారంలోనూ ప్రభుత్వ స్థలంలో 900 నిర్మాణాలు గుర్తించినా... ఇంకా పూర్తికాని 260 మాత్రమే కూల్చాం. భూ కబ్జాలకు పాల్పడే అసాంఘిక శక్తులు పక్కా పథకం ప్రకారం వ్యవహరిస్తున్నాయి. 300 గజాల స్థలంపై కన్నేసి దాని చుట్టూ ప్రహరీ కడుతున్నారు. 30 గజాల్లో ఓ షెడ్లు వేసి కుటుంబాన్ని తీసుకువచ్చి అందులో ఉంచి నివాసమని పేర్కొంటున్నారు. ఇలా ఉంటున్న వారికి కబ్జాదారులే నిర్ణీత మొత్తం చెల్లిస్తూ దాన్ని అమ్మేసిన తర్వాత మరోచోటుకు మారుస్తున్నారు. గాజులరామారంలో కబ్జాలు చేసిన వారితో పాటు సహకరించిన అధికారులపైనా చర్యలు ఉంటాయి. అక్కడ ఇళ్లు కొని నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకుంటుంది. వాళ్లు తమకు అమ్మిన వారి పేర్లు చెప్పాలి.



హైడ్రాను మేనేజ్ చేయడం అబద్ధం..

వివిధ ప్రాంతాల్లో ఆక్రమణలకు పాల్పడిన సంస్థలపై 11 కేసులు నమోదు చేయించాం. ఏ బిల్డర్, సంస్థా హైడ్రాను మేనేజ్ చేయలేదు. అలా ఎవరైనా చెప్తే అది అబద్ధమే అవుతుంది. మరో నెల రోజుల్లో హైడ్రా ఠాణా పని చేయడం ప్రారంభిస్తుంది. ప్రతి అంశంలోనూ కోర్టు ఆదేశాలను కచ్చితంగా పాటిస్తున్నాం. ఈ నెల 26న బతుకమ్మకుంటను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ ఏడాది అక్టోబర్ నుంచి చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లకు సంబంధించి ఫైనల్ నోటిఫికేషన్ల జారీ ఉంటుంది. ఆ తర్వాత వాటిలో ఉన్న నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం హైడ్రా ఆరు చెరువులను పునరుద్ధరిస్తోంది. ఎవరైనా ముందుకు వచ్చిన సీఎస్సార్ నిధులతో చెరువులు అభివృద్ధి చేస్తామంటే అప్పగిస్తాం. ఇప్పటి వరకు 96 చోట్ల డ్రైవ్స్ నిర్వహించి రూ.50 వేల కోట్ల విలువైన 923.14 ఎకరాలను కబ్జా చెర నుంచి విడిపించాం.

నవంబర్ రెండో వారంలో?

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తేదీపై ఊహాగానాలు

- బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు నిర్వహించే అవకాశం..
- నోటిఫికేషన్‌కు ముందే విస్తృత ప్రచారం
- అభ్యర్థుల ప్రకటనకు ముందే.. వాడవాడలా, ఇంటింటికీ..

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలకూ ఈ ఉప ఎన్నిక సవాల్‌గానే కాక, రాబోయే జీహెచ్‌ఎంసీ పాలకమండలి, అసెంబ్లీ ఎన్నికలకు 'టీజర్' గానూ మారనుండటంతో అన్ని పార్టీలూ ఈ ఎన్నికపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి. బహుశా, ఎన్నికల షెడ్యూలు..నోటిఫికేషన్..వెలువడకముందే, అభ్యర్థులెవరో ప్రకటించకముందే విస్తృతంగా ప్రచారం జరుగుతున్న ఎన్నిక ఇదే కాబోలు. ఈ హడావుడి, ప్రచారం చూస్తున్న ప్రజల నుంచి ఇంతకీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఎప్పుడు జరగనుందనే ప్రశ్నలు వెలువడుతున్నాయి. ఎన్నిక ఎప్పుడన్నది అందరిలోనూ ఆసక్తికరంగా మారింది.

బిహార్ అసెంబ్లీ ఎన్నికలతోపాటే..

ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, త్వరలోనే బిహార్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలు తదితరమైనవి దృష్టిలో ఉంచుకొని అటు రాజకీయ పార్టీలు, ఇటు జీహెచ్‌ఎంసీ వర్గాలు చెబుతున్న సమాచారం మేరకు నవంబర్ మొదటి లేదా రెండో వారంలో ఎన్నికలు జరగనున్నట్లు తెలుస్తోంది. బిహార్ అసెంబ్లీ కాలపరిమితి నవంబర్ 22తో ముగియనుంది. ఆలోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. బిహార్‌లో ఛాత్ పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆ పండుగ అక్టోబర్ 28న వస్తోంది. ఆ పండుగ ముగిశాక ఎన్నికలు జరగనున్నట్లు తెలుస్తోంది. దాదాపుగా నవంబర్ 5–15 తేదీల మధ్య బిహార్ ఎన్నికలు జరగ్గలవనే అంచనాలున్నాయి. అందుకు తగిన కారణం కనిపిస్తోంది. బిహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పూర్తయ్యాక ఓటర్ల ఫైనల్ జాబితా ఈ నెల 30వ తేదీన వెలువడనుంది. దాని తరువాతే ఎన్నికల షెడ్యూలు వెలువడగలదని అవగాహన ఉన్నవారు చెబుతున్నారు. ఆ మేరకు అక్టోబర్ 3వ తేదీకి అటూ ఇటూగా షెడ్యూలు వెలువడనుంది. నోటిఫికేషన్‌కు, పోలింగ్‌కు మధ్య వ్యవధి, తదితరమైనవి పరిగణనలోకి తీసుకొని నవంబర్ 15లోగా ఎన్నికలు నిర్వహిస్తారని చెబుతున్నారు. దేశంలో ఎక్కడైనా ఉప ఎన్నిక జరగాల్సి ఉంటే, ఏదైనా రాష్ట్రానికి జరిగే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలుతోపాటే వాటికీ వెలువరిస్తారని జీహెచ్‌ఎంసీ ఎన్నికల విభాగం అధికారులు చెప్పారు. ఆ లెక్కన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నవంబర్ రెండోవారంలో జరగనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



నోటిఫికేషన్ రాకున్నా.. ముమ్మర ప్రచారం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడలేదు. రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించలేదు. ఒక్క బీఆర్‌ఎస్ తప్ప మిగతా పార్టీల్లో అభ్యర్థి ఎవరన్నదీ సంకేతాలు కూడా లేవు. కానీ, ఈ నియోజకవర్గంలో ఇప్పటికే విస్తృత ప్రచారం జరుగుతోంది. బీఆర్‌ఎస్ పార్టీ తమ అభ్యర్థిగా గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతకే టిక్కెట్ ఇస్తున్నట్లు చూచాయగా తెలిపింది. సునీతతో పాటు ఆమె కుమార్తెలు ఇప్పటికే ప్రచారం నిర్వహిస్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు రోజుకో డివిజన్ చొప్పున బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయంలో సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మన సీటును మనం తిరిగి గెలుచుకోవడమే కాక రాబోయే రోజుల్లో మనదే గెలుపని చెప్పేందుకు ఇక్కడి నుంచే జైత్రయాత్ర ప్రారంభం కావాలని పిలుపునిస్తున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరైనా గెలుపే లక్ష్యంగా ఏకంగా ముగ్గురు మంత్రులు, పలువురు కార్పొరేషన్ల చైర్మన్లకు బాధ్యతలప్పగించింది. వారు బస్తీబస్తీలో తిరుగుతున్నారు. ప్రభుత్వం తరఫున సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రెండు పార్టీలు కూడా పోలింగ్ బూత్‌ల వారీగా, ఓటర్ల వారీగా ప్రచార ప్రణాళికలు రూపొందించుకున్నాయి. ఒక్క ఓటు కూడా పోరాదనే విధంగా ప్రతి ఓటరునూ కలిసేలా కార్యాచరణ రూపొందించుకున్నారు. బీజేపీ సైతం తన ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ఇక ఎంఐఎం పార్టీ కాంగ్రెస్‌కు మద్దతిచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.

గోల్కొండ రోప్‌వేకు లైన్ క్లియర్

నైట్‌ఫ్రాంక్ సంస్థను కన్సల్టెన్సీగా ఎంపిక చేసిన హెచ్‌ఎండీఏ

- గోల్కొండ కోట నుంచి టూంబ్స్ వరకు రోప్‌వేపై అధ్యయనం
- మూడు నెలల్లో నివేదికను అందజేయనున్న కన్సల్టెన్సీ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లోనే మొట్టమొదటి రోప్ వే నిర్మాణానికి హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) శ్రీకారం చుట్టింది. చారిత్రక నగరంలో పర్యాటకులకు ఆహ్లాదకరమైన ఆకాశయాన సదుపాయాన్ని అందజేసేందుకు గోల్కొండ కోట నుంచి టూంబ్స్ వరకు 1.5 కి.మీ. మార్గంలో రోప్‌వే నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపైన అధ్యయనం చేసేందుకు నైట్‌ఫ్రాంక్ సంస్థ కన్సల్టెన్సీగా ఎంపికైంది. రైట్స్, నైట్ ఫ్రాంక్, కెఅండ్‌జీ అనే మూడు సాంకేతిక సంస్థలు కన్సల్టెన్సీ హోదాను దక్కించుకొనేందుకు పోటీపడగా నైట్ ఫ్రాంక్‌కు అవకాశం లభించింది. సాంకేతిక సామర్థ్యం, సంస్థ అనుభవం పరిగణనలోకి తీసుకొని కన్సల్టెన్సీనికి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సంస్థ మూడు నెలల్లో నివేదికను అందజేయనుంది. ఈ నివేదిక ఆధారంగా ప్రాజెక్టు నిర్మాణానికి అర్హత కలిగిన సంస్థను ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా ఎంపిక చేయనున్నారు. పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో ఈ ప్రాజెక్టును చేపట్టాలని హెచ్‌ఎండీఏ భావిస్తోంది. రోప్‌వే నిర్మాణం సాకారమైతే ఈ రెండు చారిత్రక ప్రదేశాలను పర్యాటకులు కేబుల్‌కార్‌లలో సందర్శించే అవకాశం లభించనుంది.

అంతర్జాతీయ స్థాయిలో అధ్యయనం....

ప్రస్తుతం ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న రోప్‌వేలపైన నైట్‌ఫ్రాంక్ సంస్థ అధ్యయనం చేయనుంది. నిర్మాణం, నిర్వహణ, సాంకేతిక సామర్థ్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని సమర్థవంతమైన నిర్మాణ సంస్థలను కూడా సూచించనుంది. అలాగే నిర్మాణవ్యయం పైన కూడా అంచనాలను రూపొందిస్తుంది. ప్రస్తుతంగోల్కొండ కోట నుంచి గోల్కొండ టూంబ్స్ మధ్య రక్షణ శాఖకు చెందిన స్థలాలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో రోప్‌వే నిర్మాణానికి రైట్ ఆఫ్ వేను రూపొందించడంతో పాటు, అవసరమైన వనరులసేకరణపైన కూడా ఈ అధ్య యనం దృష్టి సారించనుంది. అన్ని అంశాలపైన సమగ్రమైన అధ్యయనంతో డీపీఆర్‌ను రూపొందించనుంది. ఈ డీపీఆర్ ఆధారంగానే పీపీపీ పద్ధతిలో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.


ఆహ్లాదం...అనందం..

ప్రస్తుతం మన దేశంలో మనాలి, గ్యాంగ్‌టక్, ఉదయ్‌పూర్, నలందా, డార్జిలింగ్, సిమ్లా, ముస్సోరి తదితర 12 ప్రాంతాల్లో రోప్ వేలు అందుబాటులో ఉన్నాయి. అడవులు, ఎత్తైన కొండప్రాంతాలు, పర్వతమాలలను కలిపే ఆకాశయానాలుగా రోప్‌వేలు వినియోగంలో ఉన్నాయి. హైదరాబాద్‌లో మాత్రం నగరంలోనే ఆకాశహర్మ్యాల నడుమ ఈ రోప్‌వే సదుపాయం అందుబాటులోకి రానుంది. ప్రతిరోజు సుమారు 10 వేల మంది పర్యాటకులు గోల్కొండ కోటను సందర్శిస్తున్నారు. వారిలో సుమారు 3000 మందికి పైగా విదేశీ టూరిస్టులు ఉన్నట్లు అంచనా. ట్రాఫిక్ రద్దీ, రోడ్డు మార్గంలో ఎదురయ్యే ఇబ్బందుల దృష్ట్యా చాలామంది గోల్కొండ కోట నుంచే వెనుదిరుగుతున్నారు. దీంతో గోల్కొండ కోటలాగే ఎంతో చరిత్ర కలిగిన శతాబ్దాల నాటి కుతుబ్‌షాహీల సమాధులను సందర్శించలేకపోతున్నారు. ఈ రోప్‌వే అందుబాటులోకి వస్తే 1.5 కి.మీ.మార్గాన్ని కేవలం 10 నిమిషాల్లో చేరుకొనే సదుపాయం లభించనుంది. పైగా రెండు చారిత్రక ప్రదేశాలను తప్పనిసరిగా సందర్శిస్తారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం సుమారు రూ.100 కోట్ల వరకు వ్యయం కానున్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. పీపీపీ పద్ధతిలో దీన్ని నిర్వహించడం వల్ల పర్యాటకుల నుంచి టిక్కెట్ల రూపంలో ఆదాయం లభించనుంది. ఈ రోప్‌వే నిర్మాణం పూర్తయితే గోల్కొండ ప్రాంతం మరిన్ని పర్యాటక హంగులను సంతరించుకోనుంది.

మాట్లాడుదామంటూ రమ్మని పిలిచి..

యువతిని బ్లేడుతో కోసి పరార్

మూసాపేట: యువతిని మాట్లాడుదాం అని పిలిచి ఆమెను బ్లేడుతో కోసి ఓ యువకుడు పరారయ్యాడు.ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... మూసాపేటకు చెందిన మోషిన్ (20) అఫ్రిన్ (20) ఒకే పాఠశాలలో చదువుకున్నారు. అనంతరం ఇద్దరూ ప్రేమించుకున్నారు. అతను ప్రతి చిన్న విషయానికి గొడవ పడుతుండటంతో అతని ప్రవర్తనతో తట్టుకోలేకపోయిన ఆమె చాలా నెలలు నుండి అతనిని దూరంగా ఉంచాలని నిర్ణయించుకుంది. ఆదివారం రాత్రి 8 గంటలకు ఆమె ఇంటికి వెళుతుండగా ఫోన్ చేసి మాట్లాడటానికి మూసాపేట మెట్రో స్టేషన్‌కు రమ్మని కోరారు. ఆమె రాత్రి 11 గంటల ప్రాంతంలో అక్కడికి వెళ్లి ఇద్దరూ మాట్లాడుకుంటూ గొడవ పడటం ప్రారంభించారు. ఇద్దరూ వాదించుకుంటూ ఉండగా నిందితుడు వెంట తెచ్చుకున బ్లేడ్ తీసుకుని ఆమె కడుపులో పొడిచి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావం అవుతున్న యువతిని స్థానికులు కూకట్‌పల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ హత్య కేసు ఛేదించిన పోలీసులు?

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో జరిగిన మహిళ హత్య కేసును రాజేంద్రనగర్ పోలీసులు ఛేదించినట్లు సమాచారం. ఇద్దరు నిందితులతో పాటు రెండు ఆటోలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరు పాత నేరస్తుడని తెలిసింది. గత మంగళవారం కిస్మత్‌పూర్ బ్రిడ్జి వద్ద ఓ మహిళ శవం లభించిన సంగతి తెలిసిందే. హైదర్‌గూడలోని కల్లు కంపౌండ్ నుంచి మహిళను ఆటోలో తీసుకొచ్చి ఆత్యాచారం చేసి హత్య చేశారు. తమకు సహకరించకపోవడంతో అత్యంత కిరాతకంగా హత్య చేసినట్లు తెలిసింది. నిందితులను మంగళవారం మీడియా ముందుకు ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. సీసీ పుటేజీల ఆధారంగా నిందితులను పూర్తి ఆధారాలతో పట్టుకున్నారని తెలుస్తోంది.

రెరాలో కొత్త టెక్నాలజీ

త్వరలో కియోస్క్ ప్రారంభం

- రెరా మొబైల్ యాప్ కూడా
- ప్రతీ ప్రాజెక్ట్‌కు క్యూఆర్ కోడ్ తప్పనిసరి
- గృహ కొనుగోలుదారులకు పారదర్శక, వేగవంతమైన సేవలు
- ఇప్పటివరకు టీజీ రెరాలో 10,043 ప్రాజెక్ట్‌ల నమోదు

TG RERA



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ రెరా) సాంకేతికతను మరింత బలోపేతం చేయనుంది. గృహ కొనుగోలుదారులకు, పెట్టుబడిదారులకు పారదర్శక, వేగవంతమైన సేవలను అందించేందుకు సాంకేతికతను వినియోగించనుంది. ఇందులో భాగంగా టీజీ రెరా కార్యాలయంలో కియోస్క్‌ను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఎలాగైతే బ్యాంకింగ్ రంగంలో కియోస్క్‌లు చిన్నపాటి బ్యాంక్ అవుట్‌లెట్ లాగా పనిచేస్తాయో.. అదే తరహాలో కస్టమర్లు టీజీ రెరా సేవలన్నీ ఈ కియోస్క్ ద్వారా పొందే వీలుంటుంది. గృహ కొనుగోలుదారులు టీజీ రెరా కార్యాలయాన్ని నేరుగా సందర్శించే అవసరం లేకుండా టీజీ రెరా ప్రాథమిక సేవలన్నీ ఈ కియోస్క్ ద్వారా అందుకోవచ్చని ఓ టీజీ రెరా అధికారి తెలిపారు. ఇది అందుబాటులోకి వస్తే దేశంలో రెరా కియోస్క్ ఏర్పాటు చేసిన తొలి, ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

టీజీ రెరా యాప్ కూడా..

టీజీ రెరా మొబైల్ అప్లికేషన్ (యాప్)ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. సాంకేతిక అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని, ఏప్రిల్‌లో యాప్ అందుబాటులోకి వస్తుందని ఓ అధికారి తెలిపారు. దీంతో పాటు క్విక్ రెస్పాన్స్ (క్యూఆర్) కోడ్ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలని టీజీ రెరా అధికారులు నిర్ణయించారు. నిర్దిష్ట ప్రాజెక్ట్ సమాచారమంతా ఈ క్యూఆర్ కోడ్‌లో నిక్షిప్తమై ఉంటుంది. ప్రాజెక్ట్‌కు బయట వీక్షకులకు కనిపించేలా క్యూఆర్ కోడ్‌ను డిస్‌ప్లే చేయాల్సి ఉంటుంది. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు ప్రాజెక్ట్ డెవలపర్, ప్రమోటర్, అపార్ట్‌మెంట్ల సంఖ్య, అనుమతులు.. ఇలా ప్రాజెక్ట్ గురించి సమస్త సమాచారం ఇట్టే తెలిసిపోతుంది. డెవలపర్లు ప్రాజెక్ట్ ప్రమోషన్, అడ్వర్టయిజింగ్ సందర్భాలలో క్యూఆర్ కోడ్‌ను తప్పనిసరిగా పబ్లిష్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే మహారాష్ట్రలో 2023 ఆగస్టులో మహా రెరా ఈ క్యూఆర్ కోడ్‌లను ప్రవేశపెట్టింది.

10,043 ప్రాజెక్ట్‌ల నమోదు..

2017 జులైలో మొదలైన టీజీ రెరాలో ఇప్పటి వరకు 10,043 ప్రాజెక్ట్‌లు నమోదయ్యాయి. 4463 మంది స్థిరాస్తి మధ్యవర్తులు, ఏజెంట్లు రిజిస్టరయ్యారు. అలాగే ఇప్పటివరకు టీజీ రెరాకు 2,340 ఫిర్యాదులు అందగా.. ఇందులో 1,566 ఫిర్యాదులను పరిష్కృతమయ్యాయి. సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్, జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వైవీఆర్ కన్‌స్ట్రక్షన్స్, సత్యనారాయణ మూల, శ్రీఅమేయా కన్‌స్ట్రక్షన్స్, శ్రీనివాస్ కాకర్ల ఏడుగురు ప్రమోటర్లు/ఏజెంట్లను డిఫాల్టర్లుగా గుర్తించారు. 500 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించే నివాస, వాణిజ్య ప్రాజెక్ట్‌లతో పాటు 8, అంతకంటే ఎక్కువ అపార్ట్‌మెంట్లు, నిర్మాణాలను టీజీ రెరాలో నమోదు చేసుకోవాల్సిందే.

కలెక్టరేట్‌లో బతుకమ్మ పండుగ



సాక్షి,మేడ్చల్‌జిల్లా: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబురాలు సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ ఆవరణలో మహిళా అధికారులు ఆటాపాటలతో ఘనంగా జరుపుకున్నారు. బతుకమ్మ ప్రకృతిని అరాధించే పెద్ద పండుగ, తెలంగాణ ఆచార సంప్రదాయమైన బతుకమ్మ పండుగను రెవెన్యూ, సివిల్ సప్లై శాఖలు సంయుక్తంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ సంబురాలు నిర్వహించాలన్న రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆటలతో మహిళా ఉద్యోగులు సందడి చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా (లోకల్‌బాడీ), విజయేందర్‌రెడి(రెవెన్యూ)డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతితో కలసి వివిధ శాఖల మహిళా అధికారులు ,ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. అందంగా రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను మధ్యలో పెట్టి మహిళలు ఉద్యోగులు పాటలు పాడుతూ ..నృత్యాలు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సాంబశివరావు, జిల్లా సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు, వివిధ శాఖల మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కింగ్ చేసిన వాహనాలే టార్గెట్

ముగ్గురు నిందితుల అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

చాంద్రాయణగుట్ట: ఇళ్ల ముందు పార్క్ చేసిన వాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. చాంద్రాయణగుట్ట డివిజన్ ఏసీపీ ఎ.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం....టోలిచౌకికి చెందిన మహ్మద్ సొహేల్(19), సన్‌సిటీకి చెందిన సల్మాన్(22)లు ఆటోడ్రైవర్లు. వీరు మరో ప్రధాన నిందితుడు షాబాజ్‌తో కలిసి ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన ఆటోలు, మోటార్ సైకిళ్లను చోరీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు ఆటోలను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న సొహేల్, సల్మాన్‌లను సీసీఎస్ పోలీసులతో కలిసి అదుపులోకి తీసుకొని విచారించడంతో దొంగతనాల చిట్టా విప్పారు. బండ్లగూడతో పాటు చందానగర్‌లో ఒక ఆటో, ఆర్సీ పురంలో పల్సర్ బైక్‌ను చోరీ చేసినట్లు అంగీకరించారు. వీరిని అరెస్ట్ చేసి నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. సమావేశంలో బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్, డీఐ బి.శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

మనూ అధ్యాపకులకు అరుదైన గుర్తింపు



ప్రొఫెసర్ సల్మాన్‌ఖాన్ | ప్రొ.మహ్మద్ రఫీక్ | ప్రొ. డాక్టర్ మహ్మద్ ఫైజాన్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ సైన్సెస్‌లోని ముగ్గురు అధ్యాపకులకు ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ గుర్తింపు లభించింది. యూఎస్‌ఏలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ప్రచురించిన ప్రపంచవ్యాప్తంగా ప్రతిష్టాత్మకమైన వరల్డ్ టాప్-2 శాతం శాస్త్రవేత్తల జాబితా-2025లో గుర్తింపు లభించింది. కెమిస్ట్రీ విభాగం అధిపతి ప్రొఫెసర్ సల్మాన్ ఏ ఖాన్, ఫిజిక్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ మహ్మద్ రఫీక్ అబుతురాబ్, వృక్షశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ ఫైజాన్ వారి రంగాలలో అత్యుత్తమ కృషికి గుర్తింపు సాధించిన నేపథ్యంలో వారికి ఈ అవకాశం లభించింది.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



స్వరూప (ఫైల్)

నాగోలు: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందింది.నాగోలు పోలీసులు తెలిపిన మేరకు.. మహబూబాబాద్ జిల్లా రెడ్డాల గ్రామంలో బోడ స్వరూప(35), బోడ రవి దంపతులు నివాసముంటున్నారు. ఈ క్రమంలో అనిల్ కుమార్‌తో స్వరూపకు పరిచయం ఏర్పడింది. దీంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. అనిల్ మాయ మాటలు నమ్మిన స్వరూప ఈ నెల 21న నాగోలు బ్లైండ్ కాలనీలో నివాసం ఉండే అనిల్ కుమార్ దగ్గరకు వచ్చింది.స్వరూప హైదరాబాద్‌కు వచ్చిన విషయం తెలుసుకున్న భర్త ఫోన్ చేయగా తాను అనిల్‌తో ఉన్నాను అని చెప్పింది. ఆదివారం రాత్రి అనిల్ కుమార్ నివాసంలో అనుమానాస్పద స్థితిలో బాత్‌రూమ్‌లో ఆత్మహత్య చేసుకొని కనిపించింది.స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని అనిల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

అక్కినేని నాగేశ్వరరావు గొప్ప నటుడు



సంగీత దర్శకుడు సాలూరి వాసురావును సత్కరిస్తున్న బండారు దత్తాత్రేయ

చిక్కడపల్లి: అక్కినేని నాగేశ్వర్‌రావు గొప్ప నటుడని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సోమవారం రాత్రి రసమయి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి వాసురావుకు 'అక్కినేని జీవిత సాఫల్య పురస్కారం'ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మైన్స్ మాజీ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, సాహితీవేత్తలు ఎంకే రాము, జంగయ్యగౌడ్, సుబ్బరాయశర్మ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



హస్తినాపురం: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం పోలీసులు తెలిపిన మేరకు.. బీఎన్‌రెడ్డినగర్ జంక్షన్ నుండి శ్రీకృష్ణదేవరాయనగర్ చౌరస్తాకు వెళ్లే దారిలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గమనించారు. దీంతో వనస్థలిపురం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

25 వరకు ప్రధాని ఫొటో ఎగ్జిబిషన్



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు

గన్‌ఫౌండ్రీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 25 వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రదర్శించనున్నట్లు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, తెలిపారు. నరేంద్రీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రలకు తెలియజేసేలా నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్లమెంటు సభ్యులు డీకే అరుణ, కొండా విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



సికింద్రాబాద్: పట్టాల పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కేతావత్ నారాయణ తెలిపిన మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన సుబోధ్ కుమార్(25) గుండ్ల పోచంపల్లిలోని ఫ్యాక్టరీ ఏరియాలో రోజువారి కూలీగా పని చేస్తున్నాడు. ఈ నెల 21న సాయంత్రం కూరగాయలు కొనుగోలు చేసేందుకు పోచంపల్లి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రైలు పట్టాల పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో వెనుకవైపు నుంచి వచ్చిన రైలు సుబోధ్ కుమార్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

మాజీ డీఎస్పీ నళినికి న్యాయం జరిగేలా చూడండి

కాచిగూడ: తెలంగాణ మలిదశ ఉద్యమంలో డీఎస్పీ పదవికి రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్న మాజీ డీఎస్పీ నళినికి న్యాయం జరిగే విధంగా చూడాలని ఓబీసీ సెంట్రల్ కమిటీ జాతీయ అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. నళినికి రావాల్సిన గ్రాంట్‌ను అందించే విధంగా చూడాలని సోమవారం మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు వినతి పత్రం అందజేశారు. రాందేవ్‌బాబాతో దత్తాత్రేయ మాట్లాడి నళిని ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. నళిని ఆరోగ్య పరిస్థితి కుదుట పడిన తర్వాత ప్రధానమంత్రిని కల్పిస్తానని దత్తాత్రేయ హామీ ఇచ్చారని తెలియజేశారు.

దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

సాక్షి, సిటీ బ్యూరో: మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులపై దాడికి పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించాలని తెలంగాణ టీచింగ్ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కిరణ్, ప్రధాన కార్యదర్శి మాదాల కిరణ్, కోశాధికారి ఎల్.రమేష్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం సుమారు 150 మంది సూపరింటెండెంట్ కార్యాలయాన్ని చుట్టుముట్టి చంపేస్తామంటూ బెదిరించడం క్షమించరాని నేరమన్నారు. వైద్యులుపై వివిధ ప్రాంతాల్లో నిత్యం దాడులు జరుగుతున్నాయని, వీటిని అరికట్టకుంటే పనిచేయలేమని పేర్కొన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం వెంటనే నిందితులను అరెస్టు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బాల త్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మవారు



కీసర: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కీసరగుట్టలో మొదటి రోజున అమ్మవారు బాలత్రిపుర దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.మొదటిరోజు పూజకార్యక్రమాల్లో ఆలయ చైర్మెన్ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్‌రెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సంఘాల నూతన జేఏసీని ఏర్పాటు చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న థామస్‌రెడ్డి, హనుమంత్ ముదిరాజ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆర్టీసీలోని అన్ని సంఘాల కార్మికులతో ఈనెల 26న కలిసి నూతన జేఏసీ ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఈ.వెంకన్న హనుమంత్ ముదిరాజు, కత్తుల యాదయ్య తెలిపారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి 2021 పేస్కేల్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. ఆర్టీసీలోని ట్రేడ్ యూనియన్‌లను అనుమతించాలని డిమాండ్ చేశారు. 2017 పేస్కేల్ ఏరియర్స్‌ను చెల్లించాలని కోరారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు ఆర్టీసీ సంఘాల నాయకులు సుద్దాల సురేష్, రవీందర్‌రెడ్డి, కమలాకర్‌గౌడ్, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రసేన్ మహారాజ్ స్ఫూర్తితో రాష్ట్రాభివృద్ధి

ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

శంషాబాద్: సేవే నిజమైన సంపద అని చాటి చెప్పిన అగ్రసేన్ మహారాజ్ స్ఫూర్తితో రాష్ట్రాభివృద్ధి వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు అన్నారు. శంషాబాద్ క్లాసిక్ కన్వెన్షన్‌లో తెలంగాణ అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అగ్రసేన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అగ్రసేన్ గొప్పసామాజిక శిల్పి అని ఆయన కొనియాడారు. ఆయన ప్రవేశ పెట్టిన ఒక ఇటుక.. ఒక నాణేం అన్న సూత్రం ప్రపంచంలోనే మొదటి స్టార్టప్ ఇన్‌క్యూబేటర్ అని పేర్కొన్నారు, సంపద కొద్దిమందికే పరిమితం చేయకుండా సమాజంలో పంపిణీ చేసినపుడే అభివృద్ధి సాధ్యమని నిరూపించిన మహానీయుడన్నారు. కార్యక్రమంలో అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా, ఉపాధ్యక్షుడు రూపేష్ అగర్వాల్ పాల్గొన్నారు.

ఎటుచూసినా జ్వరాలు..ఇబ్బందుల్లో ప్రజలు

ఇప్పటికే 274పైగా కేసుల నమోదు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: డెంగీ వ్యాధి చాపకింది నీరులా విస్తరిస్తూ మృత్యుఘంటికలు మోగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే అధికారికంగా 274కి పైగా కేసులు నమోదు కాగా అనధికారికంగా మరో వందకుపైగా ఉన్నట్టు సమాచారం. వీరిలో ఇప్పటికే ఇద్దరు మృత్యువాతపడగా తాజాగా కొత్తూరు మండలం ఎస్‌బీపల్లికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక ఇదే జ్వరంతో బాధపడుతూ కన్నుమూసింది. అవగాహన లేక చాలామంది దీన్ని సాధారణ జ్వరంగా భావిస్తున్నారు. చికిత్సను నిర్లక్ష్యం చేస్తూ చివరికి ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. ఏకధాటి వర్షాలు, వరదలకు తోడు పారిశుద్ధ్య లోపంతో బస్తీవాసులతో పాటు మారుమూల ప్రాంతాల్లోని పేదలు జ్వరం, కీళ్లనొప్పులు, వాంతులు, విరేచనాలు ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. జిల్లాలోని 56 ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోని ఓపీకి మేలో 1,32,442 మంది బాధితులు రాగా, జూన్‌లో 1,34,725 మంది, జూలైలో 1,43,962 మంది వచ్చారు. ఆగస్టులో ఈ సంఖ్య ఏకంగా రెండు లక్షలు దాటింది. ప్రతి నెలా పదివేల వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతుండగా తాజాగా ఆ సంఖ్య పాతికవేలు దాటడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

చికిత్సల పేరుతో..

తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, వాంతులు, చర్మంపై దద్దుర్ల వంటి లక్షణాలతో బాధపడుతూ ఆస్పత్రులకు చేరుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కొంత మంది వైద్యులు సాధారణ జ్వరాలను సైతం డెంగీ జాబితాలో చేర్చి.. ప్లేట్‌లెట్ కౌంట్స్ చికిత్సల పేరుతో నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. నిజానికి మనిషి రక్తంలో 1.50 లక్షల నుంచి 4.50 లక్షల వరకు ప్లేట్‌లెట్స్ ఉంటాయి. జ్వర పీడితుల్లో ఇది కొంత తగ్గుతుంది. ప్రస్తుతం ఆస్పత్రులకు వస్తున్న చాలా మంది రోగుల్లో ప్లేట్‌లెట్ కౌంట్ 50 వేలపైనే ఉంటోంది. అంతకు తగ్గి నోరు, ముక్కు నుంచి బ్లీడింగ్ అయితే వెంటనే ప్లేట్‌లెట్స్ పునరుద్ధరించాలి. లేదంటే షాక్‌కు గురై కోమాలోకి వెళ్లి చనిపోయే ప్రమాదం ఉంటుంది. కొంత మంది వైద్యులు ఐసీయూ చికిత్సల పేరుతో అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నారు. నిజానికి ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాదు ప్రైవేటు ఆ స్పత్రుల్లోని డెంగీ బాధితుల వివరాలను సైతం జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు చేరవేయాల్సి ఉంటుంది. జిల్లాలోని ఏ ఒక్క కార్పొరేట్ ఆస్పత్రి కూడా రోగుల జాబితాను ఇవ్వడం లేదంటే ఆశ్చర్యపోనసరం లేదు. అనుమానిత డెంగీగా నమోదు చేసి గుట్టుగా చికిత్సలు చేస్తుండటం కొసమెరుపు.

ఆ ప్రాంతాల్లో అధికం

కోకాపేట్, నార్సింగి, మణికొండ, గండిపేట్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, బాలాపూర్ ప్రాంతాల్లో డెంగీ కేసులు ఎక్కువ నమోదవుతున్నాయి. ఆకర్షణ, ఆహ్లాదం కోసం ఇంటి గుమ్మం ముందు కుండీల్లో మనీప్లాంట్స్ నాటుతుండటం, ఖాళీ ప్రదేశాల్లో రకరకాల పూలు, పండ్ల మొక్కలు పెంచుతుండటం, ఏకధాటి వర్షాలకు కుండీల నిండా నీరు చేరడం, ఇంటిపై ఖాళీ డబ్బాలు, ఇంటి పక్క ఖాళీ స్థలాల్లో కొబ్బరి బొండాలు, టైర్లు పడేయడంతో వాటిలో వర్షపు నీరు చేరి దోమలకు నిలయంగా మారుతున్నాయి. ఇంటిపై ఉన్న నీటి ట్యాంకులపైనే కాదు సెల్లార్‌లో ఉన్న సంపుపై కూడా మూతలు లేకపోవడం, నిర్మాణాల కోసం తవ్విన సెల్లార్ గుంతల్లో నీరు చేరడం, స్లాబులు, గోడల క్యూరింగ్ కోసం వాడిన నీరు రోజుల తరబడి అక్కడే నిల్వ ఉంటూ దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయి. ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయక పోవడంతో ఇవి మరింత వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

క్లుప్తంగా...

విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడిన మేయర్



ఎస్వీఆర్ స్కూల్‌లో బతుకమ్మ వేడుకల్లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్–12 ఎస్టీ నగర్ బస్తీలోని ఎస్వీఆర్ స్కూల్‌లో బతుకమ్మ వేడుకల్లో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొని విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మ విశిష్టత గురించి విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాల కరస్పాండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు



బడ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్‌లో బతుకమ్మ వేడుకల్లో మాగంటి సునీత, కార్పొరేటర్ దేదీప్య

శ్రీనగర్‌కాలనీ: రాజీవ్‌నగర్‌కాలనీ బడ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్‌లో సోమవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాగంటి సునీత, కార్పొరేటర్ దేదీప్య హాజరై బతుకమ్మ ఆడారు. స్కూల్ డైరెక్టర్ శశిభూషణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు ఆర్థిక సాయం



ఉమ్రా యాత్రికులకు వీడ్కోలు పలుకుతున్న బొంతు రామ్మోహన్

రహమత్‌నగర్: ఐదుగురు ఉమ్రా యాత్రికులకు మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆర్థిక సాయం అందించారు. బోరబండ డివిజన్ సైట్–1 మసీదు కమిటీ ప్రతినిధులు ఐదుగురు ఉమ్రా వెళ్తున్నారనే సమాచారాన్ని స్థానిక కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ద్వారా తెలుసుకున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ బోరబండకు చేరుకుని ఐదుగురు సభ్యులకు స్వచ్ఛందంగా ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం మసీదు కమిటీ సభ్యులు బొంతు రామ్మోహన్‌ను ఘనంగా సత్కరించి, 'మానవాళి ప్రవక్త' పుస్తకాన్ని బహుకరించారు.

బీఆర్ఎస్ జెండా మరోసారి ఎగరాలి



మాట్లాడుతున్న మాగంటి వజ్రనాథ్

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మరోసారి బీఆర్ఎస్ జెండా రెపరెపలాడాలని దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సోదరుడు మాగంటి వజ్రనాథ్ పేర్కొన్నారు. త్వరలో జరగనున్న ఉప ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం బీఆర్ఎస్ యూసుఫ్‌గూడ డివిజన్ బూత్ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. వజ్రనాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, ప్రజల్లోని అసంతృప్తిని ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీని నమ్మవద్దని, తన సోదరుడు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూపించాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నేతలు బస్వరాజ్, మాధవి పాల్గొన్నారు.

'మనం సైతం' పుష్కర వేడుక

బంజారాహిల్స్: నటుడు కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మనం సైతం' ఫౌండేషన్ పుష్కర మహోత్సవం హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో ఘనంగా జరిగింది. 12 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఈ ఫౌండేషన్‌కు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ కరోనా సమయంలో వందలాది కుటుంబాలకు ఆయన సాయం చేశారన్నారు. అవసరమైన కిట్లు అందించారని, అప్పటి నుంచి కిరణ్ తనకు పరిచయమన్నారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి మాట్లాడుతూ మనం సైతం ఫౌండేషన్ టీమ్‌కు, ఫౌండర్ కాదంబరి కిరణ్‌కు అభినందనలు తెలిపారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాదంబరి కిరణ్ మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్ట్ జీ.కృష్ణ స్ఫూర్తితోనే తనకు సామాజిక సేవ ఆలోచన వచ్చిందన్నారు. సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్, సినీ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు, జర్నలిస్టులు పృథ్వీ, సాయి, ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్, రామసత్యనారాయణ, అశోక్ కుమార్, సురేష్ కొండేటి తదితరులు పాల్గొన్నారు.



బంజారాహిల్స్ రోడ్ నెం.12లో స్వర్ణ కవచంతో బంజారాహిల్స్ కనకదుర్గా దేవి



వెండి కవచంతో ఫిలింనగర్ దైవసన్నిధానం రాజరాజేశ్వరి దేవి



బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో మాగంటికాలనీ విజయ కనకదుర్గా దేవి



బాలాత్రిపుర సుందరి దేవి అలంకారంలో శ్రీనగర్‌కాలనీలోని శ్రీభ్రమరాంబికా అమ్మవారు

ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

బాలాత్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు | ఆలయాలకు పోటెత్తిన భక్తులు

బంజారాహిల్స్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీదేవి నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి దివ్య అలంకారాన్ని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తారు. మొదటి రోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఫిలింనగర్‌లోని ఎంఆర్‌సీకాలనీలో కొలువుదీరిన విజయ కనకదుర్గాదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమివ్వగా భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారి దివ్య అలంకారాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ తల్లి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయంలో ఏర్పాట్లు చేశారు.

స్వర్ణ.. రజత కవచాలు..

బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన కనకదుర్గా దేవి అమ్మవారిని కేజీ బంగారంతో తయారు చేసిన స్వర్ణ కవచాలతో అలంకరించారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలోని శ్రీరాజరాజేశ్వరి దేవి అమ్మవారిని 11 కేజీల వెండి కవచాలతో అలంకరించారు.



ఎంఆర్‌సీకాలనీ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత మామిడి నర్సింగరావు

సినీ కార్మికులకు అండగా ఉంటాం

వెంగళరావునగర్: సినీ కార్మికులకు తాము అండగా ఉంటామని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ వల్లభనేని, కార్మిక సంఘాల సీనియర్ నాయకులు వి.చిన్న శ్రీశైలం యాదవ్ అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని వెంకటగిరిలో ఉన్న తెలుగు సినీ స్టూడియోస్ వర్కర్స్ యూనియన్ ఎన్నికలు ఇటీవల నిర్వహించారు. అధ్యక్షుడిగా జి.ఈశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.వీరేష్, కోశాధికారిగా ఆర్.పెద్ద ఉపేందర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన నాయకులు సోమవారం సంఘం కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన చిన్న శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ కార్మికుల కష్టాలను ఎన్నో ఏళ్లుగా ప్రత్యక్షంగా, పరోక్షంగా చూస్తున్నామని అన్నారు. కార్మికులకు ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన నేతలను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్మిక సంఘం నాయకులు జగన్నాథం, ప్రభాకర్, సుబ్రహ్మణ్యం, చెన్నయ్యతో పాటు సినీ స్టూడియో వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



నూతన కమిటీతో సన్మానం చేయిస్తున్న చిన్నశ్రీశైలం యాదవ్ తదితరులు

వెంగళరావునగర్‌లో రోడ్డు పనులు ప్రారంభం

వెంగళరావునగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు చేపట్టలేదని స్థానిక కార్పొరేటర్ దేదీప్య అన్నారు. వెంగళరావునగర్‌కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క రూపాయి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. గతంలో చేసిన పనులే ఇప్పటికీ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, పూజారి బాలు, కృష్ణ, ఆదిత్య, బాలురజక, పవన్ ముదిరాజ్, నర్సింగరావు, చిలకల వెంకటేశ్వరరావు, కోడె సాంబశివరావు తదితరులు ఉన్నారు.



రహదారి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

రేపు సదరం శిబిరం

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్ హెచ్ఎఫ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 24న వికలాంగుల కోసం సదరం శిబిరం ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్, బోరబండ, వెంగళ్‌రావు నగర్, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, షేక్‌పేట్ డివిజన్లకు చెందిన దివ్యాంగులకు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి సదరం సర్టిఫికేట్లు అందిస్తారు. ఎలాంటి ముందస్తు రిజిస్ట్రేషన్ అవసరం లేదు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకు సదరం శిబిరం కొనసాగుతుంది.

విద్యార్థులను ఇతిహాసంలోకి తీసుకెళ్లేందుకు..



'రామాయణం ద్వారా ప్రయాణం'పై స్టోరీ టెల్లింగ్, వర్క్‌షాప్‌లో చిన్నారులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో 'రామాయణం ద్వారా ప్రయాణం'పై స్టోరీ టెల్లింగ్, వర్క్‌షాప్ ఉత్సాహంగా సాగింది. 3–7 సంవత్సరాల వయస్సు పిల్లల కోసం ప్రత్యేక వర్క్‌షాప్‌లను నిర్వహించడంలో కీలకపాత్ర పోషించే ట్రైల్‌బ్లేజర్స్, స్టోరీ వీవర్స్ అయిన పూర్వ, కోమల్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులను ఇతిహాసంలోకి తీసుకెళ్లడం, ఇంటరాక్టివ్ పద్ధతిలో సజీవంగా తీసుకురావడమే లక్ష్యంగా కార్యక్రమం సాగింది. విద్యార్థులు రాముడు, సీత, హనుమంతుడు తదితర పాత్రల జీవిత పాఠాలను కళ్ల ముందు ఆవిష్కరించారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావాలి



మాట్లాడుతున్న మంత్రి వివేక్

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరాలని, బూత్ కమిటీలు సమష్టిగా పనిచేసి భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి వివేక్ కోరారు. షేక్‌పేటలో సోమవారం డివిజన్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్‌తో కలిసి పాల్గొన్న మంత్రి వివేక్ మాట్లాడుతూ బస్తీల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని, బస్తీలు, కాలనీలను ఆదర్శంగా చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, పథకాలను చూసి ప్రజలు ఆకర్షితులవుతున్నారని, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. నియోజకవర్గాన్ని బీఆర్ఎస్, బీజేపీలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచాయని, కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేపడుతున్నామని మాజీ ఎంపీ అంజన్ కుమార్‌యాదవ్ అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ, బూత్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేబీఆర్ చుట్టూ స్థలాలు కోల్పోతున్న వారితో సమావేశం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లైఓవర్లతో పాటు అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టనుండగా, ఇందుకోసం భూసేకరణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఇప్పటికే కేబీఆర్ పార్కు చుట్టూ భూసేకరణలో స్థలాలు కోల్పోయే నోటిఫికేషన్ జారీ కాగా, స్థలాలు కోల్పోతున్న నివాసితులతో జీహెచ్ఎంసీ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఖైరతాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో ఫిలింనగర్ జంక్షన్, రోడ్డు నంబర్–45 జంక్షన్‌లలో స్థలాలు కోల్పోతున్న నివాసితులతో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సోమవారం మాట్లాడారు. ఏయే ప్లాట్‌లో ఎంత స్థలం కోల్పోతున్నారో అందుకు తగిన పరిహారం, టీడీఆర్ వివరాలు వారి దృష్టికి తీసుకువచ్చారు. సాధ్యమైనంత త్వరగా అంగీకార పత్రాలు ఇవ్వాల్సిందిగా సూచించారు.



ఆస్తులు కోల్పోతున్న వారితో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

ఎక్కడ చూసినా గుట్టలుగా వ్యర్థాలు



ఎంజీనగర్ నాలాపై పెద్దఎత్తున పేరుకుపోయిన వ్యర్థాలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ సర్కిల్–18 బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలోని బస్తీలు, కాలనీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. బహిరంగ ప్రదేశాల్లోని చెత్తను తరలించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటంతో ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. బస్తీ, కాలనీవాసులు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఫిలింనగర్ బస్తీలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయండి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులు, పనిచేయని వీధి దీపాలపై తక్షణ చర్యలు తీసుకోవాలంటూ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా కమలాపురికాలనీలో చేపట్టాల్సిన నూతన రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాల్సిందిగా కోరారు.

వ్యాలిడేషన్ ఆఫ్ పెన్షన్ బిల్లును రద్దు చేయాలి

హిమాయత్‌నగర్: వ్యాలిడేషన్ ఆఫ్ పెన్షన్ బిల్లును తక్షణమే రద్దు చేయాలని నేషనల్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎన్‌సీసీపీఏ) ప్రధాన కార్యదర్శి ఎస్.సోమయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.యుగంధర్, కోశాధికారి ఎం.అర్జున్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లుతో పాటు పెన్షన్ బిల్లు ప్రవేశపెట్టి, రాజ్యాంగంలోని పెన్షన్ రూల్స్ ఆర్టికల్–14ను అతిక్రమించారని ఆరోపించారు. 8వ వేతన కమిషన్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. బ్యాంకు పెన్షనర్స్ పెన్షన్ కూడా అప్‌గ్రేడ్ చేయాలని, ఎన్‌పీఎస్, యూపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. సమావేశంలో ఎన్‌సీసీపీఏ ప్రతినిధులు శివకుమార్, రామచంద్రుడు, శివలింగం, భార్గవచారి, ఎస్.మోహన్ దాస్, సుధాకర్, బి.నర్సింహ, ఎస్.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.



సోమాజిగూడలో ఓ అపార్ట్‌మెంట్‌ను ముంచెత్తిన వరద



పంజగుట్ట మోడల్ హౌస్ వద్ద..



పంజాగుట్ట మోడల్ హౌస్ వద్ద..



సోమాజిగూడ ప్రధాన



యశోద ఆస్పత్రి వద్ద వరద

భారీ వర్షానికి అతలాకుతలం

బంజారాహిల్స్: వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రహదారులు జలమయం అవుతున్నాయి. సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, ఫిలింనగర్ ప్రాంతాల్లోని రోడ్లపై భారీగా వరద చేరింది. బంజారాహిల్స్ రోడ్–5లోని దేవరకొండబస్తీలో నాలా పొంగడంతో బస్తీ నీట మునిగింది. నివాసాల్లోకి పెద్ద ఎత్తున వరద చేరింది. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో పాటు కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు దారి, అమీర్‌పేట్, పంజగుట్ట మోడల్ హౌజ్ వద్ద వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఒకవైపు ట్రాఫిక్ పోలీసులు, మరోవైపు జీహెచ్ఎంసీ, హైడ్రా సిబ్బంది వరద సాఫీగా వెళ్లేలా ప్రయత్నాలు చేశారు. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు నరకాన్ని చూశారు.



సోమాజిగూడ యశోద ఆస్పత్రి వద్ద..



కేబీఆర్ పార్కు రోడ్డు దుస్థితి



అమీర్‌పేట్ చర్మాస్ జంక్షన్‌లో..



బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద..



ఖైరతాబాద్ మారుతినగర్ బస్తీలో..

సాక్షి మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025

అగ్రసేన్ మహారాజ్‌కు సీఎం పుష్పాంజలి


అగ్రసేన్ మహారాజ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

బంజారాహిల్స్: అగ్రసేన్ మహారాజ్ జయంతి సందర్భంగా బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఆయనతోపాటు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అగ్రసేన్ మహారాజ్ సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు.

నగరంలో నేడు

- మాదాపూర్ అన్నమయ్యపురంలో దసరా నవరాత్రులను పురస్కరించుకుని నాద బ్రహ్మోత్సవ్–2025 వేడుకల్లో భాగంగా సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు ప్రముఖ కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలతో నాదనైవేద్యం సమర్పిస్తారు.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఉద్యానవన శాఖ గ్రాండ్ నర్సరీ మేళా పేరుతో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హార్టికల్చర్ షో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ హాల్‌లో దసరా పండుగ ప్రత్యేకంగా హ్యాండ్‌లూమ్ ఇండియా పేరిట స్వచ్ఛమైన ఫైబర్ సిల్క్ ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, స్కల్ప్చర్స్, స్టేకిడ్ స్టోరీస్, డీప్ ఇంటీరియల్స్ చిత్ర ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయి.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో దసరా ఉత్సవాలు, శారీస్ ఆఫ్ ఇండియా మేళా కార్యక్రమాలు ఉదయం 10.30 నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతాయి.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ గఫార్ ఖాన్ కాలనీలోని లేబుల్స్ ది పాప్ అప్ స్పేస్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఖిజార్ స్కిల్స్ సోల్‌లో ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ సునీల్ ఎస్.హీరేమంత్ తదితరులు

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో 31 మంది అనిమల్ కీపర్లకు వన్యప్రాణుల సంరక్షణపై ఒక్కరోజు శిక్షణకార్యక్రమాన్ని రాష్ట్ర జూ పార్కుల డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్.హీరేమంత్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణే ధ్యేయంగా అనిమల్ కీపర్లు పోషించే పాత్ర అమోఘమైనదన్నారు. రాష్ట్రంలోని నెహ్రూ జూలాజికల్ పార్క్, కరీంనగర్ డీర్ పార్క్, కిన్నెరసాని డీర్ పార్క్, లోయర్ మానేరు డీర్ పార్కుల్లోని అనిమల్ కీపర్లు తమ పాత్రను మెరుగుపర్చుకోవడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జూ పార్కు క్యూరేటర్ జె.వసంత మాట్లాడుతూ జంతు నిర్వహణలో, అటవీ ప్రాంతాల్లో వారి పాత్ర ముఖ్యమైందన్నారు. జూ పార్కు వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ అబ్దుల్ హకీం జూ పార్కు జంతువులకు ఆహారం అందించడంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డాక్టర్ లక్ష్మీనారాయణ, జూ పార్క్ వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ వన్యప్రాణుల రెస్క్యూ ఆపరేషన్, జంతువులపై మత్తు మందు ప్రయోగంలోని మెళకువలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన అనిమల్ కీపర్లకు ధ్రువపత్రాలు అందజేశారు.

పండుగ వేళ.. వేతన వెతలు

- కొత్త మున్సిపాలిటీల్లో జీతాలు రాక కార్మికుల ఆందోళన
- పస్తులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న కుటుంబాలు
- పంచాయతీరాజ్, పురపాలక శాఖ మధ్య నలిగిపోతున్న కార్మికులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని మూడు చింతలపల్లి, ఎల్లంపేట్, అలియాబాద్ మున్సిపాలిటీల కార్మికులకు వేతనాలు అందక పడుతున్న వెతలు అన్నీ ఇన్నీకావు. నాలుగు నెలల నుంచి వేతనాలు అందకపోవటంతో వారి కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పంచాయతీరాజ్, పురపాలక శాఖ మధ్య నలిగిపోతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు పంచాయతీరాజ్ శాఖ జీతాలు చెల్లిస్తుందని పురపాలక సంఘాలు పేర్కొంటుండగా, లేదు లేదు మున్సిపాలిటీ వారే ఇస్తారని పంచాయతీ శాఖ ముఖం చాటేస్తోంది. బతుకమ్మ, దసరా పండుగల వేళ.. జీతాలు రాక తాము తీవ్ర ఇబ్బందులతో నలిగి పోతున్నామని కార్మికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. బతుకమ్మ, దసరా పండుగ ఉత్సవాల నేపథ్యంలో మున్సిపల్ కార్మికులకు జీతాలు అందకపోవటంతో తమ కుటుంబాలు పస్తులుండాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పండుగ వేళ కొత్త దుస్తులతోపాటు కావలసిన నిత్యావసర సరుకులు కొనుక్కోలేని దుస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. నిరుపేదలుగా జీవనం గడుపుతున్న మున్సిపల్ కార్మికులకు సకాలంలో జీతాలు రాకపోతే వారి కుటుంబాలు ఎలా బతకాలని జిల్లా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ ప్రశ్నిస్తోంది. పేదల సంక్షేమానికి పాల్పడుతున్నామని అనునిత్యం వల్లించే ప్రభుత్వం పురపాలక సంఘాల్లో పని చేస్తున్న దళిత కార్మికుల స్థితిగతులను పట్టించుకోకపోవటంపై యూనియన్ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది. మున్సిపల్ కార్మికులకు ప్రతి నెలా జీతం ఇవ్వకుండా వారిని ఇబ్బంది పెడుతున్న సర్కారు ప్రజా ప్రతినిధులు, అధికారులకు మాత్రం ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు అందజేస్తోందని యూనియన్ విమర్శిస్తోంది. కార్మికుల జీతాల కోసం జిల్లా కలెక్టర్‌తోసహా జిల్లా అదనపు కలెక్టర్('లోకల్ బాడీ) రాధిక గుప్తాకు పలుమార్లు వినతులు అందజేసినా మున్సిపల్ కార్యాలయాల ముందు ఆందోళన చేసినా పట్టించుకోవటం లేదని జిల్లా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. మూడు చింతలపల్లి, ఎల్లంపేట్, అలియాబాద్ ఇటీవలనే మూడు మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. ఈ మూడు మున్సిపాలిటీల్లో 275 మంది కార్మికులు, ఉద్యోగులు పని చేస్తున్నారు. మూడు చింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపల్ కార్మికులకు నాలుగు నెలల జీతాలు పెండింగ్‌లో ఉండగా, అలియాబాద్ మున్సిపల్ కార్మికులకు మూడు నెలల వేతనాలు రావాల్సి ఉంది. ఈ మున్సిపాలిటీలో కార్మికుల ఆందోళనలు, నిరసనల ఫలితంగా రెండు రోజుల కిందనే ఒక నెల జీతం అందజేసినట్లు జిల్లా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ పేర్కొంటోంది. సకాలంలో జీతాలు అందించక పోతే నిరవధిక ఆందోళనతోపాటు సమ్మెకు పూనుకుంటామని వారు హెచ్చరిస్తున్నారు.

వైద్య నిపుణులకు ఏఐపై అవగాహన


ఓరియంటేషన్ కోర్సులో పాల్గొన్న ముఖ్యులు

రాయదుర్గం: వైద్యనిపుణుల కోసం కృత్రిమ మేధపై నిర్వహించిన ఓరియంటేషన్ కోర్సు సోమవారం ముగిసింది. ఏఐ అన్వయాలపై అవగాహన కల్పించేందుకు నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఐ హబ్ డాటా, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ సంయుక్తంగా 12 వారాల 2వ ఎడిషన్ ఓరియంటేషన్ కోర్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఢిల్లీ, హైదరాబాద్‌ల్లో ఒకరోజు ఆన్‌లైన్ సెషన్లు నిర్వహించాయి. జూన్ 15న ప్రారంభించిన ఈ కోర్సు ఆరోగ్యరంగంలో ఏఐ ప్రాథమికాలు, అన్వయాలను వైద్యులకు పరిచయం చేయడమే లక్ష్యంగా రూపొందించారు. లెర్నింగ్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా అందించిన ఈ కోర్సులో ప్రీ రికార్డ్ లెక్చర్లు, వారానికి ఒకసారి లైవ్ సెషన్లు, డేటా అనలిటిక్స్‌పై ట్యూటోరియల్స్, నోకోడ్ ప్లాట్‌ఫార్మ్‌లను ఉపయోగించి ఏఐ మోడల్ అభివృద్ధి ప్రదర్శనలు చోటు చేసుకున్నాయి. భారతదేశం, అమెరికా, యూకే, రుమేనియా, కాంబోడియా, యూఏఈ నుంచి 110 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరు మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, ఎథిక్స్, గవర్నెన్స్, ఏఐ ఆధారిత హెల్త్‌కేర్ సొల్యూషన్స్‌పై అవగాహన కల్పించారు. ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ సివిజవమర్, ప్రొఫెసర్ బాపిరాజు, డాక్టర్ వినోద్, అనూప్ నంబూద్రి, డాక్టర్ పొన్ను రంగం కుమార గురు, డాక్టర్ మోనాలిసా పాత్రా, డాక్టర్ అవనీష్ ఖరే, ప్రొఫెసర్ జాయ్ మామెన్, ప్రొఫెసర్ బిందుమీనన్, డాక్టర్ నిపుణ్ వర్మ, ప్రొఫెసర్ కృతికా రంగరాజన్ వంటి ప్రముఖ వైద్యులు, ఏఐ నిపుణులు బోధించడం విశేషం. పాల్గొన్న వారికి ఎన్ఏఎంఎస్, ఐహబ్ డాటా, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ సంయుక్తంగా సర్టిఫికెట్లు అందించాయి.

మాన్యువల్ స్కావెంజింగ్‌ను నిషేధించాలి

జేడీ్స, డీసీలకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు

లక్డీకాపూల్: గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా మాన్యువల్ స్కావెంజింగ్ విధానాన్ని పూర్తిగా నిషేధించాలని జేడీ్స, డీసీలను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదేశించారు. డ్రైనేజీలలో మాన్యువల్ స్కావెంజింగ్‌కు తావివ్వొద్దని అన్నారు. పారిశుధ్య నిర్వహణ పనులు పూర్తిగా మెకానికల్ పద్ధతుల ద్వారానే జరగాలని అధికారులను ఆదేశించారు. జీవీపీ, చెత్త సేకరణను డీసీలు, జేడీ్సలు నేరుగా పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. శానిటేషన్ పనుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో లోపాలు తలెత్తినప్పుడు చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. ప్రజారోగ్యం, కార్మికుల భద్రత జీహెచ్ఎంసీకి ప్రథమ కర్తవ్యమని కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు.

బాలాత్రిపుర సుందరీదేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో సోమవారం దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారి భక్తులకు శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చింది. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. నవరాత్రుల సందర్భంగా ఆలయంలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

జీఎస్టీ తగ్గింపు దీపావళి కానుక

– 'ధన్యవాదాలు మోదీజీ' ర్యాలీలో లక్ష్మణ్


ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ లక్ష్మణ్, బీజేపీ శ్రేణులు

చిక్కడపల్లి: జీఎస్టీ తగ్గింపును ప్రధాని నరేంద్ర మోదీ దసరా, దీపావళి కానుకగా ప్రజలకు అందించారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. సోమవారం నుంచి దేశవ్యాప్తంగా కొత్త జీఎస్టీ రేట్లు అమలవుతున్న నేపథ్యంలో చిక్కడపల్లి నుంచి అశోక్‌నగర్ వరకు వ్యాపారులు, వినియోగదారులకు అవగాహన కల్పిస్తూ 'ధన్యవాదాలు మోదీజీ'పేరుతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ సెంటర్లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాల పిలుపు మేరకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రధాని దూరదృష్టితో ప్రపంచంలోనే భారత్ నాలుగో ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందన్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంచడంతోపాటు వికసిత భారత్ దిశగా ముందుకు సాగుతోందన్నారు. అగ్రదేశాలు విధిస్తున్న పన్నులకు తలవంచకుండా ఆత్మస్థైర్యంతో స్వదేశీ వస్తువులను తయారు చేసి ప్రపంచానికి అందించాలని, దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, పూస రాజు, రమేష్‌రామ్, మద్దూరి శివాజీ, కార్పొరేటర్‌లు రచన శ్రీ, సుప్రియగౌడ్, రవిచారి, ఆర్. శేషసాయి, శర్మ, ఎండీ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: మంజీరా మంచినీటి పైపులైన్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఈ నెల 24 ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని జలమండలి వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సరఫరా చేసే మంజీరా ఫేజ్–2లో కలబ్‌గూర్ నుంచి హైదర్‌నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్‌కు వివిధ ప్రాంతాల్లో ఏర్పడిన భారీ లీకేజీలకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆర్సీ పురం, అశోక్ నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్, బీరంగూడ, అమీన్ పూర్, ట్రాన్స్‌మిషన్ డివిజన్ 2: ఆఫ్ టేక్ పాయింట్స్, బల్క్ కనెక్షన్లు, ఎర్రగడ్డ, ఎస్.ఆర్. నగర్, అమీర్ పేట్, కేపీహెచ్ బీ కాలనీ, కూకట్ పల్లి, భాగ్యనగర్ కాలనీ ప్రగతి నగర్ ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

నిమ్స్‌లో రోగులకు అత్యాధునిక సదుపాయాలు



– క్రానిక్ మైలాయిడ్ ల్యూకేమియా డే వేడుకల్లో ప్రొ.బీరప్ప

లక్డీకాపూల్: రోగుల కోసం నిమ్స్ ఎల్లప్పుడూ అత్యాధునిక వైద్య సదుపాయాలను అందిస్తోందని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. సోమవారం ఆస్పత్రిలో 'క్రానిక్ మైలాయిడ్ ల్యూకేమియా (సీఎంఎల్) డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. దాదాపుగా 150 మందికిపైగా ల్యూకేమియా రోగులు పాల్గొన్న అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోగులు, వారి కుటుంబసభ్యులు, వైద్య సిబ్బంది కలిసి ముందుకు సాగితేనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు వైద్యరంగానికే కాకుండా సమాజానికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. నిమ్స్ పరిశోధన, శిక్షణ, చికిత్స రంగాల్లో ఎల్లప్పుడూ ముందంజలో ఉందని చెప్పడానికి గర్వపడుతున్నామని చెప్పారు. సమాజంలో సీఎంఎల్‌పై అవగాహన పెంపొందించడం అవసరమని మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సదాశివుడు గుండేటి అన్నారు. మాక్స్ ఫౌండేషన్ సహకారంతో రోగులకు ఉచితంగా ప్రాణరక్షక ఔషధాలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సీఎంఎల్ పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక లఘు చిత్రాలను ప్రదర్శించారు. మెడికల్ అంకాలజీ అడిషనల్ ప్రొఫెసర్ డా. మెహెర్ లక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్ డా.రచన చెన్నమనేని, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డా.శాంతవీర్ ఉప్పిన్, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ డా. ఉప్పలపాటి శ్రీహరి, మెడికల్ సూపరింటెండెంట్ డా. నిమ్మ సత్యనారాయణ, మాక్స్ ఫౌండేషన్ ప్రతినిధులు ఊర్వశి నేగి, ప్రియాంక కుబుల్, పీజీ విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

దాండియాకు హిందువులనే ఆహ్వానించాలి: రాజాసింగ్

సాక్షి, సిటీబ్యూరో: దాండియా ఆటలకు హిందువులను మాత్రమే ఆహ్వానించాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. నవరాత్రులంటే హిందువులకు ఎంతో పవిత్రమైనవని, వేరే వాళ్లను అనుమతిస్తే లవ్ జిహాద్ పేరుతో హిందూ మహిళలను టార్గెట్ చేస్తారన్నారు. గత ఏడాది దాండియా కార్యక్రమంలో తమ కార్యకర్తలపై దాడులు జరిగాయని తెలిపారు. రాయదుర్గం పీఎస్ పరిధిలో ఈ నెల 27న ఈవెంట్ నిర్వహిస్తున్నారని, అది హిందువులను ట్రాప్ చేయడానికి కాదా అని ఆయన ప్రశ్నించారు. నిర్వాహకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని పోలీసు కమిషనర్‌ను కోరారు.

ఖైదీల రక్షణపై శిక్షణ


శిక్షణకు హాజరైన అధికారులతో డీజీ సౌమ్య మిశ్రా

చంచల్‌గూడ: రాష్ట్ర జైళ్ల శాఖ, ఢిల్లీలోని బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ డెవలప్‌మెంట్(బీపీఆర్ అండ్ డీ) సంస్థ సంయుక్తంగా చంచల్‌గూడలోని జైళ్ల శాఖ శిక్షణా సంస్థ సీకా కార్యాలయంలో నిర్వహించిన 'కస్టడీ ఆఫ్ ప్రిజినర్స్ అండ్ సెర్చ్ ప్రొసీడ్యూర్'శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, గోవా, మధ్యప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, ఢిల్లీ, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల జైలు అధికారులు 23 మంది శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణ ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ ఈ శిక్షణ అధికారులపై మరింత బాధ్యత పెంచుతుందన్నారు. ఖైదీలతో వ్యవహరించాల్సిన తీరు, వారి ప్రవర్తనపై అధికారులకు అవగాహన ఉండాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఐజీ మురళిబాబు, సీకా ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు భాగస్వాములు కావాలి

ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేయాలని మంత్రి పొన్నం పిలుపు


టీవర్క్స్‌లో సస్టెయినబిలిటీ మొబైల్ వాహన యంత్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రాయదుర్గం: ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యమైతేనే అవి విజయవంతం అవుతాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని 'టీ వర్క్స్'లో స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా ప్రపంచంలోనే మొదటి మొబైల్ వాహనంగా రూపొందించిన 'స్విట్చ్‌కో, సస్టెనబిలిటీ ఆన్ వీల్స్'యంత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన ఆ యంత్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలు చేసే వారికి తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా చేసే ప్రతి ప్రయత్నానికి అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతంలో వినూత్న ఆలోచనతో అక్షయ్, మూర్తి కలిసి ఈ రకమైన మొబైల్ వాహనాన్ని రూపొందించడం, అందుకు 18 స్టార్టప్‌ల సహకారం అందించడం ఆనందంగా ఉందన్నారు. తమ నియోజకవర్గం అంతటా దీన్ని వినియోగించేలా చేస్తామని, ఇందుకు మహిళలకు అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీ హబ్ ఉపాధ్యక్షుడు ఎస్‌బీఎంజీ సురేష్ బాబు, సిద్దిపేట డీఆర్‌డీఓ అధికారి శ్రీనివాస్ తాలుకా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జయదేవ్, పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్, స్విట్చ్‌కో సీఈఓ అక్షయ్ దేశ్‌పాండే, కో పార్టనర్ శ్రీనివాసమూర్తి, స్విట్చ్‌కో ప్రతినిధులు అషుతోష్ పట్వర్ధన్, దిలీప్ రాథోడ్, నాగరాజు యాదవ్, విష్ణు, శ్రీమంత్ కులకర్ణి, పివి ఆకాన్ష్, ప్రియ పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులకే మార్కెట్‌లో విలువ

– మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


సదస్సుకు హాజరైన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో నిర్వాహకులు

అమీర్‌పేట: ప్రజానీకానికి నాణ్యమైన ఉత్పత్తులు అందించినప్పుడే విశ్వసనీయత, పోటీ శక్తి, అంతర్జాతీయ మార్కెట్ విలువ లభిస్తుందని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో 39వ చాప్టర్ కన్వెన్షన్, క్వాలిటీ, కాన్సెప్ట్ అనే అంశంపై అమీర్‌పేట మ్యారీగోల్డ్ హోటల్‌లో సోమవారం నిర్వహించిన సదస్సుకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిజిటలైజేషన్, రియల్ టైమ్ మానిటరింగ్‌తోపాటు ఆటోమేషన్‌లో పెట్టుబడులు పెడుతుందని తెలిపారు. ఈ ప్రయత్నాలతో క్వాలిటీ, ప్రొడక్టివిటీ, దేశ అభివృద్ధికి బలమైన పునాదిగా మారే భవిష్యత్తుకు దారి తీస్తాయని చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పారిశ్రామిక వేత్తలకు ఉత్తమ్ మెమెంటోలు ప్రదానం చేశారు.

పేదల ఇళ్లు కూల్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాగంటి సునీత

– బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రహమత్ నగర్ : కాంగ్రెస్ పార్టీ సంవత్సర పాలనలో పేదల నివాసాలు కూల్చడం తప్ప, ప్రజలకు చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఓట్లతో బుద్ధి చెప్పాలని ఆయన పిలుపు నిచ్చారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన బోరబండ డివిజన్ బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతూ శంకుస్థాపనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గొప్ప వారి నివాసాలకు వెళ్లకుండా హైడ్రా అధికారులు పేదల ఇళ్లను కూల్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో నాలుగోసారి బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు శ్రమించాలని సూచించారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, దివంగత జూబ్లీహిల్స్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత, నాయకులు సుహైల్, కృష్ణమోహన్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మైనార్టీ విద్యాసంస్థల పనితీరు భేష్

– స్పష్టం చేసిన ఎంప్లాయీస్ అసోసియేషన్



సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అసాధారణ అభివృద్ధి, అద్భుతమైన పనితీరును కనబరుస్తున్నాయని మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ మోహిస్సిన్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ రేష్మా హుస్సేన్, జాయింట్ సెక్రటరీ జమీల్ అహ్మద్ అన్నారు. సోమవారంమీడియా ప్లస్ ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ఫలితాలు, అభివృద్ధి కొన్ని స్వార్థపరశక్తులకు ఇబ్బందికరంగా మారాయని, విద్యను వ్యాపారంగా మార్చుకున్న కొందరి ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని అన్నారు. 2025లో ఈ విద్యాసంస్థలకు చెందిన 20 మంది నీట్‌లో విజయం సాధించి ఉచిత మెడికల్ సీట్లకు అర్హత సాధించారని, బీడీఎస్‌లో ఆరుగురు, బీవీఎస్సీలో ఐదుగురు అర్హత పొందారని తెలిపారు. ఇప్పటివరకు 104 మంది విద్యార్థులు మెరిట్ ప్రాతిపదికన వివిధ కోర్సుల్లో ఉచిత సీట్లు పొందారని తెలిపారు. గత ఏడాది 33 మంది ప్రొఫెషనల్ కోర్సుల్లో విజయం సాధించగా, ఈ ఏడాది ఆ సంఖ్య 39కి పెరిగిందని పేర్కొన్నారు. 204 పాఠశాలల నుంచి ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో ప్రత్యేక కోచింగ్ అందిస్తున్నారని తెలిపారు. సంస్థ విజయంలో ఉద్యోగుల కృషి కీలకమని పేర్కొన్నారు. ఈ సంస్థలు మైనారిటీ వర్గాల ఉజ్వల భవిష్యత్తుకు అహర్నిశలు కృషి చేస్తున్నాయన్నారు. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసేవిధంగా దుష్ప్రచారాలు చేయడం తగదని పేర్కొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం వీడియో కాన్ఫరెన్స్

– పాల్గొన్న కలెక్టర్ మనుచౌదరి

సాక్షి,మేడ్చల్ జిల్లా : రాష్ట్రంలో పెండింగ్ ఉన్న నేషనల్ హైవేలు, రీజినల్ రింగ్ రోడ్డు అంశాలపై సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మేడ్చల్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, ఇతర అధికారులు పాల్గొన్నారు. సచివాలయంలో జరిగిన సమీక్షలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్టోబరు నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, కోర్టు పరిధిలో ఉన్న భూసమస్యల వివరాలను ఉన్నతాధికారులకు అందించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం కలెక్టర్లను ఆదేశించారు.

ఉత్తమ పీపీపీ ప్రాజెక్టుగా ఎల్‌అండ్‌టీ మెట్రో



సాక్షి, సిటీబ్యూరో: ఎల్ అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ ఈ ఏడాది ఉత్తమ పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య(పీపీపీ) ప్రాజెక్టుగా అవార్డును అందుకుంది. ఈ నెల 19వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన ఈటీ నౌ ఇన్‌ఫ్రా ఫోకస్ సమ్మిట్–2025 కార్యక్రమంలో ఈ ఏడాది ఉత్తమ పీపీపీ ప్రాజెక్టుగా ఎడిటోరియల్ చాయిస్ అవార్డును హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ కేవీబీ రెడ్డికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన పీపీపీ ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రోను అభినందించారు. ఈ సెప్టెంబర్‌లోనే మరో రెండు ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు కూడా హైదరాబాద్ మెట్రోరైల్‌కు లభించాయి. 18వ తేదీన జరిగిన కార్యక్రమంలో సీఐఐ 26వ జాతీయ అవార్డును ఎల్‌అండ్‌టీ మెట్రో దక్కించుకుంది. విద్యుత్ వినియోగంలో ఉత్తమ ఫలితాలను సాధించిన మొట్టమొదటి భారతీయ మెట్రోరైల్‌గా ఈ అవార్డు లభించడం విశేషం. సీఐఐ 53వ జాతీయ కైజాన్ పోటీల్లో ప్లాటినం అవార్డు లభించింది. ఒకే నెలలో మూడు జాతీయ స్థాయి అవార్డులను అందుకోవడం ఎంతో గర్వంగా ఉందని ఎల్‌అండ్‌టీ మెట్రో రైల్ ఎండీ కేవీబీ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, మంగళవారం, 23, సెప్టెంబర్, 2025



'ఆరో రియాలిటీ'లో బతుకమ్మ..

నగరంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా హైటెక్ సిటీలోని కోహినూర్ ఆరో రియాలిటీ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. పలువురు ఔత్సాహిక మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– సాక్షి, సిటీబ్యూరో



పికిల్ బాల్ లీగ్‌లో కిదాంబి శ్రీకాంత్..

- లీగ్‌లో నంది ఛార్జర్స్ జట్టులో భాగస్వామిగా
- ప్రత్యేక ఆకర్షణగా మాజీ ప్రపంచ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు

సాక్షి, సిటీబ్యూరో: భారత ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, పురుషుల మాజీ సింగిల్స్ ప్రపంచ నంబర్ వన్ కిదాంబి శ్రీకాంత్ అధికారికంగా హైదరాబాద్ పికిల్‌బాల్ లీగ్ (హెచ్‌పీఎల్)లో పెట్టుబడిదారుడిగా, భాగస్వామిగా మారారు. హైదరాబాద్ పికిల్‌బాల్ లీగ్‌లో భాగంగా నంది ఛార్జర్స్ ఫ్రాంచైజీలో కిదాంబి చేరారు. ఈ అక్టోబర్‌లో హైదరాబాద్‌లో ప్రారంభం కానున్న పికిల్‌బాల్ లీగ్‌కు కిదాంబి భాగస్వామ్యం మరింత క్రీడా ప్రమాణాలను తీసుకొస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. నంది ఛార్జర్స్ జట్టుతో కలసి చాంపియన్ల ఆలోచనను, పోటీ స్ఫూర్తిని పికిల్‌బాల్‌లోకి తీసుకురావడం అభినందనీయమని నంది ఛార్జర్స్ ఫ్రాంచైజీ యజమాని అనిరుధ్ పొన్నాల తెలిపారు. గ్లోబల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల్లో ఒకరిగా కిదాంబి స్థాయి తమ జట్టుకు ప్రోత్సాహాన్ని, ఆత్మ స్థైర్యాన్ని అందిస్తుందని వివరించారు. హైదరాబాద్ పికిల్‌బాల్ లీగ్‌లో ఎనిమిది ఫ్రాంచైజీ జట్లు ఉన్నాయి. అక్టోబర్ 10 నుంచి నవంబర్ 28 వరకు ప్రతి శుక్రవారం రాత్రి మ్యాచ్‌లు జరుగనున్నాయి.

లీగ్ ప్రాముఖ్యతను పెంచుతోంది..

హైదరాబాద్ పికిల్‌బాల్ లీగ్‌లో భాగం కావడం, నంది ఛార్జర్స్‌తో చేతులు కలపడం సంతోషంగా ఉంది. పికిల్‌బాల్ వేగంగా, డైనమిక్‌గా ఉంటుంది. దేశంలోని అభిమానులతో అనుసంధానం అవడానికి కావాల్సినవన్నీ ఇందులో ఉన్నాయి. ఈ గేమ్ అందరికీ అందుబాటులో ఉంటుంది. చూడటానికి థ్రిల్లింగ్‌గా, పోటీతత్వంతో ఉంటుంది. నా క్రీడా అనుభవం ఒక కొత్త రంగంలోకి తీసుకువచ్చి, ఈ లీగ్ ప్రాముఖ్యతను పెంచడానికి సహాయ పడుతుంది.

– కిదాంబి శ్రీకాంత్, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు

నేటి నుంచి గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ టోర్నీ


గోల్కొండ: ప్రపంచ గోల్ఫ్ టోర్నమెంట్లలో తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ ప్రత్యేకమైన స్థానం పొందిందని ప్రొఫెషనల్ గోల్ఫ్ టోర్నమెంట్ ఆఫ్ ఇండియా సీఈవో అమన్‌దీప్ జోషి అన్నారు. మంగళవారం నుంచి జరిగే తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ టోర్నమెంట్ 11వ ఎడిషన్‌పై సోమవారం గోల్కొండలోని గోల్ఫ్ కోర్సులో మీడియాతో ఆయన మాట్లాడారు. ఈసారి గోల్కొండ మాస్టర్స్ ప్రైజ్‌మనీని కోటి రూపాయలుగా నిర్ణయించినట్లు చెప్పారు. ఈసారి సైతం చెక్ రిపబ్లిక్‌కు చెందిన స్టెపాన్ డానెక్, శ్రీలంకకు చెందిన తంకరాజతోపాటు ఇటలీ, బంగ్లాదేశ్, ఉగాండ, నేపాల్ తదితర దేశాలకు చెందిన మేటి గోల్ఫర్లు పోటీల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ టోర్నమెంట్ నిర్వహణకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తోందని చెప్పారు. హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ కెప్టెన్ జస్వీందర్ సింగ్ బిర్గి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఈ టోర్నమెంట్‌ను నిర్వహించడం ఎంతో గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో గోల్ఫ్ క్రీడాకారులు స్టెపాన్ డానెక్, తంగరాజ తదితరులు పాల్గొన్నారు.





జర్మనీ దేశం గురించి తెలియని సిటి జనులు ఉంటారేమో కానీ అక్టోబర్ ఫెస్ట్ గురించి తెలియని పార్టీ ప్రియులు ఉండరు. సెప్టెంబర్ నెలాఖరులో మొదలై అక్టోబరు తొలివారం వరకూ జరిగే ఈ వార్షిక ఈవెంట్‌ను అంతర్జాతీయంగా అక్టో బీరు ఫెస్ట్ అని కూడా బీర్ లవర్స్ ముద్దుగా పిలుచుకుంటారు. ఇంటర్నేషనల్ ఇష్టాలన్నింటినీ ఒడుపుగా ఒడిసిపట్టుకుంటున్న నగర పార్టీ సంస్కృతిలో ఈ పండుగ కూడా కలగలిసిపోయింది.

– సాక్షి, సిటీబ్యూరో



జర్మన్ ఫెస్ట్.. జాయ్ మస్ట్..

నగరంలో జర్మనీ రుచుల సందడి షురూ

- ప్రపంచవ్యాప్తంగా పేరొందిన బీర్ వేడుక
- లక్షల సంఖ్యలో ఔత్సాహికుల భాగస్వామ్యం
- వార్షిక సంప్రదాయంగా మారిన అక్టోబర్ ఫెస్ట్
- జర్మన్ వంటకాలతో పసందైన విందు, వినోదం
- బవేరియన్-శైలి దుస్తులతో యువత హడావుడి
- సిటీ పార్టీలకు పక్షం రోజుల పాటు బీర్ ఫీవర్

జర్మనీ దేశపు సంప్రదాయ బీరోత్సవం ఈ అక్టోబరు ఫెస్ట్. బీర్ ప్రియులకు హుషారెత్తించే ఈవెంట్లతో జర్మనీ రాజధాని నగరమైన మ్యునిచ్‌లో దీనిని భారీ ఎత్తున నిర్వహిస్తారు. ప్రపంచవ్యాప్తంగా లక్షల సంఖ్యలో బీర్ లవర్స్ ఈ కార్యక్రమానికి హాజరవుతారు. స్పెయిన్‌లో జరిగే టమాటినా ఫెస్ట్ లాగే జర్మనీలో జరిగే ఈ వేడుక కూడా బాగా పాపులర్.

క్రేజీ.. ఈవెంట్..

'మద్యపాన ప్రియులందు బీరు పాన ప్రియులు వేరయా' అంటారు కొందరు. నిజానికి మందుబాబుల్లో ఆల్కహాల్ శాతం తక్కువగా ఉండే బీరును ఇష్టపడేవారు తక్కువే. అదే సమయంలో 'బీర్బ'ల్‌లు అనిపించుకునే చాలా మంది దీన్ని ఒక మత్తుని అందించే డ్రింక్‌లా కాక కాలక్షేపపు పానీయంలా భావిస్తారు. అయితే మత్తు కోసం స్ట్రాంగ్ బీర్లు గటగటా లాగించే వారిని పక్కన పెడితే.. కాఫీషాప్‌లు, కెఫేల తరహాలో నగరంలో వీటి తయారీకి సేవనానికి ప్రత్యేక బ్రూవరీలు సైతం ఉన్న నేపథ్యంలో అక్టోబర్ ఫెస్ట్ మరింత క్రేజీగా మారుతోంది.





నగరంలో సందడి షురూ..

ఈ ఫెస్ట్ సందర్భంగా నగరంలోని హోటళ్లు, పబ్స్, కేఫ్‌లు, రెస్టారెంట్స్.. జర్మన్ వంటకాలతో పాటు బీర్‌తో కూడిన ప్రత్యేక మెనూ అందిస్తాయి. ఈ కార్యక్రమాలు సంప్రదాయ జర్మన్ రుచికరమైన వంటకాలు, సంగీతం, సాంస్కృతిక కార్యక్రమాలతో బవేరియన్ వాతావరణాన్ని పునఃసృష్టిస్తాయి. స్థానికులు మ్యూనిచ్‌కు ప్రయాణించకుండానే ప్రపంచంలోనే అతిపెద్ద బీర్ పండుగను ఆస్వాదించిన అనుభూతిని అందిస్తున్నాయి. బ్రాట్‌వ్రాస్ట్, సౌర్‌క్రాట్, ష్నిట్జెల్ బవేరియన్ క్రీమ్ వంటి జర్మన్ వంటకాలతో ప్రత్యేక మెనూ రూపొందిస్తాయి. ఈ ఈవెంట్‌లలో లైవ్ జర్మన్ మ్యూజిక్ కూడా ఉంటుంది. సంప్రదాయ జానపద సంగీతం కొన్ని సార్లు బవేరియన్-శైలి దుస్తులు ఉంటాయి. మద్యపానం అలవాటు లేనివారికి ఇక్కడ సాఫ్ట్, ఎనర్జీ డ్రింక్స్ కూడా రెడీగా ఉంటాయి. అదిరిపోయే డీజే మ్యూజిక్ కిక్ ఎలాగూ ఉంటుంది. వీటికి తోడుగా రకరకాల కాంటెస్ట్‌లు, సరదా గేమ్స్, క్విజ్ వంటివి యూత్‌కి ఎంజాయ్‌మెంట్ ఇస్తాయి. ఇక ఫైర్‌తో, బాటిల్స్‌తో రకరకాల విన్యాసాలు చేసే జగ్లర్స్, నృత్యాలతో అదరగొట్టే డ్యాన్స్ ట్రూప్స్.. వగైరా చిల్డ్ డ్రింక్స్‌కి ఛీర్స్ చెబుతాయి. 'బీర్ మాత్రమే కాదు ఫుడ్‌ని, విందు వినోదాలను కోరుకునే యూత్ కోసం ఈ ఈవెంట్ నిర్వహిస్తున్నాం. మా అక్టోబర్ ఫెస్ట్ వినోదప్రియులు ఎవరినీ నిరాశపరచదు' అని ఆరెంజ్ బైస్కిల్ ఎండీ భవ్యగవర చెప్పారు. ఈ వేడుక కోసం నగరం నుంచి జర్మనీ వరకూ రాకపోకలు సాగించే పార్టీ ప్రేమికులు కూడా ఉన్నారంటే నమ్మక తప్పదు.

సాంస్కృతిక ఉత్సవం..

అక్టోబర్ ఫెస్ట్ అనేది జర్మన్ దేశపు సంస్కృతిలో ఒక భాగం. ఈ వేడుకలో బీర్ ప్రధానమైన అంశమే అయినప్పటికీ విభిన్న రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. నగరంలో గత కొంత కాలంగా ఈ ఫెస్ట్‌ను చాలా ఇష్టంగా ఆదరిస్తున్నారు. మా సంస్థ ఆధ్వర్యంలో కూడా ఏటా ఈ ఫెస్ట్‌ను ఒక రోజు ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థులతో పాటు అన్ని వర్గాల వారి కోసం ఈ ఏడాది అక్టోబర్ మొదటి వారంలో నిర్వహించనున్నాం.

– సందీప్, గోతె జంత్రమ్ (జర్మన్ కల్చరల్ సెంటర్)

జర్మనీలో మొదలైంది..

- సెంట్రల్ మ్యూనిచ్‌లోని థెరిసియన్ వైస్ ఫెయిర్ గ్రౌండ్‌లో గత శనివారం అక్టోబర్ ఫెస్ట్ మ్యునిచ్ నగర మేయర్ ఘనంగా ప్రారంభించారు.
- దీనిని ప్రపంచంలోనే అతిపెద్ద బీర్ ఉత్సవంగానే కాదు జానపద కళల ఉత్సవంగా పిలుస్తారు.
- ఇది పేరుకు భిన్నంగా, అక్టోబర్ ఫెస్ట్ ఎల్లప్పుడూ సెప్టెంబర్‌లో ప్రారంభమవుతుంది. సాధారణంగా సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 5 వరకు జరుగుతుంది.
- జర్మనీ దేశపు ఈ ప్రధాన పర్యాటక కార్యక్రమం ప్రస్తుతం 190వ సారి జరుగుతోంది. ఈ ఏడాది కనీసం 6 మిలియన్ల మంది సందర్శకులు వస్తారని అంచనా. అయితే 2023లో ఎప్పుడూ లేని విధంగా 7.2 మిలియన్ల మంది హాజరుకావడం ఓ రికార్డ్. ఈ సందర్భంగా వీరు సేవించిన బీరు మొత్తం పరిమాణం 1.95 మిలియన్ గ్యాలన్లు.
- ఈ సంవత్సరం ఫెస్ట్‌లో బీర్ ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. సుమారు 15 యూరోల నుంచి 17 యూరోల మధ్య అంటే మన రూపాయలలో చెప్పాలంటే రూ.1500పైనే..
- ఈ ఫెస్ట్‌లో భాగంగా పలువురు వ్యాపారులు టెంట్స్ ఏర్పాటు చేస్తారు. ఆయా టెంట్స్ అందించే ప్యాకేజీల్లో సందర్శకులు బీరు తాగడంతో పాటు, వినోద యాత్రలకు వెళ్లవచ్చు.



- గత శనివారం ప్రారంభమైన ఈ ఫెస్ట్ కోసం సందర్శకులు తెల్లవారుఝాము నుంచే క్యూ కట్టారంటే ఈ పండుగ ఎంత పాపులర్ అనేది అర్థమవుతుంది.

వయసులకు అతీతం.. ఆధ్యాత్మిక పర్యాటకం..

- తీర్థయాత్రల పట్ల పెరుగుతున్న ఆసక్తి
- మేక్ మై ట్రిప్ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: నగరవాసుల్లో తీర్థయాత్రల ఆసక్తి ఏ ప్రతి యేటా పెరుగుతోంది. విశేషం ఏమిటంటే ఈ ఆసక్తి వయసులకు అతీతంగా వ్యక్తమవుతోంది. నగరంతో పాటు దేశవ్యాప్తంగా తీర్థయాత్ర ధోరణులపై ప్రముఖ టూర్ ఆపరేటర్ మేక్‌మైట్రిప్ అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది. అత్యధిక శాతం మంది చేసిన యాత్రల్లో.. ప్రయాగ్‌రాజ్ (ఉత్తరప్రదేశ్), వారణాసి (ఉత్తరప్రదేశ్), అయోధ్య (ఉత్తరప్రదేశ్), పూరి (ఒడిశా), అమృత్‌సర్ (పంజాబ్), తిరుపతి (ఆంధ్రప్రదేశ్) వంటివి ఉన్నాయి. ఇదే సమయంలో ఖాటూశ్యామ్ జీ (రాజస్థాన్), ఓంకారేశ్వర్ (మధ్యప్రదేశ్), తిరుచెందూర్ (తమిళనాడు) వంటి మరి కొన్ని కూడా తీర్థయాత్రల గమ్యస్థానాలుగా వృద్ధిని నమోదు చేస్తున్నాయి.

వయసులకు అతీతంగా..

అన్ని వయసుల, ఆదాయ వర్గాలకు చెందిన భారతీయులు ఈ తరహా తీర్థయాత్రల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. విహార యాత్రకు వెళ్లేవారిలో కుటుంబాలు, స్నేహితుల సమూహాలుగా వెళ్లేవారు 38.9% మంది కాగా తీర్థయాత్రకు అలా బృందాలుగా వెళ్లేవారు 47% మంది ఉన్నారని ఈ అధ్యయనం వెల్లడించింది.





ఫ్లిప్ సైడ్ వేదికగా దాండియా మస్తీ

- అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహణ
- వినూత్నంగా విజేతలకు వెండి నాణాలు

సాక్షి , సిటీబ్యూరో: లైవ్ ఢోల్, లైవ్ డీజే ప్రదర్శనలతో ఈ సారి 'దాండియా మస్తీ–2025' నగర వాసులను సందడి చేస్తోంది.. జాంటీ హ్యాట్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నానకరాంగూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఫ్లిప్ సైడ్ వేదికగా దాండియా వేడుకలు సోమవారం ప్రారంభమయ్యింది. హైదరాబాద్ బిగ్గెస్ట్ దాండియా నైట్స్, డాన్స్ లైక్ నెవర్ బిఫోర్ అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. జాంటీ హ్యాట్ ఈవెంట్స్ వ్యవస్థాపకురాలు దీపికా బాజీ రెడ్డి, నటి అరియానా గ్లోరీ, నటుడు రామ్ కార్తిక్, డీజే కిమ్, డీజే ఫ్లోజా, డీజే వినీష్, డీజే రిషి, డీజే హరీష్, డీజే వివాన్ ఇందులో భాగస్వామ్యమయ్యారు. దాండియా మస్తీ 2025లో ప్రత్యేక ఆకర్షణలుగా లైవ్ ఢోల్, లైవ్ డీజే ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. సినీ ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ భాగస్వాములుకానున్నారు. గర్బా మ్యూజిక్, బాలీవుడ్ ట్విస్ట్, స్టేజ్ సెటప్, థీమ్ డెకర్, స్పెషల్ లైటింగ్ ఎఫెక్ట్స్, ఓపెన్ అరేనాతో పాటు లైవ్ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు దీపికా బాజీ రెడ్డి తెలిపారు. ప్రతిరోజూ బెస్ట్ డ్రెస్, బెస్ట్ డ్యాన్సర్ విజేతలకు సిల్వర్ కాయిన్స్ బహుమతులు, పిల్లలకు ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నారు. మహిళలకు 1+1 టికెట్ ఆఫర్లు అందుబాటులో ఉన్నాయి. దాండియా మస్తీ టికెట్లు బుక్ మై షో, 95533 06329, 77023 99188, 97040 0162 నంబర్లలో పొందవచ్చు.



మనదేశంలో దుస్తుల వినియోగంతోపాటు.. వ్యర్థాలూ పెరిగిపోయాయి. సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ (సీఎస్‌టీఈపీ) నివేదిక ప్రకారం.. ప్రపంచ వాణిజ్యంలో కీలకపాత్ర పోషిస్తున్న వస్త్ర పరిశ్రమ కాలుష్యకారక పరిశ్రమల్లోనూ ఒకటిగానూ ఎదిగింది! ఏటా ప్రపంచ వ్యాప్తంగా 9.2 కోట్ల టన్నుల టెక్స్‌టైల్ వ్యర్థాలు పోగుపడుతున్నాయి. వీటిలో కేవలం 12-15 శాతం మాత్రమే రీసైక్లింగ్‌కు వెళ్తున్నాయి. వాటిలో కూడా ఒక శాతమే కొత్త దుస్తులుగా రీసైకిల్ అవుతున్నాయి. మనదేశంలోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు.

- సాక్షి, స్పెషల్ డెస్క్



వస్త్రం.. వ్యర్థం కారాదు

ఓ 15-20 ఏళ్ల కిందటి మాట...
ఒక కుటుంబం సంక్రాంతి లేదా దసరాకి కొత్త బట్టలు కొనేవారు లేదా కుట్టించుకునేవారు. మళ్లీ కొత్త బట్టలు అంటే పుట్టినరోజుకే. వాటిని కూడా ఎంతో అపురూపంగా వాడేవారు.

కానీ ఇప్పుడు...
ప్రతి పండుగకూ షాపింగ్. వారాంతాల్లో షాపింగ్. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటివి బిగ్ సేల్ పెడితే షాపింగ్. బోరు కొడితే షాపింగ్. ఫాస్ట్ ఫ్యాషన్, అల్ట్రా ఫాస్ట్ ఫ్యాషన్ వంటి ధోరణుల వల్ల.. తక్కువ ధరలో లేటెస్ట్ ఫ్యాషన్లు, వాటి నకళ్లు ఉన్న దుస్తులు మార్కెట్లోకి వెల్లువెత్తుతున్నాయి. సహజంగానే ఇవి అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. సమస్య కొనడంతోకాదు.. ఎక్కువగా కొనడం, ఎక్కువ కాలం వాటిని వాడకపోవడం వల్ల వస్తోంది!

వస్త్ర వ్యర్థాలు
సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ (సీఎస్‌టీఈపీ) అధ్యయనం ప్రకారం.. దేశంలో పొడి మునిసిపల్ ఘన వ్యర్థాల్లో ప్లాస్టిక్, నిర్మాణ వ్యర్థాల తరవాత మూడో స్థానాన్ని ఆక్రమించింది టెక్స్‌టైల్ రంగమే. ఏటా దీని ద్వారా ఉత్పత్తవుతున్న వ్యర్థాలు సుమారు 7,800 కిలో టన్నులు.

ప్రపంచ కర్బన ఉద్గారాల్లో ఫ్యాషన్ ఉత్పత్తుల వాటా దాదాపు 10 శాతం. యూరోపియన్ యూనియన్ మొత్తం ఉద్గారాల కంటే ఇది ఎక్కువ.

మనదేశంలో సగటున ఒక వ్యక్తి వల్ల ఏటా 5 కిలోల వస్త్ర వ్యర్థాలు ఉత్పన్నమవుతున్నాయి.

దేశంలో ఏటా 7,800 కిలో టన్నుల వ్యర్థాలు
భారతీయుల తలసరి వస్త్ర వ్యర్థాలు 5 కిలోలు
రీసైక్లింగ్, పునర్వినియోగం వాటా చాలా తక్కువ
వృథా అరికడితేనే కాలుష్య నియంత్రణ సాధ్యం

కాటన్ టీషర్టు.. జీన్స్ ప్యాంటు
ఒక కాటన్ టీ షర్ట్ మన ఒంటిమీదకు రావాలంటే.. సుమారు 2,700 లీటర్ల నీరు ఖర్చవుతుంది. అంటే సగటు మనిషి సుమారు 90 సార్లు స్నానం చేయొచ్చన్నమాట. ఒక జీన్స్ ప్యాంట్ తయారీకి 7,600 లీటర్ల నీళ్లు కావాలి.



4.5 కోట్ల మంది
దేశంలో టెక్స్‌టైల్ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నవారు సుమారు 4.5 కోట్లమంది. పరోక్షంగా మరో 10 కోట్లకు పైగా ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. జీడీపీలో ఈ రంగ వాటా 2.3 శాతం.

వినిమయం తర్వాతే ఎక్కువ
ఫ్యాషన్ రంగంలో వినూత్న ఆవిష్కరణలు ప్రోత్సహించేందుకు పనిచేసే 'ఫ్యాషన్ ఫర్ గుడ్' 2022 నివేదిక ప్రకారం.. టెక్స్‌టైల్ వ్యర్థాలు 3 రకాలు.

తయారీ సమయంలో వచ్చేది	వినిమయం తరవాత వచ్చేది
42%	51%
దిగుమతులు 7%	

రీసైక్లింగ్ తక్కువే



ప్రస్తుతం మనదేశంలోని టెక్స్‌టైల్ వ్యర్థాల్లో 59 శాతం పునర్వినియోగం, రీసైక్లింగ్ వంటి ప్రక్రియల ద్వారా మళ్లీ పరిశ్రమకు చేరుతున్నాయి. ఇందులో 34 శాతాన్ని మరమ్మతులు చేసి, కొత్త ఉత్పత్తులుగా మారుస్తున్నారు. కేవలం 25 శాతమే దారాలుగా రీసైకిల్ అవుతోంది. మిగతా 41 శాతంలో.. 5 శాతాన్ని ఇటుక బట్టీలు, బాయిలర్లలో కాల్చేందుకు వినియోగిస్తున్నారు. 17 శాతం వ్యర్థాల్లో చేరుతోంది. 19 శాతం.. తక్కువ విలువ, నాణ్యత గల వస్తువులుగా రూపాంతరం చెందుతోంది.

ఏం చేయొచ్చు
దుస్తులు కొనేటప్పుడు.. ముఖ్యంగా పండుగ సీజన్లో ఒకటికి రెండుసార్లు ఆలోచించండి. ఎక్కువ కొనేసి తక్కువసార్లు వాడేసి పారేయకండి.

పాతవీ, చిరిగిపోయిన దుస్తులతో పాత సామాన్లు కొనొచ్చు. లేదంటే ఇంట్లోని పని వాళ్లకు లేదా చుట్టుపక్కల పేదలకు లేదా వాటిని సేకరించే ఎన్జీఓలకు ఇవ్వొచ్చు.

వాడేసిన, చిరిగిపోయిన జీన్స్ ప్యాంట్లు, టీషర్టులతో ఇంట్లోకి బొమ్మల్లాంటి రకరకాల అలంకరణ వస్తువులు తయారుచేయవచ్చు.

యూట్యూబ్, సోషల్ మీడియాలో ఇలాంటి విభిన్న డిజైన్లకు సంబంధించి బోలెడన్ని వీడియోలు ఉంటాయి. వాటిని చూసి సరికొత్త వస్తువులు రూపొందించవచ్చు.

చెప్పాలంటే.. ఇలా విభిన్నంగా వాడకాన్ని చెప్పేవి కూడా సరికొత్త వ్యాపార ఆలోచనలే. వీటితోనూ డబ్బు సంపాదించవచ్చు.

'మ్యాన్ మేడ్' ప్రమాదకరం



టెక్స్‌టైల్ ఫైబర్లు రెండు రకాలు. ఒకటి.. సిల్కు, కాటన్ వంటి సహజ ఫైబర్లు, రెండోది పాలిస్టర్, నైలాన్ వంటి మ్యాన్ మేడ్ ఫైబర్లు (ఎమ్ఎమ్ఎఫ్). ఇంటర్నేషనల్ కాటన్ అడ్వైజరీ కమిటీ (ఐసీఏసీ) నివేదిక ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా చూస్తే 100లో 72 పాళ్లు ఎమ్ఎమ్ఎఫ్‌లే. వీటి ఉత్పత్తిలో చైనా, భారత్ తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. మన్నిక; మరకలు, ముడతలు పడకుండా ఉండటం, తయారీ వేగంగా, తక్కువ ధరతో చేయడం వంటి కారణాల వల్ల సింథటిక్ ఫైబర్ల వాడకం పెరుగుతోంది. కానీ ఇవి పర్యావరణానికి మంచివి కావు. మైక్రోప్లాస్టిక్స్‌ను విడుదల చేస్తాయి. దుస్తుల తయారీలో డైయింగ్ ప్రక్రియ, రంగురంగుల దుస్తుల నుంచి వచ్చే రసాయనాలు.. కాలుష్యానికి కారణమవుతాయి.



అమీర్‌పేటలో జలమయమైన ప్రధాన కూడలి



లక్డీకాపూల్‌లో స్తంభించిన ట్రాఫిక్

జల దిగ్బంధం... ట్రాఫిక్ చక్రబంధం

హైదరాబాద్‌పై వరుణ ప్రతాపం
- సాయంత్రం 4 నుంచి రాత్రి 10 వరకు జడివాన
- చెరువుల్లా మారిన రోడ్లు.. పలుచోట్ల కొట్టుకుపోయిన టూవీలర్లు
- గంటలకొద్దీ కి.మీ. మేర స్తంభించిన ట్రాఫిక్.. సీఎం కాన్వాయ్‌కూ తప్పని ట్రా'ఫికర్'
- సచివాలయం నుంచి జూబ్లీహిల్స్ వరకు కాన్వాయ్‌లో 13 నిమిషాల ప్రయాణానికి గంటంపావు సమయం
- బంజారాహిల్స్‌లో అత్యధికంగా 10.5 సెం.మీ. వర్షపాతం
- పలు జిల్లాల్లోనూ కుండపోత.. పిడుగుపాట్లకు ఇద్దరు మృతి

సాక్షి, హైదరాబాద్/సాక్షి, నెట్‌వర్క్: భాగ్యనగరాన్ని వరుణుడు బెంబేలెత్తించాడు. హోరు వానతో నగరాన్ని అతలాకుతలం చేశాడు. సోమవారం సాయంత్రం 4 గంటలకు ఉరుములు మెరుపులతో మొదలైన మేఘగర్జన రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోని బస్తీలు నీటమునిగాయి. పలు ప్రాంతాల్లో వరద ఉధృతికి రహదారుల పక్కన నిలిపిన వాహనాలు కొట్టుకుపోయాయి. ఓపెన్ నాలాలు, మ్యాన్‌హోల్స్ పొంగిపోర్లాయి. ఫలితంగా రోడ్లన్నీ చెరువులను తలపించడంతో ట్రాఫిక్ పూర్తిగా అస్తవ్యస్తమైంది. గంటలకొద్దీ, కిలోమీటర్ల మేర ఎక్కడికక్కడ వాహనాలు స్తంభించిపోయాయి. విజయవాడ, వరంగల్, ముంబై, బెంగళూరు, కరీంనగర్ వెళ్లే మార్గాల్లో ఇళ్లకు, ఆఫీసులకు బయలుదేరిన వాహనదారులు ముందుకు కదల్లేక నానా అవస్థలు పడ్డారు. ప్రధానంగా అసెంబ్లీ నుంచి ఖైరతాబాద్, మెహిదీపట్నం నుంచి మాసాబ్ ట్యాంక్, ఎల్బీ నగర్ నుంచి మలక్‌పేట వరకు కేవలం కిలోమీటర్ ప్రయాణానికి గంటలకొద్దీ సమయం పట్టింది. రాత్రి 10 గంటల వరకు అత్యధికంగా బంజారాహిల్స్‌లో సుమారు 10.5 సెం.మీ. వర్షం కురవగా శ్రీనగర్ కాలనీలో 9.9 సెం.మీ., ఖైరతాబాద్‌లో 8.9 సెం.మీ. వర్షం కురిసింది. శ్రీనగర్, ఖైరతాబాద్, మైత్రివనం, యూసుఫ్‌గూడ, వనస్థలిపురం, హయత్‌నగర్, బహదూర్‌పురా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఇక నగరు శివారు ప్రాంతాల్లోనూ వర్షం దంచికొట్టింది. తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి ఇంజాపూర్–తొర్రూర్ మార్గంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు వరదలో చిక్కుకున్నారు. మున్సిపల్ సిబ్బంది అతికష్టం మీద వారిని కాపాడారు. వరదలో కొట్టుకుపోయిన కారు కొద్ది దూరంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు తగిలి ఆగిపోయింది.



కేబీఆర్ పార్కు చౌరస్తాలో నిలిచిపోయిన సీఎం కాన్వాయ్

సీఎం కాన్వాయ్‌కూ తప్పని ట్రాఫిక్ తిప్పలు..
కుండపోత వర్షంతో రోడ్లన్నీ జలమయం కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్ సైతం ట్రాఫిక్‌లో చిక్కుకొని నత్తనడకన ముందుకు సాగింది. సాయంత్రం 6:30 గంటలకు సీఎం సచివాలయం నుంచి జూబ్లీహిల్స్‌లోని తన ఇంటికి బయల్దేరగా ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ మీదుగా వీవీ స్టాచ్యూ వద్దకు రాగానే ఖైరతాబాద్ కూడలిలో ట్రాఫిక్ స్తంభించింది. అక్కడి నుంచి ఖైరతాబాద్, కేసీపీ జంక్షన్, ఎర్రమంజిల్ తాజ్ కృష్ణా, వెంగళరావు పార్కు, ఎన్ఎఫ్‌సీఎల్ చౌరస్తా, పంజగుట్ట శ్మశానవాటిక, టీవీ 9 మీదుగా సాగర్ సొసైటీ, కేబీఆర్ పార్కు చౌరస్తా వరకు కాన్వాయ్ ముందుకు కదిలేందుకు చాలా సమయం పట్టింది. సరిగ్గా 7:25 గంటలకు సీఎం కాన్వాయ్ కేబీఆర్ పార్కు చౌరస్తాలో ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. కేబీఆర్ పార్కు చౌరస్తా నుంచి జూబ్లీహిల్స్ చౌరస్తాకు వెళ్లేందుకు 20 నిమిషాలు పట్టింది. జూబ్లీహిల్స్ చౌరస్తా నుంచి సీఎం ఇంటికి వెళ్లకుండా కేబుల్ బ్రిడ్జి మీదుగా మెడికవర్ ఆస్పత్రికి వెళ్లారు. సరిగ్గా 8 గంటలకు ఆయన మెడికవర్ ఆస్పత్రికి చేరుకున్నారు. వాస్తవానికి సచివాలయం నుంచి సీఎం నేరుగా తన ఇంటికి వెళ్లేందుకు 13 నిమిషాల సమయం పడుతుంది. కానీ సోమవారం సాయంత్రం ఆయన జూబ్లీహిల్స్ దాటడానికే గంటంపావు సమయం పట్టింది. అయితే తన కోసం వాహనదారులను ఇబ్బంది పెట్టొద్దని.. తాను ట్రాఫిక్‌లో ఇరుక్కున్నా పరవాలేదని పోలీసులను ఆదేశించిన సీఎం రేవంత్.. గంటన్నరపాటు స్తంభించిన ట్రాఫిక్‌లోనే మెల్లగా ముందుకు కదిలారు.

జిల్లాల్లోనూ జోరు వాన
వరంగల్, ములుగు, సిద్దిపేట జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో సోమవారం పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని చెల్పాక గ్రామంలో పొలం దున్నుతున్న రైతు ఊకే కృష్ణ (45) పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందగా మరో రైతు పూనెం చిట్టిబాబు గాయపడ్డాడు. అలాగే వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం చంద్రయ్యపల్లి గ్రామంలో పొలంలో మిరప నారు వేస్తుండగా వర్షం కురుస్తోందని చెట్టు కింద నిలబడిన మొద్దు రాకేష్ (25)పై పిడుగుపడటంతో మృతిచెందాడు. వరంగల్ నగరంలోని వరంగల్ అండర్‌బ్రిడ్జి, భవాని నగర్–వికాస్‌నగర్ కూడలి, అంబేడ్కర్ భవన్, హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ కూడలి, బస్‌స్టేషన్, కాకాజీ నగర్, హనుమకొండ, వరంగల్ చౌరస్తా ప్రాంతాల్లో వరదనీరు చేరడంతో వాహనదారులు అవస్థలుపడ్డారు. సిద్దిపేట జిల్లా కొండపాకలో 8.5 సెం.మీ. వర్షం కురవగా కొమురవెల్లి మండల కేంద్రంలో 7.2, సిద్దిపేట పట్టణంలో 7.15 సెం.మీ. వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ శాఖ కార్యాలయంపై పిడుగు పడటం సుమారు రూ. 10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.

శ్రీశైలంలో 3.04 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

పది గేట్ల ఎత్తివేత • సాగర్‌లో తెరుచుకున్న అన్ని గేట్లు



సాగర్‌లో 26 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

దోమలపెంట/నాగార్జునసాగర్: శ్రీశైలం ప్రాజెక్టుకు నిలకడగా వరద కొనసాగుతోంది. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు 37 క్రస్టుగేట్లు ఎత్తి.. స్పిల్‌వే ద్వారా 2,58,489 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 27,851, సుంకేసుల నుంచి 17,916, హంద్రీ నుంచి 250 మొత్తం 3,04,506 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తోంది. దీంతో ప్రాజెక్టు పది గేట్లను ఒక్కొక్కటి 12 అడుగుల మేర ఎత్తి.. స్పిల్‌వే ద్వారా 3,12,260 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరోవైపు ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,050 మొత్తం 65,365 క్యూసెక్కుల నీళ్లు అదనంగా సాగర్‌కు విడుదలవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 883.2 అడుగుల వద్ద 205.6672 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

సాగర్‌కు వెల్లువెత్తిన వరద..
సాగర్ జలాశయానికి ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. దీంతో అధికారులు సాగర్ ప్రాజెక్టు 26 రేడియల్ క్రస్ట్ గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం నీటిమట్టం 587 అడుగులుగా (305.5050 టీఎంసీలు) ఉంది.

ఓటుకు నోటులో మత్తయ్య కీలక నిందితుడు

- సుప్రీంకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం
- అప్పుడు అక్కడున్న వ్యక్తి ప్రస్తుతం సీఎం అయ్యారన్న అతని తరపు న్యాయవాది

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు (కోట్లు)'కేసులో ఏ4గా ఉన్న ముద్దాయి జెరూసలేం మత్తయ్య కీలక నిందితుడని సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. మత్తయ్యను విచారించనిదే ఈ కేసులో నిజానిజాలు బయటకు రావని స్పష్టం చేసింది. మత్తయ్యను విచారించేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కోరింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మత్తయ్యపై 2016లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను తెలంగాణ హైకోర్టు క్వాష్ చేయగా, దీన్ని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అదే ఏడాది జూలై 6న సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఇదే సందర్భంలో ఈ కేసులో కీలక సాక్షిగా ఉన్న ఎల్విస్ స్టీఫెన్‌సన్ సైతం సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లు మంగళవారం సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది.

ప్రస్తుత సీఎం అప్పుడు అరెస్టు అయ్యారు
'ఈ కేసు చాలా సున్నితమైంది. ఈ కేసులో ఏ4గా ఉన్న మత్తయ్యను విచారించేందుకు అనుమతి ఇవ్వండి'అంటూ తాము తొమ్మిదేళ్లుగా సుప్రీంకోర్టును కోరుతున్నట్లు ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి సీజేకు చెప్పారు. 'ఈకేసులో ఉన్న వ్యక్తి ఇప్పుడు మీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. అయినా, మీరు ఏ4గా ఉన్న వ్యక్తిని విచారించేందుకు అనుమతి అడగడం అభినందనీయం'అంటూ సీజేఐ జస్టిస్ గవాయ్ అన్నారు. మత్తయ్య తరపు న్యాయవాది జి.ప్రకాష్ వాదనలు వినిపిస్తూ.. 'ఘటన జరిగినప్పుడు నేరస్థలంలో మత్తయ్య లేరు. ఆ రోజు అక్కడ ఉన్నది ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి. ఆయన అప్పుడే ఈ కేసులో అరెస్టు అయ్యారు. ప్రస్తుత సీఎంతోపాటు మరో ఇద్దరు ఉన్నారు. వాళ్లు కూడా అరెస్టు అయ్యారు. అక్కడ లేని మత్తయ్యను మాత్రం పీడీ యాక్ట్ కింద కేసులో చేర్చారు'అని చెప్పారు. అయినా.. పీడీ యాక్ట్ కింద ఎలాంటి నేరం మత్తయ్యపై మోపలేదన్నారు. వాదనలను విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు వెల్లడించింది.

మావోయిస్టులకు ఎదురుదెబ్బ

▶ మొదటి పేజీ తరువాయి
కాల్పులు జరగ్గా, కడారి సత్యనారాయణరెడ్డి, కట్టా రామచంద్రారెడ్డి చనిపోయినట్టుగా గుర్తించామని వివరించారు. ఘటనా స్థలం నుంచి ఒక ఏకే 47, ఒక ఇన్సాస్, ఒక బీఎల్‌జీ, పేలుడు పదార్థాలతోపాటు మావోయిస్టుల వ్యక్తిగత సామగ్రి, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఇద్దరూ ఇద్దరే..
21వ ఆవిర్భావ వేడుకలు మొదలైన రెండో రోజే మావోయిస్టు పార్టీ ఇద్దరు అగ్రనేతలను కోల్పోయింది. అందులో ఒకరైన కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోసా స్వస్థలం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లె. సత్యనారాయణరెడ్డి తండ్రి కిష్టారెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తల్లి అన్నమ్మ గృహిణి. సోదరుడు కరుణాకర్‌రెడ్డి రిటైర్డ్ ఎంఈవో. 1980 దశకంలో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీలో చేరిన సత్యనారాయణరెడ్డి 45 ఏళ్లుగా ఇంటి ముఖం చూడలేదు. ఆయన తండ్రి కిష్టారెడ్డి 2013 జూన్ 8న మరణించాడు. తల్లి అన్నమ్మ 2012 నవంబర్ 14న గోపాల్‌రావుపల్లెలో అనారోగ్యంతో మృతిచెందారు. సత్యనారాయణరెడ్డి సిరిసిల్లలో ప్రాథమికవిద్య అభ్యసించి పెద్దపల్లి ఐటీఐలో చదువుకున్నారు. అక్కడే బసంత్‌నగర్ సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగంలో చేరిన సత్యనారాయణరెడ్డి కార్మికుల హక్కుల కోసం ఉద్యమించారు. ఈ క్రమంలో సిమెంట్ ఫ్యాక్టరీ మేనేజర్ హత్యకు గురికాగా.. ఆ కేసులో సత్యనారాయణరెడ్డి జైలుకు వెళ్లాడు. జైలు నుంచి వచ్చాక అప్పటి సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస)లో చురుకైన నాయకుడిగా పనిచేస్తూ పీపుల్స్‌వార్‌లో చేరారు. చనిపోయే వరకూ కేంద్ర కమిటీ సభ్యుడి హోదాలో సెంట్రల్ రీజినల్ బ్యూరో ఇన్‌చార్జ్ బాధ్యతలు చూస్తున్నారు. పార్టీ వ్యూహకర్తల్లో కీలకమైన వ్యక్తిగా ఉన్నారు. దండకారణ్యంలో విప్లవ పోరాటానికి పునాదులు వేసిన వారిలో సత్యనారాయణరెడ్డి ఒకరు. అతని తలపై మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు రూ.3 కోట్ల రివార్డును ప్రకటించాయి.



కడారి సత్యనారాయణరెడ్డి, కట్టా రామచంద్రారెడ్డి మృతదేహాలు

డీజీపీ చెప్పినట్టుగానే..
మావోయిస్టు పార్టీ చీఫ్ నంబాళ కేశవరావు ఎన్‌కౌంటర్ 2025 మే 21న జరిగింది. ఈ సమయంలో ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతమ్ మాట్లాడుతూ.. మావోయిస్టు పార్టీలో అగ్రనేతలంతా తమ రాడార్‌లో ఉన్నారని, సరైన సమయం వచ్చినప్పుడు ఆపరేషన్లు చేపడుతున్నామని, అలాంటి ఓ ఆపరేషన్‌లో నంబాల ఎన్‌కౌంటర్ జరిగిందని తెలిపారు. ఆయన చెప్పినట్టుగానే గత మే నుంచి వరుసగా జరుగుతున్న ఎన్‌కౌంటర్లలో ఆ పార్టీకి చెందిన అగ్రనేతలు చనిపోతున్నారు.
- జూన్‌లో తెంటు లక్ష్మీనరసింహాచలం అలియాస్ సుధాకర్, జూలైలో గాజర్ల ఉదయ్ అలియాస్ గణేశ్ చనిపోయారు.
- సెప్టెంబరులో అయితే కోలుకోలేని దెబ్బ పడింది. ఒకే నెలలో మోడెం బాలకృష్ణ అలియాస్ మనోజ్, పర్వేశ్ అలియాస్ సహదేవ్, కట్టా రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణరెడ్డి మొత్తం నలుగురు చనిపోయారు.
- అంతకుముందు ఏప్రిల్‌లో ప్రయాగ్‌మాంఝీ, జనవరిలో చలపతి మరణించారు.
- మరో కేంద్ర కమిటీ సభ్యురాలు సుజాత లొంగిపోగా, మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ పార్టీ లైన్‌తో విభేదించిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

బలగాల విజయం: అమిత్‌షా
న్యూఢిల్లీ: అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేతలు కడారి సత్యనారాయణరెడ్డి, కట్టా రామచంద్రారెడ్డిని మట్టుబెట్టడాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా భద్రతా బలగాల విజయంగా అభివర్ణించారు. మావోయిస్టు పార్టీ అగ్రనాయకత్వాన్ని పద్ధతి ప్రకారం భద్రతా దళాలు తుదముట్టిస్తున్నాయని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. రెడ్ టెర్రర్ వెన్నుముకను విచ్ఛిన్నం చేస్తున్నాయన్నారు.

కట్టా రామచంద్రారెడ్డి
మరో కేంద్రకమిటీ సభ్యుడు కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజుదాదా, అలియాస్ వికల్ప్‌కు గుడ్సా ఉసెండీ అనే పేరు కూడా ఉంది. ఈ పేరుతో అనేక దాడుల్లో ఆయన పాల్గొన్నారు. పీపుల్స్‌వార్ పార్టీకి సంబంధించి ఆర్‌కే పేరు ఎంత పాపులరో, ఛత్తీసగఢ్‌లో గుడ్సా ఉసెండీ అనే పేరుకు అంత ప్రాముఖ్యత ఉంది. ఛత్తీస్‌గఢ్ నుంచి హిడ్మా నూతన నేతగా ఎదిగే వరకు దళాల్లోకి కొత్తగా వచ్చిన సభ్యులు గుడ్సా ఉసెండీ పేరు పెట్టుకునేందుకే ఆసక్తి చూపించేవారు. పదవ తరగతి వరకు కోహెడలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారు. టీటీసీ పూర్తి అయిన తర్వాత కరీంనగర్ జిల్లా కాటారం మండలం పెంచికలపేట గ్రామంలో ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. ఆ ప్రాంతంలో పీపుల్స్‌వార్ ప్రభావం ఎక్కువగా ఉండేది. తర్వాత బదిలీపై కోహెడ మండలం వరికోలుకు వచ్చారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే పీపుల్స్ వార్ సిద్ధాంతాలకు ఆకర్షితుడయ్యాడు. అప్పటికే శాంతిని ప్రేమవివాహం చేసుకున్నాడు. ప్రభుత్వ టీచర్ ఉద్యోగానికి లాంగ్ లీవ్ పెట్టి ఎల్ఎల్‌బీ చేసేందుకు ఔరంగబాద్‌కు వెళ్లాడు. అక్కడి నుంచే 1989 సంవత్సరంలో భార్య శాంతితో కలసి పీపుల్స్‌వార్‌లో చేరేందుకు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. 12 సంవత్సరాల క్రితం రాయ్‌పూర్‌లో భార్య శాంతి, పిల్లలతో సహా లొంగిపోయారు. వీరు ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. మూడున్నర దశాబ్దాలుగా పీపుల్స్‌వార్, మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో రామచంద్రారెడ్డి పని చేశారు. ఇతనిపై 40 లక్షల రివార్డు ఉంది. కూతురి వివాహానికి సైతం రాలేదు.

మరణానికి ముందు వికల్ప్ ఆఖరి లేఖ

ప్రభుత్వానికి లొంగిపోవాలని సోను నిర్ణయించుకున్నాడు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌చార్జ్, కేంద్ర అధికార ప్రతినిధి హోదాలో వికల్ప్ జారీ చేసిన ఆఖరి లేఖ ఆయన మరణం తర్వాత వెలుగు చూసింది. ఇటీవల సోను అలియాస్ అభయ్ పేరుతో మల్లోజుల వేణు గోపాల్ విడుదల చేసిన లేఖ, ఆడియో ఫైల్‌లో పేర్కొన్న విషయాలను ఖండిస్తూ వికల్ప్ సెప్టెంబరు 20న లేఖ జారీ చేశారు. అయితే 22న నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయన చనిపోయిన విషయం బయటకు వచ్చిన తర్వాతే ఈ లేఖ వెలుగులోకి రావడం గమనార్హం. తొలిసారిగా తనకు అలవాటైన వికల్ప్ పేరుతో కాకుండా కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి, అభయ్ పేరుతోనే లేఖ ఇచ్చారు. అయితే ఆ హోదాలో అదే ఆయన తొలి, చివరి లేఖగా మిగిలింది. ఆ లేఖలోని ప్రధాన అంశాలు ఇలా ఉన్నాయి.



అభయ్ పేరుతో వికల్ప్ జారీ చేసిన మూడు పేజీల ఆఖరి లేఖ

- నంబాల ఆయుధ విరమణకు సంసిద్ధత వ్యక్తం చేసినట్టుగా సోనూ పేర్కొనడం సత్యాన్ని వక్రీకరించడమే. ఆయుధాలు వదులుకొని ప్రధాన స్రవంతిలో చేరడమనే అంశంపై సమాజంలోని వివిధ వర్గాల అభిప్రాయం కోరడమనేది పార్టీని విచ్ఛిన్నం చేయడానికి సోను చేసిన ఒక దుష్ట ప్రణాళిక.
- పార్టీ తప్పుడు విధానాలు అమలు చేస్తుంటే పొలిట్ బ్యూరో సభ్యుడిగా సోను ఎందుకు అడ్డుకోలేదు. లొంగిపోవాలనుకోవడం సోను, అతని అనుచరుల ఇష్టం. కానీ లొంగిపోవడానికి ముందు ఆయుధాలు పార్టీకి అప్పగించాలి. లేదంటే మేమే జప్తు చేస్తాం.
- ఇకపై అభయ్ పేరుతో మావోయిస్టు కేంద్ర కమిటీ తరఫున ప్రకటనలు విడుదల చేసే హక్కు సోనూకు లేదు. ప్రభుత్వానికి ఆయుధాలు అప్పగించేది లేదు. విప్లవ పోరాటం కొనసాగుతుంది. ఆయుధాలను వదులుకొని శాంతి చర్చలలో పాల్గొనాలని నిర్ణయించుకోవడం మార్క్సిజం–లెనినిజం–మావోయిజంల ఉల్లంఘనే.

కోవర్ట్ ఆపరేషన్‌లో భాగమే కేంద్ర కమిటీ సభ్యుల హత్య

- ఈ ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలి: పౌర హక్కుల సంఘం డిమాండ్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణరెడ్డిలను కోవర్ట్ ఆపరేషన్‌తోనే పోలీసులు హత్య చేశారని పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు ఆరోపించారు. ఈ ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఇది బూటకపు ఎన్‌కౌంటర్. కేంద్ర కమిటీ సభ్యులు సాధారణంగా పటిష్టమైన గార్డుల రక్షణ వలయంలో ఉంటారు. వీరు కనుక చనిపోయారంటే రక్షణగా నిలిచిన గార్డులు కూడా మృత్యువాత పడాలి. రక్షణ వలయానికి సంబంధించిన సమాచారాన్ని పోలీసులు ప్రకటించలేదు. కనుక ఈ ఎన్‌కౌంటర్ కచ్చితంగా కోవర్ట్ ఆపరేషన్‌లో భాగంగా జరిగినట్టుగా అర్థమవుతుంది. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో అనైతిక యుద్ధం 21 నెలలుగా కొనసాగిస్తున్నది. ఈ యుద్ధాన్ని వెంటనే నిలిపివేసి ప్రజా సమస్యల పరిష్కారం పైన దృష్టి సారించాలి. మావోయిస్టులతో వెంటనే చర్చల ప్రక్రియ చేపట్టాలి. దండకారణ్యంలో మోహరించిన అన్ని రకాల బలగాలను వెంటనే ఉపసంహరించాలి'అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సైబర్ నేరగాళ్ల 'పండుగ' షురూ..!



దసరా, దీపావళి ఆఫర్లు అంటూ ఫేక్ మెసేజ్‌లు.. ఆఫర్లు, గిఫ్ట్ కూపన్ల పేరిట ఫిషింగ్ లింకులు

అనుమానాస్పద మెసేజ్‌లోని లింకులపై క్లిక్ చేయొద్దంటున్న సైబర్ నిపుణులు

సాక్షి, హైదరాబాద్

దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ఆయా సంస్థలు ఆఫర్లతో సిద్ధమయ్యాయి. ఇప్పటికే పలు ప్రకటనలతో మార్కెట్‌లో హడావుడి మొదలైంది. దీన్నే అదనుగా చేసుకుంటున్న సైబర్‌నేరగాళ్లు డబ్బులు కొల్లగొట్టి 'పండుగ'చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ప్రముఖ ఈ-కామర్స్ వెబ్‌సైట్లను పోలినట్టుగా నకిలీ వెబ్‌సైట్‌లను, ఆయా కంపెనీల బ్రాండ్స్‌తో వెబ్‌సైట్లను తయారు చేసి వినియోగదారులకు వల విసురుతున్నారు. పండుగ ఆఫర్ల పేరిట అచ్చంగా నిజమైన కంపెనీలను పోలినట్టుగా లోగోలు, నకిలీ వెబ్‌సైట్లతో వాట్సాప్‌లో ఫేక్ ప్రకటనలు పంపుతున్నట్టు సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణ ఎస్ఎంఎస్‌లలో, ఈ మెయిల్స్‌లో ఫేక్ వెబ్‌సైట్లకు సంబంధించిన లింక్‌లు పెట్టి పంపుతున్నట్టు చెబుతున్నారు. అలాంటి లింక్‌లపై క్లిక్ చేస్తే మనకు తెలియకుండానే వైరస్‌ను చొప్పించి మన ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు తమ అధీనంలోకి తీసుకునే ప్రమాదం ఉందని అంటున్నారు. ఆ తర్వాత మన బ్యాంకు ఖాతాల్లోని సొమ్ము కొల్లగొట్టే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అదే విధంగా మన ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లు, ఫొటోలు, వీడియోలు తీసుకుని ఐడెంటిటీ థెఫ్ట్‌తోపాటు ఆన్‌లైన్ బెదిరింపులకు పాల్పడి డబ్బులు డిమాండ్ చేసే ప్రమాదమూ ఉందని పేర్కొంటున్నారు.

ఎలా మోసగిస్తారు?

- **నకిలీ ఈ-కామర్స్ సైట్‌లతో** నిజమైన ఈ-కామర్స్ (అమెజాన్, ఫ్లిప్‌కార్టు, మీ షో తదితర సైట్‌లు) వెబ్‌సైట్‌లను కాపీ కొట్టి సైబర్‌నేరగాళ్లు చిన్నపాటి మార్పులతో నకిలీ వెబ్‌సైట్‌లను సృష్టిస్తారు. భారీ పండుగ డిస్కౌంట్‌లు పెట్టి ఆకర్షిస్తారు.
- **ఫిషింగ్, హానికరమైన లింక్‌లు** దసరా/దీపావళి ఆఫర్‌లు, బహుమతులు, లక్కీడీప్‌లు, అంటూ వాట్సాప్, ఎస్ఎంఎస్, ఈ-మె యిల్స్‌లో ఫిషింగ్ లింక్‌లు పంపుతారు.
- ఫేక్ క్యూఆర్ కోడ్‌లు పంపి వాటిని స్కాన్ చేస్తే ఆఫర్లు వస్తాయని, తాము అడిగే ప్రశ్నలకు బదులిస్తే బహుమతులు గెలుచుకోవచ్చంటూ మెసేజ్‌లతో లింక్‌లు పంపుతారు.

ఈ జాగ్రత్తలు పాటించండి..

- వాట్సాప్, ఎస్ఎంఎస్‌లో ఆఫర్ల పేరిట వచ్చే సందేశాలను నమ్మ వద్దు. వాటిల్లో ఉండే లింక్‌లపై క్లిక్ చేయొద్దు. ఈ-కామర్స్‌కు సంబంధించిన అధికారిక వెబ్‌సైట్‌లలోనే ఆన్‌లైన్ షాపింగ్ చేయాలి. అది నిజమైనదో కాదో నిర్ధారించుకున్నాకే ముందుకెళ్లాలి.
- వెబ్‌సైట్ అడ్రస్ సరైనదో లేదో చెక్ చేసుకోవాలి. సురక్షితమైన వెబ్‌సైట్‌లకు ముందుకు "https"తో పాటు ప్యాడ్‌లాక్ చిహ్నంతో ఉంటుంది. అది గమనించుకోవాలి.
- ఉచిత బహుమతులు, లాటరీలు లేదా నమ్మశక్యం కాని డిస్కౌంట్ పేరిట వాగ్దానాలు ఇస్తూ వచ్చే ఎస్ఎంఎస్‌లను అనుమానించాలి. మీ అన్ని ఆన్‌లైన్ ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించండి. సాధ్యమైన చోట టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ విధిగా పెట్టుకోవాలి.
- ఆఫర్లు రావాలంటే వ్యక్తిగత, బ్యాంకు వివరాలు నమోదు చేయాలని సూచించే వెబ్‌సైట్‌లు నకిలీవని గుర్తుంచుకోవాలి. మీ మొబైల్ ఫోన్, కంప్యూటర్లలో యాంటీ-వైరస్, యాంటీ-ఫ్రాడ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించండి.
- మీరు స్కామ్‌ను ఎదుర్కొంటే లేదా బాధితులైతే, దానిని పోలీస్‌లకు, టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు 1930 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయండి. దీనివల్ల సైబర్ మోసగాళ్లు మరొకరిని మోసం చేయకుండా నివారించవచ్చు.

ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి

ఇటలీ పారిశ్రామికవేత్తలతో భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు



జియాన్ డొమెనికో మిలానోకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అతిపెద్ద ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఇటలీ పారిశ్రామికవేత్తలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆహ్వానించారు. సోమవారం సచివాలయంలో ఇటలీకి చెందిన ప్రముఖ ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. విడిభాగాల తయారీ, సరఫరా చైన్, నిర్వహణ, మరమ్మతులు, ఏవియానిక్స్, రాడార్, సెన్సార్ వ్యవస్థలు, చిన్న ఉపగ్రహాల తయారీలో తెలంగాణలోని అవకాశాలు, అనుకూలతలను వారికి వివరించారు. 'రాష్ట్రంలో ప్రత్యేక ఏరోస్పేస్ పార్కులు, సెజ్‌లు, భారీ ఎంఎస్ఎంఈ నెట్‌వర్క్, శక్తిమంతమైన పరిశోధన అభివృద్ధి (ఆర్అండ్‌డీ), మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, అత్యుత్తమ ప్రతిభ గల మానవ వనరులు, సుస్థిర ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం, పారిశ్రామిక ప్రోత్సాహక విధానాలతో కూడిన పటిష్ట వాతావరణం అందుబాటులో ఉంది. టీజీ-ఐపాస్ ద్వారా 15 రోజుల్లోనే వేగంగా అనుమతులు ఇస్తున్నాం'అని శ్రీధర్‌బాబు వివరించారు.

తెలంగాణ బ్రాండ్ విశ్వవ్యాప్తం

'హైదరాబాద్ ఏరోనాటికల్ లిమిటెడ్, డీఆర్‌డీవో లాంటి కేంద్ర సంస్థలు, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, ధ్రువ స్పేస్, స్కైరూట్ స్పేస్, బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్, జీఈ ఏవియేషన్, ప్రాట్-విట్నీ లాంటి దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయి. హై ప్రెసిషన్ మెషినింగ్, షీట్ మెటల్, హైడ్రాలిక్ సిస్టమ్స్ వంటి క్లిష్టమైన భాగాలను ఇక్కడ తయారీ చేసి అంతర్జాతీయ మార్కెట్‌కు సరఫరా చేయొచ్చు.విమానాలు, హెలికాప్టర్ల ఇంజన్ల నిర్వహణలో ఇటలీకి ఉన్న నైపుణ్యం ఇక్కడి డిఫెన్స్, ప్రైవేట్ రంగాలకు ఉపయోగపడుతుంది'అని శ్రీధర్‌బాబు పేర్కొన్నా రు. ధ్రువ స్పేస్, అనంత్‌టెక్నాలజీస్, స్కైరూట్ వంటి హైదరాబాద్ స్టార్టప్‌లు ఇప్పటికే తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పాయన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, డిఫెన్స్, ఏరోస్పేస్ డైరెక్టర్ ప్రవీణ్ పీఏ, కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇటలీ ఇన్ బెంగళూరు జియాన్ డొమెనికో మిలానో, ట్రేడ్ కమిషనర్ అంటోనియెట్టా బక్కానారి, ఇండస్ట్రియల్ ఇంటర్నేషనలైజేషన్, నేషనల్ ఎకానమీ మిషన్స్ సెక్షన్ హెడ్ సిల్వియా సిక్కారెల్లి, ప్రెసిడెన్సీ ఆఫ్ కౌన్సిల్ ఆఫ్ మినిస్టర్స్ లూగి రిగ్గియో పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కార్ పార్టీ అక్రమ లగ్జరీ కార్లపై నడుస్తుందా?

'ఎక్స్'లో కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: 'కార్ పార్టీ (బీఆర్ఎస్).. అక్రమంగా తెచ్చిన లగ్జరీ కార్లపై నడుస్తుందా?'అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సందేహం వ్యక్తం చేశారు. లగ్జరీ కార్ స్కామ్ నిందితుడు బసరత్ ఖాన్ దిగుమతి చేసిన ల్యాండ్ క్రూజర్లలో ట్విట్టర్ టిల్లు (కేటీఆర్) ఎందుకు తిరుగుతున్నారు? అని ప్రశ్నించారు. లగ్జరీ కార్ స్కామ్ నిందితుడు బసరత్‌ఖాన్‌ను అహ్మదాబాద్ డీఆర్ఐ అరెస్ట్ చేసిందన్నారు. సోమవారం ఎక్స్ వేదికగా సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఆ కార్లు కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన కంపెనీల పేర్లతో ఎందుకు రిజిస్టర్ అయ్యాయి? మార్కెట్ ధర చెల్లించారా? లేక తక్కువగా చూపించి కొనుగోలు జరిగిందా? పేమెంట్లు బినామీ పేర్లతోనా? నకిలీ ఆదాయమా? లేక మనీలాండరింగ్ ద్వారానా?'అని ప్రశ్నించారు. 'ఈ స్కామ్‌లో కేసీఆర్ కుటుంబం నేరుగా ప్రయోజనం పొందినట్లు కాదా? వాస్తవాలు బయటకు రావాలి.. సంబంధిత శాఖలు ఇన్వెస్టిగేట్ చేయాలి'.. అంటూ సంజయ్ తన ఎక్స్ ఖాతాలో కోరారు.

ఉప ఎన్నికలు ఖాయం

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి జోస్యం



సాక్షి, హైదరాబాద్: నియోజకవర్గం ప్రజలను మోసగించిన పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అన్ని ఆధారాలు స్పీకర్‌కు సమర్పించినట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి వెల్లడించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ సరైన నిర్ణయం తీసుకుంటారని, ఉప ఎన్నికలు రావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణపై సోమవారం అసెంబ్లీ కార్యదర్శికి అఫిడవిట్లు అందజేసిన అనంతరం ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ కే.సంజయ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఏ పార్టీలో ఉన్నానో స్పీకర్ నిర్ణయిస్తారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులకు కాంగ్రెస్, బీజేపీ కారణమని విమర్శించారు. కేటీఆర్ కార్లపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ దుర్మార్గం వల్లే కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 299 టీఎంసీల వాటా దక్కిందన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు ఆధారాలతో సిద్ధంగా ఉన్నట్లు జగదీశ్‌రెడ్డి చెప్పారు.

టీజీపీఎస్సీ సభ్యులుగా ముగ్గురి నియామకం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురిని నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా నియమితులైన వారిలో సి.చంద్రకాంత్ రెడ్డి, విశ్వప్రసాద్, ప్రొఫెసర్ ఎల్‌బీ.లక్ష్మీకాంత్ రాథోడ్ ఉన్నారు. వీరంతా ఆరేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. గరిష్ట వయోపరిమితి 62 సంవత్సరాలుగా ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.



తెలంగాణ వారసత్వ శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ అర్జునరావు నాంపల్లిలోని స్టేట్ మ్యూజియంలో ప్రదర్శనాంశాలను పరిశీలిస్తున్న దృశ్యం.

కార్పొరేట్‌కు దీటుగా సింగరేణి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- రాష్ట్ర సాధనలో సంస్థ కార్మికుల పోరాటం మరువలేనిది
- సంస్థ లాభాలకు వారు చేస్తున్న కృషి కూడా అభినందనీయం
- కార్మికులకు రూ.819 కోట్ల బోనస్ ప్రకటించిన సీఎం, డిప్యూటీ సీఎం
- దీపావళి బోనస్ కూడా ఇస్తామన్న ముఖ్యమంత్రి



బోనస్ చెక్కుతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, శ్రీధర్‌బాబు, వివేక్, సింగరేణి సీఎండీ బలరాం తదితరులు

సాక్షి, హైదరాబాద్: కార్పొరేట్ కంపెనీలతో పోటీపడేలా సింగరేణి సంస్థను తీర్చి దిద్దుతామని సీఎం ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికుల పోరాటం ఎప్పటికీ మరువలేనిదన్నారు. సంస్థను లాభాల్లో నడిపించేందుకు వారు చేస్తున్న కృషి కూడా అభినందనీయమని పేర్కొన్నారు. అందుకే సంస్థ లాభాల్లో కార్మికులకు వాటా ఇస్తున్నామని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సాధించిన నికర లాభాలలో 34% వాటాను ఉద్యోగులకు బోనస్‌గా చెల్లిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సోమవా రం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ విషయం అధికారికంగా వెల్లడించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు.

కార్మికులను ప్రోత్సహించేందుకే లాభాల్లో వాటా..

'సింగరేణిని లాభాల్లోకి తీసుకొచ్చిన కార్మికులను మరింత ప్రోత్సహించేందుకు లాభాల్లో వారికి వాటా ఇస్తున్నాం. సింగరేణి మొత్తం ఆదాయం రూ.6,394 కోట్లు. ఇందులో రూ.4,034 కోట్లు భవిష్యత్ పెట్టుబడులకు కేటాయించాం. మిగిలిన రూ.2,360 కోట్లు నికర లాభాలు. ఇందులో 34 శాతం అంటే రూ.819 కోట్లు శాశ్వత కార్మికులకు బోనస్‌గా కేటాయించాం. గత ఏడాది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,000 బోనస్ ఇస్తే, ఈ సారి రూ.5,500 ఇస్తున్నాం. కార్మికులకు దీపావళికి కూడా బోనస్ ఇస్తాం. ప్రైవేటు భాగస్వామ్యం సింగరేణిని ప్రశ్నార్థకం చేస్తుందని కార్మికులు అంటున్నారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళిన గనులను సంస్థకు అప్పగించాలని కోరుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం కేంద్రంతో సంప్రదింపులు జరుపుతాం. కేంద్రం జీఎస్టీని సవరించడంతో రాష్ట్రానికి దాదాపు రూ.7 వేల కోట్ల ఆదాయం తగ్గింది. ఈ నష్టాన్ని కేంద్రం పూడ్చాలి. దీని కోసం రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కృషి చేయాలి. విద్యుత్ సంస్థలకు ఇవ్వాల్సిన డబ్బులు ప్రభుత్వం ఇవ్వడం లేదు. విద్యుత్ సంస్థలు సింగరేణి డబ్బులు సరిగా చెల్లించడం లేదు. దీన్ని సరి చేయాల్సిన అవసరం ఉంది. విద్యుత్ సంస్థల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తుంది..'అని ముఖ్యమంత్రి చెప్పారు.

సింగరేణి ఇతర రంగాల్లోకి విస్తరించాలి: భట్టి

సింగరేణి సంస్థ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే బొగ్గు బ్లాకుల వేలం పాటలో పాల్గొని కొత్త బ్లాకులు సాధించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి సంస్థ కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు నిధులు అవసరమని, దీన్ని దృష్టిలో ఉంచుకుని నికర లాభాల్లో రూ.4,034 కోట్లు కేటాయించామని చెప్పారు. సంస్థ సీఎండీ ఎన్.బలరాం మాట్లాడుతూ.. ఒడిశా రాష్ట్రంలో నైని బ్లాకును సింగరేణి దక్కించుకుని, కీలకమైన ఖనిజ రంగంలోకి ప్రవేశించిందని, రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మేరకు త్వరలోనే కొత్త బొగ్గు బ్లాక్‌లను వేలం పాట ద్వారా సాధిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం వివేక్, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాలరావు, షబ్బీర్ అలీ, ఎంపీలు పి.బలరాం నాయక్, రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్సీ కొమరయ్య,ఎమ్మెల్యేలు, పాయం వెంకటేశ్వర్లు, మట్టా రాగ మయి, మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, గండ్ర సత్య నారాయణ, గడ్డం వినోద్‌తో పాటు దానం నాగేందర్, సింగరేణి అధికారులు కె.వెంకటేశ్వర్లు, తిరుమలరావు, బి.వెంకన్న, టి. శ్రీనివాస్, కిరణ్‌కుమార్, సింగరేణి కాలరీస్ వర్క ర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

సింగరేణి లాభాల వాటా బోనస్ ప్రస్థానం ఇలా..

- సింగరేణి తొలిసారిగా 1999-2000లో లాభాల వాటా బోనస్‌ను ప్రకటించింది. ఆ ఏడాది వచ్చిన లాభాలు రూ.300 కోట్లు కాగా రూ.30 కోట్లు (10 శాతం) బోనస్‌గా ఇచ్చింది. సింగరేణిలో పనిచేస్తున్న 1.7 లక్షల మంది కార్మికులు ఒక్కొక్కరికీ రూ.2,782 బోనస్ వచ్చింది.
- గత ఏడాది 33 శాతం లాభాల వాటా బోనస్‌గా ప్రకటించారు. దీంతో ప్రతి కార్మికుడికి రూ.1.87 లక్షల బోనస్ వచ్చింది. 2024-25లో లాభాల్లో వాటా 34 శాతం చొప్పున రూ.2,360 కోట్ల బోనస్ ప్రకటించగా ఒక్కొక్కరికి సగటున రూ.1,95,610 బోనస్ వచ్చింది.

డిప్యుటేషన్లెన్ని.. కోర్టు కేసులెన్ని?

గురుకులాల్లో జీఓ 317 పరిధిలో ఉన్న వారిపై ఆరా.. సొసైటీల వారీగా వివరాలతో నివేదిక కోరిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో ఉద్యోగ కేటాయింపుల్లో నష్టపోయామంటూ కోర్టును ఆశ్రయించిన వారెందరు ఉన్నారు, ఇతర సమస్యలతో పోస్టింగ్ ఇచ్చిన చోట కాకుండా డిప్యుటేషన్లు తీసుకుంటున్న వారెందరు ఉన్నారు? అనే లెక్కలు గురుకుల సొసైటీలు తీస్తున్నాయి. జీఓ 317 ద్వారా నష్టపోయామంటూ దాదాపు 4 వేలమంది ఉద్యోగులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో గత వారం పభుత్వం జీఓ 190 జారీ చేసింది. వారికి గరిష్ఠంగా మూడేళ్ల పాటు సొంత ప్రాంతాల్లో డెప్యూటేషన్లు ఇవ్వాలని ఆదేశించింది.

డిప్యుటేషన్లకు బ్రేక్..: ప్రస్తుతం గురుకుల విద్యాసంస్థల్లో డిప్యుటేషన్లకు అవకాశం లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. జీఓ 190 ద్వారా ఎంపికైన వారికి మాత్రమే మూడేళ్ల పాటు అవకాశం కల్పించాలని సూచిస్తూ... ముందుగా ఆ మేరకు జాబితాలను రూపొందించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో గురుకుల సొసైటీలు లెక్కలు తేల్చే పనిలో పడ్డాయి. ప్రధానంగా ఎస్సీ గురుకుల సొసైటీలో పెద్ద సంఖ్యలో జీఓ 317 ప్రభావానికి గురైన వారున్నారు. ఆ తర్వాత గిరిజన గురుకులం, మైనార్టీ గురుకులంలో ఎక్కువ మంది ఉండగా.. బీసీ గురుకుల సొసైటీలో పరిమితంగా ఉన్నారు. మరోవైపు కోర్టు కేసులున్న వారు కూడా ఎస్సీ గురుకుల సొసైటీలోనే ఎక్కువగా ఉన్నారు. ఈ మేరకు ఇప్పటికే ప్రాథమికంగా జాబితాలను తయారు చేసిన గురుకుల సొసైటీలు..మరోమారు పునఃసమీక్షించి తుది జాబితాలను తయారు చేసేందుకు చర్యలు వేగవంతం చేశాయి. ప్రస్తుతం డిప్యుటేషన్లు పొందుతున్న వారితో ఒక జాబితాను.. కోర్టు కేసుల పరిధిలో ఉన్న వారితో మరో జాబితా రూపొందించి దసరా సెలవులు పూర్తయ్యే నాటికి జాబితాలను ఖరారు చేసి సంక్షేమ శాఖల కార్యదర్శికి సమర్పించనున్నట్లు సమాచారం.

ఆసుపత్రుల సెక్యూరిటీలో రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది

మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి

- పారిశుధ్య నిర్వహణను బాధ్యతగా తీసుకోవాలి
- అధికారులతో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రతా వ్యవహారాలను చూసే సెక్యూరిటీ సిబ్బందిని రిటైర్డ్ ఆర్మీకి చెందిన వారిని నియమించాల్సిన అవసరం ఉందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో ప్రభుత్వ హాస్పిటళ్ల నిర్వహణలో శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ వర్కర్ల పాత్ర, తీసుకురావలసిన మార్పులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, డైట్ పాలసీల్లో ఉన్న లోపాలను, దీంతో ఎదురవుతున్న సమస్యలను డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ మంత్రికి వివరించారు. ఈ మూడు వ్యవస్థలతోపాటు, పేషెంట్లకు అందించే డైట్‌లో తీసుకురావాల్సిన మార్పులు, ఆయా వ్యవస్థలను బలోపేతం చేయడానికి అవసరమైన కొత్త పాలసీల రూపకల్పనపై చర్చించారు. సెక్యూరిటీ టెండర్ నిబంధనల్లో సరైన నిబంధనలు లేకపోవడంతో సెక్యూరిటీ గార్డులుగా వృద్ధులను, ఫిజికల్ ఫిట్‌నెస్ లేని వారిని కాంట్రాక్టర్లు నియమిస్తున్నారని, ఇందులో మార్పు తీసుకు రావాలని అధికారులు కోరారు. మంత్రి దామోదర మాట్లాడుతూ.. మొత్తం సెక్యూరిటీ సిబ్బందిలో కొంత శాతం మేర ఎక్స్‌సర్వీస్‌మెన్‌ను నియమించాలని, ఇందుకు అనుగుణంగా నిబంధనలు మార్చాలని సూచించారు. ఫిజికల్ ఫిట్‌నెస్ ఉండి, 50 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్నవారినే నియమించుకునేలా నిబంధనలు ఉండాలన్నారు. సెక్యూరిటీ సూపర్‌వైజర్ పోస్టును ఏర్పాటు చేసి, ఆ పోస్టులో తప్పనిసరిగా రిటైర్డ్ ఆర్మీ పర్సన్‌ను నియమించాలని ఆదేశించారు. అన్ని హాస్పిటల్స్‌లో సీసీ టీవీ మానిటరింగ్ రూమ్ ఉండాలని, మానిటర్ చేసే పని కూడా సెక్యూరిటీ కాంట్రాక్ట్‌లో ఉండాలన్నారు.

పారిశుధ్యానికి ప్రథమ ప్రాధాన్యం

ఆస్పత్రుల లోపల, బయట పారిశుధ్య నిర్వహణకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి దామోదర అధికారులకు స్పష్టం చేశారు. శానిటేషన్ టెండర్లు పకడ్బందీగా ఉండాలని, ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత శానిటేషన్ కాంట్రాక్టర్లదే అని అన్నారు. నిబంధనల ప్రకారం పరిశుభ్రంగా ఉంచకపోతే కాంట్రాక్ట్ రద్దు చేసేలా పాలసీ ఉండాలని చెప్పారు. పెస్ట్ కంట్రోల్‌ను కూడా శానిటేషన్‌లో భాగం చేయా లని, సర్టిఫైడ్ పెస్ట్ కంట్రోలర్స్‌ను నియమించుకునేలా టెండర్ నిబంధనలు ఉండాలన్నారు. రోగుల కు నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహా రాన్ని అందించేలా నూతన విధానం రూపొందించాలన్నారు. పేషెంట్ కేర్ వర్కర్లుగా క్వాలిఫైడ్ పర్సన్స్ మాత్రమే నియమించాలని సూచి ంచారు. ఏఎన్ఎం తదితర క్వాలిఫికేషన్లు ఉన్న వారి కి అవకాశమివ్వాలన్నారు. పేషెంట్ కేర్ వర్కర్లలో 60 శాతానికి తగ్గకుండా మహిళలు ఉండాలని మంత్రి చెప్పారు. ఆయా వర్కర్ల ఈపీఎఫ్, ఈఎస్ఐ ఖాతాల్లోకి నేరుగా డబ్బు జమ చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి, ఫుడ్ సేఫ్టీ డైరెక్టర్, డాక్టర్ శివలీల తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో కాంగ్రెస్ పాత్ర ఆరోవేలు లాంటిదే

మాజీ మంత్రి హరీశ్‌రావు



పామాయిల్ పరిశ్రమను పరిశీలిస్తున్న హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

సాక్షి, సిద్దిపేట: రాష్ట్ర అభివృద్ధిలో కాంగ్రెస్ పాత్ర.. చేతిలో ఆరో వేలు లాంటిదని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పామాయిల్ పరిశ్రమను ప్రారంభించేందుకు కాంగ్రెస్ వారు జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నారన్నారు. విత్తనం నాటింది బీఆర్ఎస్ అయితే.. పండ్లు కాస్తే తెంపుతాం అన్నట్టుగా ఉంది కాంగ్రెస్ పార్టీ తీరు అని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేటలో ఉన్న పామాయిల్ పరిశ్రమలో ఇటీవల ట్రయల్‌రన్ విజయవంతమైంది. దీంతో సోమవారం ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డిలతో కలిసి హరీశ్‌రావు ఆ పరిశ్రమను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018లో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు తేమ తక్కువ ఉందని సిద్దిపేటతోపాటు ఇతర జిల్లాల్లో ఐఐఓపీఆర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పామ్ రీసెర్చ్) అనుమతి ఇవ్వలేదన్నారు. అదే కాళేశ్వరం నీళ్లు వచ్చిన తర్వాత తేమ శాతం పెరగడంతో ఆయిల్ పామ్ సాగుకు అనుమతులు వచ్చాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఏం చేయకుండానే ఇదంతా సాధ్యమైందా అని ప్రశ్నించారు.

సింగరేణి కార్మికులకు బోనస్ బోగస్

సింగరేణి కార్మికులకు ఇచ్చే బోనస్‌ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బోగస్‌గా మార్చిందని హరీశ్‌రావు విమర్శించారు. కార్మికులకు ఇచ్చే లాభాల్లో 50 శాతానికి పైగా కోత విధించారని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ నికర లాభం రూ.6394 కోట్లు కాగా, అందులో కోత విధించి రూ.2360 కోట్ల నుంచి వాటా చెల్లించాలని నిర్ణయించడం కార్మికులకు ద్రోహం చేయడమే అని పేర్కొన్నారు. 'నమ్మి ఓట్లేసినందుకు సింగరేణి కార్మికులను కాంగ్రెస్ నయవంచనకు గురి చేసింది. నికర లాభాల నుంచి 34 శాతం వాటా చెల్లిస్తేనే కార్మికులకు న్యాయం జరుగుతుంది 'అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావుకు ఊరట

అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ పొడిగింపు

కౌంటర్ దాఖలుకు రెండు వారాల గడువిచ్చిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ(స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలంటూ తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదనలు సోమవారం వాడీవేడిగా జరిగాయి. ప్రభాకర్‌రావు సాక్ష్యాలను ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేశారని ప్రభుత్వం బలమైన ఆధారాలతో వాదించగా, అదంతా రాజకీయ కక్ష సాధింపేనని పిటిషనర్ తరఫు న్యాయవాది తిప్పికొట్టారు. ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ బీవీ. నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం, ప్రభాకర్‌రావుకు అరెస్టు నుంచి మధ్యంతర రక్షణను పొడిగిస్తూ, విచారణకు పూర్తిగా సహకరించాలని ఆదేశించింది.

సిట్ చేతికివ్వకముందే రీసెట్: ప్రభుత్వ వాదన

తెలంగాణ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా తుషార్ మెహతాతోపాటు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. ప్రభాకర్‌రావు కోర్టు ఇచ్చిన రక్షణను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. 'దర్యాప్తు సంస్థలకు అప్పగించడానికి ముందే మూడు ఫోన్లు, ఒక అధికారిక ల్యాప్‌టాప్‌లోని మొత్తం డేటాను 'ఫ్యాక్టరీ రీసెట్'ద్వారా చెరిపేశారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో బెయిల్ పిటిషన్లపై విచారణ జరుగుతున్న సమయంలోనే ఇలా చేయడం సాక్ష్యాలను ధ్వంసం చేయాలనే దురుద్దేశాన్ని స్పష్టం చేస్తోంది. ఫోరెన్సిక్ నివేదిక ఈ విషయాన్ని తేదీలతో సహా రుజువు చేస్తోంది. ఇది అత్యంత తీవ్రమైన కేసు. న్యాయమూర్తులు, రాజకీయ నాయకులు, జర్నలిస్టుల ఫోన్లను ట్యాప్ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. అలాంటి వ్యక్తి విచారణకు సహకరించకుండా సాక్ష్యాలను నాశనం చేస్తుంటే బెయిల్‌పై కొనసాగే అర్హత కోల్పోతారు'అని వాదించారు.

అదంతా రాజకీయ కక్షసాధింపే

ప్రభుత్వ ఆరోపణలను ప్రభాకర్‌రావు తరఫు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు కొట్టిపారేశారు. 'ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్య. రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే మా క్లయింట్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. ఆయన ఎలాంటి సాక్ష్యాలనూ ధ్వంసం చేయలేదు. అధికారులు జరిపిన విచారణ మొత్తాన్ని వీడియో రికార్డు చేశారు. ఆ వీడియోలను కోర్టు ముందుంచితే నిజానిజాలు తెలుస్తాయి. ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి చేసి, కొందరి చేత మా క్లయింట్‌కు వ్యతిరేకంగా వాంగ్మూలాలు ఇప్పిస్తున్నారు'అని వాదించారు. ప్రభుత్వ ఆరోపణలపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు తమకు రెండు వారాల సమయం కావాలని కోరారు.

- ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ప్రభాకర్‌రావు తరఫు న్యాయవాది అభ్యర్థనను అంగీకరించింది. కౌంటర్ దాఖలు చేసేందుకు రెండు వారాల గడువు మంజూరు చేసింది. తదుపరి విచారణ వరకు అరెస్టు చేయకుండా మధ్యంతర రక్షణ ఉత్తర్వులను పొడిగించింది. అయితే, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని, అధికారులు అడిగినప్పుడు విచారణకు హాజరుకావాలని ప్రభాకర్‌రావును ధర్మాసనం స్పష్టంగా ఆదేశించింది.

108 సర్వీసులకు బాబు సర్కారు ఉరి

పాడేరు ఘటనపై మాజీ సీఎం వైఎస్ జగన్ తీవ్ర ఆవేదన

- 108 రాకపోవడంతో నిండు గర్భిణి ఆటోను ఆశ్రయించాల్సి వచ్చింది
- చివరకు ఆటోలోనే ప్రసవం.. వైద్యం అందక పురిటి బిడ్డ మరణించింది
- కుయ్ కుయ్ మూగబోతోంది.. ప్రజల ప్రాణాలు పోతున్నాయి
- ఏపీలో ప్రభుత్వం అన్నది పని చేస్తోందా?
- కలెక్షన్లపై మినహా ప్రజల బాగోగుల పట్ల ధ్యాస ఏది?



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 108 సర్వీసులకు చంద్రబాబు ప్రభుత్వం ఉరి వేస్తోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫోన్ చేసినా 108 సర్వీసు రాకపోవడంతో పాడేరు సమీపంలోని ముల్లుమెట్టకు చెందిన నిండు గర్భిణిని ఆస్పత్రికి తరలించేందుకు ఆటోను ఆశ్రయించాల్సి వచ్చిందని, చివరకు అందులోనే ప్రసవం జరిగిందని.. వైద్యం అందక ఆటోలోనే శిశువు మరణించిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను జత చేసి చంద్రబాబు సర్కార్ అసమర్థతను నిలదీస్తూ వైఎస్ జగన్ 'ఎక్స్'లో తన ఖాతాలో సోమవారం పోస్టు చేశారు. అందులో ఆయన ఏమన్నారంటే..

ప్రజల ప్రాణాలు పోతున్నాయ్

- ప్రజల ప్రాణాలకు భరోసా ఇచ్చే 108 సర్వీసులకు చంద్రబాబు ప్రభుత్వం ఉరి వేస్తోంది. నిండు గర్భిణిని ఆస్పత్రికి తరలించేందుకు 108 రాకపోవడంతో ఆటోను ఆశ్రయించాల్సి వచ్చింది. వైద్యం అందక ఆటోలోనే శిశువు మృతి చెందింది.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అంబులెన్స్‌లు, పట్టణ ప్రాంతాల్లో ఫోన్ చేసిన 15 నిమిషాల్లోగా 108 రావాలనే నిబంధన ఉంటే.. దాన్ని అధిగమిస్తూ 12–14 నిమిషాల్లోనే చేరుకునేవి. గ్రామీణ ప్రాంతాల్లో 20 నిమిషాల్లో చేరుకోవాలని నిబంధన ఉంటే.. 16–17 నిమిషాల్లోనే వచ్చేవి. గిరిజన ప్రాంతాల్లో 30 నిమిషాల్లో చేరుకోవాలనే నిబంధన ఉంటే దాన్ని కూడా అధిగమిస్తూ 22.12 నిమిషాల్లోనే చేరుకుని 108లు సేవలందించాయి. మరి ఇప్పుడు ఎందుకు చేరుకోవడం లేదు? ఫోన్ చేసినా ఎందుకు రావడంలేదు? ప్రభుత్వం అన్నది పనిచేస్తేనే కదా! కలెక్షన్ల మీద మినహా ప్రజల పట్ల ధ్యాస ఉంటే కదా?

జీఎస్టీలో కొత్త సంస్కరణలు విప్లవాత్మక అడుగు

- సాధారణ ప్రజలకు మేలు
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: దేశంలో జీఎస్టీ (వస్తు సేవల పన్ను) కొత్త శ్లాబులు సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. జీఎస్టీ సంస్కరణలు సరళమైన, పారదర్శకమైన పన్ను వ్యవస్థ దిశగా వేసిన విప్లవాత్మక అడుగుగా అభివర్ణించారు. దీనివల్ల సాధారణ ప్రజలకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్'లోని తన ఖాతాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోస్టు చేశారు. 'జీఎస్టీ సంస్కరణలు సరళమైన పారదర్శకమైన పన్ను వ్యవస్థ దిశగా వేసిన విప్లవాత్మక అడుగు. వస్తువులు, సేవలను ప్రతి పౌరుడికి మరింత సరళంగా సరసమైనదిగా మార్చడానికి ఈ చర్యలు దోహదపడతాయి. ప్రాథమికంగా కొన్ని ఫిర్యాదుల నిర్వహణలో లోపాలు ఉండవచ్చు. కానీ ఇది ఒక ప్రక్రియ. దీని ప్రయోజనాలు తుది వినియోగదారులకు చేరుకుంటాయని ఆశిస్తున్నాను. ఇది కచ్చితంగా ఆర్థిక వ్యవస్థలో వినియోగానికి.. మరింత పెట్టుబడులకు అవసరమైన పోత్సాహాన్ని ఇస్తుంది' అంటూ పేర్కొన్నారు.

శ్రీ కనకదుర్గమ్మ కటాక్షం అందరిపై ఉండాలి: వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ కటాక్షం అందరిపై ఉండాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమవడంతో ఆయన ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు.

రేపు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం బుధవారం ఉదయం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించనున్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, పీఏసీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు, రాష్ట్ర కార్యదర్శులు(కో–ఆర్డినేషన్), రాష్ట్ర కార్యదర్శులు(పార్లమెంటు)ను ఆహ్వానించారు.

దాండియాలో ముస్లింలు వద్దు: వీహెచ్‌పీ

సాక్షి, హైదరాబాద్: దాండియా కార్యక్రమాల్లో ముస్లింలను అనుమతించరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే అడ్డుకుంటామని వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్ హెచ్చరించారు. దసరా పండుగ సందర్భంగా నవరాత్రుల్లో నిర్వహించే దాండియాలో ముస్లిం యువకులు పాల్గొనకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు. ప్రైవేట్ సంస్థలు నిర్వహించే దాండియాలలో నిర్వాహకులు విధిగా కొన్ని నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. విధిగా దుర్గామాత చిత్రపటానికి పూజ నిర్వహించాలని సూచించారు. మహిళల రక్షణకు పోలీసులు ప్రత్యేకంగా షీటీమ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు.

నోటికి ప్లాస్టర్, ముక్కుకు ఐరన్ క్లిప్.. ఇంజినీరింగ్ విద్యార్థిని బలవన్మరణం

గుంటూరులోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఘటన



లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): ఊపిరాడకుండా నోటికి ప్లాస్టర్, ముక్కుకు ఐరన్ క్లిప్ పెట్టుకుని పిడికిళ్లు బిగించుకుని ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం గుంటూరులో చోటుచేసుకుంది. గుంటూరు పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా శ్రీరామవరం ప్రాంతానికి చెందిన కమ్మ రాజు రైతు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె శ్రావ్య (20) గుంటూరు అశోక్‌నగర్‌లోని నవీన్ లేడీస్ హాస్టల్‌లో ఉంటూ వీవీఐటీ ఇంజినీరింగ్ కాలేజీలో నాలుగో సంవత్సరం బీటెక్ చదువుతోంది. చదువులో చురుగ్గా ఉంటూ 85 శాతం మార్కులు సాధిస్తోంది. అయితే, ఆదివారం సాయంత్రం శ్రావ్య తన చిన్ననాటి స్నేహితురాలైన జాగృతికి ఫోన్‌చేసి తనకు చాలా చికాకుగా ఉందని, ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తోందంటూ కన్నీరుమున్నీరైంది. దీంతో స్నేహితురాలు ధైర్యం చెప్పింది. అయినా అనుమానంతో జాగృతి.. శ్రావ్య సోదరుడికి ఫోన్‌చేసి జరిగిన విషయం వివరించింది. అతను తన తల్లికి చెప్పడంతో ఆమె వెంటనే ఏలూరు వచ్చేయాల్సిందిగా కుమార్తెకు చెప్పింది. అయితే, గురువారం నుంచి సెలవులు కాబట్టి అప్పుడు వస్తానని తన తల్లితో శ్రావ్య చెప్పింది. కానీ, శ్రావ్య ఆదివారం రాత్రే ఆత్మహత్య చేసుకునేందుకు యాప్ ద్వారా ప్లాస్టర్‌ను, ఐరన్ క్లిప్‌ను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుంది. తర్వాత కొద్దిసేపటికి నోటికి ప్లాస్టర్, ముక్కుకు ఐరన్ క్లిప్‌ను పెట్టుకుని రెండు పిడికిళ్లు గట్టిగా బిగించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తెల్లవారుజామున తోటి విద్యార్థినులు గదిలో నుంచి బయటకొచ్చి చూసి భయంతో హాస్టల్ వార్డెన్‌కు సమాచారమిచ్చారు. శ్రావ్య కుటుంబ సభ్యులు హాస్టల్‌కు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అప్పులు రూ.3,70,897 కోట్లే


ఏపీ అసెంబ్లీ సాక్షిగా నిజాన్ని ఒప్పుకున్న టీడీపీ కూటమి సర్కారు

- రూ.10 లక్షల.. రూ.14 లక్షల కోట్లు అప్పులంటూ ఇన్నాళ్లుగా గత ప్రభుత్వంపై చేసిన దుష్ప్రచారంలో నిజం లేదని అంగీకారం
- 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాక ముందు.. టీడీపీ దిగిపోయే నాటికి రాష్ట్రం మొత్తం అప్పులు రూ.3,06,952.26 కోట్లు
- జగన్ ప్రభుత్వం దిగిపోయే నాటికి బడ్జెట్‌తో పాటు గ్యారెంటీ కలిపి రాష్ట్రం మొత్తం అప్పులు రూ.6.77 లక్షల కోట్లే
- ఈ ఏడాది రూ.1,03,656.50 కోట్లు అప్పులు చేస్తామన్న ఆర్థిక మంత్రి పయ్యావుల.. ఆగస్టుకి రూ.44,364.06 కోట్లు అప్పు చేసినట్లు ప్రకటన

• చంద్రబాబు అబద్ధాలకు అంతే లేదా?



2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక శాఖపై సమీక్ష సందర్భంగా రాష్ట్ర అప్పులు రూ.14లక్షలు అని ప్రకటించిన సీఎం చంద్రబాబు


Extract from Governor's address

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర అప్పులు రూ.10లక్షల కోట్లు అని పేర్కొన్న భాగం

సాక్షి, అమరావతి: రాష్ట్ర అప్పులపై చట్టసభ సాక్షిగా చంద్రబాబు సర్కారు అబద్ధాలు మరోసారి బట్టబయలయ్యాయి! వైఎస్సార్ సీపీ హయాంలో చేసిన అప్పులు రూ.14 లక్షల కోట్లు.. రూ.10 లక్షల కోట్లు.. అంటూ నోటికొచ్చినట్లు పదేపదే నిస్సిగ్గుగా చేసిన ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని సభ సాక్షిగా స్వయంగా ఒప్పుకుంది! వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన మొత్తం అప్పులు రూ.3,70,897 కోట్లు మాత్రమేనని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీ వేదికగా సోమవారం లిఖితపూర్వకంగా వెల్లడించారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాక ముందు.. నాడు టీడీపీ సర్కారు దిగిపోయే నాటికి రాష్ట్రం మొత్తం అప్పులు రూ.3,06,952.26 కోట్లు అని కూటమి ప్రభుత్వం సభ సాక్షిగా ప్రకటించడం గమనార్హం.

ఆగస్టు నాటికే రూ.44,364.06 కోట్లు అప్పు

ప్రస్తుత ఆర్థిక ఏడాది (2025–26)లో రూ.1,03,656.50 కోట్లు బడ్జెట్ అప్పులు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. ఇందులో ఆగస్టు నెలాఖరు నాటికి రూ.44,364.06 కోట్లు అప్పు చేసినట్లు వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు ఈమేరకు మంత్రి కేశవ్ సోమవారం అసెంబ్లీలో లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ దిగిపోయే నాటికి మొత్తం అప్పులు రూ.6,77,849.80 కోట్లు..

ఇక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి అంటే జూన్ 12, 2024 నాటికి బడ్జెట్ అప్పులు, ప్రభుత్వ గ్యారెంటీతో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల అప్పులు కలిపి మొత్తం రూ.6,77,849.80 కోట్లు మాత్రమే అప్పులు ఉన్నట్లు మంత్రి కేశవ్ తన సమాధానంలో వెల్లడించారు. ఇందులో 2014–15 నుంచి 2018–19 వరకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న బడ్జెట్ అప్పులు, ప్రభుత్వ గ్యారెంటీతో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల అప్పులు కలిపి రూ.3,06,952.26 కోట్లు ఉన్నాయన్నారు. ఆ తరువాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బడ్జెట్‌తో పాటు గ్యారెంటీతో కలిపి రూ.3,70,897.54 కోట్లు మాత్రమే అప్పులు చేసిందని ఆర్థిక మంత్రి కేశవ్ లిఖిత పూర్వక సమాధానంలో స్పష్టం చేశారు. ఈ గణాంకాలన్నీ అకౌంటెంట్ జనరల్ (ఏజీ) ఫైనాన్స్ ఖాతాల నుంచి చెప్పినట్లు మంత్రి కేశవ్ పేర్కొన్నారు.

సీఎంగా ఉంటూ అబద్ధాలా బాబూ..?

బడ్జెట్ బయట, బడ్జెట్ లోపల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసిందంటూ పదే పదే సీఎం చంద్రబాబు చెబుతున్న మాటలన్నీ అవాస్తవాలేనని శాసన సభ సాక్షిగా ఆర్థిక మంత్రి లిఖిత పూర్వక సమాధానంతో మరోసారి తేటతెల్లమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి అంటే జూన్ 12, 2024 నాటికి ఐదేళ్లలో బడ్జెట్‌లోనూ, బడ్జెట్ బయట గ్యారెంటీలతో చేసిన మొత్తం అప్పు కేవలం రూ.3,70897.54 కోట్లేనని ఆర్థిక మంత్రి కేశవ్ సమాధానంతో వెల్లడైంది. వాస్తవాలు ఇలా ఉంటే ఇప్పటికీ సీఎం చంద్రబాబు అసెంబ్లీలోనూ, బయట పదే పదే గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసిదంటూ నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతుండటం, సాక్షాత్తూ గవర్నర్‌తోనూ ఆయన ప్రసంగంలో అబద్ధాలు పలికిస్తుండటం విస్తుగొలుపుతోంది. ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ అవాస్తవాలు చెప్పడం ఒక్క చంద్రబాబుకే చెల్లుతుందని ఆర్థిక నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ చేయని అప్పులు చేసినట్లు బుకాయించడం ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వడమేనని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఈ ఆర్థిక ఏడాది (2025-26) బడ్జెట్ అంచనాల్లో అప్పులు, ఆగస్టు వరకు చేసిన అప్పులు ఇలా..

వివరాలు	బడ్జెట్ అంచనా అప్పు	ఆగస్టు నెలాఖరు వరకు చేసిన అప్పు (రూ.కోట్లలో)
బహిరంగ మార్కెట్ రుణాలు	80,456.50	37,172.03
కేంద్రం నుంచి రుణాలు	21,700	6,920.17
ఇతర రుణాలు	1,500	271.86
మొత్తం	1,03,656.50	44,364.06

2014-15 నుంచి 2024 జూన్ 12 నాటికి ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల బకాయి అప్పులు ఇలా..

సంవత్సరం	ఏజీ ఖాతాల మేరకు ప్రభుత్వ అప్పు	ఏజీ ఖాతాల మేరకు గ్యారెంటీతో ప్రభుత్వ రంగ సంస్థల అప్పు (రూ.కోట్లలో)
2014-15	1,48,743.46	10,675.30
2015-16	1,69,458.08	7,058.53
2016-17	1,94,862.16	9,664.94
2017-18	2,23,705.96	35,964.06
2018-19	2,57,509.90	49,442.36
12 జూన్ 2024 నాటికి	5,19,192.00	1,58,657.80
2024-25 సవరించిన	5,64,448.34	1,53,651.13

నేడు 'స్థానిక' రిజర్వేషన్ల ఖరారు

ఎవరికీ వెల్లడించొద్దంటూ అధికారులకు కలెక్టర్ల హెచ్చరికలు జారీ

- ప్రభుత్వం నుంచి 42 శాతం బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన జీవో వెలువడగానే నోటిఫికేషన్ ఇచ్చే యోచనలో రాష్ట్ర ఎన్నికల సంఘం
- ఎన్నికల సన్నాహాల్లో పూర్తిగా నిమగ్నమైన పీఆర్‌లోని అన్ని స్థాయిల అధికారులు, సిబ్బంది

సాక్షి, హైదరాబాద్ : గ్రామీణ స్థానిక సంస్థల్లోని ఆయా స్థానాలకు మంగళవారంలోగా రిజర్వేషన్లను ఖరారు చేయాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా, మండల, గ్రామ పంచాయతీల్లో అధికారులు పూర్తిస్థాయిలో ఆ పనిలో నిమగ్నమయ్యారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలోని అన్ని స్థాయిల అధికారులు...వార్డు సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, జెడ్పీ చైర్మన్ల రిజర్వేషన్ల ఖరారుకు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ఆలోచనతో ఉన్నందున, దానికి అనుగుణంగా జీపీలు, మండల, జిల్లా పరిషత్‌లలో ఈ మేరకు కసరత్తు ఓ కొలిక్కి వచ్చినట్టుగా తెలుస్తోంది. ఇప్పటికైతే ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా డెడికేటెడ్ కమిషన్ డేటా ఆధారంగా...ముందుగా ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్లు ఖరారు చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు, జనరల్ (అన్‌రిజర్వుడ్)లకు తగ్గట్టుగా, అన్ని కేటగిరీల్లో మహిళలకు 50 శాతం స్థానాలు రిజర్వ్ చేయనున్నారు. దీనికి సంబంధించి సోమవారం వివిధ జిల్లాల్లో కలెక్టర్లు ఆర్డీఓలు, ఎండీఓలు, డీపీఓలతో సమావేశాలు నిర్వహించి రిజర్వేషన్లు ఎలా చేయాలన్న దానిపై అవగాహన కల్పించారు. నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియ ముగించాలని ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకల్లా పూర్తిచేసిన రిజర్వేషన్లను తమకు సమర్పించాలని చెప్పారు. అయితే ఖరారు చేసిన రిజర్వేషన్లను ఇప్పుడే ఎవ్వరికీ వెల్లడించొద్దని హెచ్చరికలు జారీ చేసినట్టు అధికార వర్గాల సమాచారం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం, స్థానిక ఎన్నికల తేదీలపై నిర్ణయం తీసుకొని, దానిని రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలియజేస్తే.. వెంటనే స్థానిక ఎన్నికల షెడ్యూల్ జారీచేసి, ఆ మరుసటిరోజే నోటిఫికేషన్ ఇచ్చేందుకు ఎస్ఈసీ సిద్ధమవుతోంది.

నేటిలోగా ఆయా కేటగిరీల రిజర్వేషన్లు ఖరారు

- మంగళవారంలోగా ఆయా స్థానిక ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈవోలు, డీపీవోలకు ఆదివారం సీఎస్ ఆదేశాలు జారీ చేసి న విషయం తెలిసిందే. అయితే 2019 జనవరిలో రాష్ట్రంలో తొలిసారిగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించినప్పు డు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018కు అనుగుణంగా...గ్రామపంచాయతీల్లో వార్డు సభ్యులు, సర్పంచ్‌ల స్థానాలకు రిజర్వేషన్లకు అనుసరించిన విధానాన్ని అధికారుల పరిశీలనకు ఓ మోడల్‌గా పంపించినట్టు సమాచారం.



- 2019 జూన్‌లో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018కు అనుగుణంగా మండల, జిల్లా పరిషత్‌లకు నిర్వహించిన ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, జెడ్పీ చైర్మన్ పదవులకు అనుసరించిన రిజర్వేషన్ల విధానాన్ని, ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను అధికారుల పరిశీలనకు ఓ మోడల్‌గా పంపించి, దానిని ఈ కసరత్తుతో సరిచూసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

కలెక్టర్లకు మార్గదర్శకాలివీ...

ఎంపీపీ, జెడ్పీటీసీ రిజర్వేషన్లు ఎలా చేయాలనే దానిపై ఓ స్పష్టమైన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, సూచనలను జిల్లా కలెక్టర్లకు ఉన్నతాధికారులు పంపించారు. అందులో ప్రధానంగా రిజర్వేషన్ల ఖరారుకు అనుసరించాల్సిన విధానం, సుప్రీంకోర్టు ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్ నియామకం, ఆ కమిషన్ సమర్పించిన డేటా, ఎన్నికలు జరగనున్న స్థానాలకు రిజర్వేషన్ల రొటేషన్‌కు పాటించాల్సిన పద్ధతి, కొత్తగా ఏర్పడిన జీపీలు, మున్సిపాలిటీల్లో ఆయా జీపీలు విలీనంతో ఆయా మండలాల్లో మారిన ఎంపీటీసీ స్థానాలు, తదితరాల విషయంలో ఏ విధానాన్ని అనుసరించాలనే దానిపై స్పష్టత నిచ్చారు. దీంతోపాటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలతోపాటు ఎంపీపీ, జెడ్పీ చైర్మన్ పోస్టులను ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళలకు రిజర్వ్ చేయడానికి సంబంధించిన విధానమూ ఉంది.

- షెడ్యూల్ ఏరియాల్లో ఎస్టీల రిజర్వేషన్ సీట్లను వారి జనాభా నిష్పత్తితో మొత్తం సీట్లలో 50 శాతం తగ్గకుండా చూ డాలని ఆదేశించారు. షెడ్యూల్ ఏరియాల్లో అన్ని మండల అ ధ్యక్షుల పదవులను ఎస్టీలకే రిజర్వ్ చేయాలని సూచించారు.
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రిజర్వేషన్ ఖరారు చేసే అధికారం (కాంపిటెంట్ అథారిటీ) రాష్ట్రస్థాయిలో కమిషనర్ పంచాయతీరాజ్‌కే ఉంటుందని స్పష్టం చేశారు.
- జిల్లాల్లో ఎంపీపీ, జెడ్పీటీసీల రిజర్వేషన్ల ఖరారు అధికారం జిల్లాస్థాయిలో కలెక్టర్లదేనని తెలిపారు.
- మండలాల్లో ఎంపీటీసీల రిజర్వేషన్లు ఖరారు చేసే అధికారి (కాంపిటెంట్ అథారిటీ) మండల స్థాయిలో ఆర్డీఓలదేనని తెలియజేశారు.
- బీసీ రిజర్వేషన్లు మాత్రం 2024లో చేసిన ఎస్ఈఈఈపీసీ సర్వే ఆధారంగా ఖరారు చేయాలని పేర్కొన్నారు.
- – ఎంపీటీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రతీ కేటగిరీని డెడికేషన్ కమిషన్ సూచించిన మేరకే చేయాలని చెప్పారు.
- ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళా రిజర్వేషన్లను మొదటి సాధారణ ఎన్నికలను బట్టి (2019లో జరిగినవి) రొటేషన్ పద్ధతిలో చేపట్టాలన్నారు.
- ప్రతీ మండల ప్రజాపరిషత్‌కు ఆర్డీఓనే రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉంటుందని, ఆయా రిజర్వేషన్లను ఆయా కేటగిరీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా చేయాలని తెలిపారు.
- ఎస్టీ, ఎస్సీ, బీసీ రిజర్వేషన్ల ఖరారు తర్వాత మిగిలిపోయిన మిగతా వాటికి అన్ రిజర్వ్‌డ్ (యూఆర్)గా మార్క్ చేయాలని సూచించారు.
- ప్రతీ కేటగిరీ అంటే ఎస్టీ, ఎస్సీ, బీసీ, యూఆర్‌లలో 50 శాతం రిజర్వేషన్ల మహిళలకు కేటాయించేందుకు డ్రా నిర్వహించాలని (మొదటి ఎన్నికల్లో మహిళలకు రిజర్వ్ అయిన స్థానాలను మినహాయించి) సూచించారు.
- జెడ్పీటీసీ సీట్ల రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి అనుసరించాల్సిన విధానాన్ని కూడా తెలియజేశారు.

కలెక్టర్ల సందేహాల నివృత్తి ఇలా...

గ్రామపంచాయతీలు, కొత్తగా ఏర్పడిన మండలాల విషయంలో రిజర్వేషన్లు ఎలా ఖరారు చేయాలన్న దానిపైనా కలెక్టర్లకు ప్రభుత్వం స్పష్టతనిచ్చింది.

- కొత్త గ్రామపంచాయతీ నోటిఫై (ఏర్పాటు) అయినచోట్ల వార్డు సభ్యులకు రిజర్వేషన్ల రొటేషన్‌ను 'ఫస్ట్ రొటేషన్'గా పరిగణించాలని తెలిపారు.
- కొత్త మండలం నోటిఫై అయిన చోట మండలాన్ని రిజర్వేషన్ యూనిట్‌గా తీసుకొని సర్పంచ్, ఎంపీటీసీ సీట్ల రిజర్వేషన్లను 'ఫస్ట్ రొటేషన్'గా తీసుకోవాలని పేర్కొన్నారు.
- ఏదైనా మండలం కొత్తగా నోటిఫై కాకపోయినా అందులోని ఎంపీటీసీలు పునర్ వ్యవస్థీకరణ కారణంగా మారిన నేపథ్యంలో ఈ మండలంలోని అన్ని ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్‌ను రెండో రొటేషన్ కింద తీసుకోవాలని స్పష్టం చేశారు.

అల్లకాస్ కంప్లీట్ ఫ్యామిలీ షాపింగ్ మాల్ ప్రారంభం



అల్లకాస్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి ప్రియాంక మోహన్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అల్లకాస్ కంప్లీట్ ఫ్యామిలీ షాపింగ్ మాల్‌ను 'ఓజీ'సినిమా హీరోయిన్ ప్రియాంక మోహన్ ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లకాస్ యజమాని అల్లక సత్యనారాయణ మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు సరికొత్త ఫ్యాషన్ ప్రపంచాన్ని అల్లకాస్ పరిచయం చేస్తుందన్నారు.

పేదల పట్ల మూర్ఖంగా వ్యవహరించారు

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



ఎంపీ ఈటల రాజేందర్‌కు తమ గోడును వెళ్లబోసుకుంటున్న ఇళ్లు కోల్పోయిన బాధితులు

సుభాష్‌నగర్: గాజులరామారంలోని బాలయ్యనగర్, నరసింహబస్తీ, గాలి పోచమ్మ బస్తీలో హైడ్రా కూల్చివేతలపై రాజకీయ నాయకులు మండిపడ్డారు. సోమవారం ఆ ప్రాంతాల్లో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వేర్వేరుగా పర్యటించి ఇళ్లు కోల్పోయిన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఇళ్ల కూల్చివేతల సమయంలో పేదలు కన్నీరుమున్నీరు అవుతున్న హైడ్రా అధికారులు కనికరించకుండా నిజాం రాజుల కన్నా మూర్ఖంగా ప్రవర్తించారన్నారు. వీరు ఏమైనా పాకిస్తాన్, బంగ్లాదేశ్ వారు కాదు కదా.. భరతమాత బిడ్డలే కదా శత్రు దేశం మీద దాడి చేసినట్టు ఏంటి ఈ దాడులని మండిపడ్డారు. పేదరికంలో ఉన్న వారికి కన్నీరు పెట్టించడం నీకు తగునా అని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ప్రశ్నించారు. 300 గుడిసెలు కూలగొట్టి రూ.15 వేల కోట్ల స్థలాన్ని కాపాడామంటూ ట్విట్టర్‌లో పెట్టుకోవడం సిగ్గుచేటు అన్నారు.

మరోసారి దాడులు చేస్తే నేనే జేసీబీకి అడ్డుగా నిల్చుంటా: కవిత

హైడ్రా అధికారులు పెద్దలు కబ్జా చేసిన స్థలాలను వదిలి పేదలపై తమ ప్రతాపం చూపించడం హేయమైన చర్య అని కల్వకుంట్ల కవిత అన్నారు. అక్టోబర్ 6వ తేదీ లోపు మిగతా ఉన్న ఇళ్లను ఖాళీ చేయిస్తామని అధికారులు చెప్పడం దారుణమని, ఒకవేళ వస్తే వారి జేసీబీకి నేనే స్వయంగా అడ్డుగా ఉంటానని హెచ్చరించారు.

➤ బాలయ్యనగర్, గాలి పోచమ్మ బస్తీ, హబీబ్ బస్తీ, నరసింహ బస్తీ, మిథిలానగర్ నగర్‌లో ఇళ్లు కోల్పోయిన బాధితులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఇంటికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
23-9-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
466	125
82,160	25,202

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,775	▲	143
డోజోన్స్	46,419	▲	103
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,232	▲	16
డాక్స్	23,533	▽	106
షాంఘై	3,829	▲	8
నికాయ్	45,494	▲	448

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. ల్లో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.80	88.82
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.23	121.22
€	యూరో	ఎస్‌బీఐ	102.23	105.02
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.28	60.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.29	59.57
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.27	69.97
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.60	24.10
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.09	24.35
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.50	13.32

పండుగల ముందు పసిడి పరుగు

- ఒకే రోజు రూ.2,200 పెరుగుదల
- ఢిల్లీలో కొత్త గరిష్టం 1,16,200

న్యూఢిల్లీ: పండుగల ముందు పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. సోమవారం ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత పసిడి 10 గ్రాములకు ఏకంగా రూ.2,200 పెరిగి మరో కొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,16,200కి చేరుకుంది. వెండి సైతం రూ.4,380 ర్యాలీ చేసి కిలోకి రూ.1,36,380 స్థాయిని (కొత్త ఆల్‌టైమ్ గరిష్టం) తాకింది.



'అంతర్జాతీయ మార్కెట్లలో ఉన్న బుల్లిష్ ధోరణికి అనుగుణంగా దేశీయంగానూ బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిల్లో ట్రేడయ్యాయి. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది చివరి నాటికి మరో రెండు రేట్ల కోతలు ఉంటాయంటూ సంకేతం ఇవ్వడం డాలర్, ట్రెజరీ ఈల్డ్స్ బలపడటాన్ని అడ్డుకుంది. ఇది పసిడి, వెండి ధరలకు మద్దతిచ్చింది' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయంగా చూస్తే బంగారం ధర 50 డాలర్లకు పైగా పెరిగి 3,760 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యింది. ఈ ఏడాది ఇప్పటి దాకా దేశీ మార్కెట్లో పసిడి ధరలు 47%, వెండి ధరలు 52% పెరగడం గమనార్హం.

అక్టోబర్ 21న మూరత్ ట్రేడింగ్

ముంబై: దీపావళి సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలు అక్టోబర్ 21న గంట పాటు ప్రత్యేక 'మూరత్ ట్రేడింగ్' నిర్వహించనున్నాయి. మధ్యాహ్నం 1.45 గంటలకు మొదలై 2.45 గంటలకు ట్రేడింగ్ ముగుస్తుందని ఎన్‌ఎస్‌ఈ, బీఎస్‌ఈ తెలిపాయి.



ఈ దీపావళి నుంచి సంవత్ 2082 ఆరంభం కానుంది. ఈ పర్వదినం రోజు ట్రేడింగ్ చేస్తే.. వచ్చే దీపావళి వరకు లాభాలు వరిస్తాయనే నమ్మకంతో చాలా మంది మూరత్ ట్రేడింగ్‌లో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతుంటారు. గతేడాది(2024) ప్రత్యేక మూరత్ ట్రేడింగ్ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహించాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..

యూఎస్‌కు స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు డీలా	మార్కెట్‌కు హెచ్-1బీ ఫీజు పెంపు సెగ..

స్టాక్ మార్కెట్లే ఇప్పుడు దిక్కు

అమెరికా నుంచి ప్రతికూలతలు ఎదురవుతున్నా... విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అమ్మకాలు కొనసాగిస్తున్నా... భారత మార్కెట్లు అంతకంతకూ పెరుగుతుండటానికి కారణం దేశీ ఇన్వెస్టర్లకు మార్కెట్లపై ఉన్న నమ్మకమేనని, కొన్నేళ్లుగా వారు కళ్లజూస్తున్న లాభాలే వారిని ఇన్వెస్ట్‌మెంట్‌కు ప్రేరేపిస్తున్నాయని ఎడిల్‌వీజ్ ఏఎంసీ ఎండీ- సీఈఓ రాధికా గుప్తా అభిప్రాయపడ్డారు. వినూత్న ఉత్పత్తులతో ఎడిల్‌వీజ్‌ను దేశవ్యాప్తంగా విస్తరించి... దేశంలోని అగ్రశ్రేణి మ్యూచువల్‌ఫండ్ కంపెనీల్లో ఒకటిగా మార్చిన రాధికా గుప్తా... నిరంజన్ అవస్థితో కలిసి 'మ్యాంగో మిలియనీర్' అనే పర్సనల్ ఫైనాన్స్ పుస్తకాన్ని రాశారు. దానికి సంబంధించిన కార్యక్రమంలో పాల్గొంటూ 'సాక్షి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. వచ్చే ఐదేళ్లలో ఎంఎఫ్ పరిశ్రమ 200 లక్షల కోట్లకు చేరుతుందంటున్న రాధికాతో 'సాక్షి' ఇంటర్వ్యూ ఇది...

'సాక్షి'తో ఎడిల్‌వీజ్ ఎండీ-సీఈఓ రాధికా గుప్తా

- ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాలేవీ ఆకర్షణీయంగా లేవు
- అందుకే యువత సహా ఇన్వెస్టర్లంతా ఇటు చూస్తున్నారు
- అంతర్జాతీయ ప్రతికూలతలున్నా పెరుగుతున్నది అందుకే...
- గడిచిన కొన్నేళ్లుగా వచ్చిన లాభాలు మార్కెట్లపై నమ్మకం పెంచాయి
- కొన్ని షేర్లలో బబుల్స్ ఉండొచ్చు.. కానీ పునాదులు బలంగా ఉన్నాయి
- లిస్టింగ్ లాభాల కోసం తాడూబొంగరం లేని అన్‌లిస్టెడ్ కంపెనీల్లో పెట్టొద్దు
- దేశ వృద్ధిలో అన్ని రంగాలూ కీలకం.. అందుకే మ్యూచువల్ ఫండ్లు బెటర్
- తక్కువైనా... స్థిరమైన రాబడులతోనే సంపద సృష్టి సాధ్యం



(సాక్షి, ప్రత్యేక ప్రతినిధి)

అంతర్జాతీయంగా ఇబ్బందులెదురవుతున్నా భారత మార్కెట్లు కొత్త శిఖరాలను చేరుకోవటానికి కారణం?

యువత ఆకాంక్షలు పెరుగుతున్నాయి. మరోవంక ఇన్వెస్ట్‌మెంట్‌కు మరీ ఎక్కువ ప్రత్యామ్నాయాలేవీ లేవు. ఎందుకంటే బ్యాంకు డిపాజిట్లు చేశారనుకుందాం. పన్నులు పోతే మిగిలేది తక్కువే. పెరుగుతున్న జీవన ప్రమాణాలకిది సరిపోదు. అందుకని సహజంగానే జనం ఈక్విటీ మార్కెట్ల వైపు చూస్తున్నారు. నేను ఎంఎఫ్ పరిశ్రమలో అడుగుపెట్టినపుడు 'సిప్' ద్వారా వచ్చే మొత్తం 4 వేల కోట్లుగా ఉండేది. ఇపుడది 28వేల కోట్లకు చేరింది. ఇందులో అత్యధిక భాగం దీర్ఘకాలికం. అదే ఇక్కడ కీలకం. ప్రత్యేకించి గడిచిన రెండేళ్లుగా మార్కెట్లోకి వస్తున్న కొత్త ఇన్వెస్టర్లకు మంచి లాభాలొస్తున్నాయి.

అయితే ఈ ర్యాలీ చల్లారిపోయేది కాదని, బుడగలేవీ లేవని అంటున్నారా?

స్మాల్‌క్యాప్ కంపెనీలు... కొన్ని థీమ్స్..., కొన్ని కంపెనీల రూపంలో ఈ బబుల్స్ ఉండొచ్చు. పాలపై నురుగు ఓ 20 శాతం తప్పదు. ఏ బుల్ ర్యాలీకైనా ఇది వర్తిస్తుంది. దానర్థం మొత్తం మార్కెట్ ఇలానే ఉందని కాదుకదా? పునాదులు గట్టిగా ఉన్నాయన్నదే నా పాయింట్.

మరి ఇలాంటి సమయంలో రిటైల్ ఇన్వెస్టర్లకు మీరేం చెబుతారు?

అన్నిటికన్నా ముఖ్యం... అతిగా ఆశించకపోవటం. నా పుస్తకంలో కూడా అదే చెప్పాను. చాలామంది ఇన్వెస్టర్లు గత సంవత్సరాన్ని బేరీజు వేసుకుంటూ 30–40 శాతం రాబడి వస్తుందనే అంచనాలతో ఉన్నారు. అది సరికాదు. రెండోది... హైబ్రిడ్ ఫండ్లు, మల్టీ అసెట్ ఫండ్లు, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ల వంటి మధ్యస్థ ఆదాయాన్నిచ్చే ఉత్పత్తులను ఎంచుకోండి. ఇవి మరీ సంప్రదాయకంగా కాకుండా... మరీ దూకుడుగా కాకుండా మధ్యస్థంగా ఇన్వెస్ట్‌చేస్తాయి. స్థిరంగా నిలకడైన రాబడులనిస్తాయి. సంపద సృష్టించాలంటే అలానే సాధ్యం.

డిఫెన్స్ థీమ్, ప్రభుత్వ బ్యాంకుల థీమ్ అంటూ రకరకాల స్టోరీలను ఈ మధ్య చూస్తున్నాం. చాలామంది రిటైల్ ఇన్వెస్టర్లు వీటిని నమ్ముతున్నారు కదా?

నిజమే!. రిటైలర్లు ఇలాంటి స్టోరీల వెంటనే పరిగెడతారు. చివరకు దురదృష్టకరంగా ఎగ్జిట్ అవుతారు. నేనైతే ఈ థీమ్‌లను నమ్మను. ఏ ఒక్క రంగం వల్లనో దేశం ముందుకెళ్లదు. హోటల్స్, హాస్పిటల్స్, డేటా సెంటర్స్, క్యాపిటల్ మార్కెట్స్, టెక్నాలజీ.. ఇలాంటి రంగాలన్నీ దేశాభివృద్ధితో ముడిపడి ముందుకెళతాయి.

యువత చాలామంది ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ చేస్తున్నారు. మీరేమంటారు?

అదో దుర్మార్గం. ఎఫ్ అండ్ ఓ అనేది సంస్థలు రిస్కును తగ్గించుకోవటానికి ఉపయోగించుకోవాల్సిన సాధనం. అంతేతప్ప అప్పులు తెచ్చి ట్రేడింగ్ చేసే యువత కోసం కాదు. విద్యార్థులు, చిన్నచిన్న వర్కర్లు, డ్రైవర్లు రుణాలు తీసుకుని ట్రేడింగ్ చేస్తున్న వ్యవహారాన్ని నేనూ విన్నా. ఇది గ్యాంబ్లింగ్. ప్రమాదకరం. రిటైల్ ఇన్వెస్టర్లు సిప్, మ్యూచువల్ ఫండ్ల ద్వారా తేలిగ్గా సంపద సృష్టించుకోవచ్చు. గ్యాంబ్లింగ్ అవసరం లేదు.

మార్కెట్లో ఏ ఒక్క రంగమైనా మరీ అతిగా పెరిగినట్లు భావిస్తున్నారా?

అలాగని చెప్పలేం. అయితే కొన్ని అన్‌లిస్టెడ్ కంపెనీలు, ఎస్‌ఎంఈ ఐపీఓల విషయంలో మాత్రం ఆందోళన ఉంది. లిస్టింగ్‌లోనే లాభాలొస్తాయి కదా అని చాలామంది రిటైల్ ఇన్వెస్టర్లు కంపెనీ పూర్వాపరాలేవీ పట్టించుకోకుండా అన్‌లిస్టెడ్ కంపెనీల్లో పెట్టుబడులు పెడుతున్నారు. పేరు చెప్పలేను కానీ... ఈ మధ్య ఒక ఐపీఓలో దెబ్బతిన్నారు. కొన్ని ఎస్‌ఎంఈ కంపెనీలూ అంతే. వీటిలో పెద్ద లిక్విడిటీ ఉండదు. పరిస్థితులు అనుకూలించకపోతే ఇరుక్కుపోయే ప్రమాదమే ఎక్కువ. అందుకే నేనెప్పుడూ రిటైల్ ఇన్వెస్టర్లను ఇండెక్స్ ఫండ్లలో గానీ, ఏవైనా ఇతర మ్యూచువల్ ఫండ్లలో గానీ పెట్టుబడి పెట్టమని చెబుతాను.

కానీ కొన్ని కంపెనీలు ఏడాదిలో 50 శాతం... రెండు మూడు రెట్లు పెరగటం చూస్తున్నారు కదా? ఇవి రిటైలర్లను ఆకర్షిస్తాయి కదా?

ఇలా పెరిగిన రెండుమూడు గురించే అంతా చెబుతారు. కానీ కుదేలైన షేర్ల గురించి చెప్పరు. స్టాక్ మార్కెట్లో లాభాలు ఆర్జించిన వారిని తప్ప నష్టపోయిన వారి స్టోరీలు బయటకు రావు. ఇలా ఒక షేర్లో పెట్టి లాభపడ్డ వారు కూడా మిగిలిన షేర్లలో రాబడి గురించి చెప్పరు. ఆ షేర్‌ను ఎంచుకోవటం వెనక వారి శ్రమ, సమయం కూడా ఉంటాయి కదా?

ఏడాదికి 10–12 శాతం రాబడినిచ్చే మ్యూచువల్ ఫండ్లు బోరింగ్‌గా అనిపించవచ్చు. కానీ ఆ రాబడి స్థిరంగా ఉంటుంది. సురక్షితం కూడా.

చిన్న పట్టణాల్లో ఇన్వెస్ట్‌మెంట్ సంస్కృతి పెరుగుతోందా?

చాలా. ఎడిల్‌వీజ్‌ను 5 నగరాల్లో ఆరంభించాం. ఇపుడు 60 పట్టణాల్లో ఉన్నాం. త్వరలో 200 పట్టణాలకు విస్తరిస్తాం. స్థానిక భాషల్లో ఆర్థిక పాఠాల లభ్యత.. వారికి సలహాదారులు, డిస్ట్రిబ్యూటర్లు అందుబాటులో ఉండటమన్నదే ప్రధానం.

పాసివ్ (ఇండెక్స్) ఫండ్లకు ఆదరణ పెరుగుతోంది కదా.. మరి యాక్టివ్ ఫండ్లకు వీటితో పోటీ ఉంటుందా?

అలాంటిదేమీ లేదు. చాలామంది ఇన్వెస్టర్లు రెండింట్లోనూ పెట్టుబడి పెడుతున్నారు. బాగా రాబడులనిచ్చిన యాక్టివ్ ఫండ్లలోకి పెట్టుబడులొస్తాయి. లేదంటే పాసివ్ ఫండ్లలోకి వెళతాయి. రెండూ పెరుగుతున్నాయనేది మనం గమనించాలి.

భారత్ బాండ్ ఫండ్ మాదిరి ఎడిల్‌వీజ్ నుంచి కొత్త ఉత్పత్తులేమైనా వస్తున్నాయా?

అక్టోబర్ 1న మేం దేశంలో మొట్టమొదటి హైబ్రిడ్ స్పెషల్ ఇన్వెస్ట్‌మెండ్ ఫండ్‌ను (ఎస్ఐఎఫ్) ఆరంభించబోతున్నాం. సెబీ ఇటీవలే దీనికి అనుమతిచ్చింది. దీన్లో కనీస పెట్టుబడి సైజు రూ.10 లక్షలు. దీన్లో రిస్క్ తక్కువ ఉంటుంది. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల్ని బ్యాలెన్స్ చేసుకోవటానికి ఈ ఫండ్ ఉపయోగపడుతుంది.

ఇపుడు చాలామంది ఇన్వెస్టర్లు అమెరికా సహా అంతర్జాతీయ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేయాలని చూస్తున్నారు. ఎడిల్‌వీజ్ ప్రణాళికలేంటి?

టెక్నాలజీ, చైనా సహా కొన్ని గ్లోబల్ ఫండ్లను మేం నడిపిస్తున్నాం. కాకుంటే వీటికి ఆర్‌బీఐ పరిమితులున్నాయి. వీటిని గిఫ్ట్ సిటీ ద్వారా అధిగమించే ప్రయత్నం చేస్తున్నాం. ఇప్పటికే గిఫ్ట్‌సిటీలో కార్యాలయాన్ని ఆరంభించాం.

ఐదు పదేళ్లలో ఎంఎఫ్ పరిశ్రమ ఎలా ఉండొచ్చు?

2030 నాటికి ఇది 200 లక్షల కోట్లకు చేరుతుందన్నది నా అంచనా. దీన్లో 130–140 లక్షల కోట్లు ఈక్విటీలోనే ఉంటాయి. సిప్ పెట్టుబడులు నెలకు రూ. లక్ష కోట్లను చేరుతాయి. దేశంలో 30–40 శాతం మంది మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేయటమే వికసిత భారత్‌కు అర్థమన్నది నా భావన.

రిటైలర్లు తరచూ చేసే తప్పులేంటి?

అతిగా ఆశ పడటం, స్నేహితుల్ని కాపీ కొట్టడం, సోషల్ మీడియా టిప్స్ తీసుకోవటం, ఇన్వెస్ట్‌మెంట్ బదులు ట్రేడింగ్ చెయ్యటం, డైవర్సిఫికేషన్ లేకపోవటం ఇలా చాలానే ఉన్నాయి. నా పుస్తకంలో ఒక చాప్టర్ మొత్తం ఇదే రాశాను. ఇక సోషల్ మీడియా విషయానికొస్తే బాధ్యతాయుతంగా వాడితే అదో గొప్ప సాధనం. కాకపోతే ఆర్థిక సలహా అనేది చాలా సీరియస్ వ్యవహారం. తప్పుడు సలహాల్ని నమ్మితే కష్టపడి సంపాదించిన డబ్బు పోతుంది. చాలామంది ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇన్వెస్టర్ల ప్రయోజనాల కోసం కాకుండా లైక్‌ల కోసం సలహాలిస్తుంటారు. తెలియని విషయాన్ని చెప్పొద్దన్నది నా సలహా. అర్హులైన నిపుణుల నుంచే సలహాలు తీసుకోవాలి.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- తెలంగాణ చరిత్ర » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- పాలిటీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-రీజనింగ్

విద్య, ఉద్యోగ సమాచారం

బెల్ ఘజియాబాద్‌లో 35 ట్రైనీ ఇంజనీర్ పోస్టులు

ఘజియాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్).. ట్రైనీ ఇంజనీర్-1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 35.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
» **వయసు:** 01.09.2025 నాటికి 28 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **దరఖాస్తులకు చివరితేది:** 24.09.2025.
» **వెబ్‌సైట్:** http://https//bel-india.in/

ఐఐటీ జమ్మూలో ఫిజియోథెరపిస్ట్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), జమ్మూ.. తాత్కాలిక ప్రాతిపదికన ఫిజియోథెరపిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ (ఫిజియోథెరపీ)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 50 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **దరఖాస్తులకు చివరితేది:** 30.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.iitjammu.ac.in/

ఐఐఎస్సీ, బెంగళూరులో పోస్టులు

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ).. ఒప్పంద ప్రాతిపదికన ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **విభాగాలు:** బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. పోస్ట్ పీహెచ్‌డీ అనుభవం ఉండాలి.
» **వయసు:** 45 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **దరఖాస్తులకు చివరితేది:** 01.10.2025.
» **వెబ్‌సైట్:** https://iisc.ac.in/

నిట్ వరంగల్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ).. ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోలు(జే ఆర్‌ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు ఉండాలి.
» **ఫెలోషిప్:** నెలకు మొదటి రెండు సంవత్సరాలు రూ.37,000, మూడో సంవత్సరం రూ.42,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **దరఖాస్తులకు చివరితేది:** 23.09.2025.
» **వెబ్‌సైట్:** https://nitw.ac.in/

ఆర్ఆర్‌సీ-సదరన్ రైల్వేలో 67 స్పోర్ట్స్ కోటా పోస్టులు

చెన్నైలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ (ఆర్ఆర్‌సీ) సదరన్ రైల్వే పరిధిలోని లెవల్ 1, 2, 3, 4, 5 స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం పోస్టుల సంఖ్య:** 67.

» **పోస్టుల వివరాలు:** లెవల్1–46, లెవల్ 2, 3–16, లెవల్ 4, 5–05.
» **స్పోర్ట్స్ విభాగాలు:** అథ్లెటిక్స్, బాక్సింగ్, క్రికెట్, బాస్కెట్‌బాల్, గోల్ఫ్, స్విమ్మింగ్, టెన్నిస్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు క్రీడా సంబంధిత పతకాలు పొంది ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, క్రీడా స్కిల్స్, స్పోర్ట్స్ అచీవ్‌మెంట్స్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **దరఖాస్తులకు చివరితేది:** 12.10.2025.
» **వెబ్‌సైట్:** sr.indianrailways.gov.in/

ప్రతిభావంతులకు 'ఆశా'

» ఎస్‌బీఐ ప్లాటినమ్ జూబ్లీ ఆశా స్కాలర్‌షిప్ 2025–26
» 9వ తరగతి నుంచి పీజీ వరకు ఉపకార వేతనాలు

దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ).. ప్రతిభావంతులైన పేద విద్యార్థుల చదువులకు చేయూత ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. తాజాగా ఎస్‌బీఐ ప్లాటినమ్ జూబ్లీ ఆశా స్కాలర్‌షిప్ 2025-26కు ప్రకటన ఇచ్చింది. ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు దీనిద్వారా అండగా నిలవనుంది. ఈ స్కాలర్‌షిప్‌ను ఎస్‌బీఐ ఫౌండేషన్ అందించనుంది. ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐ ఆశా స్కాలర్‌షిప్ పథకం పూర్తి వివరాలు..



ఎస్‌బీఐ ప్లాటినమ్ జూబ్లీ స్కాలర్‌షిప్‌ను వివిధ కేటగిరీల కింద అందించనున్నారు. అవి.. స్కూల్ స్టూడెంట్ కేటగిరీ(9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు), అండర్ గ్రాడ్యుయేట్స్ స్టూడెంట్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ స్టూడెంట్స్, మెడికల్ స్టూడెంట్స్, ఐఐటీ స్టూడెంట్స్, ఐఐఎం స్టూడెంట్స్, ఓవర్‌సీస్ స్టూడెంట్స్ విభాగాల్లో ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు.

స్కాలర్‌షిప్ మొత్తం

సదరు కోర్సు, విద్య స్థాయిని బట్టి రూ.15వేల నుంచి రూ.20లక్షల వరకు స్కాలర్‌షిప్‌ను అందిస్తారు. ఎంపికైన విద్యార్థుల బ్యాంక్ అకౌంట్‌లో నేరుగా స్కాలర్‌షిప్ మొత్తాన్ని జమ చేస్తారు. ప్రతిసంవత్సరం స్కాలర్ షిప్ రెన్యువల్ పొందేందుకు నిబంధనలకు అనుగుణంగా కనీస అర్హత ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. ఈ ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులు సదరు కోర్సు పూర్తి చేసుకునే వరకూ బాసటగా నిలిచే ప్రయత్నం చేయనున్నట్లు పేర్కొన్నారు.

కేటగిరీల వారీగా అర్హతలు:

స్కూల్ స్టూడెంట్స్ విభాగంలో:

- స్కూల్ స్టూడెంట్స్ కేటగిరీలో స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుత విద్యాసంవత్సరంలో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు.
- వీరు గత విద్యాసంవత్సరంలో 75 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించాలి. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు పది శాతం మార్కుల సడలింపు ఉంటుంది. అదేవిధంగా కుటుంబ వార్షిక ఆదాయం రూ.3లక్షల లోపు ఉండాలి. మొత్తం స్కాలర్‌షిప్‌ల్లో బాలికలకు 50 శాతం, ఎస్సీ/ఎస్టీలకు 50 శాతం కేటాయిస్తారు.
- ఈ కేటగిరీ కింద ఎంపికైన విద్యార్థులకు రూ.15వేల వరకూ స్కాలర్‌షిప్ అందుతుంది.

అండర్ గ్రాడ్యుయేట్స్ స్టూడెంట్స్ కేటగిరీ:

- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్ 300లో ఉన్న ప్రముఖ విద్యాసంస్థల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు.
- గత విద్యాసంవత్సరంలో 75 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించాలి. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు పది శాతం మార్కుల సడలింపు ఉంటుంది. అదేవిధంగా కుటుంబ వార్షిక ఆదాయం రూ.6లక్షల లోపు ఉండాలి. మొత్తం స్కాలర్‌షిప్‌ల్లో బాలికలకు 50 శాతం, ఎస్సీ/ఎస్టీలకు 50 శాతం కేటాయిస్తారు.
- ఈ కేటగిరీ కింద ఎంపికైన విద్యార్థులకు రూ.75వేల వరకూ స్కాలర్‌షిప్ అందుతుంది.

పోస్ట్ గ్రాడ్యుయేట్స్ స్టూడెంట్స్

- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్ 300లో ఉన్న ప్రముఖ విద్యాసంస్థల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు.
- గత విద్యాసంవత్సరంలో 75 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించాలి. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు పది శాతం మార్కుల సడలింపు ఉంటుంది. అదేవిధంగా కుటుంబ వార్షిక ఆదాయం రూ.6లక్షల లోపు ఉండాలి. మొత్తం స్కాలర్‌షిప్‌ల్లో బాలికలకు 50 శాతం, ఎస్సీ/ఎస్టీలకు 50 శాతం కేటాయిస్తారు.
- ఈ కేటగిరీ కింద ఎంపికైన విద్యార్థులకు రూ.2.5లక్షల వరకూ స్కాలర్‌షిప్ అందుతుంది.

మెడికల్ స్టూడెంట్స్

- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్ 300లో ఉన్న ప్రముఖ విద్యాసంస్థల్లో మెడికల్ కోర్సు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు.
- గత విద్యాసంవత్సరంలో 75 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించాలి. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు పది శాతం మార్కుల సడలింపు ఉంటుంది. అదేవిధంగా కుటుంబ వార్షిక ఆదాయం రూ.6లక్షల లోపు ఉండాలి. మొత్తం స్కాలర్‌షిప్‌ల్లో బాలికలకు 50 శాతం, ఎస్సీ/ఎస్టీలకు 50 శాతం కేటాయిస్తారు.
- ఈ కేటగిరీ కింద ఎంపికైన విద్యార్థులకు రూ.4.5లక్షల వరకూ స్కాలర్‌షిప్ అందుతుంది.

ఐఐటీ స్టూడెంట్స్

- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు.
- గత విద్యాసంవత్సరంలో 75 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించాలి. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు పది శాతం మార్కుల సడలింపు ఉంటుంది. అదేవిధంగా కుటుంబ వార్షిక ఆదాయం రూ.6లక్షల లోపు ఉండాలి. మొత్తం స్కాలర్‌షిప్‌ల్లో బాలికలకు 50 శాతం, ఎస్సీ/ఎస్టీలకు 50 శాతం కేటాయిస్తారు.
- ఈ కేటగిరీ కింద ఎంపికైన విద్యార్థులకు రూ.2లక్షల వరకూ స్కాలర్‌షిప్ అందుతుంది.

ఐఐఎం స్టూడెంట్స్

- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ల్లో ఎంబీఏ/పీజీడీఎం కోర్సు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు.
- గత విద్యాసంవత్సరంలో 75 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించాలి. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు పది శాతం మార్కుల సడలింపు ఉంటుంది. అదేవిధంగా కుటుంబ వార్షిక ఆదాయం రూ.6లక్షల లోపు ఉండాలి. మొత్తం స్కాలర్‌షిప్‌ల్లో బాలికలకు 50 శాతం, ఎస్సీ/ఎస్టీలకు 50 శాతం కేటాయిస్తారు.
- ఈ కేటగిరీ కింద ఎంపికైన విద్యార్థులకు రూ.5లక్షల వరకూ స్కాలర్‌షిప్ అందుతుంది.

ఓవర్‌సీస్ స్టూడెంట్స్

- క్యూఎస్/టీహెచ్‌ఈ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2024–25లో టాప్ 200 ర్యాంకుల్లో ఉన్న విద్యాసంస్థల్లో పోస్టు గ్రాడ్యుయేషన్, ఆ పై కోర్సులు చదువుతున్న ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు.
- గత విద్యాసంవత్సరంలో 75 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించాలి. అదేవిధంగా కుటుంబ వార్షిక ఆదాయం రూ.6లక్షల లోపు ఉండాలి.
- ఈ కేటగిరీ కింద ఎంపికైన విద్యార్థులకు రూ.20లక్షల వరకూ స్కాలర్‌షిప్ అందుతుంది.

ఎంపిక విధానం

ఎస్‌బీఐ ప్లాటినమ్ జూబ్లీ ఆశా స్కాలర్‌షిప్‌కు ఎంపిక ప్రక్రియను వివిధ దశల్లో చేపడతారు. తొలుత అకడెమిక్ మెరిట్, ఆర్థిక నేపథ్యం ఆధారంగా దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. అలా షార్ట్‌లిస్ట్ అయిన విద్యార్థులకు టెలిఫోన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఆ తర్వాత ధ్రువపత్రాల పరిశీలన అనంతరం తుది ఎంపిక చేపడతారు.

అవసరమైన ధ్రువపత్రాలు

- విద్యాసంబంధిత మార్కుల పత్రాలు, వ్యక్తిగత గుర్తింపు కోసం ఆధార్ కార్డ్ వంటివి, ప్రస్తుత సంవత్సరం ఫీజు రిసీప్ట్, బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఆదాయ ధ్రువపత్రం, ప్రవేశం పొందినట్లు రుజువుచూపే సర్టిఫికెట్(బోనాఫైడ్), కులధ్రువీకరణ పత్రం, ఫోటోలు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 19.09.2025
- **దరఖాస్తులకు చివరి తేది:** 15.11.2025
- **వెబ్‌సైట్:** sbiashascholarship.co.in

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


TVS Racing
TVS
CELEBRATE
WITH THE TVS PREMIUM RANGE OF MOTORCYCLES
GST BENEFITS UP TO ₹ 26 900*
Apache
SERIES
#RacingDNAUnleashed
NOW STARTS @ ₹ 1.02 L*
RONIN
THE ULTIMATE MODERN-RETRO
Ride #UnScripted
NOW STARTS @ ₹ 1.24 L*

ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ల నియామకం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ)కి ప్రభుత్వం నిర్వహణ కమిటీని నియమించింది. మొత్తం 14 మందిని డైరెక్టర్లుగా నియమిస్తూ సోమవారం విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా నుంచి ఇద్దరు, మిగిలిన ఉమ్మడి జిల్లాల నుంచి ఒకొక్కరు చొప్పున అకాశం కల్పించారు. వీరు రెండేళ్ల పాటు పదవిలో ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'ఒకే రాష్ట్రం–ఒకే అసోసియేషన్' విధానం అమలు: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాష్ట్రంలోని క్రీడా సంఘాలకు సంబంధించి 'ఒకే రాష్ట్రం ఒకే అసోసియేషన్' విధానం' అమలు చేయనున్నట్టు క్రీడాశాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. విజయవాడలో సోమవారం క్రీడా సంఘాల సమన్వయ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రతి సంఘం తమ వార్షిక క్రీడా క్యాలండర్‌ను సమర్పించాలని సూచించారు. జీవో నం.490, 272లో ఉన్న విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని, ఎస్ఎస్‌డీసీ 2011 మార్గదర్శకాలకు అనుగుణంగా శాప్ ద్వారా గుర్తింపు కలిగి ఉండాలన్నారు. క్రీడా రిజర్వేషన్లు, ప్రోత్సాహకాలకు సంబంధించి సూచనలు ఆహ్వానించారు. శాప్‌లో 14 అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి సంబంధించి అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను సోమవారం పరిశీలించారు. ఈ ఉద్యోగాల కోసం 68 మంది హాజరై తమ పత్రాలను అందజేశారు.

భార్య చికెన్ వండలేదని యువకుడి ఆత్మహత్య

యర్రగొండపాలెం: భార్య చికెన్ వండలేదని భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలంలోని గోళ్లవిడిపి గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్సై పి.చౌడయ్య కథనం మేరకు ఇంట్లో రోజూ పచ్చడి అన్నం పెడుతున్నావని ఇళ్ల లక్ష్మీనారాయణ (25) తన భార్యతో గొడవ పడ్డాడు. ఆదివారం కావడంతో చికెన్ తినాలని ఉందని చెప్పినా ఆమె చికెన్ వండకపోవడంతో లక్ష్మీనారాయణ తీవ్రమనస్తాపానికి గురై పొలానికి వెళ్లి అక్కడ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని, మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చలపరకోన..చారిత్రక వీణ


చిత్తూరు జిల్లా నగరి సమీపంలో ఉన్న చలపన కోన చరిత్ర ఆనవాళ్లకు సాక్ష్యంగా నిలుస్తోంది. కోనలోని రాళ్లలో కొన్ని వేల ఏళ్ల చరిత్ర దాగుంది. ఆదిమానవుల జీవన శైలిని తెలిపే అనేక గుర్తులు ఇక్కడ దర్శనమిస్తున్నాయి. ప్రాచీన చరిత్రను తెలిపే ఆధారాలు ఇక్కడ అనేకం. ఆదిమానవుడి కాలం నాటి శిలా చిత్రలేఖనాలు, ఎరుపు వర్ణంలో మానవ చిత్రాలు, చక్రాల గుర్తులు దర్శనమిస్తాయి. మహర్షులు తపస్సు చేసినట్లు ఆనవాళ్లు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఈ కోన ఖ్యాతిని పెంచి పర్యాటక కేంద్రంగా మార్చాలని నగరి ప్రజలు కోరుతున్నారు.

- చరిత్రకు ఆనవాళ్లు చలపనకోన కొండ గుహలు
- నాటి ఆదిమానవులు గీసిన చిత్రాలు.. మహర్షులు తపస్సు చేసిన గుర్తులు
- మెగాలిథిక్ కళకు సారూప్యత అంటున్న పురావస్తు అధ్యయనకారులు
- ఇక్కడి రాతి శాసనానికి 600 ఏళ్లు
- గత ప్రభుత్వంలో సీసీ రోడ్డు నిర్మాణం
- పర్యాటక కేంద్రంగా మార్చాలని నగరి మండల ప్రజల కాంక్ష

నగరి : చిత్తూరు జిల్లా నగరి మండలంలోని ముడిపల్లి గ్రామం నుంచి 3 కి.మీ దూరంలో స్థానికంగా చలపరకోన కొండ ఉంది. ఇక్కడ వెలసిన చలపరమ్మ అనే దేవత కారణంగా ఈ ప్రాంతానికి ఈ పేరు వచ్చింది. స్థానిక ప్రజలు అమ్మవారికి పూజలు చేస్తారు. సమీపంలో ఉన్న గుహ లోపల చలపరమ్మ దేవత ఉండేదని చెబుతారు. ఈ ప్రదేశానికి దగ్గరగా గతంలో పురాతన శిలాయుగం పనిముట్లు గుర్తించబడ్డాయి. పరిసరాల్లో 3వ శతాబ్దం నాటి చారిత్రక అవశేషాలు కనుగొన్నారు.

రాతిశాసనానికి 600 ఏళ్లు

చారిత్రక విశేషాలకు నెలవుగా చెప్పుకునే చలపరకోన, నాగతీర్థం కొండలకు సమీపంగా కరియమాణిక్య స్వామి ఆలయ సమీపంలో ఒక రాతి శాసనం ఏర్పాటు చేయబడింది. అందులో ప్రాచీన తమిళలిపిలో చెక్కబడి ఉన్న సమాచారం పురావస్తు శాస్త్ర వేత్తలు అధ్యయనం చేసిన మేరకు ఈ శాసనం 1426 సెప్టెంబరు 8వ ఏర్పాటుచేశారు. ఇప్పటికే ఈ శాసనం 600 ఏళ్లు పూర్తిచేసుకుంది.



చలపర కోన కొండ గుహ



కొండపైకి వెళ్తున్న పర్యాటకులు

ఉట్టి పడే రాతి కళ



చలపరకోన గుహలో ఆది మానవులు గీసిన చిత్రాలు దర్శనమిస్తున్నాయి. రాతి కళలో మానవ, జంతు, మత, రేఖాగణితం, తదితర వంటివి గుర్తించబడని డ్రాయింగ్‌లకు చెందిన అనేక చిత్రాలు కనుమరుగయ్యే స్థితిలో ఉన్నాయి. చిత్రాలను గీయడానికి ఆది మానవుడు ఎరుపు, ఎరుపు గోధుమ, తెలుపు వర్ణద్రవ్యాలను ఉపయోగించాడు. ఈ రాతి గుహలోని రాతి కళ వివిధ పురావస్తు కాలాల ద్వారా కళాత్మక వ్యక్తీకరణల కొనసాగింపును చూపుతుంది. ప్రస్తుతం చలపరకోన రాతి గుహలో రాతిపై చెక్కిన చక్రాలు, త్రిశూలాలు, వృత్తాలు, ఒకరి చేతులు ఒకరు పట్టుకున్న మానవ వరుస, తల్లిదండ్రులు బిడ్డ చేయి పట్టుకుని నడుస్తున్న ఆకారాన్ని గుర్తించారు. ఆర్కియాలజికల్ అధ్యయనాలు వెల్లడించిన మేరకు ఆది మానవులు సహజంగా లభించే ఖనిజాలు, మూలికలు, జంతు పదార్థాలను వాటి పరిసర వాతావరణంలో కలపడం ద్వారా రంగులు వేశారు. పలు చిత్రాలు మసకబారి ఉన్నాయి.



కొండరాళ్లపై గల చరిత్రకు ఆనవాలుగా నిలిచే చిత్రాలు

మెగాలిథిక్ కళతో సారూప్యత



ప్రాచీన చరిత్ర, పురావస్తు శాస్త్ర పరిశోధకులు కొండగుహలోని చిత్రాల ఆధారంగా చేసిన పరిశోధనల్లో చల పరకోనలో చెక్కి ఉన్న చక్రాల బొమ్మలు మల్లయ్యపల్లి, సుండుపల్లి మెగాలిథిక్ సమాధుల్లో చిత్రించిన చక్రాలతో సారూప్యతలను కలిగి ఉన్నాయని, మానవ బొమ్మలు మల్లయ్యపల్లి మెగాలిథిక్ కళతో సారూప్యతలను కలిగి ఉన్నాయని వీటి ఆధారంగా చలపరకోన రాతికళ మెగాలిథిక్ కాలానికి చెందినదిగా ఉండవచ్చని పురావస్తు అధ్యయనకారులు చెబుతున్నారు. ఆపై ఇక్కడ నివశించిన మహర్షులు కొండగుహలో శివలింగం ప్రతిష్ట చేసి, రాతిపై తమిళంలో నాగదేవతకు ప్రతీకగా సర్పాలను 1894లో చెక్కినట్లు తెలుస్తోంది. వీటి ఆధారంగా ఈ ప్రాంతానికి నాగతీర్థం అనే పేరు స్థిరపడింది. ఇక్కడి కొండలపై మహర్షులు (మునులు) తపస్సుచేసినట్లుగా రాతిగుహల్లో నిర్మించుకున్న కుటీరాలు ఉన్నాయి. అందుకే ఈ మునిపల్లి కాస్త ముడిపల్లిగా మారిందని చరిత్రకారులు చెబుతారు.

ఎంతో విశిష్టత దాగుంది



చలపరకోన గుహలో ఆది మానవులు గీసిన చిత్రాలు కనిపిస్తాయి. పలు చిత్రాలు కనుమరుగయ్యే స్థితిలో ఉన్నాయి. ఈ బొమ్మల పరిశీలన ఆధారంగా కొండ గుహల్లో కొన్ని వేల ఏళ్ల చరిత్ర ఇక్కడ దాగి ఉన్నట్లు స్పష్టమవుతుంది. విద్యార్థులకు ఆర్కియాలజీ గురించి వివరించడానికి ముడిపల్లి చలపరకోని, నాగతీర్థం ప్రాంతాల్లో ఎడ్యుకేషనల్ ఫీల్డ్ టూర్స్ కూడా నిర్వహిస్తాం.

– డాక్టర్ ఎస్.వినోద్, గెస్ట్ లెక్చరర్, డిపార్ట్‌మెంట్‌ఆఫ్ హిస్టరీ, ముడిపల్లి

పర్యాటక కేంద్రంగా మార్చాలి



చలపరకోన, నాగతీర్థంకు వేళ ఏళ్ల చరిత్ర ఉంది. గత ప్రభుత్వంలో జెడ్పీ నిధులతో నాగతీర్థం కొండవరకు సిమెంటు రోడ్డు వేశారు. గ్రామస్తుంతా కలసి నిధులు పోగుచేసి కొండపైకి వెళ్లే మెట్లు నిర్మించుకున్నాం. ప్రస్తుతం కొత్తగా ఏర్పాటు చేసే నగరి దిండివనం రైల్వేలైను కొండపక్కనే వెళ్తోంది. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చితే ఇక్కడి విశిష్టత పలువురికి తెలిసే అవకాశం ఉంది.

– జయచంద్రారెడ్డి, ముడిపల్లి, నగరి మండలం






రాతిపై చెక్కబడిన వర్ధమాన మహావీరుడి ప్రతిమను చూపుతున్న పురావస్తు అధ్యయనకారులు, చలపరమ్మ ఆలయం



కొండరాళ్లపై గల చరిత్రకు ఆనవాలుగా నిలిచే చిత్రాలు

చదువు కొనలేం



ఉన్నత విద్యాభ్యాసం చేసి, ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా ఉండాలనే పేద యువతీ, యువకుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది. ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా కాలయాపన చేస్తోంది. దీంతో కొన్ని కళాశాలలు మూతపడగా.. మరికొన్ని కాలేజీలు ఆదే బాటన పడుతున్నాయి. ఇలాగైతే చదువు 'కొనలేం' అని పేద విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం

- కర్నూలు జిల్లాలో పేరుకుపోయిన రూ.134 కోట్ల బకాయిలు
- 2023-24 పెండింగ్‌ను క్లియర్ చేయని కూటమి ప్రభుత్వం
- ఫీజుల జాప్యంతో మూతపడుతున్న కళాశాలలు
- కాలేజీలు మూసి వేస్తామని ఇప్పటికే అల్టిమేటం
- ఇప్పటికే మూతకు గురైన 44 కళాశాలలు

కర్నూలు(అర్బన్): కూటమి ప్రభుత్వ చర్యలతో విద్యారంగం అతలాకుతలమవుతోంది. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో తీవ్ర జాప్యం చేస్తుండటంతో విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై కొన్ని కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. విద్యార్థులపై ఒత్తిడి తీసుకు రాలేక మరికొన్ని కళాశాలలు మూతపడ్డాయి. ఫీజురీయింబర్స్‌మెంట్‌ను ఈ నెల 21వ తేదీలోగా విడుదల చేయకపోతే కళాశాలలను మూసి వేస్తామని తాజాగా డిగ్రీ కళాశాలలకు చెందిన యాజమాన్యాలు అల్టిమేటం జారీ చేశాయి.

మాట మార్చిన 'కూటమి' నేతలు

అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు ఎలాంటి ఆటంకం కల్పించబోమని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు హామీ ఇచ్చారు. ఎప్పటికప్పుడు ఫీజులను విడుదల చేస్తామని ప్రతి సభలో చెప్పారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత గడచిన విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్ విడుదల చేయలేదు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి విద్యా సంవత్సరంలో నాలుగు విడతలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసింది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి అదే ఏడాది మార్చి 2వ తేదీన మొదటి విడతగా జిల్లాలోని 35,618 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి రూ.23.95 కోట్లను అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జమ చేసింది.

➤ 2017–18, 2018–19 విద్యా సంవత్సరాల్లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019–20 విద్యా సంవత్సరంలో విడుదల చేసింది. అప్పట్లో జిల్లాలో 32,162 మంది విద్యార్థులకు సంబంధించిన అరియర్స్‌ను అందించారు. అలాగే కుటుంబ వార్షిక ఆదాయాన్ని కూడా అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.లక్షగా నిర్ధారిస్తే, వీలైనంత ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరాలనే సదుద్దేశ్యంతో జగన్ ప్రభుత్వం రూ.2.50 లక్షలకు పెంచింది.

ప్రస్తుతం దుస్థితి ఇదీ..

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో 2024లో మూడు విడతల ఫీజును కూటమి ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. అలాగే 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు చెల్లించాల్సిన మూడు క్వార్టర్ల ఫీజును పెండింగ్‌లో పెట్టింది.

కళాశాలలను మూసి...

రాయలసీమ విశ్వ విద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలలకు ఈ నెల 21వ తేదీలోగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుంటే కళాశాలలను మూసివేసేందుకు కూడా వెనుకాడమని ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అల్టిమేటమ్‌ను జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే అసోసియేషన్ నేతలు యూనివర్శిటీ వైస్ చాన్సలర్ వీ వెంకటబసవరావుకు వినతి పత్రాన్ని అందించారు. కాగా.. గతంలో మొత్తం 112 డిగ్రీ కళాశాలలు ఉండగా, ప్రస్తుతం ఫీజు జాప్యం తదితర కారణాలతో 44 కళాశాలలు మూతకు గురి కాక, 68 కళాశాలలు మాత్రం కొనసాగుతున్నాయి.

ఆర్థిక భారాన్ని తగ్గించి.. అండగా నిలిచి

గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టిన సమయంలో బీసీ, ఈబీసీ, మైనారిటీ, కాపు విద్యార్థుల ఇంజినీరింగ్ విద్యకు ఏడాదికి రూ.35 వేలు మాత్రమే విడుదలయ్యేవి. కానీ, కొన్ని పెద్ద కళాశాలల్లో (గ్రేడ్ –1) ఇంజినీరింగ్ ఫీజు ఏడాదికి రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఉంది. ఆయా కళాశాలల్లో చదువుతున్న సంబంధిత సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసే రూ.35 వేలను మినహాయించి మిగిలిన ఫీజు వారి తల్లిదండ్రులే చెల్లించాల్సి వచ్చేది. ఈ ఆర్థిక భారాన్ని కూడా తొలగించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని పెంచారు. దీంతో గ్రేడ్–1 కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారాన్ని కూడా తగ్గించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కింది.

➤ జిల్లాలో 2023–24, 2024–25 విద్యా సంవత్సరాలకు సంబంధించి దాదాపు రూ.134 కోట్లు పెండింగ్‌లో పడ్డాయి. 2023–24కు సంబంధించి 31,596 మంది విద్యార్థులకు మూడు త్రైమాసికాలకు సంబంధించి దాదాపు రూ.89 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా, రూ.23 కోట్లు విడుదల చేసినట్లు చెబుతున్నారు. ఈ లెక్కన ఇంకా రూ.66 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే 2024–25 విద్యా సంవత్సరానికి 32,736 మంది విద్యార్థులకు ఇప్పటి వరకు దాదాపు రూ.110 కోట్లను విద్యార్థులకు చెల్లించాల్సి ఉండగా, రూ.42 కోట్లు చెల్లించామని చెబుతున్నారు. ఇంకా ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.68 కోట్లను బకాయి పెట్టారు.

అక్రమ బదిలీలు ఆపండి

డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద సీహెచ్‌ఓల నిరసన



తిరుపతిలో డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద మహిళా సీహెచ్‌ఓల నిరసన

తిరుపతి తుడా: తిరుపతి జిల్లా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (సీహెచ్‌ఓ) అక్రమ బదిలీలను ఆపాలంటూ వారు ఆందోళనకు దిగారు. సీహెచ్‌ఓల అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం వద్ద సోమవారం రాత్రి 9 గంటల నుంచి ఈ నిరసన ప్రారంభించారు. కుప్పంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ హెల్త్ కేర్ డెలివరీ కోసం టాటాస్ డిజిటల్ నర్వ్ సెంటర్‌లో శిక్షణ నిమిత్తం ఐదుగురు మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెండు వారాల క్రితం తిరుపతి జిల్లా నుంచి పంపించారు. శిక్షణ పూర్తిచేసుకున్న ఐదుగురిలో ముగ్గురు కుప్పంలోనే ఉండాలని ఆదేశాలిచ్చారు. దీనిని అసోసియేషన్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. మహిళా సీహెచ్‌ఓలను తిరుపతి జిల్లా నుంచి పంపించాల్సిన అవసరం ఏముందని అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ సందీప్‌కుమార్ ప్రశ్నించారు. చిత్తూరు జిల్లాలోనే కుప్పానికి సమీపంలోని సీహెచ్‌ఓలను పంపించే అవకాశమున్నా తిరుపతి జిల్లా నుంచి పంపించడం సరికాదన్నారు. కుటుంబాలను వదిలి మహిళా సీహెచ్‌ఓలు ఎలా వెళ్తారన్నారు. మహిళా సీహెచ్‌ఓలపై కక్ష సాధింపులో భాగంగానే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బలవంతపు బదిలీలకు పూనుకున్నారని ఆరోపించారు. ఈ అక్రమ బదిలీలను వెంటనే రద్దుచేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ నిరసనకు సీఐటీయు జిల్లా కార్యదర్శి జయచంద్ర, జేఏసీ చైర్మన్ గండికోట నాగ వెంకటేష్ తదితరులు మద్దతిచ్చారు.

పిడుగు పాటుకు శాప్ కార్మికుడు దుర్మరణం

పీఎం పాలెం(విశాఖ జిల్లా): గ్రేటర్ విశాఖ ఆరో వార్డు కొమ్మాదిలోగల శాప్(ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్)లో పనిచేస్తున్న దోహర్తి సూర్యప్రకాష్(38) పిడుగుపాటుకు గురై మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యప్రకాష్ ఆరిలోవలో భార్య ఆశ, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తూ కొమ్మాది ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆఫీస్ సబార్డినేట్, గ్రౌండ్ మెయింటెనెన్స్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం 9 గంటలకు ఇంటి వద్ద బయల్దేరి గ్రౌండ్‌కు చేరుకుని గ్రాస్ కటింగ్ మెషిన్‌తో గ్రాస్ కట్ చేస్తుండగా 11.10 సమయంలో పెద్ద శబ్దంతో పిడుగు పడింది. ఆ ధాటికి సూర్యప్రకాష్ గ్రౌండ్‌లో పడిపోయాడు. శరీరంపై పలు చోట్ల గాయలయ్యాయి. 108 వాహనానికి ఫోన్ చేయగా వారు వచ్చి అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. మృతుని భార్యకు, పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

అసెంబ్లీ మీడియా పాయింట్

మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలి: ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి




ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయం దారుణం. విద్యార్థి, యువజన, ప్రజాస్వామిక వాదులు ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజా ఆరోగ్యాన్ని, సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసింది.

ప్రజల సమస్యలపై చర్చించడమే లక్ష్యం: ఎమ్మెల్సీ తలశిల రఘురాం



ప్రజల తరపున, వారి సమస్యలపై మాట్లాడేందుకు అసెంబ్లీలో వైఎస్సార్ సీపీకి తగిన సమయం కేటాయించాలని కోరుతున్నాం. ప్రతిపక్ష హోదా ద్వారానే ఇది సాధ్యమవుతుందని భావిస్తున్నాం. అయినా కూటమి ప్రభుత్వం స్పందించకపోవడాన్ని చూస్తుంటే, ప్రజల సమస్యలు సభలో చర్చకు రాకూడదన్న సర్కార్ ఉద్దేశం స్పష్టమవుతోంది.

నిరుద్యోగ భృతి ఇచ్చారా?: ఎమ్మెల్సీ రమేష్ యాదవ్



సూపర్ సిక్స్ అమలు చేశామని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఇందులో మొదటి హామీ నిరుద్యోగ భృతిని ఇచ్చిందా?. ఉద్యోగాలిస్తాం లేదా రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామంటూ నిరుద్యోగులను నమ్మించి ఓట్లు వేయించుకున్నారు. లేబర్ సర్వే ప్రకారం నిరుద్యోగంలో 21 శాతంతో ఏపీ 3వ స్థానంలో ఉంది.

ఉల్లి రైతుకు కన్నీళ్లు: ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



రైతులు ఉల్లి పంట పండించాలంటే ఎకరాకు రూ.లక్ష ఖర్చవుతోంది. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలతో పాటు రాష్ట్రంలో ఎక్కడ ఉల్లి పండించినా గిట్టుబాటు ధర రావడం లేదు. కూటమి అధికారంలోకి వచ్చాక ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. ఉల్లి క్వింటాకు రూ.1,200 మద్దతు ధర ప్రకటించినా, ఆచరణలో కనిపించడం లేదు.

నెరిసింది... మెరిసిందని మురిసిపోవద్దు!

ఈ జాగ్రత్తలు తీసుకోండి!

ఇటీవల చాలా చిన్నవయసులోనే హెయిర్ డై వాడాల్సిన అవసరం వస్తోంది. మరికొందరికైతే పాతికేళ్లు, ముప్పై ఏళ్లకే జుట్టు తెల్లబడుతోంది. ఇంకొందరి విషయంలో జుట్టు తెల్లబడకపోయినా... వెంట్రుకలను మరింత ఆకర్షణీయం చేసుకునేందుకు... వెంట్రుక చివర్లలోగానీ లేదా జుట్టు పాయల్లో అక్కడక్కడా ఎరుపు లేదా ఇతర రంగుల షేడ్స్‌ను పార్లర్లలో వాడటం జరుగుతోంది. హెయిర్ డై లు కొనేప్పుడు ఎలాంటి వాటిని ఎంపిక చేసుకోవాలి, వాటితో వచ్చే సాధారణ ప్రమాదాలు, ఆ ముప్పును తప్పించుకోడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన కొన్ని సాధారణ సూచనలు... ఇలాంటి అనేక విషయాలపై అవగాహన కోసం ఈ కథనం...

చాలామంది హెయిర్-డై లను జుట్టు నలుపు చేసుకోడానికే ఉపయోగిస్తుంటారు. కానీ మరికొందరు మాత్రం జుట్టు నలుపు రంగులోనే ఉన్నప్పటికీ దాన్ని మరింత ఫ్యాషనబుల్‌గా తీర్చిదిద్దుకోవడం కోసం రంగులు వేసుకుంటారు. ఇలా ఫ్యాషనబుల్‌గా గ్రూమింగ్ చేసుకునే సమయంలో వారు వెంట్రుకల చివర్లను ఎర్రగా మార్చుకునేందుకూ, మరికొందరు మధ్యమధ్యన యూనిఫామ్‌గా కొన్ని పాయలు ఆకర్షణీయమైన రంగులూ, రకరకాల షేడ్స్‌లో కనిపించేలా... ఇలా హెయిర్-డైని వేర్వేరు ప్రయోజనాలకోసం వాడుతుంటారు.

హెయిర్ డైతో కనిపించే కొన్ని సాధారణ ముప్పులు...

➡ అలర్జీ కారణంగా...
హెయిర్ డైలో ఉండే రసాయనాల్లోని కొన్ని కెమికల్స్ కొందరి చర్మానికీ లేదా వాళ్ల జుట్టుకు సరిపడకపోవచ్చు. దాంతో ఆ హెయిర్ డై వాడకం వల్ల వాళ్లలో అలర్జీ వంటి దుష్పరిణామాలు కలగవచ్చు. ఫలితంగా చర్మం ఎర్రబారడం, దురద పెట్టడం, ఒంటి మీద ఎర్రటి దద్దుర్లు (ర్యాష్), డై తగిలిన చోట కొద్దిపాటి వాపు, మంట వంటివి కనిపించవచ్చు.

➡ కళ్లూ, పెదవులకూ లేదా దేహమంతటా వాపురావడం...
కొన్ని సందర్భాల్లో రంగు తలకు మాత్రమే పెట్టుకున్నప్పటికీ కళ్లవాపు, పెదవులు ఉబ్బినట్లుగా వాచడం లేదా మొత్తం దేహమంతటికీ వాపు రావడం వంటి దుష్ప్రభావాలూ కనిపించవచ్చు. ఇలాంటి పరిణామాలు చోటుచేసుకుంటే బాధితులను వీలైనంత త్వరగా హాస్పిటల్‌కు తీసుకెళ్లి డర్మటాలజిస్ట్‌కు చూపించాలి.

➡ రసాయనాల కారణంగా కళ్లమంట...
కొన్ని సందర్భాల్లో హెయిర్‌డైలో ఉండే రసాయనాల కారణంగా కళ్లు విపరీతంగా మండటం, కళ్ల నుంచి నీరుకారడం, గొంతులో గీరుతున్నట్లుగా ఇబ్బంది కలగడం, ముక్కు నుంచి నీళ్లు కారడం, విపరీతంగా తుమ్ములు రావడం వంటి ఇబ్బందులు కలగవచ్చు.

➡ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది / ఆస్తమా...
పై లక్షణాలు కనిపించిన కొందరిలో ఆ సమస్యల తీవ్రత చాలా ఎక్కువగా ఉండి, శ్వాసతీసుకోవడంలో వాళ్లకు తీవ్రమైన ఇబ్బంది కలగవచ్చు. కొందరిలో ఇది ఒక్కోసారి ఆస్తమాకు సైతం దారితీయవచ్చు.

➡ అవే రసాయనాలు మరో సందర్భంలో ప్రతికూలంగా...
మొదట్లో చాలాసార్లు సురక్షితంగా వాడిన ఆ రసాయనాలే, చాలా ఏళ్లు గడిచాక కూడా ఇతర సందర్భాల్లో చాలా ప్రమాదకరంగా, అలర్జిక్‌గా పరిణమించవచ్చు. అందుకే రంగు వేసుకునే ప్రతిసారీ అదే మొదటిసారి అయినట్లుగా జాగ్రత్తగా ఉండాలి.



డా. స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్
హైదరాబాద్

డై వేసుకునే సమయంలో గోళ్లకు అంటనివ్వవద్దు...

➡ జుట్టుకు హెయిర్ డై వేసుకునే సమయంలో ఆ రంగు గోళ్లకు అంటకుండా వీలైనంతగా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎందుకంటే అది వెంట్రుక అయినా, గోరు అయినా కెరొటిన్ అనే పదార్థంతోనే తయారవుతుంది. అంటే వెంట్రుక, గోరు... ఈ రెండూ హెయిర్-డైలోని కెమికల్‌తో ఒకేలా రసాయనిక చర్య జరుపుతాయి. అందువల్ల పొరబాటున గోళ్లకు రంగు అంటుకుంటే... జుట్టులాగే గోరు కూడా నల్లగా మారుతుంది. అంటుకున్న రంగు అలాగే ఉండిపోతుంది.

➡ అయితే పొరబాటున గోళ్లకు అంటుకున్నప్పటికీ అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే పెరుగుతున్న వెంట్రుకలు తమ మొదళ్లనుంచి తెల్లగా కనిపిస్తున్నట్టే... గోరు పెరుగుతున్న కొద్దీ రంగు అంటని భాగం తెల్లగా పెరుగుతూ వస్తుంది. దాంతో పెరిగిన భాగాన్ని కట్ చేస్తున్న క్రమంలో దాదాపు మూడు నెలల వ్యవధిలో నల్లగా మారిన గోరు పూర్తిగా తొలగిపోతుంది. పై కారణాల వల్ల జుట్టుకు అంటుకున్న రంగు ఎప్పటికీ ఉన్నట్లే గోరుకూ అంటుకుపోయే ప్రమాదం ఉన్నందున గోళ్ల విషయంలో కాస్తంత జాగ్రత్తగా ఉండటం అవసరం.

కీలక అవయవాల సంరక్షణ విషయంలో జాగ్రత్తలు అవసరం

➡ రంగు వేసుకునే సమయంలో హెయిర్-డైను ఎట్టిపరిస్థితుల్లోనూ కళ్ల మీదికి జారనివ్వకూడదు. బాగా పలచగా ఉండే కొన్ని రకాల హెయిర్-డైలతో ఈ తరహా ముప్పు ఎక్కువగా ఉంటుంది. పలచగా ఉండే హెయిర్‌డైల విషయంలో అప్రమత్తంగా ఉంటూ ఈ జాగ్రత్తను తప్పక పాటించాలి.

➡ హెయిర్-డై తాలూకు ఘాటైన వాసన వల్ల శ్వాస సరిగా తీసుకోలేకపోవడంగానీ లేదా ఆయాసం రావడంగానీ జరుగుతుంటే... దాని వాసన తగలకుండా ముక్కుపై శుభ్రమైన గుడ్డతో కవర్ చేసుకోవాలి లేదా మందపాటి మాస్క్ ధరించడం మేలు.

➡ హెయిర్-డై పూయడాన్ని కేవలం తలకు మాత్రమే పరిమితం చేయాలి. కనుబొమలకూ ఎట్టిపరిస్థితుల్లోనూ హెయిర్‌డై వాడకూడదు, కనురెప్పల వరకు దాన్ని జారనివ్వకూడదు.



➡ తొలిసారిగా తలకు రంగు వేసుకునేవారు... నేరుగా తమ ఇంట్లోనే తొలిసారి హెయిర్-డై వాడుకునేందుకు బదులుగా... ముందుగా ఒకటి రెండు సార్లు మంచి పార్లర్‌లో ప్రొఫెషనల్స్ సహాయంతో రంగు వేసుకోవడం మేలు. ఈ సమయంలో వారు ఎలా రంగు కలుపుతున్నారు, ఎలా హెయిర్ డై వేస్తున్నారూ అన్న విషయాలు జాగ్రత్తగా గమనించి, ఆ తర్వాత అదే టెక్నిక్స్‌ను ఇంటిదగ్గర స్వయంగా అనుసరించవచ్చు.

సరిపడుతోందా అనే అంశాన్ని పరిశీలించుకోవడం...

మొదటిసారి హెయిర్-డై వాడేవారు అది తమకు సరిపడుతుందా లేదా అన్నది పరీక్షించుకోవాలి. కొద్దిపాటి రంగు పూసుకుని, 48 గంటల పాటు వేచిచూశాక ఏ ముప్పూ లేదా ప్రతికూల పరిణామాలు కనిపించకపోతే దాన్ని సురక్షితంగా వాడుకోవచ్చు. ఒకవేళ ఆ బ్రాండ్ హెయిర్-డై కారణంగా ఏవైనా అలర్జిక్ లక్షణాలు కనిపిస్తుంటే మాత్రం దానికి దూరంగా ఉండటమే మేలు. ఎవరు ఎలాంటి హెయిర్-డై వాడుతున్నప్పటికీ, వీలైనంతలో మన బడ్జెట్‌లోనే కాస్తంత నాణ్యమైనది ఎంచుకోవడమే మేలు.

నిర్వహణ:
యాసీన్



గర్భవతుల విషయంలో...

మంచి పేరున్న, నాణ్యమైన హెయిర్-డైతో చాలావరకు కడుపులో ఉన్న పిండంపై గానీ లేదా తల్లికి గానీ చాలావరకు ఎలాంటి ప్రమాదమూ, ముప్పూ లేకపోయినప్పటికీ... వీలైనంతవరకు ప్రసవం వరకు హెయిర్‌డై ఉపయోగించకపోవడమే మంచిది.



➡ తొలిసారి రంగు వేసుకునే వారు నేరుగా దాన్ని తలకు పట్టించుకోవడానికి బదులుగా... కాస్తంత రంగు తీసుకుని, మొదట చెవి వెనక ఉండే ఒక పాయకు రంగు వేసి, కాసేపు ఉంచి, ఆ తర్వాత దాన్ని కడుక్కోవాలి. అటు తర్వాత దాదాపు 48 గంటల పాటు పరిశీలించి చూసుకోవాలి. ఆ సమయంలో రంగు వేసిన చోట చర్మంపై గానీ, కళ్లకు గానీ లేదా జుట్టు విషయంలోనూ ఎలాంటి దుష్ప్రభావాలూ (సైడ్ ఎఫెక్ట్స్) కనిపించపోతే... అటు పిమ్మట ఆ రంగును నిరభ్యంతరంగా వాడుకోవచ్చు. ఒకవేళ ఏదైనా సైడ్‌ఎఫెక్ట్ కనిపిస్తే ఆ బ్రాండ్‌ను వదిలేసి, మరో సురక్షితమైన బ్రాండ్‌ను ఎంచుకోవాలి.

➡ తమకు సురక్షితమని తేలిన బ్రాండ్‌నే ఎల్లప్పుడూ కొనసాగించాలి. ఏదైనా కారణాల వల్లగానీ లేదా పాత బ్రాండ్ దొరకనప్పుడూ... మరేదైనా సరి కొత్త బ్రాండ్ వాడదలిస్తే... అప్పుడు మొదట నిర్వహించన పరీక్షనే మళ్లీ చేసుకోవాలి. అంటే... ఈ కొత్త బ్రాండ్ తాలూకు హెయిర్-డైని మరోసారి మళ్లీ చెవి వెనక ఉన్న వెంట్రుకలలో ఒక పాయకు రంగు వేసి మళ్లీ మరోసారి 48 గంటలు వేచి చూసి, అది సురక్షితమని తేలాకే బ్రాండ్ మార్చాలి.



➡ ఏదైనా బ్రాండు హెయిర్-డై వాడేముందర... అందులో ఉపయోగించిన రసాయన పదార్థాల జాబితానూ, ఎలా ఉపయోగించాలన్న సూచనలను శ్రద్ధగా చదవాలి. కొన్ని హెయిర్-డైలలో కోల్‌తార్, లెడ్ ఎసిటేట్, రెసార్సినాల్ వంటి రసాయనాలు ఉన్నట్లు రాసి ఉంటే వాటిని వాడకపోవడమే మంచిది.

➡ అమోనియా వంటి రసాయనాలు ఉన్న బ్రాండ్స్ వాడటం వల్ల ఏవైనా దుష్ప్రభావాలు కనిపిస్తే... అమోనియా లేని బ్రాండ్‌లలో మోనో ఈథేనొలమైన్ (ఎమ్ఈఏ) వంటి సురక్షితమైన ఏజెంట్స్ ఉన్న బ్రాండ్స్ వాడుకోవడం మేలు.

హెయిర్ డై వేసుకునే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలివే...

➡ రంగు అంటకూడదని అనుకుంటున్న శరీర భాగాల చర్మంపైన ముందుగా కాస్తంత పెట్రోలియం జెల్లీని పూయడం వల్ల ఆ చోట్లలో రంగు అంటదు. ఉదాహరణకు చెంపలూ, చెవి వెనక భాగాల వంటివి.

➡ రంగు అంటకూడదని భావించే మెడ వెనక భాగంపైన పాత టవల్‌ను చుట్టడం మంచిది.

➡ హెయిర్-డై తాలూకు రంగునంతా ఒకే తరహాలో (యూనీఫామ్‌గా) అంటుకునేలా బ్రష్‌ను వాడాలి. అంటే... బ్రష్‌తో ఒక్క చోట ఎక్కువగానూ లేదా మరోచోట తక్కువగానూ హెయిర్-డై పూయకూడదు. దాంతో జుటు ఏకరీతిలో కాకుండా తెరలు తెరలుగా రంగు అంటుకున్నట్లు కనిపించి... అంత స్వాభావికంగా కనిపించకపోవచ్చు.

➡ రంగు పూసే సమయంలో చేతులకు గ్లౌవ్స్ తప్పక ధరించాలి. దీనివల్ల రంగు గోరుకు అంటుకోదు. గోరు నల్లగా అసహ్యంగా కనిపించదు. పైగా హెయిర్-డైలోని రసాయనాలు చేతికి అంటుకోకుండా ఉంటాయి. హెయిర్-డై వేసిన వెంటనే చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.

➡ వెంట్రుక పెరుగుతున్న కొద్దీ జుట్టు కుదుళ్ల వద్ద తెల్లగా కనిపించే చోట మాత్రమే రంగు పూయదలచినప్పుడు, నల్లగా ఉన్న మిగతా జుట్టుకు కండిషనర్ పూసి, తెల్లగా ఉన్నచోట మాత్రమే టచప్ చేసుకోవచ్చు.

➡ ఎంపిక చేసుకున్న షేడ్ తాలూకు రంగు మాత్రమే వేసుకోవాలి. అంతే తప్ప రెండు రెండు షేడ్‌లు వేసుకునే సమయంలో ఆ రెండు షేడ్‌ల రంగులు కలుపుకోవడం సరికాదు.

హెయిర్-డై వేసుకోవడం ఇలా...

➡ వేసుకోబోయే హెయిర్-డైని కలుపుకుని సిద్ధం చేసుకోవాలి. ఇందుకోసం గాజుదీ లేదా పింగాణీ గిన్నెను ఉపయోగించుకోవడం మంచిది. ఎందుకంటే గాజు / పింగాణీ గిన్నెకు రంగు అంటుకోదు. గిన్నె కడిగివేయగానే రంగు తేలిగ్గా వదిలిపోతుంది.

➡ ఆ గిన్నెలో కలుపుకున్న హెయిర్ డైలోకి మనం ఎంచుకున్న బ్రష్‌ను పైపైనే ముంచుతూ... కొద్ది కొద్ది మోతాదుల్లోనే బ్రష్‌కు రంగు అంటేలా హెయిర్‌డైను తీసుకుంటూ జుట్టుకు జాగ్రత్తగా రాయాలి. పెద్ద మొత్తంలో హెయిర్‌డైను బ్రష్ మీదకు తీసుకోవడం అంత మంచిది కాదు. ఎందుకంటే పెద్ద మొత్తంలో బ్రష్ మీదకు రంగును తీసుకోవడం వల్ల అది పక్కలకూ లేదా కంటిలోకి కారే ప్రమాదం ఉంది. పక్కలకు కారిన రంగు కాస్త ఇబ్బందికరంగా కనిపించవచ్చు. కానీ అది కంటిలోకి జారితే ప్రమాదం. కొన్ని రకాల హెయిర్ డై లోని రసాయనాలు కంటికి హాని చేసే అవకాశముంటుంది. హెయిర్‌డై కళ్లలోకి ప్రవించినప్పుడు కళ్లు విపరీతంగా మండటం, కళ్లు ఎర్రబారడం, కళ్లకు ఇన్ఫెక్షన్ రావడమూ జరగవచ్చు.

➡ హెయిర్ డైలోని రసాయనాలు వెంట్రుకలోకి ఇంకిపోయి, వెంట్రుకతో ఒక రకమైన రసాయనిక చర్య జరపడం ద్వారా జుట్టును నల్లబారుస్తాయి. అవే రసాయనాలు వెంట్రుకను బిరుసెక్కేలాగా చేస్తాయి కూడా. అందుకే చాలాకాలంగా హెయిర్-డై వాడేవాళ్ల వెంట్రుకలు కాస్తంత రఫ్‌గానూ, తేలిగ్గా విరిగిపోయేలా (బ్రిటిల్‌గా) ఉండటం గమనించవచ్చు. కొందరు మహిళల్లో హెయిర్ స్ట్రెయిటెనింగ్ చేసుకుంటూ రంగు వేసుకునేవాళ్లుంటారు. అలాంటి వాళ్లలో ఈ తరహా ముప్పు మరింత స్పష్టంగా కనిపిస్తుంటుంది.

కంటెంట్‌లో ఈ రసాయనాలు ఉంటే కాస్త జాగ్రత్త...

➡ కృత్రిమంగా తయారు చేసే ప్రతి హెయిర్ డైలోనూ తారు (కోల్‌తార్), పీపీడీ (పారాఫినైలీన్ డై అమైన్- ఇదే రంగును కల్పించే ప్రధాన రసాయనం) వంటి రసాయనాలు ఉంటాయి. ఆ రసాయనాల కారణంగా చాలా చాలా అరుదుగా కొన్ని రకాల క్యాన్సర్ల ముప్పునకు అవకాశం ఉంది. కాబట్టి రసాయనాలు కలిగి ఉండే హెయిర్-డై లకు బదులుగా వెజిటబుల్ హెయిర్ కలర్స్‌గానీ, మెడికేటెడ్ హెయిర్ కలర్స్ గానీ వాడుకోవడం సురక్షితం.

చివరగా... హెయిర్ డైతో అందం ఇనుమడిస్తుంది. ఫ్యాషనబుల్ లుక్ వస్తుంది. అయితే వాటికోసం ఆరోగ్యానికీ, కళ్లకూ ముప్పు కలిగించేంత మూల్యం చెల్లించడం సరికాదని గుర్తించాలి. హెయిర్-డైని వీలైనంత ప్రమాదరహితంగా ఉపయోగించాలని గుర్తుంచుకోవాలి.

యూఎస్‌కు స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు డీలా

ఆగస్టులో 58 శాతం క్షీణత

- 96.48 కోట్ల డాలర్లకు పరిమితం
- మే నెలలో ఇవి 229 కోట్ల డాలర్లు



న్యూఢిల్లీ: గత నెల(ఆగస్ట్)లో భారత్ నుంచి యూఎస్‌కు స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు భారీగా క్షీణించాయి. మే నెలతో పోలిస్తే 58 శాతం పడిపోయి 96.48 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి. మే నెలలో ఇవి 229 కోట్ల డాలర్లుగా నమోదైనట్లు గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్(జీటీఆర్ఐ) పేర్కొంది. ఇది ఆందోళనకరమని, నిజానికి స్మార్ట్‌ఫోన్ ఎగుమతులపై టారిఫ్‌లు లేవని తెలియజేసింది. వెరసి స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు భారీగా క్షీణించడం వెనుక వాస్తవిక కారణాలను వెంటనే అన్వేషించవలసి ఉన్నట్లు అభిప్రాయపడింది. యూఎస్‌కు భారత్ నుంచి స్మార్ట్‌ఫోన్లు అత్యధికంగా ఎగుమతి అవుతుంటాయని, అయితే 2025 మే నుంచీ చూస్తే నెలవారీగా తగ్గుతూ వస్తున్నట్లు వెల్లడించింది. ఈ వివరాల ప్రకారం..

ఇదీ తీరు..

2025 మే నెలలో యూఎస్‌కు 2.29 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేసిన భారత్, జూన్‌లో 2 బిలియన్ డాలర్లకు క్షీణించాయి. ఈ బాటలో జూలైకల్లా ఇవి 1.52 బిలియన్ డాలర్లకు చేరాయి. ఆగస్టులో ఇవి మరింత నీరసించి 96.48 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం(2024–25)లో భారత్ నుంచి స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో 10.6 బిలియన్ డాలర్ల విలువతో యూఎస్ టాప్ ర్యాంకులో నిలిచింది. భారత్ నుంచి గ్లోబల్ ఎగుమతుల విలువ 24.1 బిలియన్ డాలర్లుకాగా.. 44 శాతం వాటాతో యూఎస్ తొలి ర్యాంకును ఆక్రమిస్తోంది. ఈ బాటలో ఈయూకు 7.1 బిలియన్ డాలర్ల విలువైన(29.5 శాతం వాటా) ఎగుమతులు జరుగుతున్నాయి. ఆగస్ట్ ఎగుమతుల్లో టారిఫ్‌లులేని ప్రొడక్టుల వాటా 28.5 శాతంకాగా.. దాదాపు 42 శాతం క్షీణించి 1.96 బిలయన్ డాలర్లకు పడిపోయాయి. మే నెలలో ఇవి 3.37 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

ఫార్మా సైతం..

మే నెలతో పోలిస్తే ఆగస్టులో ఫార్మాస్యూటికల్స్ ఎగుమతులు సైతం బలహీనపడ్డాయి. 13.3 శాతం క్షీణించి 64.66 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి. మే నెలలో ఇవి 74.5 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. మరోవైపు అధిక టారిఫ్‌లను ఎదుర్కొంటున్న దేశీ వస్తువుల ఎగుమతులు సైతం డీలాపడినట్లు జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఆగస్టులో జ్యువెలరీ ఎగుమతులు 9.1 శాతం నీరసించి 22.82 కోట్ల డాలర్లకు చేరాయి. పాలిష్‌డ్ వజ్రాలు, వజ్రాలతోకూడిన బంగారు ఆభరణాల ఎగుమతులు సైతం బలహీనపడ్డాయి. సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు దాదాపు 44 శాతం పడిపోయి 16.27 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి. మే నెలలో ఇవి 28.97 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. టెక్స్‌టైల్స్, దుస్తులు తదితర ఎగుమతులు 9.3 శాతం తక్కువగా 85.55 కోట్ల డాలర్లకు చేరాయి. మేలో ఇవి 94.37 కోట్ల డాలర్లు కాగా.. కెమికల్ ఎగుమతులు 16 శాతం క్షీణించి 45.19 కోట్ల డాలర్లను తాకాయి.

జియో పేమెంట్స్ బ్యాంక్ ‘సేవింగ్స్ ప్రో’

పొదుపు నిల్వలపై 6.5 శాతం రాబడి



న్యూఢిల్లీ: జియో పేమెంట్స్ బ్యాంక్ ‘సేవింగ్స్ ప్రో’ పేరుతో కొత్త సేవింగ్స్ ఖాతాను తీసుకొచ్చింది. ఇందులో మిగులు నిల్వలపై 6.5 శాతం వరకు వడ్డీ రాబడి పొందొచ్చని ప్రకటించింది. ఇందుకోసం కస్టమర్లు నిర్దేశిత మొత్తాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఇది కనీసం రూ.5,000 లేదా అంతకుమించి ఉండొచ్చు. ఖాతాలో మొత్తం బ్యాలన్స్ కస్టమర్లు ఎంపిక చేసిన నిర్ణీత మొత్తం మించినప్పుడు, అదనంగా ఉన్న నిధులు ఓవర్‌నైట్ ఫండ్స్‌లో పెట్టుబడులుగా మళ్లుతాయి. ఇలా ఒక ఖాతాదారుడు ఒక రోజులో గరిష్టంగా రూ.1.5 లక్షలను ఓవర్‌నైట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. అవసరమైనప్పుడు ఈ పెట్టుబడుల నుంచి 90 శాతాన్ని వెంటనే వెనక్కి తీసుకోవచ్చు. కాకపోతే ఇలా తక్షణం తీసుకునే మొత్తం రూ.50,000గా ఉంటుంది. మిగిలిన మొత్తం 1–2 రెండు రోజుల్లో బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. ఈ మొత్తాన్ని జియో ఫైనాన్స్ యాప్ నుంచి సులభంగా చేసుకోవచ్చు. జియో పేమెంట్స్ బ్యాంక్ ప్రస్తుత ఖాతాదారులు సైతం సేవింగ్స్ ప్రో ఖాతాకు అప్‌గ్రేడ్ కావొచ్చని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ తెలిపింది. ఇందులో ఎలాంటి ఎగ్జిట్ లోడ్, ఇతర చార్జీల్లేవని స్పష్టం చేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-9-2025

విశాఖ	540–00
చిత్తూరు	578–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550–00
విజయవాడ	560–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,624.50	3.98
ETERNAL	341.95	1.6
BAJFINANCE	1,006.00	1.37
ADANIPORTS	1,445.00	1.2
ULTRACEMCO	12,645.00	1.1

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TECHM	1,507.20	-3
TCS	3,075.50	-2.96
INFY	1,500.90	-2.55
CIPLA	1,542.00	-2.14
WIPRO	250.49	-2.11

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,556
ఎన్ఎస్ఈ	1,03,101
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,77,325
ఎఫ్ఐఐ	- 2,910
డీఐఐ	+ 2,583

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.31	$ 62.40
బ్రెంట్	66.64	$ 66.68

మార్కెట్‌కు హెచ్–1బీ ఫీజు పెంపు సెగ

ఐటీ షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాలు

- 466 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- నిఫ్టీకి 125 పాయింట్ల నష్టం



ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్–1బీ కొత్త వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో దేశీయ ఐటీ కంపెనీల షేర్లు డీలా పడ్డాయి. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 466 పాయింట్లు పతనమై 82,160 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 125 పాయింట్లు కోల్పోయి 25,202 వద్ద నిలిచింది. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు ఒక శాతానికి పైగా నష్టపోయి సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడి పెంచింది. సూచీలు ఉదయమే నష్టాల్లో మొదలయ్యాయి. చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్లలో లాభాల స్వీకరణతో ఏ దశలోనూ కోలుకోలేకపోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 629 పాయింట్లు క్షీణించి 81,997 వద్ద, నిఫ్టీ 176 పాయింట్లు కోల్పోయి 25,151 వద్ద కనిష్టాలు తాకాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 12 పైసలు నష్టపోయి 88.28 వద్ద స్థిరపడింది. ఆసియాలో హాంగ్‌కాంగ్ మినహా అన్ని దేశాల సూచీలు లాభాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లు అరశాతం నష్టాల్లో ముగిశాయి. అమెరికా స్టాక్ సూచీలు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- బీఎస్ఈ రంగాల వారీగా ఇండెక్సుల్లో ఐటీ 3%, టెక్ 2%, క్యాపిటల్ గూడ్స్ 0.77%, ఇండస్ట్రియల్స్ 0.75%, ఆటో 0.41 శాతం నష్టపోయాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.78%, 0.71 శాతం పతనమయ్యాయి. మరోవైపు యుటిలిటిస్, విద్యుత్, మెటల్, చమురు, సర్వీసెస్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.
- కొత్త హెచ్–1బీ వీసా దరఖాస్తులపై అమెరికా ప్రభుత్వం లక్ష డాలర్ల పెంపు నిర్ణయం.. భారత టెక్ కంపెనీలకు ఇబ్బందికర పరిణామమే అంటూ పరిశ్రమ వర్గాల అభిప్రాయంతో దేశీయ ఐటీ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ఇన్ఫోబీన్స్ 9%, హెక్సావేర్ 7%, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ 4.50%, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 4% పతనమయ్యాయి. టెక్ మహీంద్రా 3%, టీసీఎస్ 3%, ఇన్ఫోసిస్ 2.50%, విప్రో 2.25%, హెచ్‌సీఎల్ 2% నష్టపోయాయి. ఒక్క రోజులో ఈ కంపెనీలు మొత్తం రూ.83,994 కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ కోల్పోయాయి.
- హిండెన్‌బర్గ్ కేసులో సెబీ క్లీన్‌చిట్ ఇవ్వడంతో అదానీ గ్రూప్ షేర్లు రెండో రోజూ రాణించాయి. అదానీ పవర్ షేరు 20% పెరిగి రూ.170 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకి, అక్కడే ముగిసింది. అదానీ టోటల్ గ్యాస్ 20%, అదానీ గ్రీన్ ఎనర్జీ 12% లాభపడ్డాయి. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 7%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 4%, అంబుజా సిమెంట్స్ 1.50%, అదానీ పోర్ట్స్ 1.17%, ఎన్‌డీటీవీ 1.12%, ఎన్‌డీటీవీ 1.12%, ఏసీసీ 0.30 శాతం పెరిగాయి. రెండు ట్రేడింగ్ సెషన్‌లో ఈ కంపెనీలు మొత్తం రూ.1.78 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌ను ఆర్జించగలిగాయి. కాగా, గ్రూప్ మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.15.44 లక్షల కోట్లకు చేరింది.

అన్‌లిమిటెడ్ జీఎస్‌టీ డిస్కౌంట్లు



న్యూఢిల్లీ: ఫ్యాషన్ దుస్తుల సంస్థ అన్‌లిమిటెడ్ ‘జీఎస్టీ బచత్ ఉత్సవ్’లో భాగంగా ఉత్పత్తుల ధరలు తగ్గించింది. దుస్తులు, గృహోపకరణాలు, యాక్సెసరీస్‌తో సహా లైఫ్‌స్టయిల్ ఉత్పత్తుల పన్ను రేట్లను ఇటీవల కేంద్రం సవరించిన సంగతి తెలిసిందే. జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలకు నేరుగా కస్టమర్లకు బదిలీ చేస్తున్నట్లు అన్‌లిమిటెడ్ సీఓఓ వినీత్ జైన్ తెలిపారు. ఇందుకు అనుగుణంగా బిల్లింగ్ సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ చేసినట్లు పేర్కొన్నారు.

మౌలిక రంగంలో మెరుగైన వృద్ధి

- ఆగస్టులో 6.3 శాతం
- 13 నెలల గరిష్ట స్థాయి



న్యూఢిల్లీ: ఎనిమిది కీలక మౌలిక రంగాల్లో వృద్ధి ఆగస్టులో మరింత బలపడింది. 13 నెలల గరిష్ట స్థాయిలో 6.3 శాతానికి చేరింది. ఈ ఏడాది జూలైలో ఇది 3.7 శాతంగానే ఉండడం గమనార్హం. ఇక గతేడాది ఆగస్ట నెలలో మైనస్ 1.5 శాతంతో పోల్చినా పనితీరు బలపడినట్టు తెలుస్తోంది. చివరిగా 2024 జూలైలోనూ ఇదే స్థాయిలో 6.3 శాతం వృద్ధి నమోదైంది. బొగ్గు రంగంలో ఉత్పత్తి 11.4 శాతం పెరిగింది. స్టీల్ రంగంలో 14.2 శాతం, సిమెంట్ రంగంలో 6.1 శాతం చొప్పున ఆగస్టులో వృద్ధి నమోదైంది. రిఫైనరీ ఉత్పత్తుల రంగం 3 శాతం, ఎరువుల రంగం 4.6 శాతం, విద్యుదుత్పత్తి రంగం 3.1 శాతం చొప్పున వృద్ధిని సాధించాయి. ఒక్క ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి మైనస్‌కు పడిపోయింది.

జీఆర్‌టీ జ్యువెలర్స్ దాతృత్వం



హైదరాబాద్: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ జీఆర్‌టీ జ్యువెలర్స్ మరోసారి దాతృత్వం చాటుకుంది. బెంగళూరులోని సాయి ఆశ్రయ ట్రస్ట్‌కు రూ.55 లక్షల విరాళం అందించింది. ఈ సహకారంతో ట్రస్ట్ పిల్లలు, పెద్దలకు గుండె సంరక్షణ చికిత్స సహా ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాలను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఈ సందర్భంగా జీఆర్‌టీ జ్యువెలర్స్ ఎండీ జీఆర్ ఆనంద్ అనంత పద్మనాభన్ మాట్లాడుతూ... దశాబ్దాలుగా మమ్మల్ని విశ్వసించి, మద్దతు ఇచ్చిన కమ్యూనిటీలకు కృతజ్ఞత చూపించడానికి మా వంతు సహకారం అందిస్తున్నాము. జీఆర్‌టీ సామాజిక కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. వారసత్వం కేవలం సృష్టించే ఆభరణాల గురించి మాత్రమే కాదు, చీకటి జీవితాల్లో వెలుగులు నింపడం కూడా.. అని అన్నారు.

‘గ్రీన్’ ఎనర్జీలో 1.5 లక్షల కోట్లు ఆదా

2030కల్లా జరిగే వీలు...

- జీఎస్టీ సంస్కరణల ఎఫెక్ట్
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణలు పునరుత్పాదక ఇంధన(రెనెవబుల్ ఎనర్జీ) రంగంలో భారీ పొదుపునకు తెరతీయనున్నట్లు మంత్రి ప్రహ్లాద్ జోషీ పేర్కొన్నారు. దీంతో 2030కల్లా రెనెవబుల్ ఎనర్జీ రంగంలో రూ. 1.5 లక్షల కోట్లవరకూ ఆదాకానున్నట్లు అభిప్రాయపడ్డారు. వినియోగదారులకు ఇది నవరాత్రి కానుకగా జీఎస్టీ సంస్కరణల అమలు తొలి రోజు నూతన, పునరుత్పాదక ఇంధన కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కూడిన జీఎస్టీ కౌన్సిల్ పన్ను రేట్ల తగ్గింపునకు నిర్ణయించడంతో 2030కల్లా 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలన్న భారత్ భారీ లక్ష్యానికి మద్దతివ్వనున్నట్లు తెలియజేశారు. సీఐఐ ఇక్కడ నిర్వహించిన 6వ అంతర్జాతీయ ఇంధన సదస్సు సందర్భంగా విలేకరులతో మంత్రి పలు అంశాలపై మాట్లాడారు.

చౌకగా రూఫ్‌టాప్ సోలార్

ప్రధానంగా నవరాత్రి తొలిరోజు రెనెవబుల్స్ పరికరాలపై జీఎస్టీ రేట్లు తగ్గించిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నట్లు జోషీ చెప్పారు. రెనెవబుల్ పరికరాలపై జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతానికి దిగివచ్చినట్లు వెల్లడించారు. దీంతో ఇన్వెస్టర్లకు 2030కల్లా రూ. లక్ష కోట్ల నుంచి 1.5 లక్షల కోట్లవరకూ ఆదాకానున్నట్లు తెలియజేశారు. 2030కల్లా భారత్ 300 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని జత చేసుకునే ప్రణాళికల్లో ఉన్నట్లు ప్రస్తావించారు. దీనిలో భాగంగా 2–3 శాతం వ్యయాలు ఆదా అయినప్పటికీ రూ. 1–1.5 లక్షల కోట్లమేర పెట్టుబడులలో పొదుపునకు వీలుంటుందని వివరించారు. పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో భాగంగా 3 కేడబ్ల్యూ సిస్టమ్ రూఫ్‌టాప్ సోలార్ రూ. 9,000–10,500మేర చౌక కానున్నట్లు వెల్లడించారు. పీఎం కుసుమ్‌లో భాగంగా 10 లక్షల సోలార్ పంప్‌ల ద్వారా రైతులకు రూ. 1,750 కోట్లమేర ఆదాకానున్నట్లు అంచనా వేశారు.

ఐపీవో స్ట్రీట్

సెకండరీ మార్కెట్ల ఆటుపోట్లను అధిగమిస్తూ ఇటీవల దుమ్మురేపుతున్న ప్రైమరీ మార్కెట్లు ఈ వారం మరింత సందడి చేయనున్నాయి. సోమవారం(22న) జీకే ఎనర్జీ, సాత్విక్ గ్రీన్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూలు ముగియగా.. గణేశ్ కన్జూమర్, అట్లాంటా ఎలక్ట్రికల్స్ ప్రారంభమయ్యాయి. ఈ బాటలో 23న సోలార్ విండ్ ఎనర్జీ, జారో ఇన్‌స్టిట్యూట్ టెక్, శేషసాయి టెక్, ఆనంద్ రాఠీ షేర్ ఐపీవోలకు తెరలేవనుంది. రేపటి(24) నుంచి మరో మూడు కంపెనీల ఐపీవోలు ప్రారంభంకానున్నాయి. సోమవారం(22న) ఐపీవో పూర్తి చేసుకున్న ఐవేల్యూ ఇన్ఫోసొల్యూషన్స్ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కానుండగా.. వారాంతాన జీకే, సాత్విక్ గ్రీన్ ఎనర్జీలో సైతం ట్రేడింగ్ ప్రారంభంకానుంది. కొన్ని ఐపీవోల వివరాలు చూద్దాం..

అట్లాంటా ఎలక్ట్రికల్స్ @ రూ. 718-754

- ఈ నెల 22–24 మధ్య ఐపీవో
- రూ. 687 కోట్ల సమీకరణకు రెడీ



న్యూఢిల్లీ: విద్యుత్, ఆటో, ఇన్వెర్టర్ డ్యూటీ ట్రాన్స్‌ఫార్మర్స్ తయారీ కంపెనీ అట్లాంటా ఎలక్ట్రికల్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 718–754 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 22న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా రూ. 400 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 287 కోట్ల విలువైన 38.1 లక్షల షేర్లను కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి 24న ముగియనున్న ఇష్యూ ద్వారా మొత్తం రూ. 687 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 19న షేర్లను విక్రయించనుంది. లిస్టింగ్ ద్వారా కంపెనీ రూ. 5,800 కోట్ల మార్కెట్ విలువను అందుకునే వీలుంది. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 19 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.

ఆనంద్ రాఠీ షేర్ @ రూ. 393-414

- ఈ నెల 23–25 మధ్య ఐపీవో
- రూ. 745 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: బ్రోకింగ్ సంస్థ ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 393–414 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 23న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా రూ. 745 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వెరసి 25న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 745 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. ఈక్విటీ జారీ నిధులలో రూ. 550 కోట్లు దీర్ఘకాలిక వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు వెచ్చించనుంది. మరికొన్ని నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 36 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఆనంద్ రాఠీ గ్రూప్ కంపెనీ విస్తృత స్థాయిలో ఫైనాన్షియల్ సర్వీసులను అందిస్తోంది. ఆనంద్ రాఠీ బ్రాండుతో 54 పట్టణాలలో 90 బ్రాంచీల ద్వారా బ్రోకింగ్, మార్జిన్ ట్రేడింగ్, ఫైనాన్షియల్ ప్రొడక్టుల పంపిణీ తదితర సర్వీసులు సమకూర్చుతోంది. గత ఆర్థిక సంవత్సరం(2024–25) ఆదాయం రూ. 468 కోట్ల నుంచి రూ. 846 కోట్లకు జంప్ చేసింది. ఇది 34 శాతం వృద్ధికాగా.. నికర లాభం 66 శాతం దూసుకెళ్లి రూ. 104 కోట్లకు చేరింది.

జైన్ రిసోర్స్ @ రూ. 220-232

- ఈ నెల 24–26 మధ్య ఐపీవో
- రూ. 1,250 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: రీసైక్లింగ్ ద్వారా నాన్‌ఫెర్రస్ మెటల్ ప్రొడక్టులను తయారు చేసే జైన్ రిసోర్స్ రీసైక్లింగ్ పబ్లిక్ ఇష్యూకి రూ. 220–232 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 24న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 750 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్ కమలేష్ జైన్(రూ. 715 కోట్లు), ప్రస్తుత వాటాదారుడు మయాంక్ ప్రతీక్(రూ. 35 కోట్లు) విక్రయానికి ఉంచనున్నారు. వెరసి 26న ముగియనున్న ఇష్యూ ద్వారా తమిళనాడు కంపెనీ రూ. 1,250 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. లిస్టింగ్‌లో కంపెనీ విలువ రూ. 8,000 కోట్లుగా నమోదయ్యే వీలున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 64 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. కంపెనీ ప్రధానంగా నాన్‌ఫెర్రస్ మెటల్ స్క్రాప్ నుంచి నాన్‌ఫెర్రస్ మెటల్ ప్రొడక్టులను రూపొందిస్తోంది. ప్రొడక్టుల జాబితాలో లెడ్, లెడ్ అల్లాయ్ ఇన్‌గాట్స్, కాపర్, కాపర్ ఇన్‌గాట్స్, అల్యూమినియం, అల్యూమినియం అల్లాయ్స్ తదితరాలున్నాయి. అంతేకాకుండా నాన్‌ఫెర్రస్ మెటల్స్, ఇతర కమోడిటీల ట్రేడింగ్‌ను సైతం చేపడుతోంది. షార్జాలో గోల్డ్ రిఫైనింగ్ యూనిట్ ఏర్పాటుకుగాను ఐకాన్ స్క్వేర్ లిమిటెడ్(యూఏఈ)తో జైన్ రిసోర్స్ చేతులు కలిపింది.

ఈప్యాక్ ప్రీఫ్యాబ్ @ రూ. 194-204

- ఈ నెల 24–26 మధ్య ఐపీవో
- రూ. 504 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: ప్రీఇంజనీర్డ్ బిల్డింగ్ సొల్యూషన్లు అందించే ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 194–204 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 24న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా రూ. 300 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 204 కోట్ల విలువైన కోటి షేర్లను కంపెనీ ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి 26న ముగియనున్న ఇష్యూ ద్వారా గ్రేటర్ నోయిడా కంపెనీ రూ. 504 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. ఈక్విటీ జారీ నిధులలో రూ. 102 కోట్లతో రాజస్తాన్‌లోని అల్వార్, గిలోత్ పారిశ్రామిక ప్రాంతంలో కొత్త తయారీ యూనిట్ నెలకొల్పనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని మాంబట్టులోగల ప్లాంటు విస్తరణకు రూ. 58 కోట్లు వెచ్చించనుంది. తద్వారా ప్రీఇంజినీర్డ్ స్టీల్ బిల్డింగ్ సామర్థ్యాన్ని పెంచుకోనుంది. రుణ చెల్లింపులకు మరో రూ. 70 కోట్లు కేటాయించనుంది. 2024 డిసెంబర్‌కల్లా కంపెనీ గ్రేటర్ నోయిడా(యూపీ), గిలోత్(రాజస్తాన్), మాంబట్టు(ఆంధ్రప్రదేశ్)లలో తయారీ యూనిట్లను కలిగి ఉంది. వీటితోపాటు నోయిడా, హైదరాబాద్(తెలంగాణ), విశాఖపట్టణం(ఆంధ్రప్రదేశ్)లలో డిజైన్ సెంటర్లను నిర్వహిస్తోంది.

భారత్ కోకింగ్ కోల్ లిస్టింగ్‌కు ఓకే

ఏక్వస్ ఐపీవోకూ సెబీ గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్(బీసీసీఎల్) పబ్లిక్ ఇష్యూకి లైన్ క్లియరైంది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా బీసీసీఎల్‌తోపాటు.. కన్జూమర్ డ్యురబుల్ గూడ్స్ కాంట్రాక్ట్ తయారీ కంపెనీ ఏక్వస్ లిస్టింగ్‌కూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏరోస్పేస్ విడిభాగాలను సైతం రూపొందించే ఏక్వస్ జూన్‌లో సెబీకి గోప్యతా మార్గంలో ప్రాస్పెక్టస్ దాఖలు చేయగా.. ఇదే నెలలో బీసీసీఎల్ సాధారణ పద్ధతిలో ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఐపీవో ద్వారా ఏక్వస్ 20 కోట్ల డాలర్ల(రూ. 1,760 కోట్లు) సమీకరణకు ప్రణాళికలు వేసింది.

46.5 కోట్ల షేర్లతో ఆఫర్

బీసీసీఎల్ పబ్లిక్ ఇష్యూలో భాగంగా మాతృ సంస్థ కోల్ ఇండియా 46.5 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనుంది. మైనింగ్‌తోపాటు.. అత్యంత నాణ్యమైన(హైగ్రేడ్) కోకింగ్ కోల్ సరఫరాకు ఏర్పాటైన బీసీసీఎల్ దేశీయంగా స్టీల్ రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. స్టీల్ తయారీకి హైగ్రేడ్ కోకింగ్ కోల్‌పై ఆధారపడే సంగతి తెలిసిందే. కాగా.. ఐపీవోలో భాగంగా ఏక్వస్ కొత్తగా ఈక్విటీ జారీతోపాటు.. ప్రస్తుత వాటాదారులు కొంతమేర వాటాలను ఆఫర్ చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి. తద్వారా రూ. 1,760 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. కంపెనీలో అమికస్, అమన్సా, స్టెడ్‌వ్యూ క్యాపిటల్ సంస్థలుసహా.. కాటమారన్ (ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కుటుంబ సంస్థ), స్పర్శ గ్రూప్, దేశ్ పాండే కార్యాలయం ఇన్వెస్ట్ చేశాయి. ఏరోస్పేస్, కన్జూమర్ రంగాలలో పూర్తిస్థాయిలో సమీకృత ప్రెసిషన్ తయారీ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న కంపెనీ భారత్‌తోపాటు.. ఫ్రాన్స్, యూఎస్‌ఏలోనూ కార్యకలాపాలు విస్తరించింది. కర్ణాటకలోని బెలగావి, హుబ్బళి, కొప్పల్‌లో మూడు తయారీ క్లస్టర్స్‌ను నిర్వహిస్తోంది.



లలిత్ బాబు ఖాతాలో రెండో విజయం

జాతీయ సీనియర్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ఎంఆర్ లలిత్ బాబు వరుసగా రెండో విజయం అందుకున్నాడు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో ఈ మెగా టోర్నీ జరుగుతోంది. సోమవారం జరిగిన రెండో రౌండ్‌లో లలిత్ బాబు 62 ఎత్తుల్లో ఆయుశ్ రవి కుమార్ (భారత్)పై గెలుపొందాడు. రెండో రౌండ్ తర్వాత ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు లలిత్ బాబు, రవితేజ, స్వర్ణ నిహాల్, అల్లూరి భాస్కరరత్న షణ్ముఖ సేతుమాధవ్, జ్ఞాన సాయిసంతోష్ రెండు పాయింట్లతో పలువురితో కలిసి ఉమ్మడిగా ఆధిక్యంలో ఉన్నారు. మరోవైపు తెలంగాణకు చెందిన వేముల విఘ్నేశ్ అద్వైత్, తరళ యోహాన్ యాదవ్, రామకృష్ణ, శివంశిక కూడా వరుసగా రెండో విజయం సాధించారు. అండర్–8 వరల్డ్ క్యాడెట్ చాంపియన్, తెలంగాణ చిన్నారి అదుళ్ల దివిత్ రెడ్డి తొలి విజయం నమోదు చేశాడు. రెండో రౌండ్‌లో తమిళనాడు ప్లేయర్ సాదుర్యన్‌పై దివిత్ రెడ్డి గెలిచాడు.

సాక్షి ప్లస్
మంగళవారం। 23-9-2025

టీమ్ వరల్డ్‌దే లేవర్ కప్

టీమ్ యూరప్‌పై 15-9తో విజయం



శాన్‌ఫ్రాన్సిస్కో: ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్)... ప్రపంచ మూడో ర్యాంకర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) సభ్యులుగా ఉన్నప్పటికీ... లేవర్ కప్‌ను నిలబెట్టుకోవడంలో టీమ్ యూరప్ జట్టు విఫలమైంది. మూడు రోజులపాటు జరిగిన ఈ వార్షిక టెన్నిస్ టోర్నీలో టీమ్ వరల్డ్ విజేతగా నిలిచింది. టీమ్ వరల్డ్ ఓవరాల్‌గా 15-9 పాయింట్ల తేడాతో టీమ్ యూరప్‌ను ఓడించి మూడోసారి లేవర్ కప్‌ను సొంతం చేసుకుంది. ఇప్పటి వరకు లేవర్ కప్ ఎనిమిదిసార్లు జరగ్గా... ఐదుసార్లు టీమ్ యూరప్ దక్కించుకుంది. 2022, 2023లలో టీమ్ వరల్డ్ టైటిల్ నెగ్గగా... టీమ్ యూరప్ 2017, 2018, 2019, 2021, 2024లలో టైటిల్ కైవసం చేసుకుంది. కరోనా మహమ్మారి కారణంగా 2020లో ఈ టోర్నీని నిర్వహించలేదు. టోర్నీ నిబంధనల ప్రకారం తొలి రోజు మ్యాచ్ గెలిస్తే ఒక పాయింట్, రెండో రోజు మ్యాచ్ గెలిస్తే రెండు పాయింట్లు, మూడో రోజు మ్యాచ్ గెలిస్తే మూడు పాయింట్లు లభిస్తాయి. రెండు రోజుల తర్వాత టీమ్ వరల్డ్ 9-3తో ఆధిక్యంలో ఉంది. టోర్నీ చివరిరోజు ఆదివారం తొలి మ్యాచ్‌గా జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో అల్‌కరాజ్–కాస్పర్ రూడ్ జోడీ 7-6 (7/4), 6-1తో మిచెల్సన్–ఒపెల్కా జంటను ఓడించింది. ఈ గెలుపుతో టీమ్ యూరప్ జట్టుకు మూడు పాయింట్లు వచ్చాయి. ఆధిక్యం అంతరం 6-9కు తగ్గింది. అనంతరం రెండో మ్యాచ్‌గా జరిగిన తొలి సింగిల్స్‌లో అలెక్స్ డిమినార్ 6-3, 6-4తో జాకుబ్ మెన్‌సిక్‌పై నెగ్గడంతో టీమ్ వరల్డ్ 12-6తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో మ్యాచ్‌గా జరిగిన రెండో సింగిల్స్‌లో అల్‌కరాజ్ 6-2, 6-1తో సెరున్‌డోలోపై గెలవడంతో టీమ్ యూరప్ ఆధిక్యం అంతరం 9-12కు తగ్గించింది. చివరిదైన నాలుగో మ్యాచ్‌లో టీమ్ యూరప్ ప్లేయర్ జ్వెరెవ్ గెలిస్తే స్కోరు 12-12తో సమమయ్యేది. కానీ ఈ మ్యాచ్‌లో టేలర్ ఫ్రిట్జ్ 6-3, 7-6 (7/4)తో జ్వెరెవ్‌ను ఓడించి టీమ్ వరల్డ్‌కు 15-9తో టైటిల్‌ను అందించాడు. అమెరికా దిగ్గజం ఆండ్రీ అగస్సీ కెప్టెన్‌గా వ్యవహరించిన టీమ్ వరల్డ్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్ టేలర్ ఫ్రిట్జ్, ఎనిమిదో ర్యాంకర్ అలెక్స్ డిమినార్, 21వ ర్యాంకర్ సెరున్‌డోలో, 32వ ర్యాంకర్ మిచెల్సన్, 42వ ర్యాంకర్ జోవా ఫొన్సెకా, 62వ ర్యాంకర్ రిలీ ఒపెల్కా, 86వ ర్యాంకర్ జెన్సన్ సభ్యులుగా ఉన్నారు. విజేతగా నిలిచిన టీమ్ వరల్డ్‌లోని ఒక్కో సభ్యుడికి 2,50,000 డాలర్ల (రూ. 2 కోట్ల 20 లక్షలు) చొప్పున ప్రైజ్‌మనీ లభించింది.

మా వల్ల కాదంటూ మరో ఫ్రాంచైజీ అవుట్

న్యూఢిల్లీ: హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్)కు మరో ఫ్రాంచైజీ గుడ్‌బై చెప్పేసింది. లక్నో ఫ్రాంచైజీ యూపీ రుద్రాస్ లీగ్ నుంచి పూర్తిగా వైదొలగుతున్నట్లు ప్రకటించింది. నిర్వహణ సవాళ్ల కారణంగా లీగ్‌లో కొనసాగలేమని యాజమాన్యం వెల్లడించింది. భరించలేని ఆర్థికభారం వల్లే లీగ్ నుంచి తప్పుకుంటున్నామని స్పష్టం చేసింది. ఇది చాలా కఠినమైన నిర్ణయమని యూపీ రుద్రాస్ టీమ్ డైరెక్టర్ సెడ్రిక్ డిసౌజా తెలిపారు. 'హాకీ ఇండియా మొదలుపెట్టిన హెచ్‌ఐఎల్ మేం ఎంతో విలువిచ్చాం. ఎప్పటికీ గౌరవిస్తూనే ఉంటాం. కానీ ఆర్థిక సవాళ్లు మమ్మల్ని లీగ్‌లో కొనసాగేందుకు అసాధ్యంగా మార్చాయి. దీర్ఘ కాలిక లక్ష్యాలతో పనిచేసే అవకాశం లేకపోవడంతో తప్పుకుంటున్నాం. అయితే భారత్‌లో హాకీ ఉన్నత శిఖరాల్లో నిలువాలని ఆకాంక్షిస్తున్నాం' అని సెడ్రిక్ డిసౌజా అన్నారు. ఈ జట్టుకు ఆడిన భారత హాకీ వైస్ కెప్టెన్ హార్దిక్ సింగ్ మాట్లాడుతూ యూపీ రుద్రాస్‌కు ప్రాతినిధ్యం వహించడం గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పాడు. అభిమానులు సైతం మా జట్టును ఆదరించారని అన్నాడు. కానీ ఇప్పుడా అధ్యాయం ముగిసిపోవడం విచారకరమన్నాడు. లీగ్‌కు దూరమైన మూడో జట్టు రుద్రాస్. ఇదివరకే మహిళల చాంపియన్ జట్టు ఒడిశా వారియర్స్ సహా పురుషుల్లో గోనాసిక టీమ్ లీగ్‌కు రాంరాం చెప్పాయి. దీంతో వచ్చే సీజన్ కోసం రాంచీ రాయల్ టస్కర్స్ (ఇరు విభాగాల్లో)తో రెండు జట్లను భర్తీ చేసుకోగా... తాజాగా హాకీ ఇండియా (హెచ్‌ఐ)కి రుద్రాస్ షాకిచ్చింది.

విండీస్‌తో సిరీస్‌కు పంత్ దూరం


- పాదం గాయం నుంచి కోలుకోని వికెట్ కీపర్
- రేపు టీమిండియాను ఎంపిక చేయనున్న కమిటీ



న్యూఢిల్లీ: భారత స్టార్ వికెట్ కీపర్–బ్యాటర్ రిషభ్ పంత్ సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరిగే సిరీస్‌కు దూరం కానున్నాడు. ఇంగ్లండ్ పర్యటనలో గాయపడిన పంత్ ఇంకా పూర్తిగా కోలుకోకపోవడం వల్లే కరీబియన్ జట్టుతో ఆడటం లేదు. జూలైలో ఇంగ్లండ్‌తో మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టెస్టు సందర్భంగా అతని ఎడమ కాలి పాదానికి గాయమైంది. ప్రస్తుతం అతను బెంగళూరులోని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లోని పునరావాస శిబిరంలో ఉన్నాడు. వెస్టిండీస్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో పాల్గొనే జట్టు ఎంపిక కోసం రేపు అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సీనియర్ సెలక్షన్ కమిటీ సమావేశం కానుంది. ఇంగ్లండ్‌లో జరిగిన టెండూల్కర్–అండర్సన్ ట్రోఫీలో పాల్గొన్న భారత జట్టుకు పంత్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. నాలుగో టెస్టులో గాయం వల్ల అతని స్థానంలో ఎన్. జగదీశన్‌ను ఐదో టెస్టుకు తీసుకున్నారు. కానీ తుది జట్టులో మాత్రం అతనికి చోటు దక్కలేదు. ప్రస్తుతం స్ట్రెంత్–కండిషనింగ్ క్యాంపులో ఉన్న రిషభ్‌ను బోర్డు వైద్యసిబ్బంది పర్యవేక్షిస్తోంది. అయితే అతను జట్టుకు ఎప్పుడు అందుబాటులోకి వస్తాడనే నిర్దిష్టమైన సమాచారాన్ని వైద్య సిబ్బంది వెల్లడించడం లేదు. ఈ నేపథ్యంలో అతిత్వరలో జరిగే విండీస్ సిరీస్ సహా ఆస్ట్రేలియా పర్యటనకు సైతం అతను దూరమయ్యే అవకాశాలున్నాయి. ఆసీస్, భారత్ 'ఎ' జట్ల మధ్య జరిగిన తొలి అనధికారిక టెస్టులో ఆకట్టుకున్న నితీశ్ కుమార్ రెడ్డి, దేవదత్ పడిక్కల్‌ల పేర్లను సెలక్షన్ కమిటీ పరిశీలించనుంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా భారత్, విండీస్‌ల మధ్య జరిగే రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి టెస్టు వచ్చే నెల 2న అహ్మదాబాద్‌లో మొదలవుతుంది.

మళ్లీ 'క్యాబ్' అధ్యక్షుడిగా గంగూలీ

ఆరేళ్ల తర్వాత పదవిలోకి వచ్చిన మాజీ కెప్టెన్



కోల్‌కతా: భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ మరోసారి బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. సోమవారం జరిగిన 'క్యాబ్' వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో గంగూలీని ఏకగ్రీవంగా అధ్యక్ష పదవిని ఎన్నుకున్నారు. 2015–2019 మధ్య ఇదే పదవిలో ఉన్న ఉన్న సౌరవ్... ఆరేళ్ల విరామం తర్వాత మళ్లీ అవే బాధ్యతలు చేపట్టడం విశేషం. 2019–2022 మధ్య 'దాదా' బీసీసీఐ అధ్యక్షుడిగా కూడా వ్యవహరించాడు. ఈడెన్ గార్డెన్స్‌ను ఆధునీకరిస్తూ సామర్థ్యాన్ని లక్షకు పెంచడంతో పాటు ప్రతిష్టాత్మక మ్యాచ్‌లను నిర్వహించేలా తాను ప్రయత్నం చేస్తానని ఈ సందర్భంగా గంగూలీ వెల్లడించాడు. ఈ ఏడాది నవంబర్‌లో భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగే టెస్టుకు ఈడెన్ ఆతిథ్యం ఇవ్వనుంది. వచ్చే టి20 వరల్డ్ కప్ భారత్‌లో జరగనున్న నేపథ్యంలో కోల్‌కతాకు కీలక మ్యాచ్‌లు దక్కేలా బీసీసీఐతో మాట్లాడి తన ప్రయత్నం చేస్తానని కూడా అతను వెల్లడించాడు. 'బెంగాల్ టీమ్ రంజీ ట్రోఫీలో రెండు సార్లు ఫైనల్లో ఆడింది. ఇప్పుడు టీమ్ మరింత బలంగా మార్చడమే నా మొదటి లక్ష్యం. ఇందులో మరో మాటకు తావు లేదు. క్రికెట్ తర్వాతే మిగతా అంశాలు వస్తాయి. 9 ఎకరాల్లో అత్యంత ఆధునిక అకాడమీని నిర్మిస్తాం. దీని కోసం ఇప్పటికే భూమిని తీసుకున్నాం. ప్లానింగ్ కూడా పూర్తయింది' అని సౌరవ్ తన ప్రణాళికలు వివరించాడు.

యూపీ యోధాస్ ఘనవిజయం



జైపూర్: వరుస పరాజయాల పరంపరకు యూపీ యోధాస్ జట్టు బ్రేక్ వేసి గెలుపుబాట పట్టింది. ప్రొ కబడ్డీ లీగ్ 12వ సీజన్‌లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ యోధాస్ 39-22తో తమిళ్ తలైవాస్‌పై ఘనవిజయం సాధించింది. ఆరంభం నుంచి యూపీ ఆటగాళ్లు సమష్టిగా పాయింట్లు రాబట్టారు. గగన్ గౌడ (7), భవానీ రాజ్‌పుత్ (6), శివమ్ చౌధరీ (5) రెయిడింగ్‌లో అదరగొట్టారు. డిఫెండర్లలో కెప్టెన్ సుమిత్ (5), మహేందర్ సింగ్ (4), అశు సింగ్ (4), హితేశ్ (2)లు ప్రత్యర్థి రెయిడర్లను టాకిల్‌తో కట్టడి చేశారు. తమిళ్ తలైవాస్ తరఫున డిఫెండర్ నితేశ్ కుమార్ (7) ఆకట్టుకున్నాడు. మిగతావారిలో నరేందర్ (4) మినహా ఇంకెవరూ చెప్పుకోదగ్గ పాయింట్లే సాధించలేకపోయారు. నాలుగు పరాభవాల తర్వాత యూపీ ఈ మ్యాచ్ గెలిచింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 7 మ్యాచ్‌లాడిన యోధాస్ మూడు మ్యాచ్‌ల్లోనే నెగ్గింది. మరోవైపు 8 మ్యాచ్‌ల్లో పోటీపడిన తలైవాస్ ఐదు మ్యాచ్‌ల్లో ఓడింది. అంతకుముందు జరిగిన తొలి మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 28-24తో గుజరాత్ జెయింట్స్‌పై గెలుపొందింది. బుల్స్ తరఫున రెయిడర్ ఆకాశ్ షిండే (7), కెప్టెన్, డిఫెండర్ యోగేశ్ (6) రాణించారు. ఆశిష్ మలిక్, దీపక్ శంకర్ చెరో 4 పాయింట్లు చేశారు. గుజరాత్ జట్టులో ఆల్‌రౌండర్ విశ్వనాథ్ (5), డిఫెండర్ లక్కీ శర్మ (5) మెరుగ్గా ఆడారు. మిగతావారిలో ప్రతీక్ దహియా (4), శుభమ్ కుమార్ (4), రాకేశ్ (4) ఆకట్టుకున్నారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో గుజరాత్ జెయింట్స్‌తో తెలుగు టైటాన్స్; జైపూర్ పింక్ పాంథర్స్‌తో యు ముంబా తలపడతాయి.

వాలీబాల్ లీగ్‌లో కేఎల్ రాహుల్

గోవా ఫ్రాంచైజీలో భాగస్వామ్యం

పనాజీ (గోవా): భారత క్రికెటర్ కేఎల్ రాహుల్ ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్)లో వ్యాపార భాగస్వామిగా అడుగు పెట్టాడు. ఈ టోర్నీలోని ఒక జట్టు గోవా గార్డియన్స్‌కు అతను సహ యజమానిగా వ్యవహరిస్తాడు.



హైదరాబాద్‌లో అక్టోబర్ 2 నుంచి 26 వరకు పీవీఎల్ జరుగుతుంది. వాలీబాల్ లీగ్‌లో ఈ సీజన్‌తోనే గోవా జట్టు తొలిసారి అడుగు పెడుతోంది. రాజు చేకూరి ఈ టీమ్‌కు యజమానిగా ఉన్నాడు. ఇప్పుడు రాహుల్ కొత్తగా టీమ్‌తో జత కట్టాడు. 'భారత క్రీడల్లో ప్రైమ్ వాలీబాల్ లీగ్ ఒక కీలక మలుపు. ప్రేక్షకులకు మరింత చేరువ అవుతూ ఈ ఆట స్థాయిని పెంచేందుకు ఇది ఉపకరిస్తుంది. చిన్నప్పటినుంచి వాలీబాల్‌ను ఎంతో ఇష్టంగా చూసేవాడిని. ఇప్పుడు అదే క్రీడకు సంబంధించిన లీగ్‌లో నేనూ భాగం కావడం సంతోషంగా ఉంది' అని రాహుల్ వ్యాఖ్యానించాడు.

రోహిత్ సారథ్యంలో...

సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ బరిలో భారత హాకీ జట్టు



న్యూఢిల్లీ: స్వదేశంలో జరగనున్న జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నమెంట్‌కు సన్నాహకంగా సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ టోర్నీలో భారత పురుషుల జట్టు బరిలోకి దిగనుంది. అక్టోబర్ 11 నుంచి 18వ తేదీ వరకు మలేసియాలో జరగనున్న ఈ టోర్నీలో రోహిత్ సారథ్యంలో భారత జట్టు పోటీపడనుంది. అక్టోబర్ 11న బ్రిటన్‌తో తొలి మ్యాచ్ ఆడనున్న టీమిండియా... 12న న్యూజిలాండ్‌తో, 14న పాకిస్తాన్‌తో, 15న ఆస్ట్రేలియాతో, 17న మలేసియాతో తలపడుతుంది. రౌండ్ రాబిన్ లీగ్ ముగిసిన తర్వాత తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు 18న జరిగే టైటిల్ పోరుకు అర్హత సాధిస్తాయి. 'సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ టోర్నీకి భారత జట్టు పకడ్బందీగా సిద్ధమైంది. నవంబర్–డిసెంబర్‌లలో స్వదేశంలో జూనియర్ ప్రపంచకప్ జరగనుంది. ఆ మెగా టోర్నీకి భారత ఆటగాళ్లకు జొహోర్ కప్ మంచి ప్రాక్టీస్‌గా ఉపయోగపడనుంది' అని భారత జూనియర్ జట్టు కోచ్ పీఆర్ శ్రీజేశ్ వ్యాఖ్యానించాడు.

భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు: రోహిత్ (కెప్టెన్), తాలెమ్ ప్రియోబర్తా, అన్‌మోల్ ఎక్కా, అమీర్ అలీ, సునీల్, రవ్‌నీత్ సింగ్, అంకిత్ పాల్, లువాంగ్, అద్రోహిత్ ఎక్కా, అరిజీత్ సింగ్ హుండల్, రోషన్ కుజుర్, మన్‌మీత్ సింగ్, అర్ష్‌దీప్ సింగ్, సౌరభ్ ఆనంద్ కుశ్వాహ, అజీత్ యాదవ్, గుర్జోత్ సింగ్. స్టాండ్‌బై: వివేక్ లాక్రా, శార్దానంద్ తివారి, థోక్‌చోమ్ కింగ్సన్ సింగ్, రోహిత్ కుల్లు, దిల్‌రాజ్ సింగ్.



డికాక్ రిటైర్మెంట్ వెనక్కి...

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా వికెట్ కీపర్, బ్యాటర్ క్వింటన్ డికాక్ తిరిగి వన్డేలు ఆడేందుకు 'సై' అంటున్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌కు గతంలో ఇచ్చిన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాడు. దీంతో పాకిస్తాన్‌లో పర్యటించే దక్షిణాఫ్రికా జట్టుకు అతన్ని ఎంపిక చేశారు. ఈ ఎడంచేతి ఓపెనింగ్ బ్యాటర్ 2023లో భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్ అనంతరం రిటైర్ అయ్యాడు. గతేడాది జరిగిన టి20 ప్రపంచకప్ వరకు పొట్టి ఫార్మాట్‌లో ఆడినప్పటికీ తర్వాత మాజీ కోచ్ రాబ్ వాల్టర్ తమ దీర్ఘకాలిక జట్టు సన్నద్ధత–లక్ష్యాల్లో భాగంగా డికాక్‌కు టి20ల్లో అవకాశమివ్వలేదు. కానీ ఇప్పుడు నమీబియాతో జరిగే ఏకైక టి20 మ్యాచ్ కోసం ప్రకటించిన దక్షిణాఫ్రికా జట్టులో డికాక్‌కు చోటు దక్కింది. ఈ మేరకు ప్రస్తుత సఫారీ కోచ్ షుక్రి కాన్‌రడ్ మాట్లాడుతూ డికాక్ మళ్లీ పరిమిత ఓవర్ల క్రికెట్‌కు తిరిగిరావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇది జట్టుకు బలాన్నిస్తుందని అన్నారు. అయితే సఫారీ జట్టుకు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 'గద'ను అందించిన కెప్టెన్ తెంబా బవుమా గాయంతో పాక్‌తో రెండు టెస్టుల సిరీస్‌కు దూరమయ్యాడు. వచ్చే నెలలో లాహోర్, రావల్పిండి వేదికలపై రెండు టెస్టుల సిరీస్ జరుగుతుంది.

పోరాడి ఓడిన రిత్విక్–బాలాజీ జంట



సాక్షి, హైదరాబాద్: హాంగ్జౌ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నమెంట్ డబుల్స్ విభాగంలో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ పోరాటం ముగిసింది. చైనాలో సోమవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో రిత్విక్–శ్రీరామ్ బాలాజీ (భారత్) జంట 6-3, 3-6, 3-10తో 'సూపర్ టైబ్రేక్'లో టాప్ సీడ్ లుకాస్ మిడ్లెర్ (ఆస్ట్రియా)–ఫ్రాన్సిస్కో కబ్రాల్ (పోర్చుగల్) ద్వయం చేతిలో ఓడిపోయింది. 81 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్–బాలాజీ ఏడు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశారు. అయితే నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో భారత జోడీ తడబడి మూల్యం చెల్లించుకుంది. సెమీఫైనల్లో ఓడిన రిత్విక్–బాలాజీలకు 16,950 డాలర్ల (రూ. 14 లక్షల 96 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

సాక్షి ప్లస్

మంగళవారం ı 23-9-2025



ఈశాన్య రాష్ట్రం త్రిపురలోని ఉదయ్‌పూర్‌లో ఉన్న, శక్తి పీఠం, మాతా త్రిపుర సుందరీదేవి ఆలయం విహంగ వీక్షణం



మాతా త్రిపుర సుందరీ దేవి ఆలయంలో సోమవారం పూజలు చేస్తున్న ప్రధాని మోదీ

అమెరికా చదువులపై తగ్గిన ఆసక్తి

ఏడాదికాలంలో 46% తగ్గుదల

- కెనడాపై ఆసక్తి రెండేళ్లలో 75 శాతం పడిపోయింది
- ఐడీపీ ఎడ్యుకేషన్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: అమెరికా చదువులపై ఏడాది కాలంలోనే ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి గణనీయంగా తగ్గిపోయింది. ఏడాది కాలంగా అమెరికాలో విద్యావకాశాల గురించి వాకబు చేసే వారి సంఖ్య ఏకంగా 46 శాతం తగ్గిపోయిందని, అదే కెనడా విషయానికొస్తే రెండేళ్ల కాలంలో 75 శాతంపైగా ఆసక్తి క్షీణించిందని ప్రముఖ ఐడీపీ ఎడ్యుకేషన్ సంస్థ తెలిపింది. భౌగోళిక రాజకీయాల ప్రభావం కారణంగానే అమెరికా, కెనడా వెళ్లాలని భావించే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందని సంస్థ దక్షిణాసియా, లాటిన్ అమెరికా, కెనడా ప్రాంతీయ డైరెక్టర్ పియూష్ కుమార్ తెలిపారు. 'మారుతున్న భౌగోళిక రాజకీయాల గురించి మాట్లాడాలంటే ముఖ్యంగా అమెరికా విషయం ప్రస్తావించాలి. ఇక్కడ గడిచిన 12 నెలల్లో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. వాస్తవానికి ట్రంప్ అధ్యక్షుడు కాకముందు గతేడాది జూన్ నుంచే అక్కడ అననుకూల వాతావరణం నెలకొంది. అప్పటి నుంచే మంజూరయ్యే వీసాల సంఖ్య తగ్గుతూ వస్తోంది' అని ఆయన విశ్లేషించారు. 'అమెరికాలో ఎన్నికలు జరిగే సంవత్సరంలో సాధారణంగా వీసాల జారీ సంఖ్య తగ్గుతుండటం మనం గమనించొచ్చు. ఇందుకు రకరకాల కారణాలుంటాయి. కానీ, ట్రంప్ అధ్యక్షుడయ్యాక, ఆయన ఎలాంటి చర్యలను ప్రకటిస్తారనే ఉత్కంఠ కూడా విద్యార్థుల ఆసక్తిపై ప్రభావం చూపింది' అని పియూష్ తెలిపారు.

కెనడాలో ఏం జరిగింది?

2024 మేతో పోలిస్తే 2025 మే నెలకు వచ్చే సరికి అమెరికాలో విద్యావకాశాల గురించి వాకబు చేసే వారి సంఖ్య 46.4 శాతం మేర పడిపోయిందని గణాంకాలు చెబుతున్నాయన్నారు. అదేవిధంగా, కెనడాలో చదువుల గురించి తెలుసుకోవాలనుకునే వారి సంఖ్య రెండేళ్ల కాలంలో ఏకంగా 70 నుంచి 75 శాతానికి తగ్గినట్లు వెల్లడైందన్నారు. 'గడిచిన రెండేళ్ల కాలంలో కెనడాలో తీవ్రమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అప్పటి కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో భారత ప్రభుత్వం మధ్య విభేదం తలెత్తడం నుంచి ఈ తగ్గుదల ఒరవడి మొదలైంది. అనంతర కాలంలో కెనడాపై అమెరికా 80 శాతం టారిఫ్‌లను రుద్దడంతో ఎగుమతులు దారుణంగా పడిపోవడంతో ఆర్థిక వ్యవస్థ కుంగిపోయింది. ఆ సమయంలో కెనడాకు వెళ్లడం సరైన నిర్ణయం కాదని అంతా భావించారు. ఎందుకంటే, చదువుకుంటూ ఉద్యోగాలు చేసుకునే అవకాశాలు చాలా పరిమితంగా ఉంటాయన్నది వారి అంచనాగా ఉంది. చదువయ్యాక స్వదేశానికి తిరిగిరాక తప్పదని అనుకోవడం వల్లే కెనడాలో చదువులకు విద్యార్థులు మొగ్గు చూపడం లేదు' అని ఆయన వివరించారు. అయితే, కెనడాలో ప్రస్తుతం అమలవుతున్న విధానాలు 2027 దాకా కొనసాగే అవకాశముంది. ఆ తర్వాత ఆ దేశం తన విధానాలను విద్యార్థులకు అనుకూలంగా మార్చుకుంటే పరిస్థితి మెరుగవుతుందని ఆయన తెలిపారు.

ఆస్ట్రేలియాలో మరిన్ని అవకాశాలు

మరో వైపు, అంతర్జాతీయ విద్యార్థులు ప్రధానంగా దృష్టి సారించే ఆస్ట్రేలియా, యుకేలకు డిమాండ్ యథా ప్రకారం కొనసాగుతోందన్నారు. ఈ రెండుదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్యలో కూడా మార్పు లేదని పియూష్ చెప్పారు. పైపెచ్చు, గత ఏడాది కంటే 9 శాతం ఎక్కువగా విద్యార్థులను చేర్చుకుంటామని ఆస్ట్రేలియా ప్రకటించిందని గుర్తు చేశారు. విద్యార్థుల సంఖ్యను పెంచుకుంటూనే ఒక పద్ధతి ప్రకారం ఆస్ట్రేలియా ముందుకు వెళుతోందన్నారు. ఆస్ట్రేలియా ప్రభుత్వం 1969 ఏర్పాటు చేసిన ఈ సంస్థ అంతర్జాతీయ విద్యార్థులకు సేవలందించడంలో అగ్రస్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, యూకే, ఐర్లాండ్, అమెరికాల్లో చదవాలనుకునే విద్యార్థులకు యూనివర్సిటీలు, కోర్సుల ఎంపికతోపాటు దరఖాస్తు చేసుకోవడం, వీసా ప్రక్రియ వంటి వాటిలో నిపుణులతో ఉచితంగా సలహాలిప్పిస్తూ సాయపడుతూంటుంది. ఇంగ్లిష్ భాషా ప్రావీణ్య పరీక్ష ఐఈఎల్‌టీఎస్‌ను సైతం ఐడీపీ ఎడ్యుకేషన్ చేపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 800 మంది యూనివర్సిటీల్లో లక్ష మంది ఐడీపీ విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ సంస్థకు భారత్‌లోని 63 నగరాల్లో 73 కార్యాలయాలున్నాయి.

ఫారో కంకణం కరిగించేశారు!

వేల ఏళ్లనాటి స్వర్ణ కంకణాన్ని అత్యల్ప ధరకు అమ్ముకున్న దొంగ



కైరో: దాదాపు 3,000 ఏళ్లుగా చెక్కు చెదరకుండా ఉండి అలనాటి ఈజిప్ట్ ఫారో రాజుల ఘనతను చాటిన స్వర్ణకంకణం చోరీ కథ చివరకు విషాదంగా ముగిసింది. ఈజిప్ట్‌లోని ప్రఖ్యాత మ్యూజియంకు సంబంధించిన పునరుద్ధరణ ల్యాబ్‌లో తస్కరణకు గురైన కంకణాన్ని వెతికిపట్టుకునేందుకు రంగంలోకి దిగిన ఈజిప్ట్ దర్యాప్తు సంస్థ అధికారులు, పోలీసులుకు చివరకు ముద్ద బంగారమే లభించింది. సీసీకెమెరాల లేని ల్యాబ్‌లో కంకణం చోరీకి గురయ్యాక పలువురు అక్రమ పురాతన వస్తువుల డీలర్ల చేతులు మారి చివరకు స్వర్ణకారుల చేతుల్లో పడి కరిగిపోయింది. తొలుత చోరీ చేసిన దొంగ మొదలు చివరిసారిగా కొనుగోలుచేసిన వ్యక్తిదాకా ఎవరికీ దాని చారిత్రక నేపథ్యం, అమూల్యమైన అంతర్జాతీయ మార్కెట్ విలువ తెలియదు. దీంతో సాధారణ బంగారు కడియంగా భావించి దానిని కరిగించి ముడి బంగారాన్ని బయటకుతీశారు. ఇటలీలో ఒక పురాతన వస్తు ప్రదర్శన కోసం కైరో నగరంలోని తహ్రీర్ స్క్వేర్‌లోని ప్రఖ్యాత మ్యూజియం నుంచి ఈ కంకణాన్ని తెప్పించగా సెప్టెంబర్ 9వ తేదీన చోరీకి గురైన విషయం తెల్సిందే. క్రీస్తు పూర్వం 1,076 సంవత్సరం నుంచి క్రీస్తు పూర్వం 723 సంవత్సరాల కాలంలో ఈజిప్ట్‌ను పరిపాలించిన రాజవంశానికి చెందిన అమేనీమోప్ ఫారో రాజుకు చెందిన ఈ కంకణంను అమేనీమోప్ ఆన్ఆర్‌టీ-4 ఛాంబర్‌లో గతంలో కనుగొన్నారు. మధ్యలో లాపిస్ లజూలీ మణిపూస పొదిగిన ఈ కంకణం అత్యంత అరుదైంది. చోరీ కేసులో నలుగురిని పోలీసులు అరెస్ట్‌చేశారు. చేతులు మారిన నగదునూ స్వాధీనంచేసుకున్నారు.

అసలేమైంది?

భద్రంగా 'సేఫ్'లో దాచిన కంకణాన్ని ల్యాబ్‌లో పునరుద్ధరణ పనులు చూసే ఒక మహిళా నిపుణురాలు దొంగలించింది. ఆమె కైరోలోని ఒక వెండి దుకాణం యజమానికి అత్యల్ప ధరకు విక్రయించింది. దీనిని ఆ వెండి దుకాణదారు మరో బంగారం దుకాణం యజమానికి కేవలం 3,800 డాలర్లకు విక్రయించాడు. దీనిని అతను 200 డాలర్ల లాభానికి అంటే 4,000 డాలర్లకు మరో బంగారం దుకాణయజమానికి అమ్మేశాడు. ఇతను కంకణాన్ని కరిగించి వచ్చిన బంగారంతో తన కస్టమర్లకు కావాల్సిన స్వర్ణాభరణాలు చేసి ఇచ్చి డబ్బు సంపాదించాడు. కంకణం కోసం బయల్దేరిన పోలీసులకు కంకణానికి బదులు ఈ నలుగురు నేరస్తులు చిక్కారని ఈజిప్ట్ పర్యాటక, పురాతత్వ శాఖ మంత్రి షెరీఫ్ ఫతీ చెప్పారు. ''కంకణం మాత్రమే కాదు ఈజిప్ట్‌లో మరెన్నో చారిత్రక వస్తువులకు సరైన భద్రత లేదు. మ్యూజియంలలో సీసీటీవీలు సరిగా పనిచేయవు. రక్షణ ఏర్పాట్లను పటిష్ఠంచేయకపోతే అమూల్య సంపద ఇలాగే అదృశ్యమయ్యే ప్రమాదం ఉంది'' అని ఈజిప్ట్ మహిళా పురాతత్వవేత్త మోనికా హనా ఆవేదన వ్యక్తంచేశారు. ఈమె ఈజిప్ట్ నుంచి విదేశాలకు అక్రమంగా తరలిపోయి అక్కడి మ్యూజియంలలో ప్రత్యక్షమైన పలు వస్తువులను తిరిగి తీసుకొచ్చేందుకు ఉద్యమిస్తున్నారు. ఈమె అరబ్ అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ, మారిటైమ్ ట్రాన్స్‌పోర్ట్ యూనివర్సిటీలో డీన్‌గా సేవలందిస్తున్నారు.

రికార్డులు, ప్రకటనల్లో కులం ప్రస్తావన ఉండరాదు

వాహనాలపై కులం ఆధారిత స్టిక్కర్లు, నినాదాలుంటే చలాన్లు

- వీధులు, గ్రామాలు, పట్టణాల్లో కులం ప్రాతిపదికన బోర్డులు ఏర్పాటు చేయరాదు
- హైకోర్టు ఉత్తర్వుల మేరకు పోలీసులకు యూపీ ప్రభుత్వం ఆదేశాలు

లక్నో: పోలీసు రికార్డుల్లో కుల ప్రస్తావన అభ్యంతరకర పరిణామాలకు దారి తీస్తోందంటూ అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తదనుగుణంగా చర్యలకు ఉపక్రమించింది. పోలీసు రికార్డులతోపాటు పబ్లిక్ నోటీసుల్లో ఎటువంటి కుల ప్రస్తావన ఉండరాదని స్పష్టం చేసింది. మోటారు వాహనాల చట్టం ప్రకారం వాహనాలపై కులం ఆధారితంగా స్టిక్కర్లు, నినాదాలను ప్రదర్శించరాదని కూడా తెలిపింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు, జిల్లా యంత్రాంగాలకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. కులపరమైన వివక్షను తొలగించాలంటూ ఈ నెల 16వ తేదీన హైకోర్టు వెలువరించిన ఆదేశాల మేరకు ఈ చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపింది. పోలీసు రిజిస్టర్లు, కేస్ మెమోలు, అరెస్ట్ డాక్యుమెంట్లతోపాటు పోలీస్ స్టేషన్లలో పెట్టే నోటీస్ బోర్డుల్లోనూ కుల ప్రస్తావన ఉండరాదని చీఫ్ సెక్రటరీ దీపక్ కుమార్ ఆ ఉత్తర్వులో తెలిపారు. రాష్ట్ర క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్(సీసీటీఎన్ఎస్) పోర్టల్‌లోనూ కులానికి సంబంధించిన కాలమ్‌ను ఖాళీగా వదిలేయాలన్నారు. పోలీసు రికార్డుల్లో నిందితుల పేర్ల వద్ద తల్లిదండ్రుల ఇద్దరి పేర్లను జత చేయాలన్నారు. వాహనాలపై కులానికి సంబంధించిన స్టిక్కర్లు, నినాదాలను ప్రదర్శించే వారిపై చలాన్లు విధించాలని కూడా ఆయన అధికారులను ఆదేశించారు. పట్టణాలు, గ్రామాల్లో కులాలను గురించి గొప్పగా చెప్పుకుంటూ ఏర్పాటు చేసే బోర్డులను తొలగించాలన్నారు. ఈ వీధి లేదా ఈ ప్రాంతం ఫలానా కులానికి చెందినదంటూ బోర్డులను ఏర్పాటు చేయరాదన్నారు. రాజకీయ లాభాపేక్షతో కులం పేరుతో ర్యాలీలు, బహిరంగ కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేయరాదన్నారు. కులాలను గురించి గొప్పగా చెప్పుకుంటూ సోషల్ మీడియాలో వచ్చే కంటెంట్‌పైనా నిఘా ఉంచుతామన్నారు. కులాధారిత శత్రుత్వాన్ని ప్రచారం చేసే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలకు లోబడి పై ఆదేశాలకు అనుగుణంగా అధికారులు తక్షణమే స్పందించాలని, దిగువ స్థాయి అధికారులకు ఈ విషయంలో తగు శిక్షణను కూడా ఇవ్వాలని పేర్కొన్నారు.

సేంద్రియ సాగు వైపు మళ్లండి

రైతులకు కేంద్ర మంత్రి అమిత్ షా సూచన

రాజ్‌కోట్: రైతులు పంటలపై రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలని సహకార, హోం శాఖల మంత్రి అమిత్ షా కోరారు. బదులుగా సేంద్రియ సాగు విధానంపై దృష్టి పెట్టాలని కోరారు. పర్యావరణ అనుకూల పద్ధతులను అనుసరిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు రైతులకు అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం చేపడుతుందని హామీ ఇచ్చారు. ప్రపంచ సేంద్రియ ఉత్పత్తుల మార్కెట్లో ఎక్కువ వాటాను దేశంలోనే ఇక్కడి రైతులకు దక్కబోతోందన్నారు. ప్రధాని మోదీ నవరాత్రి, దీపావళి సందర్భంగా కానుకగా ప్రకటించిన తగ్గింపు జీఎస్టీతో రైతులు వాడే పరికరాలు, ఇతర వస్తువుల ధరలు తగ్గుతున్నాయన్నారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్ జిల్లాలో జరిగిన సహకార సంఘాల సమావేశంలో మంత్రి ప్రసంగించారు. సేంద్రియ సాగు విధానాలతో పర్యావరణ పరిరక్షణతోపాటు పంటల ఉత్పత్తి కూడా పెరుగుతుందన్నారు.

ఏడేళ్లలో 60% పెరిగిన పప్పుధాన్యాల ఉత్పత్తి

- దిగుమతులు 10 శాతానికి తగ్గాయని నీతి ఆయోగ్ నివేదిక
- 2036 నాటికి 36 లక్షల టన్నుల మిగులుంటుందని అంచనా
- సంక్షేమ పథకాలకు పప్పుధాన్యాల సరఫరా పెంచాలని సిఫార్సు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో గడిచిన ఏడేళ్లలో పప్పు ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని నీతిఆయోగ్ వెల్లడించింది. పప్పు ధాన్యాల ఉత్పత్తి 2015-16తో పోలిస్తే ఏకంగా 60 శాతం పెరిగాయంది. ఇదే సమయంలో దిగుమతులు 10శాతానికి పడిపోయాయని తెలిపింది. పప్పు ధాన్యాల ఉత్పత్తి సమతుల్య, స్థిరమైన వృద్ధిని సాధించేందుకు కేంద్రం మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉందని తెలిపింది. అప్పుడే ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా మిగులు దేశంగా మారుతుందని నీతిఆయోగ్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఇటీవల విడుదల చేసిన 'ఆత్మనిర్భరత లక్ష్యం వైపు పప్పుధాన్యాల వృద్ధిని వేగవంతం చేసేలా వ్యూహాలు, మార్గాలు' అనే నివేదికలో పలు అంశాలను ప్రస్తావించింది. సుమారు 80 శాతం ఉత్పత్తి వర్షాధార ప్రాంతాలపై ఆధారపడి, 5 కోట్లకు పైగా రైతులు, వారి కుటుంబాల జీవనోపాధికి ఊతమివ్వడంతోపాటు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలకు పప్పుధాన్యాల రంగం చాలా కీలకంగా ఉందని నివేదిక పేర్కొంది.

లక్ష్యం చేరాలంటే కేంద్రం మద్దతే కీలకం

2015-16లో 1.63 కోట్ల టన్నుల పప్పు ధాన్యాల ఉత్పత్తి జరగ్గా, ఆ సమయంలో ఏకంగా ఏడాదికి 60 లక్షల టన్నుల మేర దిగుమతులు చేసుకునే అవసరముండేదని నీతి ఆయోగ్ తెలిపింది. 2022-23 నాటికి, ఉత్పత్తి 59.4 శాతం పెరిగి 2.60 కోట్ల టన్నులకు ఉత్పత్తి పెరగడంతో పప్పు ధాన్యాల దిగుమతి 29 శాతం నుంచి ఏకంగా 10.4 శాతానికి తగ్గిందని తెలిపింది. 2030 నాటికి దేశంలో 3.05 కోట్ల టన్నులు, 2047 నాటికి 4.57 కోట్ల టన్నుల ఉత్పత్తిని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని గుర్తు చేసింది. 2036 నాటికి 36 లక్షల టన్నుల మిగులుకు దేశం చేరాలంటే సాగులో ఎదురవుతున్న నిర్దిష్ట అడ్డంకులను తొలగించేందుకు తగిన వ్యవసాయ వ్యూహాలను అనుసరించాల్సి ఉందని సూచించింది. పప్పు ధాన్యాల ఉత్పత్తితో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలు దాదాపు 55 శాతం వాటా కలిగి ఉన్నాయని, మొదటి 10 రాష్ట్రాలు జాతీయ ఉత్పత్తిలో 91 శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయని పేర్కొంది. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, పోషక భద్రతను నిర్ధారించడానికి, పప్పుధాన్యాలలో ఆత్మనిర్భరత దిశగా దేశం లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి అవరోధాలను అధిగమించడం చాలా ముఖ్యమని పేర్కొంది. పంటల ఉత్పాదకతను పెంచేందుకు యాంత్రీకరణ, బయో-ఫెర్టిలైజేషన్ పరిష్కారాలను ప్రోత్సహించాలని, వాతావరణ అనుకూలత, తెగులు నిర్వహణ వ్యూహాలను ముందుగానే రైతులకు చేరవేసే వ్యవస్థలను వృద్ధి చేయాలని సిఫార్సు చేసింది. దీంతో పాటే రియల్ టైం డేటా ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, దిగుబడులు మెరుగు పరిచేందుకు, ఉత్తమ పద్ధతులను అవలంబించడాన్ని ప్రోత్సహించడానికి రైతులకు శిక్షణ ఇచ్చేందుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపింది. ఉత్పత్తి అంశాలతో పాటు తక్కువ ఆదాయ కుటుంబాలకు ప్రోటీన్ భద్రత కోసం ప్రజాపంపిణీ వ్యవస్థ(పీడీఎస్), పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటి సంక్షేమ పథకాల్లో పప్పు ధాన్యాలను ఎక్కువగా కేటాయించాల్సిన అవసరాన్ని నివేదిక నొక్కిచెప్పింది.

స్టార్ట్‌కు మరో ఏడాదిపాటు కట్టుబడి ఉంటాం: పుతిన్

మాస్కో: అమెరికాతో కుదిరిన నూతన వ్యూహాత్మక ఆయుధాల తగ్గింపు ఒప్పందం(న్యూ స్టార్ట్)గడువు ముగిసిన తర్వాత కూడా మరో ఏడాది పాటు అణ్వాయుధ పరిమితులకు కట్టుబడి ఉండేందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ తెలిపారు. 2026 ఫిబ్రవరితో ఒప్పందం గడువు ముగియనున్నందున పొడిగింపునకు తమతో కలిసి రావాలని అమెరికాను ఆయన కోరారు. ఒప్పందంలోని షరతులకు అమెరికా లోబడి ఉంటుందని రష్యా ఆశిస్తోందన్నారు. వ్యూహాత్మక ఆయుధాలకు సంబంధించి అమెరికా కార్యకలాపాలను నిశితంగా పరిశీలిస్తూ ఉండాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. ఒక వేళ అమెరికా క్షిపణి వ్యవస్థల మోహరింపును, అంతరిక్షంలో ఆయుధ వ్యవస్థల విస్తరణను చేపడితే తగు రీతిలో తమ చర్యలుంటాయని స్పష్టం చేశారు. ఆయుధ పోటీని నివారించేందుకు ఉద్దేశించిన న్యూ స్టార్ట్ ఒప్పందంపై 2010లో రష్యా అధ్యక్షుడు మెద్వెదెవ్, అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా సంతకాలు చేశారు. దీని ప్రకారం..ఇరు దేశాలు 1,550కు మించి అణు వార్ హెడ్లను, 700కు మించి క్షిపణులు, బాంబర్లను కలిగి ఉండరాదు.

సుప్రీంకోర్టులో జాక్వెలిన్‌కు చుక్కెదురు

న్యూఢిల్లీ: మోసగాడు సుకేశ్ చంద్రశేఖర్‌తో సంబంధమున్న రూ.200 కోట్ల మనీ లాండరింగ్ కేసులో బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టేసేందుకు నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు జులై 3వ తేదీన ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ జాక్వెలిన్ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఆగస్టీన్ జార్జి మసీహ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. 'మీరు ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకోండి. సరైన సమయంలో మళ్లీ రండి. ఈ దశలో మేం జోక్యం చేసుకోబోం' అని పేర్కొంది. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న జాక్వెలిన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు ఇప్పటికే హాజరయ్యారు. సుకేశ్ చంద్రశేఖర్ గతంలో ర్యాన్‌బాక్సీ కంపెనీ మాజీ ప్రమోటర్లు శివీందర్ సింగ్, మల్వీందర్ సింగ్‌లను రూ.200 కోట్ల మేర మోసం చేశాడని ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ డబ్బుతో అతడు సన్నిహితురాలైన జాక్వెలిన్‌కు ఖరీదైన బహుమతులు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి.

ఢిల్లీ అల్లర్ల నిందితుల బెయిల్ పిటిషన్లపై పోలీసులకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: ఢిల్లీలో 2020 అల్లర్ల కేసులో నిందితులైన ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్, గుల్ఫిషా ఫాతిమా, మీరన్ హైదర్ తదితరులు పెట్టుకున్న బెయిల్ పిటిషన్లపై సుప్రీంకోర్టు ఢిల్లీ పోలీసులకు నోటీసులిచ్చింది. అల్లర్లకు కుట్ర పన్నారంటూ పోలీసులు వీరిపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా)కింద కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేశారు. ఢిల్లీ హైకోర్టు ఈ నెల 2వ తేదీన తమ బెయిల్ పిటిషన్లను కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ వీరు సుప్రీంను ఆశ్రయించారు. సోమవారం జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్వీ అంజారియాల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్లంతా విద్యార్థులని, ఐదేళ్లుగా వీరు జైలులోనే ఉన్నారంటూ ఫాతిమా తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ తెలిపారు. పోలీసుల స్పందన అందాక అక్టోబర్ 27వ తేదీన తదుపరి విచారణ చేపడతామని ధర్మాసనం తెలిపింది. 2020 ఫిబ్రవరిలో పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌర రిజిస్టర్‌లకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనల్లో 53 మంది చనిపోగా, 700 మందికి పైగా గాయపడటం తెల్సిందే.

ఎన్ఎస్‌సీఎన్(కే)పై నిషేధం మరో ఐదేళ్లు

న్యూఢిల్లీ: నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్(ఖప్లాంగ్)పై విధించిన నిషేధాన్ని మరో ఐదేళ్లకు కేంద్రం పొడిగించింది. దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు భంగం కలిగించే ఎన్ఎస్‌సీఎన్(కే)తోపాటు అనుబంధంగా ఉన్న అన్ని విభాగాలు, సంస్థలపై మరో ఐదేళ్ల నిషేధం కొనసాగించనుంది. సెప్టెంబర్ 28వ తేదీ నుంచి అమలవుతుందని పేర్కొంటూ హోం శాఖ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దేశం నుంచి విడిపోయి భారత-మయన్మార్ సరిహద్దుల్లోని నాగాల నివాస ప్రాంతాలను కలుపుకొని స్వతంత్ర నాగాలాండ్‌ను ఏర్పాటే లక్ష్యమని ఎన్ఎస్‌సీఎన్(కే) లక్ష్యంగా ప్రకటించుకుందని హోం శాఖ తెలిపింది. యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం(ఉల్ఫా), పీపుల్స్ రివల్యూషనరీ పార్టీ ఆఫ్ కాంగ్లీ పాక్ (ప్రీపాక్), పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) వంటి ఇతర చట్టవిరుద్ధ సంఘాలతో పొత్తు పెట్టుకుందని ఆ నోటిఫికేషన్‌లో తెలిపింది. అందుకే, చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా)లోని నిబంధనల ప్రకారం నిషేధం విధించినట్లు వివరించింది. ఎన్ఎస్‌సీఎన్(కె) చీలిక వర్గం ఎన్ఎస్‌సీఎన్(ఐఎం)మాత్రం ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న నాగాలాండ్ సమస్యకు శాంతియుత పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతోంది.

నెట్‌ఫ్లిక్స్‌లో 'ఈ-సిగరెట్' ప్రకటనపై ముంబై పోలీస్ చీఫ్‌కు ఎన్‌హెచ్ఆర్‌సీ నోటీస్

న్యూఢిల్లీ: నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారమయ్యే వెబ్‌సిరీస్‌లో ప్రముఖ నటుడు రణ్‌బీర్ కపూర్ నిషేధిత ఈ-సిగరెట్‌ను వాడుతూ కనిపించడంపై జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్ఆర్‌సీ) కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖతోపాటు ముంబై పోలీస్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. లీగల్ రైట్స్ అబ్జర్వేటరీ సంస్థకు తరఫున వినయ్ జోషి ఈ ఫిర్యాదు చేశారు. ఓటీటీలో 'Bads of Bollywood' ప్రసారమయ్యే సమయంలో స్క్రీన్‌పై ఎటువంటి హెచ్చరిక లేకుండా రణ్‌బీర్ కపూర్ ఈ సిగరెట్‌తో కనిపించడాన్ని నేరుగా ప్రసారం చేయడాన్ని ఎన్‌హెచ్ఆర్‌సీ ప్రస్తావించింది. ఈ చర్య యువతపై ప్రతికూల ప్రభావం చూపడంతోపాటు నిషేధ ఉత్పత్తులపై వారిని తప్పుదోవ పట్టించడమేనంటూ అందిన ఫిర్యాదుపై ఎన్‌హెచ్ఆర్‌సీ ఈ మేరకు స్పందించింది. తమ నోటీసుకు స్పందనగా తీసుకున్న చర్యలను వివరిస్తూ రెండు వారాల్లోగా నివేదిక అందజేయాలని కోరింది. ఈ పరిణామంపై కేంద్ర మంత్రిత్వ శాఖ, నెట్‌ఫ్లిక్స్ స్పందించాల్సి ఉంది.

జార్ఖండ్‌లో పట్టపగలే బ్యాంకు దోపిడీ

దియోగఢ్: జార్ఖండ్‌లోని దియోగఢ్ జిల్లా కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం ఓ ప్రైవేట్ బ్యాంకులో దోపిడీ జరిగింది. నగరం నడిబొడ్డునున్న రాజాబారీ రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు శాఖలోకి మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో మూడు బైక్‌లపై ఆరుగురు గుర్తు తెలియని దుండగులు ప్రవేశించారు. వచ్చీ రాగానే షట్టర్‌ను కిందికి లాగారు. వీరిలో ఒకడు హెల్మెట్, మరొకడు ముసుగు ధరించి ఉండగా మిగతా నలుగురూ సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా కనిపిస్తున్నారు. ముగ్గురు దండుగులు తమ వద్ద ఉన్న పిస్టళ్లతో కాల్చి చంపుతామని సిబ్బంది బెదిరించారు. బ్యాంకు ఉద్యోగి ఒకరిని తీవ్రంగా కొట్టారు. అనంతరం బ్యాంకులో ఉన్న నగదుతోపాటు ఆభరణాలను మూటగట్టుకున్నారు. వెళ్తూ బ్యాంకు కార్యాలయం షట్టర్‌కు బయటి నుంచి తాళం వేశారు. సమాచారం అందుకున్న పోలీసులు దుండగుల్లో ఒకరిని అక్కడికి 5 కిలోమీటర్ల దూరంలోని గ్రామం వద్ద అదుపులోకి తీసుకున్నారు. తమను పక్కదారి పట్టించేందుకే దుండగులు ఈ మేరకు పథకం వేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, దుండగులు ఎత్తుకుపోయిన మొత్తాన్ని లెక్కగట్టే పనిలో అధికారులున్నారు.

2026లో ఎస్-400 క్షిపణి వ్యవస్థల బట్వాడా పూర్తి

మాస్కో: 2018లో భారత్‌తో కుదిరిన ఒప్పందం మేరకు ఎస్-400 క్షిపణి వ్యవస్థలన్నిటినీ వచ్చే ఏడాదికల్లా రష్యా అందజేయనుంది. ఇప్పటికే నాలుగు క్షిపణి వ్యవస్థలను అందజేయగా, ఐదో దానిని 2026లో అందజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు రష్యా రక్షణ శాఖను ఉటంకిస్తూ అధికార టాస్ వార్తా సంస్థ తెలిపింది. అమెరికా అభ్యంతరాలను సైతం లెక్కచేయకుండా భారత్ 2018లో ఎస్-400 క్షిపణి వ్యవస్థల కొనుగోలు కోసం రష్యాతో రూ.40 వేల కోట్ల విలువైన కాంట్రాక్టు కుదుర్చుకుంది. మేలో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎస్-400 క్షిపణి వ్యవస్థలు లక్ష్యాలను గురి తప్పకుండా ఛేదించడం ద్వారా కీలకంగా మారాయి. దీంతో, మరింత ఆధునీకరించిన ఎస్-500 క్షిపణి వ్యవస్థలను సైతం రష్యా నుంచి కొనుగోలు చేసేందుకు భారత్ సిద్ధమవుతోంది.

అమెరికాలో భూకంపం.. భయంతో జనం పరుగులు

బర్కిలీ: అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో బే, బర్కిలీకి సమీపంలో సోమవారం వేకువజామున 3 గంటల సమయంలో భూకంపం సంభవించింది. తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.3గా నమోదైంది. శాన్‌ఫ్రాన్సిస్కో, బర్కిలీతోపాటు అక్కడికి 161 కిలోమీటర్ల దూరంలోని సలినాస్‌లోనూ ప్రకంపనల ప్రభావం కనిపించింది. తీవ్ర భూప్రకంపనలతో భయంతో నిద్ర నుంచి మేల్కొన్న జనం పరుగుపరుగున ఇళ్లు వదిలి వీధుల్లోకి చేరుకున్నారు. దుకాణాల షెల్ఫుల్లోని ఉన్న వస్తువులు కింద పడిపోయాయి. కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ఇళ్లు కదులుతున్నట్లుగా ఉన్న వీడియోలు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమయ్యాయి. భూకంపం కారణంగా కొద్దిసేపు రైళ్లను తక్కువ వేగంతో నడిపారు. అయితే, ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. నష్టం గురించిన సమాచారం కూడా లేదన్నారు. భూకంప కేంద్రం బర్కిలీకి ఆగ్నేయంగా 1.6 కిలోమీటర్ల దూరంలో, సుమారు 7.7 కిలోమీటర్ల లోతులో ఉంది.

నాయంకర విధానం ఎవరి హయాంలో మొదలైంది?

ప్రతాపరుద్రుడి కాలంలో నాయంకర విధానం అమలైంది. ఇది ఒక రకమైన జాగిర్దారీ విధానం. రాజ్యాన్ని అనేక మండలాలుగా విభజించి వాటికి పరిపాలనాధికారులుగా సైన్యాధ్యక్షులను నియమించేవారు. ఈ పాలకులనే నాయంకరులు అనేవారు. వీరు నిర్ణీత మొత్తంలో సైన్యాన్ని పోషించి, యుద్ధసమయంలో చక్రవర్తికి తోడ్పడేవారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర

కాకతీయుల సామంతులు

నతవాడి వంశం

నందిగామ, మధిర తాలూకాలు, మహబూబాబాద్, జనగామ తాలూకాలు నతవాడి రాజ్యపరిధిలో ఉండేవి. ఈ రాజ్యాన్ని నతవాడి వంశం పాలించింది. ఈ వంశీయులు మొదట కల్యాణీ చాళుక్యుల సామంతులుగా ఉండి తర్వాత కాకతీయుల సామంతులయ్యారు.

ఈ వంశానికి ఆద్యుడు బేతరాజు. ఇతడు కాకతీయ రెండో ప్రోలరాజుకు తన కూతురునిచ్చి వివాహం చేశాడు. ఇతడి కుమారుడైన దుర్గరాజు(1104–1157) కల్యాణీ చాళుక్య ఆరో విక్రమాదిత్యుడికి, మూడో సోమేశ్వరుడికి సామంతుడిగా పనిచేశాడు. దుర్గరాజు కుమారుడైన బుద్ధరాజును కాకతి రుద్రదేవుడు, మహాదేవుడు నతవాడి పాలకుడిగా నియమించారు. ఇతడి పెద్ద కుమారుడు రుద్రుడు. కాకతి మహాదేవుడు ఇతడికి తన కూతురునిచ్చి వివాహం చేశాడు. బుద్ధరాజు రెండో కుమారుడు వక్కడి మల్లరుద్రుడు. ఇతడు గణపతి దేవుడి సోదరి అయిన మైలాంబను వివాహం చేసుకున్నాడు. రుద్రమదేవి కాలం వరకు నతవాడి రాజులు కాకతీయ సామంతులుగా పనిచేశారు.

గోనవంశం

రుద్రదేవుడు కందూరి చోడులను పానుగల్లు, దేవరకొండ ప్రాంతాలకు పరిమితం చేసినందువల్ల వారు వర్ధమానపురాన్ని విడిచి వెళ్లారు. మళ్లీ రుద్రదేవుడే వర్ధమానపురం (కందూరినాటి) పాలకుడిగా గోన బుద్ధరాజు(రంగనాథ రామాయణ కర్త)ను నియమించి ఉంటాడని భావిస్తున్నారు. అతడి కుమారుడైన గోన గన్నారెడ్డి గణపతిదేవుడి వల్ల వర్ధమానపుర రాజ్యాన్ని తిరిగి పొందాడు. ఇతడి తమ్ముడు విఠల నరేంద్రుడు. వీరిద్దరూ యాదవ రాజులు ఆక్రమించిన ఆదవాని, తుంబుళాలను జయించి రాయచూరు దుర్గాన్ని ఆక్రమించారు. విఠలుడు హొళువ, మాణువ రాజ్యాలను జయించాడు. కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ప్రదేశాన్ని ఆక్రమించి దక్షిణాంధ్ర భూభాగాలను కాకతీయ సామ్రాజ్యంలో కలిపాడు. గోన గన్నారెడ్డి సోదరి కుప్పాంబిక. ఆమె భర్త మల్యాల గుండ దండాధీశుడు. గోన గన్నారెడ్డి తర్వాత ఇతడు వర్ధమానపుర పాలకుడయ్యాడు. ఇతడు 1245–46లో వర్ధమానపుర శాసనం వేయించాడు. 1259లో బూదపూర శాసనం, 1272లో మరో శాసనం వేయించాడు. ఇతడి మరణానంతరం భార్య కుప్పాంబిక తన భర్త పేరు మీద 1276లో గుండేశ్వరాలయం నిర్మించి శాసనం వేయించింది. ఇందులో ఆమె చిన్న తమ్ముడు గోనబుద్ధయ, గోన విఠయ కుమారుడు గుండయ గురించి పేర్కొన్నారు.

వావిలాల వంశం

వీరు రెడ్డి వంశస్థులు. రుద్రమదేవి కాలంలో ఆమనగల్లు, వంగూరు విషయాల (సీమ) పాలకులుగా ఉన్నారు. చెరకు రెడ్లతో వీరికి వివాహ సంబంధాలు ఉన్నాయి.

కాయస్థ వంశం (1239-1304)

మహారాష్ట్ర నుంచి వచ్చి స్థిరపడిన కాయస్థ వంశస్థుల్లో ఆద్యుడు గంగయ సాహిణి(1239–1257). ఇతడు కాకతి గణపతిదేవ చక్రవర్తికి సామంతుడు, ఆప్తుడు, అశ్వసైన్యాధిపతి. ఇతడి సువిశాల రాజ్యంలో మార్జవాడి, పలనాడు, కడప మొదలైన ప్రాంతాలతో పాటు, నల్లగొండ జిల్లాలోని పానగల్లు కూడా ఉండేవి. ఇతడి రాజధాని కడప జిల్లా వల్లూరు. దేవగిరి యాదవ రాజు ఆజ్ఞ మేరకు అతడి సామంతుడైన దామోదరుడు కాకతీయ భూభాగాలను ఆక్రమించాడు. గణపతిదేవుడి ఆజ్ఞతో గంగయ సాహిణి దామోదరుణ్ని ఓడించాడు. దీంతో గణపతిదేవుడు అతడికి మహామండలేశ్వర పదవిని ఇచ్చాడు.

గంగయ సాహిణి తర్వాత అతడి మేనల్లుడైన జన్నిగదేవుడు గణపతిదేవుడు, రుద్రమదేవి వద్ద సామంతుడిగా పనిచేశాడు. ఇతడి రాజ్యంలో నల్లగొండ మండలం అంతర్భాగంగా ఉండేది. ఇతడి సోదరుడు త్రిపురాంతకుడుకూడా సామంతుడే. తర్వాత ఇతడి సోదరుడు అంబదేవుడు(1275–1302) స్వతంత్రించి కాకతీయులకు శత్రువయ్యాడు. అంబదేవుడి రాజ్యంలో నల్లగొండ జిల్లాలోని కృష్ణా నది ఉత్తర ప్రాంతాలు, దోర్నాల ఉండేవి. ఇతడి కుమారుడైన రెండో త్రిపురాంతకుడి కాలంలో ఈ రాజ్యం కాకతీయ రాజ్యంలో కలిసిపోయింది.



సమ్మక్క సారక్క

పగిడిద్దరాజు, సమ్మక్క–సారక్కల తిరుగుబాటు వృత్తాంతానికి చారిత్రక ఆధారాలు లేవు. కానీ శతాబ్దాల నుంచి వీరి గాథలు ప్రజల్లో ప్రచారంలో ఉన్నాయి. వాటి ప్రకారం..

గోదావరి తీర ప్రాంతమైన మేడారం పరగణాను కోయ తెగకు చెందిన పగిడిద్దరాజు పాలించేవాడు. ఇతడు ప్రతాపరుద్రుడి సామంతుడు. కరీంనగర్ రాజధానిగా పాలించే మరో కోయ రాజైన మేడరాజు తన కుమార్తె సమ్మక్కను పగిడిద్దరాజుకిచ్చి పెళ్లి చేశాడు.

సారలమ్మ, నాగులమ్మ, జంపన్నలు వారి సంతానం. కొన్నాళ్లకు మేడారం పరగణాలో నాలుగేళ్ల పాటు తీవ్రమైన కరువు వచ్చింది. ప్రజలు పన్నులు కట్టలేని దుస్థితి తలెత్తింది. దీంతో పగిడిద్దరాజు కూడా ప్రతాపరుద్రుడికి పన్నులు కట్టలేదు. దీన్ని ధిక్కారంగా భావించిన ప్రతాపరుద్రుడు మంత్రి యుగంధరుడి ఆధ్వర్యంలో అతడిపైకి పెద్ద ఎత్తున సైన్యాన్ని పంపాడు. మేడారం సమీపంలోని సంపెంగవాగు వద్ద పగిడిద్దరాజు సైనికులు కాకతీయ సైన్యంతో వీరోచితంగా పోరాడారు. ఆయుధ బలం, సంఖ్యాబలం ఉన్న కాకతీయ సైన్యాన్ని నిలువరించలేక పగిడిద్దరాజుతో సహా ఆయన బిడ్డలు సారలమ్మ, నాగులమ్మ, అల్లుడు గోవిందరాజు వీరమరణం పొందారు. ఈ పరాజయాన్ని భరించలేక పగిడిద్దరాజు కుమారుడైన జంపన్న వాగులోకి దూకి చనిపోయాడు. అప్పటి నుంచి ఈ వాగుకు జంపన్నవాగు అని పేరొచ్చింది. పగిడిద్దరాజు భార్య సమ్మక్క కాకతీయ సేనతో పోరాడుతుండగా, ఒక సైనికుడు దొంగచాటుగా వచ్చి బల్లెంతో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన సమ్మక్క ప్రస్తుతం జాతర జరుగుతున్న స్థలంలో నేలకొరిగింది.

లక్షలాది మంది పూజలందుకుంటున్న ఈ వీరుల గాథలు, కథనాల్లో చిన్న చిన్న తేడాలున్నాయి. కాకతీయులకు, ఆదివాసీలకు యుద్ధం జరగడానికి సహజవనరుల పంపకాల వివాదం కారణమని కొన్ని కథనాలు, కప్పం చెల్లించకపోవడం కారణమని ఇంకొన్ని కథనాలు చెబుతున్నాయి. వీరి నుంచి కాకతీయులు కప్పం వసూలు చేశారనడానికి ఆధారాల్లేవని చరిత్రకారులు తెలిపారు. కానీ ఎక్కువ కథలు అదే కారణమని చెబుతున్నాయి. కాకతీయులు రాష్ట్ర కూట వంశం వారు కాదని పులింద జాతికి చెందిన వారని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. ఈ యుద్ధానికి పుళింద, కోయ జాతి వైరం కారణమా? కప్పమే కారణమా? అన్నది పరిశోధించి తేల్చాల్సి ఉంది.

కాకతీయ యుగ విశేషాలు

పాలనా విధానం: కాకతీయుల ప్రభుత్వం సంప్రదాయ రాచరికం. సాధారణంగా రాజ్యం తండ్రి నుంచి కుమారుడికి వారసత్వంగా సంక్రమిస్తుంది. కుమార్తెకు కూడా ఆ హక్కు కల్పించడం కాకతీయ వంశంలోనే జరిగింది. సిద్ధాంత రీత్యా అధికారం అంతా రాజుదే. కానీ ఆచరణలో రాజ్యాధికారానికి కొన్ని పరిమితులు ఉండేవి. పాలనలో రాజుకు సహకరించేందుకు మంత్రి పరిషత్తు ఉండేది. వర్ణధర్మం, కులధర్మం, ఆచారం, సంప్రదాయం, శాస్త్ర నియమాలు రాజుకైనా అనుల్లంఘనీయాలు. నాటి శాసనాల్లో చాతుర్వర్ణ సముద్ధరణ అనే బిరుదు తరచుగా కనిపిస్తుంది. నిర్ణీత సమయంలో రాజు ప్రజలకు దర్శనం ఇవ్వాలని రుద్రదేవుడి నీతిసారం తెలుపుతోంది. కాకతీయులు ఆరోగ్యశాలలు, ప్రసూతి ఆసుపత్రులు, కళాశాలలు, మఠాలు, సత్రాలు, చలివేంద్రాలను నెలకొల్పారు.

కాకతీయుల మంత్రులలో అన్ని కులాల వారు ఉండేవారు. కాకతీయులు కులాన్ని బట్టికాక వ్యక్తుల అర్హతలను బట్టి మంత్రి పదవులు ఇచ్చారు. గణపతిదేవ చక్రవర్తికి రేచర్ల రుద్రారెడ్డి, మల్యాల హేమాద్రిరెడ్డి ప్రధానులు. ప్రతాపరుద్రుడికి ముప్పిడి నాయకుడు మహా ప్రధాని. ప్రతాపరుద్రుడి కాలంలో నాయంకర విధానం అమలైంది. ఇది ఒక రకమైన జాగిర్దారీ విధానం. రాజ్యాన్ని అనేక మండలాలుగా విభజించి వాటికి పరిపాలనాధికారులుగా సైన్యాధ్యక్షులను నియమించేవారు. ఈ పాలకులనే నాయంకరులు అనేవారు. నాయంకరులు దుర్గాధ్యక్షులు. వారి మండలంలో వచ్చే ఆదాయంతో నిర్ణీత సైన్యాన్ని పోషించి, యుద్ధ సమయంలో చక్రవర్తికి తోడ్పడేవారు. ప్రతాపరుద్రుడు తన రాజ్యంలో నాలుగో వంతు భూమిని నాయంకరుల ఆధీనంలో ఉంచాడు. ప్రతాపరుద్రుడి కాలంలో 75 మంది నాయంకరులున్నారు. కాకతీయరాజ్య పతనం తర్వాత విజయనగర రాజులు నాయంకర విధానాన్ని అనుసరించారు. ఆంగ్లేయులు పాలన చేపట్టే వరకూ ఈ విధానం కొనసాగింది. కాకతీయులకు పూర్వీకులైన చోళులు, చాళుక్యులు కేంద్రీకృత పాలనా విధానాన్ని అనుసరించారు. అందుకు భిన్నంగా కాకతీయులు వికేంద్రీకృత పాలనా వ్యవస్థను అమలు పరిచారు. అందుకే మాండలికులు, నాయంకరులకు సైనిక విషయాలు మినహా పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. వారిపై అధికారాన్ని రుద్దలేదు. అణచి ఉంచే పద్ధతిని విడిచిపెట్టారు. వీరు తమను మహామండలేశ్వరులుగానే భావించారు తప్ప, రాజాధిరాజుగా, చక్రవర్తిగా భావించలేదు. ఒక రకంగా ఇది ప్రజాస్వామిక భావన.

నాయంకరుల్లో తెలంగాణకు సంబంధించిన కొందరి వివరాలు: యాదవ విశ్వనాథుడు గణపతిదేవుడి కాలంలో యుద్ధాల్లో పాల్గొన్నాడు. నల్లగొండ జిల్లాలో ఒక ప్రాంతాన్ని పరిపాలించాడు. అక్షయచంద్రదేవుడు కరీంనగర్ ప్రాంతాన్ని పాలించాడు. సారంగపాణి దేవుడనే యాదవరాజు పానగల్లును పాలించాడు. సింద కుటుంబానికి చెందిన భైరవుడు రుద్రమ కాలంలో బీదర్ ప్రాంతాన్ని పాలించాడు.

పరిపాలనా సౌలభ్యం కోసం కాకతీయ సామ్రాజ్యాన్ని స్థలం, సీమ, వాడి, నాడు, పాడి, భూమి అనే ప్రాంతీయ విభాగాలుగా విభజించారు. 10 నుంచి 60 గ్రామాల సముదాయాన్ని స్థలంగా వ్యవహరించేవారు. కొన్ని స్థలాల సముదాయమే నాడు. ఉదాహరణ: అనుమకొండ నాడు, కందూరునాడు, సబ్బినాడు, అయిజ నాడు.

ఆయగార్లు

గ్రామపాలనను ఆయగార్లు నిర్వహించేవారు. గ్రామసేవ, రాజ్యసేవ చేసినందుకు పన్ను లేకుండా వీరు భూమిని పొందేవారు. ఆయం అంటే పొలం వైశాల్యం. సాధారణంగా ఆయగార్ల సంఖ్య పన్నెండు. వారు
1. కరణం, 2. రెడ్డి, 3. తలారి 4. పురోహితుడు, 5. కమ్మరి, 6. కంసాలి, 7. వడ్రంగి, 8. కుమ్మరి 9. చాకలి, 10. మంగలి, 11. వెట్టి, 12. చర్మకారుడు. వీరిలో మొదటి ముగ్గురు ప్రభుత్వ సేవకులు. మిగతా వారు గ్రామ సేవకులు. గ్రామ విస్తీర్ణం, ఆయకట్టు, పోరంబోకు భూమి, తోట భూమి, గడ్డిభూముల విస్తీర్ణం, వ్యక్తుల ఆస్తుల లెక్కలు, దేవాలయ ఆస్తుల లెక్కలు మొదలైన దస్తరం నిర్వహణ కరణం బాధ్యత. కరణం ఇచ్చే లెక్కల ఆధారంగా రాజ్యభాగం(పన్ను)ను వసూలు చేసి ప్రభుత్వానికి అందజేసే బాధ్యత రెడ్డి లేదా పెద కాపుది. గ్రామ రక్షణ బాధ్యత తలారిది. దొంగతనాలు జరిగినప్పుడు నేరస్థులను పట్టుకోవడం, అపహరించిన సొత్తుని తెచ్చి ఇవ్వడం అతడి విధి.
అష్టాదశవర్ణాల వారికి సంఘాలుండేవి. వీటిని సమయాలనేవారు.

భారత పార్లమెంట్ సమావేశాలు దేనితో ప్రారంభమవుతాయి?



భారత పార్లమెంట్

1. లోక్‌సభ, అసెంబ్లీల్లో ఎస్సీ, ఎస్టీ, ఆంగ్లో–ఇండియన్ల రిజర్వేషన్లను ఎన్నో రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 2030 సంవత్సరం వరకు పొడిగించారు?
   1) 101 2) 102 3) 103 4) 104

జ. 4;
వివరణ: భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 330, 331, 332, 333 ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీల్లో ఎస్సీ, ఎస్టీ, ఆంగ్లో ఇండియన్లకు రిజర్వేషన్లను కల్పిస్తూ, ఇవి 10 సంవత్సరాల పాటు అంటే 1960 వరకు ఉంటాయని ఆర్టికల్–334లో పేర్కొన్నారు. కానీ దీన్ని ఇప్పటికి 7సార్లు పొడిగించారు.
ఇటీవల మోదీ ప్రభుత్వం 126వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టగా పార్లమెంట్ ఆమోదం అనంతరం రాష్ట్రపతి సంతకంతో 2019 డిసెంబర్ 12న 104వ రాజ్యాంగ సవరణ చట్టంగా అమలులోకి వచ్చింది. ప్రస్తుతం ఆర్టికల్ 334 ప్రకారం ఈ రిజర్వేషన్లు 80 సంవత్సరాలపాటు (రాజ్యాంగం అమలులోకి వచ్చిన 1950 సంవత్సరం నుంచి) అంటే 2030 వరకు అమలులో ఉంటాయి. ప్రస్తుతం లోక్‌సభలో ఎస్సీలకు 84 స్థానాలు, ఎస్టీలకు 47 స్థానాలు రిజర్వ్ చేశారు.

2. భారత పార్లమెంట్ తొలిసారిగా ఎప్పుడు సమావేశం అయింది?
   1) 1952 మార్చి 13 2) 1952 మే 13
   3) 1953 మార్చి 13 4) 1953 మే 13

జ. 2;
వివరణ: భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత రాజ్యసభ 1952 ఏప్రిల్ 3న ఏర్పడింది. లోక్‌సభ 1952 ఏప్రిల్ 17న ఏర్పడింది. ఈ రెండు సభలతో కూడిన భారత పార్లమెంట్ తొలిసారిగా 1952 మే 13న సమావేశం అయింది. భారత పార్లమెంట్ 2002 మే 13న స్వర్ణోత్సవాలు జరుపుకోగా, 2012 మే 13న వజ్రోత్సవ ఉత్సవాలు జరుపుకుంది.

3. లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్య ఎంత?
   1) 545 2) 550 3) 552 4) 543

జ. 3;
వివరణ: లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్య 552. ఇందులో 530 మంది రాష్ట్రాల నుంచి ఎన్నిక కాగా, 20 మంది కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఎన్నికవుతారు. మిగిలిన ఇద్దరు ఆంగ్లో–ఇండియన్ సభ్యులను రాష్ట్రపతి నియమిస్తారు. కానీ ప్రస్తుతం లోక్‌సభలో 545 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 530 మంది రాష్ట్రాల నుంచి, 13 మంది కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యారు. మిగిలిన ఇద్దరు ఆంగ్లో–ఇండియన్ సభ్యులను రాష్ట్రపతి నియమిస్తాడు.

4. లోక్‌సభలో అతి తక్కువగా అంటే ఒక్కొక్క స్థానం ఉన్న రాష్ట్రాలు ఏవి?
   1) సిక్కిం, నాగాలాండ్, గోవా
   2) సిక్కిం, గోవా, మణిపూర్
   3) సిక్కిం, నాగాలాండ్, మిజోరాం
   4) సిక్కిం, మిజోరాం, మణిపూర్

జ. 3;
వివరణ: సిక్కిం, నాగాలాండ్, మిజోరాం రాష్ట్రాల నుంచి లోక్‌సభలో ప్రాతినిధ్యం ఒక్క సీటు మాత్రమే ఉంది. అరుణాచల్‌ప్రదేశ్, గోవా, మణిపూర్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల నుంచి ఇద్దరు సభ్యుల చొప్పున ఉన్నారు. లోక్‌సభలో ఎక్కువ సభ్యులు ఉన్న మొదటి మూడు రాష్ట్రాలు ఉత్తరప్రదేశ్ (80), మహారాష్ట్ర (48), పశ్చిమ బెంగాల్ (42).

5. రాజ్యసభకు 233 మంది ఎన్నిక ద్వారా వచ్చే సభ్యుల ఎన్నిక విధానం ఏ విధంగా ఉంటుంది?
   1) సాధారణ మెజారిటీ పద్ధతి, రహస్య ఓటు పద్ధతి
   2) సాధారణ మెజారిటీ పద్ధతి, బహిరంగ ఓటు పద్ధతి
   3) నైష్పత్తిక ప్రాతినిధ్య, రహస్య ఓటు పద్ధతి
   4) నైష్పత్తిక ప్రాతినిధ్య, బహిరంగ ఓటు పద్ధతి

జ. 4;
వివరణ: రాజ్యసభలో 245 మంది సభ్యులు ఉండగా, 233 మంది సభ్యులు రాష్ట్రాల అసెంబ్లీ సభ్యులు ఎన్నుకోగా మిగిలిన 12 మంది సభ్యులను వివిధ రంగాల్లో ప్రముఖులను రాష్ట్రపతి నియమిస్తాడు. వీరి ఎన్నిక నైష్పత్తిక ప్రాతినిధ్య ఓటు బదిలీ పద్ధతిలో బహిరంగ ఓటు విధానం ద్వారా జరుగుతుంది. రాజ్యసభ సభ్యుని ఎన్నికల్లో ఓటువేసే ఎం.ఎల్.ఎ. తాను వేసిన ఓటును పార్టీ నియమించిన ఏజెంట్‌కు చూపవలసి ఉంటుంది. క్రాస్ ఓటింగ్‌ను నిరోధించటానికి రాజ్యసభకు 2003 సంవత్సరం నుంచి బహిరంగ ఓటు విధానాన్ని ప్రవేశపెట్టారు. రాజ్యసభ సభ్యుని ఎన్నిక విధానాన్ని దక్షిణాఫ్రికా రాజ్యాంగం నుంచి స్వీకరించారు.

6. పార్లమెంట్‌కు పోటీచేసే అభ్యర్థి చెల్లించవలసిన డిపాజిట్ ఎంత?
   1) 10,000 2) 15,000
   3) 20,000 4) 25,000

జ. 4;
వివరణ: లోక్‌సభ లేదా రాజ్యసభకు పోటీచేసే అభ్యర్థి రూ.25,000 డిపాజిట్ చెల్లించాలి. లోక్‌సభ విషయంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మాత్రం రూ.12,500 చెల్లిస్తే సరిపోతుంది. రాజ్యసభలో ఎస్సీ, ఎస్టీలకు ఎటువంటి రిజర్వేషన్లు ఉండవు. కాబట్టి డిపాజిట్ చెల్లింపులో ఎటువంటి మినహాయింపు ఉండదు. పోలై చెల్లిన ఓట్లలో 1/6వ వంతు ఓట్లు వస్తే డిపాజిట్ వాపస్ వస్తుంది. లేనిచో డిపాజిట్ గల్లంతు అవుతుంది.

7. భారత పార్లమెంట్ సంవత్సరానికి కనీసం ఎన్నిసార్లు సమావేశం కావాలి?
   1) ఒకసారి 2) రెండుసార్లు
   3) మూడుసార్లు 4) నిర్ణీత కనీస పరిమితి లేదు

జ. 2;
వివరణ: రాజ్యాంగం ప్రకారం భారత పార్లమెంట్ సంవత్సరానికి కనీసం రెండుసార్లు సమావేశం కావాలి. ఒక సమావేశానికి మరొక సమావేశానికి మధ్య 6 నెలల వ్యవధి ఉండరాదు. కానీ ప్రస్తుతం భారత పార్లమెంట్ సంవత్సరానికి మూడుసార్లు సమావేశం అవుతుంది. అవి
1) బడ్జెట్ సమావేశాలు (ఫిబ్రవరి నుంచి ఏప్రిల్)
2) వర్షాకాల సమావేశాలు (జూలై నుంచి సెప్టెంబర్)
3) శీతాకాల సమావేశాలు (నవంబర్ నుంచి డిసెంబర్)
అదే విధంగా భారత పార్లమెంట్ సంవత్సరానికి గరిష్ఠంగా ఎన్నిసార్లు అయినా సమావేశం కావచ్చు.

8. కింది ఏ బిల్లుల విషయంలో పార్లమెంట్ ఉభయ సభలకు సమాన అధికారం ఉంది?
   ఎ) సాధారణ బిల్లు
   బి) రాజ్యాంగ సవరణ బిల్లు
   సి) నూతన రాష్ట్రాల ఏర్పాటు బిల్లు
   డి) ద్రవ్యబిల్లు
   1) ఎ, బి 2) ఎ, సి
   3) ఎ, బి,సి 4) ఎ, బి, సి, డి

జ. 3;
వివరణ: సాధారణ బిల్లు, రాజ్యాంగ సవరణ బిల్లు నూతన రాష్ట్రాల ఏర్పాటు బిల్లులను పార్లమెంట్ ఉభయసభల్లో దేనిలోనైనా ప్రవేశపెట్టవచ్చు. వీటి విషయంలో రెండు సభల ఆమోదం అవసరం. అదే విధంగా రెండు సభలకు సమాన అధికారాలు ఉన్నాయి.
కానీ ద్రవ్యబిల్లు విషయంలో లోక్‌సభకే ఎక్కువ అధికారాలు ఉన్నాయి. స్పీకర్ ఒక బిల్లుని ద్రవ్యబిల్లు అని నిర్ణయించాక రాష్ట్రపతి అనుమతితో దానిని ముందుగా లోక్‌సభలో మాత్రమే ప్రవేశపెట్టాలి. లోక్‌సభ ఆమోదించిన ద్రవ్యబిల్లుని రాజ్యసభ 14 రోజుల లోపు ఆమోదించాలి లేనిచో అది ఆమోదించినట్లుగా భావించి రాష్ట్రపతి ఆమోదానికై పంపబడును.

9. సభలో సభ్యుడు కాకున్న సభకు అధ్యక్షతవహించే వ్యక్తి?
   1) లోక్‌సభ స్పీకర్ 2) లోక్‌సభ డిప్యూటీ స్పీకర్
   3) రాజ్యసభ చైర్మన్ 4) పై ముగ్గురూ

జ. 3;
వివరణ: భారత ఉపరాష్ట్రపతి పదవీ రీత్యా రాజ్యసభ చైర్మన్‌గా వ్యవహరిస్తాడు. వాస్తవానికి ఇతను రాజ్యసభ సభ్యుడు కాకున్నప్పటికీ సభకు అధ్యక్షత వహించి బిల్లుల ఆమోదానికి, సభ సజావుగా సాగటానికి కృషి చేస్తాడు. ఇతనికి మామూలు సందర్భంతో ఓటు హక్కు ఉండదు. కానీ ఒక బిల్లుకి అనుకూలంగా, వ్యతిరేకంగా సమాన ఓట్లు వచ్చినప్పుడు ఓటు హక్కు ఉంటుంది. దీనినే 'కాస్టింగ్ ఓటు' లేదా 'నిర్ణాయక ఓటు' అని అంటారు.

10. లోక్‌సభలో అధికారికంగా గుర్తింపు పొందిన తొలి ప్రతిపక్ష నేత ఎవరు?
    1) జె.బి. కృపలానీ 2) మొరార్జీ దేశాయ్
    3) చరణ్‌సింగ్ 4) వై.బి. చవాన్

జ. 4;
వివరణ: పార్లమెంట్‌లో ఒక పార్టీకి ప్రతిపక్ష హోదా లభించాలంటే ఆయా సభలో 10 శాతం సీట్లను గెలుచుకోవాలి. తొలిసారిగా 1977లో జనతాపార్టీ మొరార్జీ దేశాయ్ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా 154 స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ ప్రతిపక్షంగా గుర్తించబడింది. కాంగ్రెస్ నేత వై.బి.చవాన్ అధికారికంగా ప్రతిపక్షనేతగా గుర్తింపు పొందాడు. అదే సంవత్సరం (1977)లో కమలాపాటి త్రిపాఠి రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా గుర్తింపు పొందాడు.

11. లోక్‌సభకు తొలిసారిగా మధ్యంతర ఎన్నిక ఎప్పుడు జరిగింది?
    1) 1967 2) 1971
    3) 1977 4) 1980

జ. 2;
వివరణ: సాధారణంగా లోక్‌సభ కాల పరిమితి 5 సంవత్సరాలు. కానీ ప్రధాని సలహా ప్రకారం దానిని ముందే రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది. ఆ సందర్భంలో నిర్వహించే ఎన్నికను మధ్యంతర ఎన్నికలు అంటారు. 1967లో జరిగిన నాలుగో లోక్‌సభను ఒక సంవత్సరం ముందు 1971లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ సలహాపై రాష్ట్రపతి వి.వి. గిరి రద్దు చేశాడు. ఈ విధంగా తొలిసారిగా 1971లో మధ్యంతర ఎన్నిక జరిగింది. అనంతరం 1980లో రెండోసారి మధ్యంతర ఎన్నిక జరిగింది. లోక్‌సభకు 17 సార్లు ఎన్నికలు జరిగితే ఇందులో 7 సార్లు మధ్యంతర ఎన్నికలు (1971, 1980, 1984, 1991, 1998, 1999, 2004) జరిగాయి.

12. ఎంపీల్యాడ్స్ స్కీమ్ కింద ఒక్కొక్క ఎం.పి.కి సంవత్సరానికి నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని కోట్లు ఇస్తున్నారు?
    1) 1 2) 3 3) 5 4) 10

జ. 3;
వివరణ: పీవీ నరసింహారావు భారత ప్రధానిగా ఉన్నప్పుడు 1993లో ఎంపీల్యాడ్స్ స్కీమ్‌ను ప్రారంభించారు. మెంబర్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీమ్‌గా పిలిచే దీని కింద 1993లో ఒక్కొక్క ఎంపీకి నియోజవర్గ అభివృద్ధికి సంవత్సరానికి 5 లక్షలు కేటాయించారు. దీనిని 1994లో 1 కోటి, 1998లో 2 కోట్లు, 2011 నుంచి 5 కోట్లకు పెంచారు.

13. ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు పొందిన భారత ప్రధానులు ఎంతమంది ఉన్నారు?
    1) 2 2) 3 3) 4 4) 5

జ. 2;
వివరణ: పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు పార్లమెంట్ విలువలను పెంపొందించిన వ్యక్తులకు మాజీ హోంశాఖ మంత్రి పండిత్ గోవింద్ వల్లభ్ పంత్ పేరు మీద ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డును 1993 నుంచి ఇస్తున్నారు. ఈ అవార్డును 1993లో ఇంద్రజిత్ గుప్తా పొందగా చివరగా 2017 సంవత్సరానికి భర్తృహరి మహతాబ్‌కు లభించింది. ఈ అవార్డును ముగ్గురు ప్రధానమంత్రులు పొందారు. వారు అటల్ బిహారీ వాజ్‌పాయ్ (1994), చంద్రశేఖర్ (1995), మన్మోహన్ సింగ్ (2002).

14. ఇప్పటి వరకు లోక్‌సభకు 18 సార్లు ఎన్నికలు జరగ్గా అతి ఎక్కువ కాలం కొనసాగిన లోక్‌సభ ఎన్నోది?
    1) 3 2) 5 3) 7 4) 9

జ. 2;
వివరణ: ఐదో లోక్‌సభ 1971లో ఏర్పడింది. దీని పదవీ కాలం 1976 వరకు ఉంది. కానీ ఇందిరా గాంధీ ప్రభుత్వం 1975లో ఎమర్జెన్సీ విధించాక, 42వ రాజ్యాంగ సవరణ చట్టం (1976) ద్వారా 5వ లోక్‌సభ కాల పరిమితిని ఒక సంవత్సరం అంటే 1977 వరకు పొడిగించారు.
అదే విధంగా అతి తక్కువ కాలం కొనసాగిన లోక్‌సభ 12వ లోక్‌సభ. ఇది కేవలం 13 నెలలు (1998-99) మాత్రమే కొనసాగింది. లోక్‌సభ కాల పరిమితిని పెంచే అధికారం పార్లమెంట్‌కు ఉండగా, దానిని ముందే రద్దుచేసే అధికారం రాష్ట్రపతికి ఉంది.

15. పార్లమెంట్ సభ్యులు ఎన్ని రోజుల పాటు పార్లమెంట్ సమావేశాలకు హాజరు కాకుంటే సభ్యత్వం రద్దు అవుతుంది?
    1) 30 రోజులు 2) 60 రోజులు
    3) 3 నెలలు 4) 6 నెలలు

జ. 2;
వివరణ: పార్లమెంట్ సభ్యుడు 60 రోజుల పాటు సభాధ్యక్షుని అనుమతి లేకుండా సభకు గైర్హాజరు అయితే సభ్యత్వం కోల్పోతాడు. 1976– 77లో తమిళనాడుకు చెందిన సుబ్రహ్మణ్యస్వామి ఈ విధంగానే రాజ్యసభ సభ్యత్వం కోల్పోయాడు.
అదే విధంగా పార్లమెంట్ సభ్యుడు పార్టీ ఫిరాయింపుకు పాల్పడితే సభాధ్యక్షుడు అతని సభ్యత్వాన్ని రద్దు చేస్తాడు. అతని ఎన్నిక చెల్లదు అని హైకోర్టు లేదా సుప్రీంకోర్టు తీర్పునిస్తే రాష్ట్రపతి అతని సభ్యత్వాన్ని రద్దు చేస్తాడు.

16. రాష్ట్ర జాబితాలోని అంశాలపై కూడా పార్లమెంట్ ఏ సందర్భంలో శాసనాలు రూపొందించవచ్చు?
    1) జాతీయ ప్రయోజనం
    2) రెండు రాష్ట్రాలు ఉమ్మడి ప్రయోజనం కోసం
    3) అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నప్పుడు
    4) పై అన్నీ సందర్భాల్లో

జ. 4;
వివరణ: ఆర్టికల్–249 ప్రకారం జాతీయ ప్రయోజనం దృష్ట్యా రాష్ట్ర జాబితాలోని అంశంపై శాసనం చేయాలని రాజ్యసభ 2/3వ వంతు మెజారిటీతో తీర్మానం చేసినప్పుడు పార్లమెంట్ రాష్ట్ర జాబితాలోని అంశంపై కూడా శాసనం చేయవచ్చు.
ఆర్టికల్–250 ప్రకారం అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నప్పుడు కూడా రాష్ట్ర జాబితాలోని అంశంపై కూడా పార్లమెంట్ చట్టం చేయవచ్చు.
ఆర్టికల్–252 ప్రకారం రెండు లేదా ఎక్కువ రాష్ట్రాలు తమ ఉమ్మడి ప్రయోజనం కోసం రాష్ట్ర జాబితాలోని అంశంపై చట్టం చేయాలని కోరితే పార్లమెంట్ చట్టం చేస్తుంది.

17. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సభ్యుల సంఖ్యను ఏ సంవత్సరం వరకు మార్చకూడదు?
    1) 2025 2) 2026
    3) 2030 4) 2035

జ. 2;
వివరణ: 84వ రాజ్యాంగ సవరణ చట్టం (2001) ద్వారా ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్యను 2026 వరకు మార్చకూడదని పేర్కొన్నారు. నియోజకవర్గాలను పునర్విభజించటానికి పై సవరణ ద్వారా 4వ డీలిమిటేషన్ కమిషన్‌ను జస్టిస్ కుల్‌దీప్ సింగ్ నేతృత్వంలో వేసినప్పుడు ఈ అంశాన్ని చేర్చారు. వాస్తవానికి ప్రారంభంలో లోక్‌సభ సభ్యుల సంఖ్య 489 ఉండేది. దానిని 1956లో 525కి, 1973లో 552కి పెంచారు. ఇది 2026 వరకు కొనసాగుతుంది.

18. భారత పార్లమెంట్ సమావేశాలు దేనితో ప్రారంభమవుతాయి?
    1) శూన్య సమయం
    2) ప్రశ్నోత్తరాలు సమయం
    3) అరగంట చర్చ 4) సావధాన తీర్మానం

జ. 2;
వివరణ: పార్లమెంట్ సమావేశాలు ప్రతిరోజూ ప్రశ్నోత్తరాల సమయంతో ప్రారంభమవుతాయి. ఇది ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యలో ఉంటుంది. ప్రశ్నలు 3 రకాలు.
1. నక్షత్రపు గుర్తు ప్రశ్నలు: వీటికి 10 రోజుల ముందు సభాధ్యక్షుని అనుమతి తీసుకోవాలి. దీనికి మంత్రులు మౌఖికంగా సమాధానం చెప్పాలి.
2. నక్షత్రపు గుర్తు లేని ప్రశ్నలు: వీటికి కూడా 10 రోజుల ముందు సభాధ్యక్షుని అనుమతి తీసుకోవాలి. దీనికి మంత్రులు రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలి.
3. స్వల్ప వ్యవధి ప్రశ్నలు: అతి ముఖ్య విషయాలపై 3 నుంచి 10 రోజుల లోపు ముందస్తు అనుమతితో సభ్యులు ప్రశ్నలు అడగవచ్చు.

'రూఫ్ ఆఫ్ ది సౌత్' అని ఏ రాష్ట్రాన్ని పిలుస్తారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో 'ట్రిపియన్ నైసర్గిక స్వరూపం'గా దేన్ని అభివర్ణిస్తారు?
   1) దక్కన్ పీఠభూమి
   2) ఉత్తర మైదానాలు
   3) పశ్చిమ కనుమలు
   4) తూర్పు కనుమలు
2. హరిశ్చంద్ర కొండలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
   1) మహారాష్ట్ర 2) గుజరాత్
   3) ఛత్తీస్‌గఢ్ 4) అసోం
3. కింది వాటిలో సరికాని జత ఏది?
   1) అజంతా గుహలు - మహారాష్ట్ర
   2) బాబు బుడాన్ కొండలు - అసోం
   3) ఫళని కొండలు - తమిళనాడు
   4) వావుల్ మలై శిఖరం - కర్ణాటక
4. నీలగిరి కొండల్లో ఎత్తైన శిఖరం ఏది?
   1) అనైముడి 2) ఉదక మండలం
   3) దొడబెట్ట 4) కల్సూబాయ్
5. పశ్చిమ కనుమలకు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ఇవి ఉత్తరాన తపతి నది నుంచి దక్షిణాన కన్యాకుమారి వరకు విస్తరించి ఉన్నాయి
   2) తూర్పు కనుమలతో పోలిస్తే వీటి ఎత్తు తక్కువ
   3) ఇవి పీఠభూమి వైపు కంటే అరేబియా సముద్రం వైపు అధికంగా వాలి ఉంటాయి
   4) ఇవి సుమారు 1600 కి.మీ. పొడవు విస్తరించి ఉన్నాయి
6. జీవ వైవిధ్య ప్రాంతమైన 'సైలెంట్ వ్యాలీ' ఏ రాష్ట్రంలో ఉంది?
   1) కేరళ 2) కర్ణాటక
   3) తమిళనాడు 4) పశ్చిమ బెంగాల్
7. దక్షిణ భారతదేశంలో అత్యంత ఎత్తైన రాష్ట్రం ఏది?
   1) మహారాష్ట్ర 2) తెలంగాణ
   3) గోవా 4) కర్ణాటక
8. 'దిల్వారా దేవాలయం' ఏ పర్వతాల్లో ఉంది?
   1) వింధ్య పర్వతాలు
   2) సాత్పూర పర్వతాలు
   3) సహ్యాద్రి పర్వతాలు
   4) ఆరావళి పర్వతాలు
9. పశ్చిమ కనుమల్లో, ద్వీపకల్ప పీఠభూమిలో అతి ఎత్తైన శిఖరం ఏది?
   1) గురుశికార్ 2) అనైముడి
   3) సారమతి 4) దూప్‌గఢ్
10. అనైముడి శిఖరం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) కర్ణాటక 2) కేరళ
    3) తమిళనాడు 4) మహారాష్ట్ర
11. పర్వతాలు, ఎత్తైన శిఖరాలకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
    1) ఆరావళి పర్వతాలు - గురుశికార్
    2) అన్నామలై కొండలు - అనైముడి
    3) సాత్పూర శ్రేణులు - దూప్‌గఢ్
    4) రాజమహల్ కొండలు - సారమతి
12. సాత్పూర శ్రేణులు ఏయే నదుల మధ్య విస్తరించి ఉన్నాయి?
    1) నర్మద, సోన్ 2) నర్మద, తపతి
    3) నర్మద, చంబల్ 4) తపతి, చంబల్
13. 'గ్రానరీ ఆఫ్ కేరళ' అని పిలిచే కనుమ ఏది?
    1) బోర్ ఘాట్ 2) థాల్ ఘాట్
    3) బాల్ ఘాట్ 4) పాల్ ఘాట్
14. కొడైకెనాల్ వేసవి విడిది కేంద్రం ఏ కొండల్లో ఉంది?
    1) ఫళని కొండలు 2) నీలగిరి కొండలు
    3) అన్నామలై కొండలు
    4) ఇలైమలై కొండలు
15. వింధ్య పర్వతాలు, సాత్పూర పర్వతాల మధ్య ప్రవహించే నది ఏది?
    1) తపతి 2) నర్మద
    3) సోన్ 4) చంబల్
16. సాత్పూర, అంజతా పర్వతాల మధ్య ప్రవహించే నది ఏది?
    1) తపతి 2) నర్మద
    3) సబర్మతి 4) గోదావరి
17. మౌంట్ అబూ వేసవి విడిది కేంద్రం ఏ పర్వతాల్లో ఉంది?
    1) సాత్పూర పర్వతాలు
    2) వింధ్య పర్వతాలు
    3) సహ్యాద్రి పర్వతాలు
    4) ఆరావళి పర్వతాలు
18. 'రూఫ్ ఆఫ్ ది సౌత్' అని ఏ రాష్ట్రాన్ని పిలుస్తారు?
    1) తెలంగాణ 2) ఆంధ్రప్రదేశ్
    3) ఛత్తీస్‌గఢ్ 4) కర్ణాటక
19. భారతదేశాన్ని ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించే పర్వత శ్రేణులు ఏవి?
    1) ఆరావళి పర్వతాలు
    2) పశ్చిమ కనుమలు
    3) వింధ్య, సాత్పూర పర్వతాలు
    4) సహ్యాద్రి పర్వతాలు
20. 'క్వీన్ ఆఫ్ హిల్ స్టేషన్స్' అని దేన్ని పిలుస్తారు?
    1) మౌంట్ అబూ 2) ఊటీ
    3) కొడైకెనాల్ 4) పచ్‌మరి
21. పచ్‌మరి వేసవి విడిది కేంద్రం ఏ కొండల్లో ఉంది?
    1) మహాదేవ్ కొండలు
    2) కైమోర్ శ్రేణులు
    3) రాజమహల్ కొండలు
    4) ఫళని కొండలు
22. పశ్చిమ కనుమలు, తూర్పు కనుమలు ఎక్కడ కలుసుకుంటాయి?
    1) కార్డయమ్ 2) షెవరాయ్
    3) ఫళని 4) నీలగిరి
23. మైకాల్ పర్వత శ్రేణి ఎక్కడ వ్యాపించి ఉంది?
    1) రాజస్థాన్ 2) తమిళనాడు
    3) హరియాణా 4) ఛత్తీస్‌గఢ్
24. భారత ద్వీపకల్పంలో 'సహ్యాద్రి పర్వత శ్రేణి' అని పిలిచే పర్వత శ్రేణి ఏది?
    1) పశ్చిమ కనుమలు
    2) నీలగిరి పర్వతాలు
    3) తూర్పు కనుమలు
    4) సాత్పూర పర్వతాలు
25. షెవరాయ్ పర్వతాలు ఏ రాష్ట్రంలో విస్తరించి ఉన్నాయి?
    1) కేరళ 2) కర్ణాటక
    3) తమిళనాడు 4) గుజరాత్
26. హిమాలయ పర్వత వ్యవస్థ ఏ యుగానికి చెందింది?
    1) పూర్వ కేంబ్రియన్
    2) పేలియోజోయిక్ 3) మీసోజోయిక్
    4) టెర్షియరీ
27. ఉత్కళ మైదానంలో ఉన్న ప్రముఖ డెల్టా ఏది?
    1) పెన్నా 2) కావేరి
    3) మహానది 4) గంగానది
28. జతపరచండి.

తీరం	రాష్ట్రం
i. సర్కార్ తీరం	a. పశ్చిమ బెంగాల్
ii. వంగ తీరం	b. ఒడిశా
iii. కోరమాండల్ తీరం	c.ఆంధ్రప్రదేశ్
vi. ఉత్కళ తీరం	d. తమిళనాడు

    1) 1-b, ii-c, iii-d, iv-a
    2) 1-c, ii-b, iii-d, iv-a
    3) 1-c, ii-a, iii-b, iv-d
    4) 1-c, ii-a, iii-d, iv-b
29. దివైర్, దేసూరి, పిప్లిఘాట్ తదితర కనుమలు ఏ పర్వత శ్రేణుల్లో ఉన్నాయి?
    1) పశ్చిమ కనుమలు
    2) తూర్పు కనుమలు
    3) ఆరావళి పర్వతాలు
    4) వింధ్య, సాత్పూర పర్వతాలు
30. థాల్‌ఘాట్, బోర్‌ఘాట్, పాల్‌ఘాట్ తదితర కనుమలు ఏ పర్వతాల్లో ఉన్నాయి?
    1) వింధ్య పర్వతాలు 2) సాత్పూర శ్రేణులు
    3) పశ్చిమ కనుమలు 4) తూర్పు కనుమలు
31. కల్సూబాయ్ శిఖరం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) మహారాష్ట్ర 2) కేరళ
    3) కర్ణాటక 4) తమిళనాడు
32. కేరళలో నీలగిరి కొండల తర్వాత విస్తరించి ఉన్న పశ్చిమ కనుమలను ఏమంటారు?
    1) బాబు బుడాన్ కొండలు
    2) ఇలైమలై పర్వతాలు
    3) పంచమలై కొండలు
    4) కైమూర్ పర్వత శ్రేణి
33. కింది వాటిలో అతి పురాతన ముడుత పర్వతాలు ఏవి?
    1) హిమాలయాలు
    2) ఆరావళి పర్వతాలు
    3) పశ్చిమ కనుమలు
    4) వింధ్య పర్వతాలు
34. 'గౌరీ శంకర్' శిఖరం ఏ పర్వతాల్లో ఉంది?
    1) హిమాలయాలు
    2) సహ్యాద్రి పర్వతాలు
    3) తూర్పు కనుమలు
    4) సాత్పూర పర్వతాలు
35. భారతదేశంలోనే ఎత్తైన జోగ్/జొరసొప్పొ' జలపాతం ఏ నదిపై ఉంది?
    1) కావేరి నది 2) శివసముద్రం
    3) జోగ్ నది 4) శరావతి




36. తూర్పు కనుమలు ఏ శిలలతో ఏర్పడ్డాయి?
    1) బసాల్ట్, నీస్ 2) గ్రానైట్, బసాల్ట్
    3) ఖొండాలైట్, షిస్ట్
    4) ఖొండాలైట్, చార్నోకైట్
37. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) మెరీనా బీచ్ - తమిళనాడు
    2) కోవలం బీచ్ - కేరళ
    3) మైపాడు బీచ్ - ఆంధ్రప్రదేశ్
    4) గంగాసాగర్ బీచ్ - గుజరాత్
38. కింది వాటిలో తమిళనాడుకు చెందని కొండలు ఏవి?
    1) జువ్వాది కొండలు
    2) మైకాల పర్వతాలు
    3) గొండుమలై కొండలు
    4) పంచమలై కొండలు
39. కేరళలోని తీరాన్ని ఏమంటారు?
    1) కెనరా తీరం 2) కొంకణ్ తీరం
    3) మలబార్ తీరం 4) చోళ తీరం
40. అష్టముడి, వెంబనాడ్ సరస్సులు ఏ తీరంలో ఉన్నాయి?
    1) కోరమండల్ 2) కొంకణ్
    3) మలబార్ 4) వంగ
41. ఆటుపోటులకు ప్రసిద్ధి చెందిన మైదానం?
    1) ఉత్కళ మైదానం
    2) గుజరాత్ మైదానం
    3) కొంకణ్ మైదానం
    4) కేరళ మైదానం
42. మహారాష్ట్రలోని తీర మైదానాన్ని ఏమని పిలుస్తారు?
    1) మలబార్ మైదానం
    2) వంగ మైదానం 3) కొంకణ్ మైదానం
    4) రాణ్ ఆఫ్ కచ్ మైదానం
43. లూగూన్‌లు, కాయల్స్‌కు ప్రసిద్ధి చెందిన తీరం ఏది?
    1) మలబార్ తీరం 2) ఉత్కళ తీరం
    3) కొంకణ్ తీరం 4) వంగ తీరం
44. దక్కన్ పీఠభూమికి, కొంకణ్ మైదానానికి మధ్య ఉన్న ముఖ్యమైన దారులు ఏవి?
    1) థాల్‌ఘాట్, పాల్‌ఘాట్
    2) పాల్‌ఘాట్, పెన్‌కోట్టై ఖాళీ ప్రదేశం
    3) పాల్‌ఘాట్, బోర్‌ఘాట్
    4) బోర్‌ఘాట్, థాల్‌ఘాట్
45. మహారాష్ట్రలో అతి ఎత్తైన గిరి విహార స్థలం ఏది?
    1) పంచ్‌గని 2) మహాబలేశ్వర్
    3) మతేరాన్ 4) చికల్‌ధానా
46. మలబార్ తీరంలోని వెనక జలాలను ఏమని పిలుస్తారు?
    1) కొర్స్ 2) థరియన్
    3) కాయల్స్ 4) కోస్
47. కళింగ తీర మైదానం ఏ రాష్ట్రంలో విస్తరించి ఉంది?
    1) పశ్చిమ బెంగాల్ 2) ఆంధ్ర ప్రదేశ్
    3) ఒడిశా 4) కర్ణాటక
48. కింది వాటిలో తూర్పు కనుమలకు చెందని కొండలు ఏవి?
    1) పంచమలై కొండలు
    2) షెవరాయ్ కొండలు
    3) పాల కొండలు 4) ఫళని కొండలు
49. 'నిమజ్జిత తీరం' అని దేన్ని పిలుస్తారు?
    1) రాణ్ ఆఫ్ కచ్ తీరం
    2) కోరమండల్ తీరం
    3) మలబార్ తీరం 4) కొంకణ్ తీరం
50. బసాల్ట్ నేలలకు ప్రసిద్ధి చెందిన తీర మైదానం ఏది?
    1) కొంకణ్ మైదానం 2) కెనరా మైదానం
    3) మలబార్ మైదానం 4) వంగ మైదానం
51. యాలకుల కొండలు ఏ రాష్ట్రంలో విస్తరించి ఉన్నాయి?
    1) కర్ణాటక 2) గోవా
    3) కేరళ 4) మహారాష్ట్ర
52. పశ్చిమ కనుమలు.. నీలగిరి కొండలను ఏ ప్రాంతంలో కలుస్తాయి?
    1) గూడూరు 2) గుడలూరు
    3) కొడైకెనాలు 4) కన్యాకుమారి
53. దక్కన్ పీఠభూమి ప్రాంతంలో లభించే ముఖ్యమైన మృత్తిక ఏది?
    1) జేగురు మృత్తికలు
    2) ఒండ్రు మృత్తికలు
    3) ఊబి మృత్తికలు
    4) నల్లరేగడి మృత్తికలు
54. ఎర్ర మృత్తికల్లో ఏ మూలకం ఉండటం వల్ల అవి ఎరుపు రంగులో కనిపిస్తాయి?
    1) పొటాషియం ఆక్సైడ్
    2) ఐరన్ ఆక్సైడ్ 3) మెగ్నీషియం ఆక్సైడ్
    4) నైట్రోజన్ ఆక్సైడ్
55. రూపాంతర ప్రాప్తి శిలలు శైథిల్యం చెందడం వల్ల ఏర్పడిన మృత్తికలు ఏవి?
    1) నల్లరేగడి మృత్తికలు
    2) ఒండ్రు మృత్తికలు 3) ఎర్ర మృత్తికలు
    4) లాటరైట్ మృత్తికలు
56. నదీలోయకు దూరంగా ఉండే పురాతన సారవంతమైన నేలలను ఏమని పిలుస్తారు?
    1) టెరాయి 2) భంగర్
    3) ఖాబర్ 4) కంకర్
57. పత్తి పంటకు ప్రసిద్ధి చెందిన మృత్తికలు ఏవి?
    1) ఎర్ర మృత్తికలు
    2) లాటరైట్ మృత్తికలు
    3) అటవీ మృత్తికలు
    4) నల్లరేగడి మృత్తికలు
58. లాటరైట్ మృత్తికలకు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యం ఏది?
    1) వీటిని జేగురు నేలలు అని కూడా పిలుస్తారు
    2) ఇవి అధిక ఉష్ణోగ్రత, అత్యధిక వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో ఏర్పడతాయి
    3) ఈ మృత్తికలు అల్యూమినియం, ఐసాల్ట్‌లు ఉన్న శిలలు శైథిల్యం చెందడం వల్ల ఏర్పడతాయి
    4) పైవన్నీ సరైనవే
59. బసాల్ట్ శిల విచ్ఛిన్నం చెందడం వల్ల ఏర్పడిన నేలలు ఏవి?
    1) నల్లరేగడి నేలలు 2) లాటరైట్ నేలలు
    3) ఎర్ర నేలలు 4) శుష్క నేలలు
60. భారతదేశంలోని 'నల్ల రేగడి భూమి' ఏ సముదాయానికి చెందింది?
    1) ఒండలి 2) లాటరైట్
    3) పోడ్జల్ 4) చెర్నోజెమ్
61. 'భారతదేశ ధాన్యాగారాలు' అని ఏ నేలలను పిలుస్తారు?
    1) నల్లరేగడి నేలలు
    2) ఒండ్రుమట్టి నేలలు
    3) జేగురు నేలలు 4) ఎర్ర నేలలు
62. ఎర్ర మృత్తికలకు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలు ఏవి?
    ఎ) ఈ మృత్తికల్లో పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ ఆక్సైడ్‌లాంటి మూలకాలు అత్యధికంగా ఉంటాయి
    బి) ఇవి గాలి పారేటట్లుగా ఉంటాయి
    ఎ) ఈ మృత్తికల్లో నత్రజని, ఫాస్పారిక్ ఆమ్లం, సేంద్రియ పదార్థాలు తక్కువగా ఉంటాయి
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి

సమాధానాలు

1) 3 2) 1 3) 2 4) 3 5) 2
6) 1 7) 4 8) 4 9) 2 10) 2
11) 4 12) 2 13) 4 14) 1 15) 2
16) 1 17) 4 18) 4 19) 3 20) 2
21) 1 22) 4 23) 4 24) 1 25) 3
26) 4 27) 3 28) 4 29) 3 30) 3
31) 1 32) 2 33) 2 34) 1 35) 4
36) 4 37) 4 38) 2 39) 3 40) 3
41) 2 42) 3 43) 1 44) 4 45) 2
46) 3 47) 3 48) 4 49) 3 50) 1
51) 3 52) 2 53) 4 54) 2 55) 3
56) 2 57) 4 58) 4 59) 1 60) 4
61) 2 62) 4.

Nilesh is from which country?



BANK EXAMS
REASONING

MODEL QUESTIONS

Directions (Q. No. 1-5): Following are the criteria for selection of an officer in ITC.

The candidate must:

i) Have passed HSC examination in first class with at least 60% marks.
ii) Have passed graduation degree in any discipline with at least 55% marks.
iii) Have completed a certificate / diploma / degree course in Computer Science.
iv) Be not less than 21 years or more than 30 years of age as on 01.07.2014

If a candidate satisfies all the above mentioned criteria

except-

(a) At (ii) above but is a postgraduate, the case may be referred to the Executive Director (ED).

(b) At (iii) above but studied Computer Science as one of the subjects of curriculum, the case may be referred to the Vice President (VP).

In each of the following question below, information of one candidate is given. You have to take one of the following five decisions based on the information provided and the criteria and conditions given above. You are not to assume anything other than the information provided in each question. All these cases are given to you as on 01.07.2014. You have to indicate your decision by making to each question as follows: Give answer

1) If the case is to be referred to ED.
2) If the case is to be referred to VP.
3) If the candidate is to be selected.
4) If the candidate is not selected.
5) If the information is inadequate to take a decision.

1. Ruhi is B.Com graduate passed in second class with 56% marks. She had passed HSC in second class with 59% marks. She has also completed a Computer diploma with 56% marks. Her date of birth is 11.05.1988.
2. Rohit is Bsc with Computer science passed in second class with 58% marks. He had passed HSC examination in first class with 76% marks. He completed 25 years of age in December 2013.
3. Joseph has passed BMS degree examination in second class with 58% marks and HSC in first class with 65% marks. He has completed a diploma in Computer Science. He completed 25 years of age in November 2013.
4. Karthik is a BA passed with 63% marks. He had passed HSC examination with 69% marks. He has also completed a certificate course in Computer Science with 'A' grade. His date of birth is 23.09.1990.
5. Osheen is a science graduate passed in 2012 with 47% at the age of 22 years. She has scored 64% marks in HSC. She has also passed MSC with 58% marks. She has a certificate course in Computers.

Directions (Q. No. 6-10): Study the given information carefully to answer the given questions:

Seven participants Amit, Arjun, Deepak, Hari, Gaurav, Nilesh and Pawan from seven different countries, viz. Algeria, Australia, Belize, Brazil, Bulgaria, Cuba and Fiji, but not necessary in the same order, participate in a dance competition. All of them perform seven different dance style, viz Chhau, Bush, Brukdown, Samba, Horo, Rumba and Gavotte.

The one who perform Brukdown does not belong to Bulgaria. Arjun is from Belize and does not perform Samba. The one who is from Brazil performs Chhau. The one who is from Australia performs neither Samba nor Horo. Amit is from Fiji. Gaurav is from Algeria and perform Rumba dance. Deepak performs Gavotte but he is neither from Cuba nor from Bulgaria. Hari performs Bush and Pawan performs Brukdown.

6. Who performs Samba?
   1) Nilesh 2) Pawan
   3) Gaurav 4) Amit
   5) Deepak
7. Which of the following combination is true?
   1) Algeria - Bush
   2) Bulgaria - Horo
   3) Cuba - Brukdown
   4) Cuba - Rumba
   5) Other than given options
8. Arjun performs which of the following dance?
   1) Samba 2) Chhau 3) Horo
   4) Rumba 5) Gavotte
9. Who is from Australia?
   1) Nilesh 2) Deepak 3) Amit
   4) Pawan 5) Hari
10. Nilesh is from which country?
    1) Algeria 2) Belize
    3) Fiji 4) Brazil
    5) Cannot be determined

Directions (Q. 11-16): Study the following information carefully and answer the question given below:

Eight people P, Q, R, S, T, U, V and W are sitting around a circular table, facing the centre. Each of them is drinking different beverages - Tea, Coffee, Juice, Mineral Water, Lemonade, Cola, Coconut Water and Milk, but not necessarily in the same order. Q is sitting second to the left of U. The person drinking milk is an immediate neighbour of U. Only one person sits between the person drinking mineral water and P. The person drinking coffee is on the immediate right of the person drinking mineral water. W is second to the right of U. S is drinking milk. R and T are immediate neighbours. Neither R nor T is drinking mineral water. The person drinking lemonade is on the immediate left of Q. The person drinking cola is second to the right of person drinking coffee. The person drinking coconut water is an immediate neighbour of the person drinking mineral water. R is second to the right of the person drinking tea.

11. Who is second to the right of P?
    1) Q 2) R 3) S 4) T 5) U
12. Who among the following is drinking coconut water?
    1) Q 2) V 3) W 4) U 5) T
13. What is the position of V with respect to the person drinking milk?
    1) Third to the left
    2) Second to the right
    3) Second to the left
    4) Third to the right
    5) Immediate right
14. Four of the following five are alike in a certain way based on the given arrangement and hence form a group. Which of the following does not belong to the group?
    1) Tea - S 2) Juice - W
    3) Mineral water - T
    4) Lemonade - V 5) Cola - U
15. Which of the following person is drinking tea?
    1) P 2) R 3) T 4) V 5) W
16. Which of the following statements is true according to the given arrangement?
    1) The person drinking cola is sitting second to the left of the person drinking Juice.
    2) P is an immediate neighbour of the person drinking Lemonade.
    3) S sits exactly between Q and R.
    4) Only four people sit between W and Q.
    5) All of the given statements are true.

Answers with Explanation:

(1-5)

Candidate	i	ii/a	iii/b	iv
Ruhi	×	√	√	√
Rohit	√	√	√	√
Joseph	√	√	√	√
Karthik	√	√	√	√
Osheen	√	(√)	√	√


1) 4; 2) 3; 3) 3; 4) 3; 5) 1.

(6-10)

Participant	Country	Dance Style
Hari	Bulgaria	Bush
Arjun	Belize	Horo
Nilesh	Brazil	Chhau
Gaurav	Algeria	Rumba
Pawan	Cuba	Brukdown
Amit	Fiji	Samba
Deepak	Australia	Gavotte

6) 4; 7) 3; 8) 3; 9) 2; 10) 4.

(11-16)



11) 2; 12) 4; 13) 2;
14) 3; 15) 1; 16) 1..